సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 269

మంగళవారం 13-6-2023

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'



మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

ఏటీపీ ర్యాంకింగ్స్ విడుదల.. రెండో స్థానానికి అల్‌కరాజ్ - 12లో



ఎగవేతదారులతో సెటిల్మెంట్

నిరర్థక ఆస్తుల రికవరీకి ఆర్‌బీఐ ప్రయత్నాలు - 13లో



15న తీరానికి బిపర్‌జోయ్

బిపర్‌జోయ్ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకనుందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది.

వివరాలు 6లో ▸



ఇటలీ మాజీ ప్రధాని మృతి

మూడుసార్లు ఇటలీ ప్రధానిగా పనిచేసిన సిల్వియో బెర్లుస్కోనీ (89) లుకేమియాతో సోమవారం తుదిశ్వాస విడిచారు.

వివరాలు 6లో ▸



కోవిన్ పోర్టల్.. ఫుల్ సేఫ్

కోవిడ్ వ్యాక్సిన్ కోసం తెచ్చిన కోవిన్ పోర్టల్‌లో రిజిస్టర్ అయిన లబ్ధిదారుల డేటా లీకైనట్లు వచ్చిన వార్తలను కేంద్రం ఖండించింది.

వివరాలు 6లో ▸



శిక్ష పడినా.. పోటీ చేస్తా

రహస్య పత్రాల కేసులో శిక్ష పడినా సరే వచ్చే ఎన్నికల్లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ పడడం ఖాయమని ట్రంప్ తేల్చిచెప్పారు.

వివరాలు 6లో ▸

పేదింటి పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి

మన విద్యార్థులు మెరుగ్గా రాణించేలా ఆధునిక చదువులు: సీఎం వైఎస్ జగన్

- ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా ఎనలిటిక్స్, చాట్ జీపీటీ మన సిలబస్‌లో చేరుస్తాం
- విద్యార్థులు ఓటర్లు కానందున గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు
- నాలుగేళ్లలో రూ.60,329 కోట్లు వెచ్చించి విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం
- అమ్మ ఒడి, విద్యాదీవెనతో అడుగడుగునా ప్రోత్సహిస్తున్నాం.. మనబడి నాడు–నేడుతో రూపురేఖలు మారిన ప్రభుత్వ స్కూళ్లు
- సీబీఎస్‌ఈ, ఇంగ్లిష్ మీడియంతోపాటు మూడో తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లు
- నాడు–నేడు తొలిదశ పూర్తైన స్కూళ్లలో 6వ తరగతి నుంచి ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్
- పిల్లల్లో ఇంగ్లిష్ నైపుణ్యాలను పెంచేలా పాఠశాల దశలోనే టోఫెల్‌కు శిక్షణ
- ప్రతిభ చూపిన ఇంగ్లిష్ టీచర్లకు అమెరికాలోని ప్రిన్స్‌టన్‌లో ఓరియంటేషన్
- వరుసగా నాలుగో ఏడాదీ రూ.1,042.53 కోట్లతో 43,10,165 మందికి విద్యా కానుక
- పల్నాడు జిల్లా క్రోసూరులో కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన సీఎం జగన్

2లో



పల్నాడు జిల్లా క్రోసూరులోని మోడల్ స్కూల్లో పుస్తకాలను పరిశీలిస్తూ విద్యార్థులతో ముచ్చటిస్తున్న సీఎం జగన్

"మన విద్యార్థులు ఇంకా బాగా ఎదిగి ముందు వరుసలో నిలిచేందుకు అంతర్జాతీయంగా విద్యారంగంలో వస్తున్న మార్పులన్నింటినీ అధ్యయనం చేసి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, లాంగ్వేజ్ లెర్నింగ్ మాడ్యూల్స్, డేటా ఎనలిటిక్స్ మొదలు చాట్ జీపీటీ దాకా మన సిలబస్‌తో అనుసంధానించేలా వేగంగా అడుగులు వేస్తున్నాం."

- పల్నాడు జిల్లా క్రోసూరు సభలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పేదలపై పగబట్టిన పెత్తందారు

డిక్లరేషన్లంటూ చంద్రబాబు డ్రామాలు

క్రోసూరు సభలో సీఎం జగన్ ధ్వజం

- 14 ఏళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఏం గాడిదలు కాశావ్?
- మళ్లీ మళ్లీ వాగ్దానాలు, వెన్నుపోట్లే బాబు సైకిల్ చక్రం
- టీడీపీ మూసివేతకు సిద్ధమైన దుకాణం.. మనం తెచ్చిన వ్యవస్థలతో గ్రామాల స్వరూపమే మారిపోయింది

2లో

"ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేయడం.. ఆ తర్వాత మోసం చేయడం చంద్రబాబు నైజం. చంద్రబాబు బతుకే మోసం, పెద్ద అబద్ధం. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నా ఆయన పేరు చెబితే ఏ ఒక్క సంక్షేమ పథకమూ గుర్తు రాదు. చంద్రబాబు పేరు చెబితే గుర్తొచ్చేది వెన్నుపోట్లు, మోసం, కుట్ర, దగా! ప్రజలందరినీ మోసం చేస్తున్నా అన్ని విషయాల్లో చంద్రబాబును వెనకేసుకురావడానికి ఆయన వల్ల బాగా వెనకేసుకున్న ఓ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ- 5, దత్తపుత్రుడున్నారు. చంద్రబాబు పాలన వల్ల, ఆయన చేసిన పనుల వల్ల తమకు మేలు జరిగిందని చెప్పే ఒక సామాజికవర్గంగానీ, ప్రాంతంగానీ, పేదలుగానీ ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు." - సీఎం జగన్

న్యూస్‌రీల్

అక్రమంగా ప్రవేశిస్తే.. మట్టుపెట్టేలా



శత్రుదేశాల కుయుక్తులను తిప్పికొట్టేందుకు భారత నౌకాదళం ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోంది. ఇందులో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌తో పాటు నేవీ ఎయిర్‌ఫీల్డ్‌ను మరింత పక్కాగా నిర్వహించే వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

వివరాలు 14లో ▸

బీజేపీ.. ఏపీలో టీ-బీజేపీగా మారింది



రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ టీ–బీజేపీ(తెలుగుదేశం–బీజేపీ)గా మారిపోయిందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. ప్రత్యేక హోదా, స్టీల్ ప్లాంట్, విభజన అంశాల్లో కేంద్రం రాష్ట్ర ప్రజల్ని మోసం చేసిందన్నారు.

వివరాలు 10లో ▸

హరిరామజోగయ్యకు తెలంగాణ హైకోర్టు అక్షింతలు



సీఎం వైఎస్ జగన్‌పై దాఖలు చేసిన పిల్‌లో ప్రజాప్రయోజనం ఏముందంటూ మాజీ ఎంపీ హరిరామజోగయ్యపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇదో 'పబ్లిక్ న్యూసెన్స్' పిటిషన్.. వ్యక్తిగత కక్షతోనే వ్యాజ్యం దాఖలు చేసినట్లు కనిపిస్తోందని మండిపడింది.

వివరాలు 14లో ▸

విశాఖలోని కేడీపీఎం స్కూల్లో జగనన్న విద్యా కానుక కిట్లతో విద్యార్థులు



మోగిన బడి గంట

తొలిరోజు 57 శాతం హాజరు నమోదు

జోరుగా జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ

సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా సోమవారం పాఠశాలలు తెరుచుకున్నాయి. అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న కారణంగా ఈనెల 17 వరకు ఉ.7.30 నుంచి 11.30 వరకు తరగతులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో.. అన్ని పాఠశాలల్లోను అందుకు అనుగుణంగా జాగ్రత్తలు తీసుకున్నారు. మరోవైపు.. ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న దాదాపు 43 లక్ష మంది విద్యార్థుల కోసం ప్రభుత్వం సిద్ధంచేసిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని సోమవారం అన్ని పాఠశాలల్లోను ప్రారంభించారు. అలాగే, గతంలో పాఠశాలలు తెరిచిన తొలిరోజు 30 శాతం దాటని హాజరు, ఈ విద్యా సంవత్సరం ప్రారంభం రోజే 57 శాతం హాజరు నమోదైనట్లు పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. వీరిలో 61 శాతం మందికి విద్యా కానుక కిట్లను అందించారు. రెండోరోజు మంగళవారం నుంచి కిట్ల పంపిణీని వేగవంతం చేసి వారం రోజుల్లో మొత్తం పంపిణీని పూర్తిచేయాలని అధికారులు నిర్ణయించారు. ఇక అన్ని పాఠశాలల్లోను ఉ.8.30–9.00గంటల మధ్య విద్యార్థులకు రాగిజావ.. 11.30 గంటల తర్వాత మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు.



సివిల్స్ ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

ఐఏఎస్, ఐపీఎస్ తదితర అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్–2023 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ సోమవారం విడుదల చేసింది. ఇందులో మొత్తం 14,624 మంది అర్హత సాధించారు. ఉత్తీర్ణులైన అభ్యర్థుల సీరియల్ నంబర్, పేరు, రోల్ నంబర్లను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.

6లో



ఎంబీబీఎస్ 9 ఏళ్లలోగా పూర్తి చేయాలి

ఎంబీబీఎస్ కోర్సును విద్యార్థులు తొమ్మిదేళ్లలోగా పూర్తి చేయాలని, ఫస్టియర్‌ను నాలుగు ప్రయత్నాల్లోనే పూర్తి చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్ తాజాగా నిబంధనలు తీసుకువచ్చింది. అడ్మిషన్ పొందిన తేదీ నుంచి తొమ్మిదేళ్లలోగా కోర్సును విద్యార్థులు పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.

6లో

రోల్‌మోడల్‌గా మన 'రీ సర్వే'

- ఏపీలో భూముల రీసర్వేపై పుదుచ్చేరి అధికారులకు మనవాళ్ల అవగాహన తరగతులు
- భూమి రికార్డుల ఆధునికీకరణపై అక్కడి అధికారులకు శిక్షణ
- గత నెలలో ఉత్తరాఖండ్ అధికారులకు రీ సర్వేపై శిక్షణ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భూముల రీ సర్వే ప్రాజెక్టు విజయవంతమవడంతో వివిధ రాష్ట్రాలు దాన్ని బెస్ట్ ప్రాక్టీస్‌గా తీసుకుంటున్నాయి. తాజాగా పుదుచ్చేరి ప్రభుత్వం ఏపీ రీసర్వేపై తమ రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించింది. డైరెక్టరేట్ ఆఫ్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ విభాగాధికారులతో భూమి రికార్డులకు సంబంధించిన అంశాలపై సోమవారం ఒకరోజు వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్‌లో హైబ్రిడ్ టెక్నాలజీతో ఆధునిక భూముల సర్వే అనే అంశంపై ఏపీ ప్రభుత్వం తరపున సర్వే సెటిల్మెంట్ శాఖలో పనిచేస్తున్న సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డ్రోన్లు, విమానాలతో ఆధునిక రీతిలో రాష్ట్రంలోని 1.25 చదరపు కిలోమీటర్ల ఏరియాలో రీ సర్వే జరుగుతున్న విధానం, ఇప్పటికే 2 వేల గ్రామాల్లో విజయవంతంగా రీ సర్వే పూర్తి చేసి ఆ గ్రామాలకు సంబంధించిన డిజిటల్ రికార్డులు అందుబాటులోకి తేవడం, అక్షాంశాలు, రేఖాంశాలతో రైతుల హద్దులు నిర్ధారించడం..

మిగతా 3వ పేజీలో ▶

ఐఐటీ విద్యార్థులకు రెడ్ కార్పెట్

- ఏటా మూడో వంతు మంది విదేశీబాట
- మేధో వలసలో ఐఐటీ విద్యార్థులదే అగ్రస్థానం
- మద్రాస్, బొంబాయి, ఖరగ్‌పూర్, ఢిల్లీ, కాన్పూర్ ఐఐటీలు టాప్.. ఐఐటీ హోదా పొందాక ప్లేస్‌మెంట్స్‌లో దూసుకుపోయిన బీహెచ్‌యూ
- అత్యధికంగా 65 శాతం మంది అమెరికాకే
- ఎన్‌బీఈఆర్ నివేదిక వెల్లడి

3లో



లారీని ఢీకొన్న కారు.. ఏడుగురి దుర్మరణం

- మృతులంతా బంధువులే
- గృహప్రవేశ వేడుకకు వెళ్లి వస్తూ.. మృత్యుఒడికి
- తూర్పు గోదావరి జిల్లాలో ప్రమాదం

5లో



నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద లారీని ఢీకొట్టిన కారు

భారత్ మ్యాచ్ 'భాగ్యం' లేదు!

వరల్డ్ కప్‌లో హైదరాబాద్ ఉప్పల్ మైదానానికి దక్కని టీమిండియా వన్డే

పాకిస్తాన్ రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం.. అహ్మదాబాద్‌లో భారత్, పాక్ పోరు


12లో

ఇదండీ సంగతి!



..మీ కోరికకు అనుగుణంగా మార్చుకున్నార్సార్!

'తీపి'గా కమ్మేస్తోంది



దేశంలో పెరుగుతున్న 'మధుమేహం'

- ప్రస్తుతం దేశంలో 101 మిలియన్ల మంది డయాబెటిస్ బాధితులు
- 2045 నాటికి 134 మిలియన్లకు చేరుకుంటుందని అంచనా
- జీవనశైలి మార్పులతో రక్తపోటు, స్థూలకాయం, ఊబకాయ సమస్యలు

ఎండీఆర్ఎఫ్, ఐసీఎంఆర్ అధ్యయనంలో వెల్లడి

సాక్షి, అమరావతి: భారతదేశాన్ని మధుమేహం బాధిస్తోంది. ఏటా మధుమేహం బాధితుల సంఖ్య పెరుగుతూనే ఉంది. 2017తో పోలిస్తే మధుమేహుల సంఖ్య దాదాపు 50 శాతం వృద్ధి చెందింది. ప్రస్తుతం దేశంలో 101 మిలియన్ల మంది మధుమేహంతో సతమతం అవుతున్నారు. ఇది 2045 నాటికి 134 మిలియన్లకు పెరుగుతుందని వైద్య నిపుణుల అంచనా. దీనికితోడు రక్తపోటు, స్థూలకాయం, ఊబకాయం కేసులు కూడా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ది లాన్సెట్ డయాబెటిస్, ఎండోక్రినాలజీ జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం.. పెరుగుతున్న పట్టణీకరణతో పాటు కోవిడ్ మహమ్మారి కారణంగా ప్రజల జీవన శైలిలో మార్పులతో ఈ వ్యాధులు దాడి చేస్తున్నాయని పేర్కొంది. దేశంలో 11.4 శాతం డయాబెటిస్ ప్రాబల్యం ఉంటే.. 35.5 శాతం రక్తపోటు, 15.3 శాతం మంది ప్రీడయాబెటిస్‌తో కేసులున్నట్టు గుర్తించింది. మద్రాస్ డయాబెటిస్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఎండీఆర్ఎఫ్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) సంయుక్తంగా దాదాపు దశాబ్దానికిపైగా పరిశోధనలు చేసి వివరాలు వెల్లడించింది.

కోట్లలో ఎన్‌సీడీ వ్యాధి గ్రస్తులు: మధుమేహంతో పాటు నాన్ కమ్యూనికేబుల్ వ్యాధుల (సంక్రమించని వ్యాధులు–ఎన్‌సీడీ)పై అతిపెద్ద అధ్యయనంలో.. దేశవ్యాప్తంగా సాధారణ స్థూలకాయంతో 254 మిలియన్ల మంది (28.6 శాతం), ఉదర ఊబకాయంతో 351 మిలియన్ల మంది (39.5 శాతం), 136 మిలియన్ల మంది ప్రీడయాబెటిస్, 315 మిలియన్ల మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్టు స్పష్టం చేసింది. ఇక్కడ ప్రీడయాబెటిస్ మినహా అన్ని ఎన్‌సీడీ వ్యాధులు గ్రామీణ ప్రాంతాల కంటే పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ ఉన్నాయి. మానవ అభివృద్ధి సూచీ కనిష్టంగా ఉన్న అనేక రాష్ట్రాల్లో మధుమేహం, ప్రీడయాబెటిస్ నిష్పత్తి 1 కంటే తక్కువగా ఉంది.

గోవా టాప్: 2017లో భారతదేశంలో మధుమేహం ప్రాబల్యం దాదాపు 7.5 శాతం ఉంటే ఇప్పుడు అది రెట్టింపయ్యింది. ప్రస్తుతం గోవాలో అత్యధికంగా 26.4%, ఉత్తరప్రదేశ్‌లో అత్యల్పంగా 4.8 శాతం మధుమేహ బాధితులు ఉంటే.. ప్రీ డయాబెటిస్‌లో గరిష్టంగా సిక్కింలో 31.3 శాతం, కనిష్టంగా మిజోరాంలో 6.8 శాతం నమోదైంది. రక్తపోటు అత్యధికంగా పంజాబ్‌లో 51.8 శాతం, అత్యల్పంగా మేఘాలయాలో 24.3% ఉంది.

బాధితులకు అండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వైద్య పరంగా, ఆర్థికంగా ఆదుకోవాలని బాధితుల వినతి
- వెంటనే స్పందించిన సీఎం
- ఆదుకోవాలని కలెక్టర్‌కు ఆదేశం
- సాయంత్రానికి నగదు సాయాన్ని అందించిన అధికారులు
- అవసరమైన వారికి వైద్య సహాయానికి ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి మానవతను చాటుకున్నారు. ఎక్కడ ఎటువంటి బాధితులు కనిపించినా వెంటనే వారికి తగిన సహాయాన్ని అందించే సీఎం జగన్ సోమవారం పల్నాడు జిల్లా క్రోసూరులోనూ పలువురికి అండగా నిలిచారు. జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ సందర్భంగా పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో జరిగిన బహిరంగ సభ అనంతరం హెలీపాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివిధ సమస్యలతో బాధపడుతున్న 20 మంది వారి సమస్యలు వివరించారు. తమను వైద్యపరంగా, ఆర్థికంగా ఆదుకోవాలని సీఎం వైఎస్ జగన్‌ను వేడుకున్నారు. సీఎం జగన్ వెంటనే స్పందించి బాధితులందరికీ అవసరమైన వైద్యం, ఆర్థిక సహాయం వెంటనే అందజేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటిని ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సోమవారం సాయంత్రానికి బాధితులకు అధికారులు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అవసరమైన వారికి వైద్య సాయానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఆ వివరాలివీ..



నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన బి. గోపి రైలు ప్రమాదంలో గాయపడ్డాడు. తన దీన స్థితిని సీఎం జగన్‌కు ఆయన వివరించారు. ఆదుకోవాలని కోరారు. సీఎం వెంటనే స్పందించి గోపికి రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనకు వెంటనే అధికారులు రూ.5 లక్షలు అందించారు.





నూజెండ్ల మండలం తిమ్మాపురానికి చెందిన కుక్కమూడి సుబ్బారావు వెన్నెముక సమస్యతో బాధపడుతున్నానని చెప్పడంతో లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించారు.





నంద్యాలకు చెందిన కె. మార్తమ్మ మూర్ఛవ్యాధితో బాధపడుతున్నానని, తనకు ఏదైనా ఉపాధి చూపించాలని కోరారు. ఆమెకు తక్షణ సాయం కింద లక్ష రూపాయలు అందించి ఉద్యోగ కల్పన విషయమై నంద్యాల కలెక్టర్‌కు లేఖ రాయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు ఆమెకు ఆర్థిక సాయం అందించారు.





బెల్లంకొండ మండలం మాచయపాలేనికి చెందిన పున్నారెడ్డి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నానని చెప్పడంతో ఆయనకు తక్షణ సాయంగా రూ.లక్షన్నర అందించాలని, ఉచిత డయాలసిస్, మందులు అందించాలని సీఎం ఆదేశించారు. ఆ మేరకు అధికారులు వెంటనే చెక్కు అందించారు.





అచ్చంపేట మండలం ముత్యాలకు చెందిన పువ్వాడ సాయికి చెయ్యి విరిగింది. ఆమె పరిస్థితిని విన్న సీఎం జగన్ లక్ష రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు ఫిజియోథెరపీ అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారులు ఆయనకు ఆర్థిక సాయం అందించారు.



- పిడుగురాళ్ల మండలం పత్తిగుంటలకు చెందిన మాస్టర్ మొహమ్మద్ షబ్బీర్, షేక్ అబ్దుల్ రెహ్మాన్ ఇద్దరూ మూర్ఛవ్యాధితో బాధపడుతున్నారు. వారికి చెరొక లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించి, ఉచితంగా వైద్యం అందజేయాలని సీఎం ఆదేశించారు. వారికి అధికారులు చెక్కులు అందించారు.
- క్రోసూరు మండలం గుడిపాడుకు చెందిన దుర్గారావు పశుమిత్రగా నియమించాలని కోరారు. అతనికి స్వయం ఉపాధి కోసం రెండు లక్షల తక్షణ సాయం అందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అధికారులు వెంటనే ఆయనకు చెక్కు అందించారు.
- నరసరావుపేట మండలానికి చెందిన ఇందిర తనకు ఉద్యోగం కావాలని కోరడంతో లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించడంతోపాటు ఆమె కుమారుడికి స్వయం ఉపాధి సాయం చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు ఆమెకు రూ.లక్ష చెక్కు అందించారు.
- నూజెండ్ల మండలం తిప్పావురం గ్రామానికి చెందిన కుప్పల మరియమ్మ భర్తను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నానని చెప్పగా సీఎం జగన్ ఆదేశాల మేరకు అధికారులు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు.
- అంగ వైకల్యంతో బాధ పడుతున్న క్రోసూరుకు చెందిన షేక్ సుభానికి తక్షణ ఆర్థిక సాయం కింద లక్ష రూపాయలు అందజేయాలని సీఎం ఆదేశించారు. ఆమేరకు అధికారులు ఆర్థిక సాయం అందించారు.
- దుర్గి మండలం నెహ్రూనగర్ తాండాకు చెందిన బాలునాయక్ కడుపులో ట్యూమర్లతో బాధపడుతున్నారు. అతని పరిస్థితిని విన్న సీఎం జగన్ అతనికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించాలని, పింఛన్ ఇచ్చే అవకాశాన్ని పరిశీలించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. అతనికి అధికారులు రూ.లక్ష చెక్కు అందించారు.
- నంద్యాల జిల్లాకు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు స్వయం ఉపాధి కోసం రెండు లక్షల రూపాయలు తక్షణ ఆర్థిక సాయం ప్రకటించగా, అధికారులు ఆమేరకు చెక్కు అందించారు.
- క్రోసూరుకు చెందిన షేక్ అమాన్ వెన్నెముక సమస్యతో బాధపడుతుండటంతో తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందించడంతోపాటు నాణ్యమైన చికిత్స అందిస్తామని హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు అధికారులు చెక్కు అందించారు.
- క్రోసూరు మండలం ఇస్సపాలేనికి చెందిన కుమ్మరిగుంట మంజుల కంటి సమస్యతో బాధపడుతున్నారు. ఆమెకు ఉచిత వైద్యంతో పాటు లక్ష రూపాయలు సాయం అందించాలని సీఎం జగన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రానికే ఆమెకు రూ.లక్ష చెక్కును అధికారులు అందించారు.
- అంగవైకల్యంతో బాధపడుతున్న పెదకూరపాడుకు చెందిన ఆదాం షఫీకి లక్ష రూపాయలు ఆర్థిక సాయం ప్రకటించారు. సాయంత్రానికి అధికారులు ఆయనకు రూ. లక్ష చెక్కు ఇచ్చారు.
- గుండె జబ్బుతో బాధపడుతున్న కోసూరు మండలం గుడిపాడుకు చెందిన షేక్ కాజా షరీఫ్‌కు లక్ష రూపాయలు తక్షణ ఆర్థిక సహాయం, ఉచితంగా వైద్యం అందిస్తామని సీఎం జగన్ హామీ ఇచ్చారు. సీఎం ఆదేశాల మేరకు ఆయనకు రూ.లక్ష చెక్కు ఇచ్చారు.
- తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న పెదకూరపాడు మండలం లగడపాటికి చెందిన హాకీ హసన్ సాహెబ్‌కు సీఎం ఆదేశాల మేరకు అధికారులు రూ.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు.
- క్రోసూరు మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన ఇమామ్ బాషాకి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశాల మేరకు అతనికి లక్ష రూపాయల చెక్కు పంపిణీతోపాటు ఏదైనా ఉద్యోగం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు.
- సంతమాగులూరు మండలం పరిటాల వారి పాలేనికి చెందిన గంజనబోయిన చరణ్ తలసేమియా బాధితుడు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఇతనికి జిల్లా కలెక్టర్ లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఇతనికి గతంలోనే లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఇప్పుడు మరోసారి ఆర్థిక సహాయం అందించారు. బాధితుడికి అత్యున్నత ఆసుపత్రిలో ఉచిత చికిత్స అందిస్తామని జిల్లా కలెక్టర్ చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందేలా చూస్తామన్నారు.
- తాడేపల్లి మండలం పెనుమాకకి చెందిన కె అరవింద్‌కి మెదడు ఆపరేషన్ కోసం సీఎం జగన్ ఆదేశాల మేరకు అధికారులు లక్ష రూపాయిలు తక్షణ సాయం అందించారు.

పేదలపై పగబట్టిన పెత్తందారు

డిక్లరేషన్లంటూ చంద్రబాబు డ్రామాలు: క్రోసూరు సభలో సీఎం జగన్ ధ్వజం



పల్నాడు జిల్లా క్రోసూరులో జరిగిన సభకు భారీగా హాజరైన జనసందోహంలో ఓ భాగం



సభలో ప్రసంగిస్తున్న సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'పేద పిల్లలు చదువుకుంటుంటే.. అందులోనూ ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటే.. వారికి గవర్నమెంట్ స్కూళ్లలో డిజిటల్ బోధన జరుగుతుంటే.. వారి చేతుల్లో ట్యాబ్‌లు కనిపిస్తే తట్టుకోలేని మనస్తత్వం చంద్రబాబుది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం పల్నాడు జిల్లా క్రోసూరులో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన సీఎం జగన్

పెత్తందారీ మనస్తత్వం.. పేదల వ్యతిరేకి

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే ఎక్కడా లంచాలు, వివక్షకు తావుండకూడదని వలంటీర్ వ్యవస్థను తెచ్చాం. గ్రామాల్లో అవ్వాతాతలకు పెన్షన్ దగ్గర నుంచి అక్కచెల్లెమ్మలకు రేషన్ సరుకులు మొదలు పేదలు, రైతులకు ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతో వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టాం. ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ తీసుకొచ్చాం. నాడు–నేడు ద్వారా స్కూళ్ల స్వరూపంలో మార్పులు తీసుకొచ్చాం. ఇలా అనేక వ్యవస్థలను గ్రామస్థాయిలో మనందరి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మరి ఇవే ఆలోచనలు గతంలో చంద్రబాబు బుర్రకు ఎందుకు తట్టలేదో ఒక్కసారి ఆలోచన చేయాలి. కారణం ఆయనది పెత్తందారీ మనస్తత్వం, పేదల వ్యతిరేకి కాబట్టే. దేశ చరిత్రలో ఏ ప్రభుత్వమూ నిలబడనంత అండగా మీ జగనన్న ప్రభుత్వం అక్క చెల్లెమ్మలకు తోడుగా నిలబడింది.

గ్యాస్ సిలిండర్ల డిక్లరేషన్..

టీడీపీ మూసివేయడానికి సిద్ధంగా ఉన్న దుకాణం కాబట్టే పక్క రాష్ట్రాల్లో మేనిఫెస్టో కాపీకొట్టి తెచ్చి 'బిస్‌బెళి బాత్'లా వండుతున్నారు. మనం అమలు చేసిన పథకాలన్నింటినీ కూడా కిచిడీ చేసి పులిహోరలా వండే కార్యక్రమం చేస్తున్నారు. సీఎంగా పనిచేసిన 28 ఏళ్ల తరువాత, 14 ఏళ్లు సీఎంగా చేసిన తర్వాత ఇప్పుడు రాయలసీమ డిక్లరేషన్ అంటూ మొదలు పెడుతున్నారు. బీసీ డిక్లరేషన్, ఎస్సీ ఎస్టీ, డిక్లరేషన్, మైనార్టీ డిక్లరేషన్, అక్కచెల్లెమ్మలు, రైతన్నలు చివరికి గ్యాస్ సిలిండర్ల డిక్లరేషన్ అంటూ ఇవాళ డ్రామాలు మొదలు పెట్టారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పని చేసినప్పుడు ఏం గాడిదలు కాశావయ్యా చంద్రబాబూ? అని అడుగుతున్నా. ఇవాళ ప్రజల్ని మళ్లీ మోసం చేస్తూ, మరోసారి అవకాశం ఇస్తే మయసభ నిర్మిస్తానంటున్నాడు. ఇంటింటికీ కేజీ బంగారం ఇస్తానంటున్నాడు. ఇంటింటికీ బెంజ్ కారు కొనిస్తానంటున్నాడు. ఈ కొత్త డ్రామాలు నమ్మవచ్చా? అని అడుగుతున్నా. చంద్రబాబు బతుకంతా వాగ్దానాలు, ఆ తర్వాత వెన్నుపోట్లు! మళ్లీ ఎన్నికలొచ్చినప్పుడు మళ్లీ వాగ్దానాలు, మళ్లీ వెన్నుపోట్లు! ఈ చక్రమే బాబు సైకిల్ చక్రం!



సభలో థ్యాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ఇటు పేదలు – అటు పెత్తందార్లు

ఈరోజు మన పేదలకూ – బాబు పెత్తందార్లకూ మధ్య యుద్ధం జరుగుతోంది. బాబు పెత్తందారీ భావజాలానికి, మనందరి పేదల ప్రభుత్వానికి మధ్య జరుగుతున్న యుద్ధమిదీ! చంద్రబాబు దోచుకో, పంచుకో, తినుకో అనే డీపీటీ భావజాలానికి, ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి రూ.2.16 లక్షల కోట్లు నేరుగా పంపిన మన డీబీటీ పద్ధతికి మధ్య యుద్ధం జరుగుతోంది. వారి సామాజిక అన్యాయానికి, మన సామాజిక న్యాయానికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. ఇదే రాష్ట్రంలో, ఇదే బడ్జెట్‌లో వారు చేసిన స్కామ్‌లకు, అదే బడ్జెట్‌లో మనం అందజేస్తున్న మంచి స్కీములకు మధ్య జరుగుతున్న యుద్ధం ఇది. వారి ఎల్లో మీడియా విష ప్రచారాలకు, ఇంటింటికీ మనం చేసిన మంచికి మధ్య జరుగుతున్న యుద్ధం ఇది.

నా ధైర్యం మీరే..

ఈ కురుక్షేత్ర మహాసంగ్రామంలో వారిది పేదలపై యుద్ధం అని గుర్తు పెట్టుకోవాలి. ఈ యుద్ధంలో వారి మాదిరిగా నాకు ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5 ఢంకా బజాయించకపోవచ్చు. ఒక దత్తపుత్రుడు అండగా నిలబడకపోవచ్చు. బీజేపీ అనే పార్టీ అండగా ఉండకపోవచ్చు. కానీ జగనన్న వీళ్లను నమ్ముకోలేదు. మీ జగనన్న దేవుడి దయను, మీ చల్లని ఆశీస్సులను మాత్రమే నమ్ముకున్నాడు. ఈ కురుక్షేత్ర మహాసంగ్రామంలో నా ధైర్యం మీరే. ఇంటింటికీ మనందరి ప్రభుత్వం చేసిన మంచే నా బలం అని చెప్పడానికి మీ బిడ్డగా గర్వపడుతున్నా. మీ ఇంట్లో మంచి జరిగిందా? లేదా? అనేది ఒక్కటే ప్రామాణికంగా తీసుకోండి. మీబిడ్డ వల్ల మీఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా తోడుగా నిలబడాలని కోరుతున్నా. ఈ యుద్ధంలో చివరకు మంచే గెలుస్తుందని మనసారా నమ్ముతున్నా.

పులిచింతలలో ఫుల్లుగా నీళ్లు

పులిచింతల ప్రాజెక్టు నాన్న స్వప్నం. ఆయన పూర్తి చేయగా మిగిలిపోయిన ఆర్‌అండ్‌ఆర్ కూడా ఇవ్వకుండా, 45 టీఎంసీలను నిల్వ చేయకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. మన ప్రభుత్వ హయాంలో రూ.140 కోట్లు కేటాయించి 45 టీఎంసీల నీళ్లు నింపి ఆర్‌అండ్‌ఆర్ కార్యక్రమం కూడా పూర్తి చేశాం. ఎమాజిగూడెంలో పొరపాటున 128 ఇళ్లకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ మిగిలిపోయినట్లు ఎమ్మెల్యే నా దృష్టికి తెచ్చారు. అది కూడా పూర్తి చేస్తాం. రూ.45 కోట్లతో అచ్చంపేట మండలం తాళ్లచెరువులో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కోరారు. దాన్ని కూడా మంజూరు చేస్తున్నాం. మాదిపాడును పులిచింతల డ్యామ్‌కు కనెక్ట్ చేస్తూ రూ.3.50 కోట్ల వ్యయంతో రోడ్డు కూడా మంజూరు చేస్తున్నాం.

రూ.60 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జికి శంకుస్థాపన

మాదిపాడు వద్ద రూ.60 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. దీనివల్ల హైదరాబాద్ వెళ్లేందుకు 80 కి.మీ. దూరం తగ్గుతుంది. కీలకమైన అమరావతి – రాజుపాలెం రోడ్డుకు మరో రూ.150 కోట్లతో సీఎం జగన్ శంకుస్థాపన చేశారు.

పేదింటి పిల్లలు ప్రపంచాన్ని ఏలాలి

మన విద్యార్థులు మెరుగ్గా రాణించేలా ఆధునిక చదువులు: సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: పేద విద్యార్థులకు అంతర్జాతీయ చదువులే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. విద్యారంగంలో సమూల మార్పులను తెచ్చి నాలుగేళ్లలో రూ.60,329 కోట్లు వ్యయం చేశామన్నారు. పాఠశాలలు పునఃప్రారంభం కాగానే పుస్తకాలు, యూనిఫామ్ కోసం ఎవరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటి నుంచి పదో తరగతి చదివే ప్రతి విద్యార్థికీ కుట్టుకూలీతో సహ మూడు జతల యూనిఫామ్, బ్యాగు, బైలింగ్యువల్ టెక్స్ట్ బుక్స్, నోట్‌బుక్స్, వర్క్ బుక్స్, బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్టుతో పాటు మంచి డిక్షనరీని కూడా విద్యాకానుక కిట్ ద్వారా ఉచితంగా అందిస్తున్నామన్నారు. సోమవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరులో రూ.1,042.53 కోట్లతో జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని సీఎం లాంఛనంగా ప్రారంభించారు. దీనిద్వారా 43,10,165 మంది విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది. ఈ సందర్భంగా సీఎం జగన్ మోడల్ స్కూల్‌ను సందర్శించి కొద్ది సేపు విద్యార్థులతో ముచ్చటించారు. కిట్లు, పాఠ్య పుస్తకాలను స్వయంగా పరిశీలించారు. స్కూల్ బ్యాగ్ ధరించి విద్యార్థులను ఉత్సాహపరిచారు. బోర్డుపై 'ఆల్ ద బెస్ట్..' అని రాసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

పిల్లలకు ఓటు హక్కు లేదని గతంలో పట్టించుకోలేదు

విద్యార్థులకు ఈ దఫా యూనిఫామ్ క్లాత్ గతేడాది కంటే ఎక్కువ ఇస్తున్నాం. పిల్లలందరూ చక్కగా కనిపించేందుకు యూనిఫామ్ డిజైన్‌లో కూడా మార్పులు తెచ్చాం. గతేడాది ఫీడ్‌బ్యాక్ ఆధారంగా పుస్తకాల బ్యాగ్ సైజ్ కూడా పెంచాం. మెరుగైన క్వాలిటీ బూట్లు ఇస్తున్నాం. బైలింగ్యువల్ పాఠ్య పుస్తకాల నాణ్యతను కూడా పెంచి పిల్లలకు ఇస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ్టి నుంచి విద్యాకానుక కిట్ల పంపిణీ పండుగ వాతావరణంలో జరుగుతుంది. చిన్నపిల్లలు ఓటర్లు కానందున వారిని పట్టించుకోవాల్సిన అవసరం లేదన్న పరిస్థితి గతంలో ఉండేది. ఇవాళ మీ జగన్ మామయ్య ప్రభుత్వంలో విద్యాకానుక కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధుల సమక్షంలో పండుగలా నిర్వహిస్తున్న పరిస్థితి తెచ్చినందుకు సంతోషిస్తున్నా. ఒక్కో విద్యార్థికి విద్యాకానుక కిట్ కోసం రూ.2,400 ఖర్చు చేస్తున్నాం. ఒక్క విద్యాకానుక కింద నాలుగేళ్లలో రూ.3,366 కోట్లను ప్రభుత్వం వెచ్చించింది.



మెరుగ్గా విద్యా కానుక కిట్లు
సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: వరుసగా నాలుగో ఏడాది జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని సోమవారం ప్రారంభించామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'విద్యార్థులు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ వంటి విద్యా సామాగ్రి కోసం ఇబ్బంది పడకుండా పాఠశాలలు ప్రారంభమైన తొలిరోజు నుంచే ఈ కిట్ల పంపిణీని మన ప్రభుత్వంలో చేపడుతున్నాం. ఈ ఏడాది యూనిఫామ్ డిజైన్‌లో మార్పులు చేసి మెరుగ్గా తీర్చిదిద్దాం. షూస్ నాణ్యత పెంచడంతో పాటు పుస్తకాల బ్యాగ్ సైజ్‌ను కూడా పెంచాం. విద్యార్థులకు 10 వస్తువులతో కూడిన కిట్లను రూ.1,042 కోట్ల ఖర్చుతో అందిస్తున్నాం' అని ఆయన ట్వీట్ చేశారు.

టోఫెల్‌కు శిక్షణ.. సర్టిఫికెట్

అధికారంలోకి రాగానే పాఠశాల స్థాయి నుంచే ఇంగ్లీషులో పిల్లల నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకున్నాం. మన పిల్లలు ఎక్కడకు వెళ్లినా ప్రపంచాన్ని ఏలే పరిస్థితుల్లో ఉండాలే కానీ వారిని తక్కువగా చూసే పరిస్థితుల్లో ఉండకూడదని ఈ దిశగా అడుగులు వేశాం. మన పిల్లలు ఎక్కడైనా రాణించేందుకు వీలుగా టోఫెల్ పరీక్షలకు సిద్ధం చేసే కార్యక్రమం ఈ ఏడాది నుంచే మొదలవుతుంది. ఇందుకోసం ప్రపంచంలో ఎంతో పేరున్న అమెరికన్‌సంస్థ ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీసెస్ (ఈటీఎస్), ప్రిన్స్‌టన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాం. మూడు నుంచి ఐదో తరగతి వరకు టోఫెల్ ప్రైమరీ, ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు టోఫెల్ జూనియర్ పేరుతో పరీక్షలు నిర్వహించి టోఫెల్ ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ అందచేస్తారు. తద్వారా ఇంగ్లీషు వినడమే కాకుండా ధారాళంగా మాట్లాడడం కూడా వస్తుంది. అది కూడా అమెరికా యాసలో మాట్లాడగలుగుతారు. అంతేకాకుండా అత్యుత్తమ ప్రతిభ చూపించిన ప్రభుత్వ స్కూళ్లలో ప్రతి జిల్లాలో ఒక ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ వెరసి 26 జిల్లాల్లో 52 స్కూళ్లకు సంబంధించిన ఇంగ్లీషు టీచర్లను మెరుగైన ఓరియంటేషన్ కోసం అమెరికాలోని ప్రిన్స్‌టన్‌కు పంపిస్తాం.

డిజిటల్ క్లాస్ రూములు..

స్కూళ్లతోపాటు ప్రతి క్లాస్ రూమ్ రూపురేఖలు మారుతున్నాయి. నాడు–నేడు తొలిదశ పూర్తైన స్కూళ్లలో 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్‌రూమ్‌లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ తెస్తున్నాం. డిజిటల్ బోధనతో పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా చర్యలు తీసుకున్నాం. నాడు–నేడు తొలిదశ పూర్తైన 15,750 స్కూళ్లలో 6వ తరగతి, ఆపైన ఉన్న 30,232 క్లాస్ రూముల్లో డిజిటల్ బోధనను జూలై 12న ప్రారంభిస్తున్నాం. కాసేపటి క్రితం క్రోసూరు హైస్కూల్‌లో డిజిటల్ బోర్డులు చూశా. అవి ఇక 6వ తరగతి నుంచి ప్రతి క్లాస్‌రూమ్ లోనూ ఉంటాయి. డిసెంబర్ 21 నాటికి నాడు–నేడు రెండు దశలు పూర్తైన దాదాపు 33 వేల స్కూళ్లలో 6 నుంచి క్లాస్ రూమ్స్‌లో డిజిటల్ బోధన దిశగా అడుగులు పడతాయి. టాయిలెట్ల నిర్మాణం, నిర్వహణపై దృష్టి పెట్టి మెయింటెనెన్స్ ఫండ్ తీసుకొచ్చాం. బడికి వెళ్లే ఏ చిట్టి తల్లి కూడా ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో వారి కోసం 'స్వేచ్ఛ' కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం.



డిజిటల్ బోర్డుపై ఆల్ ది బెస్ట్ అని రాసి శుభాకాంక్షలు తెలుపుతున్న సీఎం

నాడు-నేడు, సీబీఎస్‌ఈ, ఇంగ్లీషు మీడియం..

విద్యారంగంలో నాలుగేళ్లలో విప్లవాత్మక మార్పులు తెచ్చాం. ఇప్పటికే మనబడి నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. సీబీఎస్ఈ సిలబస్, ఇంగ్లీష్ మీడియం తీసుకొచ్చాం. గతంలో క్లాస్ టీచర్లే లేని పరిస్థితి నుంచి మూడో తరగతి నుంచి ఏకంగా సబ్జెక్టు టీచర్లను నియమిస్తూ మన ప్రభుత్వంలో అడుగులు పడ్డాయి.

డిసెంబర్ 21న మళ్లీ ట్యాబ్‌లు..

నాలుగో తరగతి నుంచి మన కరిక్యులమ్‌తో అనుసంధానిస్తూ పేద పిల్లలందరికీ బైజూస్ కంటెంట్ ఉచితంగా ఇస్తున్నాం. రోజుకో మెనూతో గోరుముద్ద, అంగన్‌వాడీల్లో సంపూర్ణ పోషణ కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. అమ్మ ఒడి ద్వారా పిల్లల్ని బడులకు పంపేలా తల్లులను ప్రోత్సహిస్తూ ఏటా రూ.15 వేలు ఇస్తున్నాం. అమ్మ ఒడి కోసం ఇప్పటివరకూ రూ.19,674 కోట్లు ఖర్చు చేశాం. 8వ తరగతి పిల్లలకు ఆఫ్‌లైన్‌లో కూడా పనిచేసేలా ప్రీలోడెడ్ బైజూస్ కంటెంట్‌తో పిల్లలకు, టీచర్లకు ట్యాబ్‌లు అందించాం. 5,18,740 ట్యాబ్‌ల కోసం రూ.685 కోట్లు ఖర్చు చేసి గత ఏడాది ఇచ్చాం. మళ్లీ ఈ సంవత్సరం మీ జగన్ మామయ్య పుట్టిన రోజైన డిసెంబర్ 21న మళ్లీ 8వ తరగతి పిల్లలకు ట్యాబ్‌లు ఇస్తాం.

'ఉన్నత' మార్పులు..

జగనన్న విద్యాదీవెన ద్వారా కాలేజీ ఫీజు ఎంతైనా సరే మూడు నెలలకు ఒకసారి నేరుగా పిల్లల తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తున్నాం. ఒక్క జగనన్న విద్యా దీవెన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కోసం ఇప్పటి వరకు మన ప్రభుత్వం రూ.10,636 కోట్లు ఖర్చు చేసింది. ఒక్కో పిల్లాడి కోసం ఏడాదికి రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేస్తూ జగనన్న వసతి దీవెన తీసుకొచ్చి ఇప్పటివరకు రూ.4,275 కోట్లు వెచ్చించాం. మన పిల్లలు దేశంలోనే కాదు ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబడాలనే తపనతో జగనన్న విదేశీ విద్యా దీవెన కోసం ఇప్పటిదాకా రూ.20 కోట్లు ఖర్చు చేశాం. టాప్ 50 యూనివర్సిటీల్లో మన పిల్లలు 213 మంది చదువుతున్నారు. కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలని తీసుకొచ్చి వధూవరులకు టెన్త్ సర్టిఫికెట్ ఉండాలనే నిబంధన విధించాం. విద్యారంగంపై నాలుగేళ్లలో మనం చేసిన ఖర్చు రూ60,329 కోట్లు.

రాష్ట్రంలో చదువుల విప్లవం

మన విద్యార్థులు గ్లోబల్ సిటిజెన్‌గా రాణించాలనే ఆలోచనతో విద్యా విధానంలో సీఎం జగన్ సమూల మార్పులు తెస్తున్నారు. పేద, ధనిక వ్యత్యాసం లేకుండా అందరూ సమానంగా ఉండాలనే ఉద్దేశంతో విద్యాకానుక ఇస్తున్నాం. గోరుముద్దలో రోజుకో మెనూతో చక్కటి భోజనం పెడుతున్నాం. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లిస్తూ బైజూస్ కంటెంట్ కూడా అందజేస్తున్నాం. రాష్ట్రంలో చదువుల విప్లవం కొనసాగుతోంది.

– బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి

ఐఐటీ విద్యార్థులకు విదేశాల రెడ్ కార్పెట్



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) అంటే ప్రపంచంలోనే పేరెన్నికగన్న సాంకేతిక విద్యా సంస్థల్లో ఒకటి. ఐఐటీలో సీటు వస్తే ఆ విద్యార్థి అతను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి మార్గం ఏర్పడినట్టే. అత్యున్నత శిక్షణలో రాటుదేలే ఐఐటీ విద్యార్థులంటే విదేశీ సంస్థలకూ క్రేజీ. అందుకే భారత ఐఐటీ విద్యార్థులకు విదేశాలు రాచబాట పరుస్తున్నాయి. వారికి విదేశీ సంస్థలు ఉద్యోగ, ఉన్నత విద్యాభ్యాసం అందించేందుకు పోటీ పడుతున్నాయి. ఫలితంగా దేశం నుంచి మేధో వలసలో ఐఐటీ విద్యార్థులే అత్యధిక శాతం ఉంటున్నారు. దేశంలో ఐఐటీల నుంచి ఏటా పట్టా పొందుతున్న విద్యార్థుల్లో మూడో వంతు విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఐఐటీల్లో ప్రవేశాలకు ప్రవేశ పరీక్షల ద్వారా దేశంలో అత్యంత ప్రతిభావంతులను ఎంపిక చేస్తారు. అక్కడ శిక్షణ పొందిన వారిని అత్యుత్తమ మానవ వనరులుగా ప్రపంచ దేశాలు గుర్తిస్తున్నాయి. అందుకే ప్రపంచవ్యాప్తంగా ఎంఎన్‌సీలు, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలు భారత ఐఐటీ విద్యార్థులకు పెద్దపీట వేస్తున్నాయని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌బీఈఆర్) తాజా నివేదిక వెల్లడించింది. దేశంలోని 23 ఐఐటీలలోని 16,598 సీట్ల భర్తీ కోసం ఈ ఏడాది నిర్వహించిన పరీక్ష కోసం 1,89,744 మంది విద్యార్థులు పోటీ పడ్డారని ఆ నివేదిక పేర్కొంది. దేశంలోని ఐఐటీలలో కూడా చెన్నై, ముంబై, ఖరగ్‌పూర్, ఢిల్లీ, కాన్పూర్ ఐఐటీల విద్యార్థులకు మల్టీ నేషనల్ కంపెనీలు మరింత పెద్ద పీట వేస్తున్నాయని తెలిపింది. ఎన్‌బీఈఆర్ నివేదికలోని ప్రధాన అంశాలు సంక్షిప్తంగా..

- భారత్‌లో ఐఐటీల నుంచి ఏటా పట్టా పొందుతున్న విద్యార్థుల్లో 35 శాతం విదేశాలకు వెళ్లిపోతున్నారు
- ఐఐటీలలో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షలో టాప్–1,000లో నిలుస్తున్న విద్యార్థుల్లో 36 శాతం మంది విదేశాల బాట పడుతున్నారు.
- భారత ఐఐటీయన్ల ప్రధాన గమ్యస్థానం అమెరికా. విదేశాలకు వెళుతున్న ఐఐటీయన్లలో 65% అమెరికాకే వెళ్తున్నారు. వారిలో 85% మంది అమెరికాలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేసి అక్కడే ప్రముఖ కంపెనీల్లో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌ల నుంచి సీఈవోల వరకు బాధ్యతలు చేపడుతున్నారు.
- ప్రపంచంలో 50 విదేశీ విద్యా సంస్థల విద్యార్థులకు బ్రిటన్ హైపొటెన్షియల్ ఇండివిడ్యువల్ వీసాలు జారీ చేస్తోంది. వారిలో భారత ఐఐటీ విద్యార్థులే ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నారు.
- భారత ఐఐటీ అంటే విదేశీ సంస్థలకు ఎంతటి క్రేజ్ ఉందో చెప్పడానికి వారణాశిలోని బనారస్ హిందూ విశ్వవిద్యాలయమే (బీహెచ్‌యూ) తార్కాణం. బీహెచ్‌యూకు ఐఐటీ హోదా కల్పించిన తరువాత ఆ సంస్థలోని విద్యార్థులకు విదేశాల్లో ప్లేస్‌మెంట్స్ ఏకంగా 540 శాతం పెరగడం విశేషం.

చెప్పుడు మాటలతో తప్పుడు ఆరోపణలా?

- మా పాలనకు మీరే కితాబిచ్చి విమర్శిస్తారా?: మంత్రి కారుమూరి
- బురద చల్లే యత్నాలు బెడిసికొడతాయి
- విభజన హామీల ప్రస్తావన ఏది?
- నాడు బాబు రాళ్లు వేయించింది మరిచారా?
- మోదీని నోటికొచ్చినట్లు తిట్టింది గుర్తులేదా?



సాక్షి, అమరావతి: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా విశాఖ పర్యటన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన వ్యాఖ్యలను పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఖండించారు. చెప్పుడు మాటలు విని తప్పుడు ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద చల్లేందుకు సాహసించడం మంచిది కాదని హితవు పలికారు. ఈ ప్రయత్నాలు బెడిసికొడతాయని బీజేపీని హెచ్చరించారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నాగేశ్వరరావు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో పాలనపై ఒకవైపు మీరే కితాబులిస్తూ అవినీతి అని ఎలా మాట్లాడతారని అభ్యంతరం తెలిపారు. గతంలో అమిత్‌షా తిరుపతి వచ్చినప్పుడు చంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ నేతలు, కార్యకర్తలు రాళ్లు విసిరి తరిమేశారని గుర్తు చేశారు. ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు దూషించింది చంద్రబాబు కాదా? అని ప్రశ్నించారు. 'మోదీకి భార్యా పిల్లల్లేరు. మోదీ రూ.2 లక్షల కోట్ల ఆస్తిపరుడు' అని విమర్శించిన చంద్రబాబు యూటర్న్ తీసుకుని బీజేపీ జపం చేస్తున్నారని దుయ్యబట్టారు. అమరావతి పెద్ద స్కామ్ అని, సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది బీజేపీ కాదా? అని సూటిగా ప్రశ్నించారు.

అమిత్‌షా నోట విభజన హామీల ప్రస్తావనేది?

'ఐదేళ్ల టీడీపీ హయాంలో ఇసుక దందాలు అంతా ఇంతా కాదు. ఇందులో నాటి మిత్రపక్షమైన బీజేపీకి కూడా భాగస్వామ్యం ఉంటుంది కదా? రాష్ట్ర ఖజానాకు ఎలాంటి ఆదాయం రాలేదు. ఇప్పుడు ఇసుకపై రూ.వేల కోట్ల ఆదాయాన్ని ఖజానాకు జమ చేస్తున్నాం. అభివృద్ధి, సంక్షేమంలో దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచాం. రూ.2.16 లక్షల కోట్లు డీబీటీ ద్వారా పారదర్శకంగా అందచేస్తే ఇక అవినీతి జరిగిందెక్కడ?' అని మంత్రి కారుమూరి ప్రశ్నించారు. అందరి కళ్ల ముందే జరిగిన అమరావతి భూముల కుంభకోణాన్ని వదిలేసి విశాఖలో భూ దోపిడీకి పాల్పడ్డారనే నిరాధార ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆధారాలుంటే బయట పెట్టాలని సవాల్ చేశారు. 'అమిత్‌షా నోట విభజన హామీల ప్రస్తావనేది?' అని ప్రశ్నించారు. 'విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కనీసం ప్రస్తావించలేదు. విశాఖ రైల్వేజోన్ గురించి మాట్లాడలేదు. విశాఖ మెట్రోలైన్ ఊసే లేదు. తగుదునమ్మా అంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురద జల్లేందుకు మాత్రం సిద్ధపడ్డారు. ఆ వేదికపై ఉన్న వారంతా టీడీపీ నుంచి బీజేపీలో చేరిన వారే. అలాంటి వారు చెప్పే చాడీలు విని సీఎం జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తారా? వాస్తవాల్ని తెలుసుకుని మాట్లాడాలి' అని కారుమూరి సూచించారు. సీఎం జగన్ నేతృత్వంలో సింగిల్‌గా పోటీకి దిగి 175 స్థానాలనూ గెలిచి తీరతామని ధీమా వ్యక్తంచేశారు.

నిర్ణీత సమయంలో 'ఎల్లెల్సీ' పనులు పూర్తి చేయాలి

పనులను పరిశీలించిన మంత్రులు బుగ్గన, గుమ్మనూరు



పనులను పరిశీలిస్తున్న మంత్రులు బుగ్గన, గుమ్మనూరు

ఆలూరు(కర్నూలు): ఆంధ్ర–కర్ణాటక సమీపంలోని హగరి అక్విడెక్ట్ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించి నిర్ణీత సమయంలో పూర్తిచేయాలని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం తుంగభద్ర బోర్డు ఇంజనీర్లను ఆదేశించారు. సోమవారం ఇరువురు మంత్రులు హగరి సమీపంలో బదినేహాళ్ గ్రామ సమీపంలో వేదావతి నదిపై 700 మీటర్ల బ్రిడ్జి, ఎల్లెల్సీ కాలువపై ప్రమాదకరంగా మారిన 15వ పిల్లర్, కాలువ ఆధునికీకరణ పనులు, కాలువ డిజైనింగ్, లైనింగ్, డీపీలు, సైడ్‌వాల్ తదితర పనులను పరిశీలించారు. అనంతరం ఆంధ్రకు రావలసిన డ్యాం నీటి వాటా, ప్రస్తుతం నీటి నిలువ, లభ్యత అంశాలపై సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. సకాలంలో సంబంధిత పనులను పూర్తిచేయించే బాధ్యత ఇంజనీర్లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వానికి, రైతులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవన్నారు. మంత్రుల వెంట జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, టీబీ బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి తదితరులున్నారు.

జూలై 4న భీమవరంలో అల్లూరి స్మృతివనం ప్రారంభం

వర్చువల్‌గా ఆవిష్కరించనున్న రాష్ట్రపతి ముర్ము



సిద్ధమైన అల్లూరి సీతారామరాజు స్మృతివనం

సాక్షి, భీమవరం: పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 30 అడుగుల కాంస్య విగ్రహం ఆవరణలోని స్మృతివనాన్ని జూలై 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. గతేడాది అల్లూరి జయంతి సందర్భంగా భీమవరం పట్టణంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో ప్రధాని నరేంద్రమోదీ పాల్గొని క్షత్రియసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అల్లూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పర్యాటకులను ఆకట్టుకునేలా విగ్రహం చుట్టు మొక్కలు నాటి సుందరంగా తీర్చిదిద్దారు. జూలై 4న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము హైదరాబాద్ వస్తున్న సందర్భంగా ఈ స్మృతివనాన్ని వర్చువల్ విధానంలో ఆవిష్కరించేందుకు క్షత్రియ సేవా సమితి ఉభయ తెలుగురాష్ట్రాల అధ్యక్ష, కార్యదర్శులు పేరిచర్ల నాగరాజు, నడింపల్లి నానిరాజు ప్రణాళిక రూపొందించారు. స్మృతివనం ఆవిష్కరణ అనంతరం జాతికి అంకితం చేయనున్నారు.

ఉద్యోగి క్రిమినల్ కేసు నుంచి విముక్తి పొందాకే పదోన్నతి

- విచారణపై స్టే ఇచ్చినా పదోన్నతి కోరజాలరు
- క్రిమినల్ కేసు తేలే వరకు ఆగాల్సిందే
- ఉద్యోగిని పిటిషన్‌ను కొట్టేసిన హైకోర్టు



సాక్షి, అమరావతి: క్రిమినల్ కేసు ఎదుర్కొంటున్న ఓ ఉద్యోగి ఆ కేసు నుంచి పూర్తిగా విముక్తి పొందాకే పదోన్నతి పొందేందుకు అర్హుడని హైకోర్టు స్పష్టం చేసింది. క్రిమినల్ కేసులో కింది కోర్టులో జరుగుతున్న విచారణపై హైకోర్టు స్టే ఇచ్చినా, ఆ స్టే ఉత్తర్వులను చూపుతూ పదోన్నతి కోరజాలరని తేల్చిచెప్పింది. ఉద్యోగిపై శాఖాపరమైన విచారణ మొదలుపెట్టినా లేదా క్రిమినల్ కేసు, అభియోగాలు, అభియోగపత్రం దాఖలైనా ఆ ఉద్యోగికి పదోన్నతినివ్వడాన్ని వాయిదా వేయొచ్చని 1991లో ప్రభుత్వం జీవో 66 జారీ చేసిందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో క్రిమినల్ కేసుపై స్టే విధించినా తనకు పదోన్నతి ఇవ్వడం లేదంటూ ఓ ఉద్యోగిని దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల తీర్పు వెలువరించారు.

నకిలీ సర్టిఫికెట్లతో..

కర్నూలుకు చెందిన నాగరాణి 1996లో కారుణ్య నియామకం కింద ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా తాత్కాలిక ప్రాతిపదికన నియమితులయ్యారు. నియామకపు తేదీ నుంచి మూడేళ్లలో ఇంటర్ పూర్తి చేయాలని అధికారులు ఆమెకు స్పష్టం చేశారు. ఇంటర్ పూర్తికి తనకు మరో మూడేళ్ల గడువునివ్వాలని ఆమె అభ్యర్థించగా ప్రభుత్వం అనుమతినిచ్చింది. 2001లో నాగరాణి బీఏ సర్టిఫికెట్లను సమర్పిస్తూ వీటి ఆధారంగా తన సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు. బెటాలియన్ కమాండెంట్ ఆ సర్టిఫికెట్లు నిజమైనవో, కావో తేల్చాలని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి పంపారు. వాటిని పరిశీలించిన వర్సిటీ అధికారులు నకిలీవని తేల్చారు. దీంతో నాగరాణిని సర్వీసు నుంచి సస్పెండ్ చేస్తూ కమాండెంట్ ఉత్తర్వులిచ్చారు. శాఖాపరమైన శిక్ష కింద ఏడాది పాటు ఇంక్రిమెంట్‌ను వాయిదా వేశారు. 2002లో ఆ సస్పెన్షన్‌ను ఎత్తివేశారు.

పదోన్నతినిచ్చేలా ఆదేశాలివ్వండి..

కాగా తనపై కోర్టు కేసు పెండింగ్‌లో ఉందన్న కారణంతో తనకు ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పదోన్నతి ఇవ్వడం లేదని, దీనిని చట్టవిరుద్ధంగా ప్రకటించాలంటూ 2021లో నాగరాణి హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు విచారణ జరిపారు. ఇరువైపుల న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి ప్రభుత్వ న్యాయవాది వాదనలతో ఏకీభవించారు. నాగరాణిపై క్రిమినల్ కేసు పెండింగ్‌లో ఉన్నంత వరకు ఆమె పదోన్నతికి అర్హురాలు కాదని తేల్చిచెప్పారు.

అదే ఏడాది ఆమెకు అభియోగాలకు సంబంధించి మెమోరాండం ఇచ్చారు. మరోవైపు నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై కర్నూలు నాలుగో టౌన్ పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. కాగా 2004లో జూనియర్ అసిస్టెంట్‌గా ఆమె సర్వీసులను క్రమబద్ధీకరించారు. ఇదే సమయంలో నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంలో కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్.. నాగరాణిని దోషిగా తేలుస్తూ ఆమెకు మూడు నెలల జైలుశిక్ష, రూ.2,500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ తీర్పుపై ఆమె 2008లో కర్నూలు ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి కోర్టు ముందు అప్పీల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన సెషన్స్ కోర్టు ఆమెకు విధించిన జైలుశిక్షను రద్దు చేసింది. తిరిగి సరైన అభియోగం నమోదు చేసి ఆమె వాదనలు విని తీర్పు వెలువరించాలని కింది కోర్టుకు సూచించింది. దీనిపై నాగరాణి 2009లో హైకోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. కర్నూలు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు జరుపుతున్న విచారణపై స్టే విధించింది.

ఉచిత సామూహిక సేవగా మహామృత్యుంజయ హోమం



మహామృత్యుంజయ హోమం నిర్వహిస్తున్న అర్చకులు


శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న ఉచిత సామూహిక సేవల్లో మహామృత్యుంజయ హోమాన్ని చేర్చింది. తెల్లరేషన్ కార్డు కలిగిన భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం ప్రవేశపెట్టిన ఉచిత సామూహిక సేవల్లో ఈ సోమవారం చంద్రవతి కల్యాణ మండపంలో మహామృత్యుంజయ హోమం నిర్వహించారు. 250 మంది భక్తులు భాగస్వాములయ్యారు. హోమంలో పాల్గొన్న వీరికి అతిశీఘ్ర దర్శనం క్యూలైన్ ద్వారా మల్లికార్జునస్వామి, భ్రమరాంబదేవి దర్శనం కల్పించారు.

'మీ చూపులే' లఘు చిత్రానికి అంతర్జాతీయ అవార్డు

- రోషని అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఏజెన్సీ కళాకారుడి ఘనత
- ఉత్తమ నటుడు, దర్శకునిగా అవార్డులు అందుకున్న రాఘవ

కొయ్యూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): లఘు చిత్రాలు తీయడంలో ప్రతిభ కనబరచిన ఓ గిరిజన యువకుడు ఏకంగా రెండు అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొమ్మికకు చెందిన ఎన్.వెంకటరాఘవ కొన్నేళ్లుగా లఘు చిత్రాలను తీస్తున్నారు. తాజాగా ఆయన దర్శకత్వం వహించి, నటించిన 'మీ చూపులే' లఘు చిత్రానికి రోషని అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ (ఆర్ఐఎఫ్ఎఫ్)లో రెండు అవార్డులు లభించాయి. ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు కేటగిరీల్లో ఆయన ఈ అవార్డులు సొంతం చేసుకున్నాడు. రాఘవ సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రెండు విభాగాల్లో అవార్డుల రావడం ఆనందంగా ఉందన్నారు. గతంలో తాను చిత్రీకరించిన పీఆర్ఎస్ చిత్రం కూడా ఉత్తమ చిత్రంగా ఎంపికైందన్నారు. ఇప్పటి వరకు ఐదు లఘు చిత్రాలు ఉత్తమమైనవిగా ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నాడు.

పెదకోనేరులో మరో హనుమంతుని విగ్రహం



మెట్ల మార్గంలో బయల్పడిన మరో హనుమంతుని విగ్రహం

తాడేపల్లిరూరల్: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం పెదకోనేరు పూడికతీత పనులు నిర్వహిస్తుండగా సోమవారం కోనేరు తూర్పుభాగంలో మెట్ల మధ్యలోని ఓ గూటిలో సుమారు అడుగు ఎత్తు ఉన్న శ్రీ దాసాంజనేయ స్వామి విగ్రహం బయల్పడింది. ఈ విగ్రహం కోనేరు లోపల గుడిలోని శ్రీ దాసాంజనేయస్వామి విగ్రహాన్ని పోలిఉందని స్థానికులు అంటున్నారు. తూర్పు వైపున పిడుగుపాటుకు పడిన రాయి గూటికి అడ్డంగా ఉండడంతో సిబ్బంది ఆ రాయిని తొలగించే క్రమంలో విగ్రహం బయట పడింది.

వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేయండి

- నాయకులుగా ఎదిగేందుకు మరిన్ని అవకాశాలు వస్తాయి
- త్వరలో అనుబంధ విభాగాల నేతలతో సీఎం వైఎస్ జగన్ సమావేశం
- పార్టీ సేవాదళ్, ఐటీ విభాగాల సమావేశంలో ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి,అమరావతి: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ కోఆర్డినేటర్, అనుబంధ విభాగాల ఇన్‌చార్జి, పార్లమెంటరీ పార్టీ నేత, ఎంపీ వేణుంబాక విజయసాయిరెడ్డి చెప్పారు. సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ సేవాదళ్, ఐటీ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో విజయసాయిరెడ్డి విడివిడిగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019లో పార్టీ విజయం కోసం పని చేసిన వారికి సీఎం వైఎస్ జగన్ సముచిత స్థానం కల్పించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌తో పాదయాత్రలో కలిసి నడిచిన వారికి, ప్రతిపక్షంలో ఉండగా సేవా దళ్ విభాగంలో పనిచేసిన వారికి ప్రభుత్వం వచ్చాక తగిన గుర్తింపు లభించిందన్నారు. భవిష్యత్తులో నాయకులుగా ఎదిగేందుకు పార్టీ మరిన్ని అవకాశాలు ఇస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తున్న ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలను ప్రతి ఒక్కరిని సమన్వయం చేసుకుంటూ 2024 ఎన్నికల్లో పార్టీ విజయం కోసం పనిచేయాలని చెప్పారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలతో కలసి సేవాదళ్, ఐటీ విభాగాల జిల్లా, మండల స్థాయి కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీలు పూర్తయిన తర్వాత అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమావేశమవుతారని తెలిపారు. సీఎం జగన్ జిల్లాల పర్యటనలకు వచ్చినప్పుడు అనుబంధ విభాగాల అధ్యక్షులు, జోనల్ ఇన్‌చార్జిలు, జిల్లాల అధ్యక్షులకు సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలన్నింటిలో సేవాదళ్ భాగస్వామ్యం ఉండాలని సీఎం జగన్ కోరుకుంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు సుధీర్‌కుమార్ రెడ్డి, పార్టీ ఐటీ విభాగం అధ్యక్షుడు సునీల్ పోసింరెడ్డి, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ నేత పుత్తా ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వారాహి యాత్రకు ముందు పవన్ యాగం

మంగళగిరి పార్టీ కార్యాలయంలో నిర్వహణ



సాక్షి, అమరావతి: వారాహి యాత్ర ప్రారంభానికి ముందు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ సోమవారం మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో యజ్ఞ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ నెల 14వ తేదీ నుంచి పవన్‌కళ్యాణ్ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో రాజకీయ యాత్రకు శ్రీకారం చుట్టనున్నట్టు ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా యాగం నిర్వహణకు ముందే రాష్ట్ర పార్టీ కార్యాలయంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ యాగం చేపట్టేందుకు ఆదివారం సాయంత్రానికే పవన్‌కళ్యాణ్ యాగశాల ప్రాంతానికి చేరుకున్నారు. సోమవారం ఉదయం 6.55 గంటలకు సంప్రదాయ బద్ధంగా పట్టు వస్త్రాలతో యాగశాలకు వచ్చి దీక్ష చేపట్టారు. కాగా, పవన్‌కళ్యాణ్ యాగం నిర్వహణపై జనసేన పార్టీ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ.. ధర్మ పరిరక్షణ, సామాజిక పరివర్తన, ప్రజా క్షేమం, ప్రకృతి విపత్తుల నివారణ, అభివృద్ధి ప్రస్థానాన్ని కాంక్షిస్తూ పవన్ ఈ యాగాన్ని తలపెట్టారని పేర్కొంది. ప్రజలు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సకల సౌభాగ్యాలతో విలసిల్లాలనే ఆకాంక్షతో యాగం సందర్భంగా పవన్‌కళ్యాణ్ దేవతామూర్తులకు ప్రణతులు అర్పించారని తెలిపింది. ఈ యాగం మంగళవారం కూడా కొనసాగుతుందని ఆ పార్టీ పేర్కొంది. కాగా, ఇప్పటి దాకా హైదరాబాద్‌లో ఉన్న జనసేన పార్టీ కేంద్ర కార్యాలయాన్ని మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ కేంద్ర పార్టీ కార్యాలయ నిర్మాణానికి పవన్‌కళ్యాణ్ సోమవారం భూమిపూజ చేశారు.

రోల్‌మోడల్‌గా మన 'రీ సర్వే'

మొదటి పేజీ తరువాయి



మాట్లాడుతున్న కుమార్

వారి భూముల్లో హద్దురాళ్లు పాతడం, 7 లక్షల మందికిపైగా రైతులకు హక్కు పత్రాలు పంపిణీ, 20 వేలకుపైగా భూ వివాదాలను పరిష్కరించడం వంటి పలు అంశాలను ఆయన ఈ వర్క్‌షాప్‌లో వివరించారు. దేశ చరిత్రలో బ్రిటిష్ ప్రభుత్వం తర్వాత తొలిసారి భూములను రీ సర్వే చేయడం వల్ల ఎదురైన సవాళ్లు, వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లిన విధానం, ప్రతి భూ కమతానికి ఆధార్ నంబర్‌లా విశిష్ట సంఖ్యను కేటాయించడం వంటి విషయాలను విశ్లేషించి చెప్పారు. రీ సర్వే ద్వారా రైతులకు వారి భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమేకాకుండా రాళ్లు పాతడం ద్వారా రక్షణ కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. ఏపీలో జరుగుతున్న భూముల రీ సర్వే దేశానికే మోడల్‌గా నిలుస్తుందనడంలో సందేహం లేదని, ఏ రాష్ట్రమైనా భూమి రికార్డుల నిర్వహణ, రీ సర్వేలో కచ్చితంగా ఏపీ వైపు చూడాల్సిన పరిస్థితి ఉందన్నారు.

ఆధునిక టెక్నాలజీ, రికార్డుల నిర్వహణలో బెస్ట్ మోడల్

కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో పనిచేసే ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కి చెందిన బీఎస్ యుగంధర్ సెంటర్ ఫర్ రూరల్ స్టడీస్ (బీఎస్‌వై–సీఆర్ఎస్) ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రిసోర్సెస్‌లు వివిధ రాష్ట్రాల్లో భూ పరిపాలన, నిర్వహణకు సంబంధించిన అంశాలపై వివిధ రాష్ట్రాలకు శిక్షణ ఇవ్వడం, విధానపరమైన సిఫారసులు చేసే బాధ్యతను(బీఎస్‌వై–సీఆర్ఎస్)కి అప్పగించింది. ఈ సెంటర్ ఏపీలో రీసర్వేను బెస్ట్ ప్రాక్టీస్‌గా గుర్తించడమేకాకుండా ఇందుకు వినియోగిస్తున్న ఆధునిక టెక్నాలజీ, రికార్డుల నిర్వహణలో బెస్ట్ మోడల్‌గా సిఫారసు చేస్తోంది. అందులో భాగంగానే పలు రాష్ట్రాలకు భూముల వ్యవహారాలపై అవగాహన, రీ సర్వే గురించి శిక్షణ ఇచ్చేందుకు ఏపీ అధికారులను ఆహ్వానిస్తోంది. గత నెలలో ఉత్తరాఖండ్ అధికారులకు డెహ్రాడూన్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఇలాగే ఏపీ అధికారులతో ప్రజెంటేషన్ ఇప్పించగా, తాజాగా పుదుచ్చేరి వర్క్‌షాప్‌లోనూ ఏపీ రీ సర్వేను ఒక టాపిక్‌గా పెట్టి దానిపై అవగాహన కల్పించింది.

కేంద్ర ఉన్నతాధికారులతో ఎంపీ బాలశౌరి సమావేశం

చిలకలపూడి(మచిలీపట్నం): కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఉన్నతాధికారులతో ఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో సోమవారం బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి సమావేశం నిర్వహించారు. లోక్‌సభ సబార్డినేట్ కమిటీ అధ్యక్షుడిగా బాలశౌరి కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ సెక్రటరీ ఆర్తీ అహుజా, సెంట్రల్ పీఎఫ్ కమిషనర్ నీలం శ్యాంరావు ఇతర ఉన్నతాధికారులతో సమావేశమై ఆశాఖకు సంబంధించిన విధివిధానాలపై చర్చించారు.

టీడీపీ ఖాళీ అవడం ఖాయం

- మంత్రి జోగి రమేష్
- వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి జోగి రమేష్

పెడన: టీడీపీ ఖాళీ అవడం ఖాయమని, ఆ పార్టీకి ఇప్పుడున్న 23 సీట్లు కూడా వచ్చే ఎన్నికల్లో రావని రాష్ట్ర మంత్రి జోగి రమేష్ చెప్పారు. కృష్ణా జిల్లా నందమూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్తలు 30 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి వీరందరికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ పాలన అందిస్తోందని చెప్పారు. సీఎం జగన్ అందిస్తున్న సుపరిపాలన చూసి టీడీపీ వారంతా వైఎస్సార్‌సీపీ వైపు వస్తున్నారని అన్నారు. రైతుల చెంతకు అన్ని రకాల సౌకర్యాలు చేరుస్తున్న సీఎం జగన్‌ని చూసి చంద్రబాబుకు ఏం చేయాలో పాలుపోవడం లేదని, ప్రభుత్వంపై విషం చిమ్మడమే పనిగా పెట్టుకున్నారని విమర్శించారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పాలన చూసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు టీడీపీ సీనియర్ కార్యకర్త కట్టా పైడయ్య చెప్పారు.

> తన నోటినీ, నాలుకనూ కాచుకున్నవాడు సమస్యల నుంచి తనను తాను కాపాడుకుంటాడు.
> – జుడాయిజం

సాక్షి

మంగళవారం, 13 జూన్ 2023

ఉపేక్షించలేని ప్రదర్శన!

చూడడానికి అది ఆరు సెకన్ల వీడియోనే కావచ్చు. కానీ, సోషల్ మీడియాలో చక్కర్లుకొట్టిన ఆ వివాదాస్పద వీడియో ఇప్పుడు రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత క్షీణించే పరిస్థితి తెచ్చింది. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీని స్వయంగా ఆమె అంగరక్షకులే పొట్టనపెట్టుకున్న ఘట్టాన్ని సమర్థిస్తూ రూపొందించిన ప్రదర్శన శకటం ఒకటి కెనడాలోని బ్రాంప్టన్ నగరవీధుల్లో తిరిగిన వైనం భారత్, కెనడాల్లో విస్తృత చర్చ రేపింది. వేర్పాటువాద ఖలిస్తాన్ మద్దతుదారుల ఈ శకట ప్రదర్శన ఏ రకంగా చూసినా ఆక్షేపణీయమే. భారత వ్యతిరేక వేర్పాటువాద, తీవ్రవాద శక్తులు బలం పుంజుకుంటున్న వైనానికి ఈ ప్రదర్శన మరో ఉదాహరణ. మన దేశ రాజకీయ పక్షాలన్నీ ముక్తకంఠంతో కెనడా ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టాయి. క్షమాపణ కోరాయి. కెనడా సైతం వెంటనే విచారం వ్యక్తం చేసింది కానీ, ఆ మాట సరిపోతుందా? భారత్‌తో సత్సంబంధాలు కొనసాగాలని ఆ దేశం నిజంగా కోరుకుంటే, చేయాల్సింది చాలానే ఉంది.

అమృత్‌సర్ స్వర్ణదేవాలయంలో దాగిన సిక్కు తీవ్రవాదుల ఏరివేత కోసం 1984లో నాటి ప్రధాని ఇందిరా గాంధీ వివాదాస్పద సైనిక చర్య 'ఆపరేషన్ బ్లూస్టార్'కు దిగడం, అనంతరం కొన్నాళ్ళకు సొంత బాడీ గార్డ్‌లే విచక్షణారహితంగా కాల్పులు జరిపి ఆమెను పొట్టనపెట్టుకోవడం చరిత్రలో మహా విషాదం. ఆపరేషన్ బ్లూస్టార్ 39వ వార్షికోత్సవ సందర్భాన రెండు రోజుల ముందే జూన్ 4న కెనడాలో ఈ 5 కిలోమీటర్ల ప్రదర్శన శకటాల కవాతు జరిగింది. ప్రదర్శనలు జరిపే స్వేచ్ఛ కెనడా ప్రభుత్వం తన పౌరులకు ఇవ్వవచ్చు. కానీ, ఆ శకటంపై సిక్కు గార్డులు తుపాకీలు ఎక్కుపెట్టగా, చేతులు పైకెత్తి, తెల్లచీరలో ఎర్రటి రక్తపు మోడుగా మారిన మహిళ (ఇందిర) బొమ్మ పెట్టి, 'దర్బార్ సాహిబ్‌పై దాడికిది ప్రతీకారం' అంటూ వెనకాలే పోస్టర్ ప్రదర్శించడం సహించరానిది. దారుణహత్యను సైతం ప్రతీకారంగా పేర్కొంటున్న ఈ ప్రదర్శనను అనుమతించే సరికి పొరుగుదేశ ప్రధాని హత్యను సమర్థిస్తున్నవారిని కెనడా వెనకేసుకొస్తోందని అనిపిస్తుంది.

పంజాబ్‌లో తీవ్రవాదం తారస్థాయిలో ఉన్నరోజుల్లో కెనడా, అమెరికా తదితర దేశాలు ఈ వేర్పాటువాదులకు ఆశ్రయం కల్పించాయి. విదేశాల్లో స్థిరపడ్డ వేర్పాటువాదులు అక్కడ నుంచి భారతదేశ సమగ్రత, సార్వభౌమాధికారాన్నే సవాలు చేస్తున్నారు. అక్కడ నుంచి రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తూ, వేర్పాటువాదానికి నిధులు సమకూరుస్తూ, ఖలిస్తాన్ ఉద్యమానికి ఊపిరులూదుతున్నారు. అదే ఇప్పుడు పెద్ద సమస్య అయింది. భారత వ్యతిరేక రిఫరెండమ్‌లు, కార్యక్రమాలు జరపడమే కాదు... హిందూ ఆలయాలపై దాడులు, కెనడా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, బ్రిటన్ లాంటి దేశాల్లో భారతీయులపై హింసాకాండ ఇటీవల తరచూ సంభవిస్తున్నాయి. ఈ ఏడాది బ్రిటన్‌లో భారత హైకమిషన్ కార్యాలయంలో ఖలిస్తానీలు పాల్పడ్డ భద్రతా ఉల్లంఘన ఘట్టం లాంటివి ఆందోళన పెంచుతున్నాయి. భారత వ్యతిరేక కార్యకలాపాల్లో తాజా శకట ప్రదర్శన పరాకాష్ఠ.

చిత్రం ఏమిటంటే – భారత్‌లో, మరీ ముఖ్యంగా అమృత్‌సర్‌లో ఆపరేషన్ బ్లూస్టార్ స్మరణోత్సవాలు ఏళ్ళు గడిచేకొద్దీ హేతుబద్ధంగా మారాయి. పంజాబీలు పాత చేదు జ్ఞాపకాలను వెనక్కినెట్టి, చాలా ముందుకు వచ్చారు. శాంతిని కోరుకుంటున్నారు. అకాల్‌తఖ్త్ సైతం ఈ ఏడాది మాదక ద్రవ్యాలు, ఇతర సామాజిక రుగ్మతలతో సతమతమవుతున్న గ్రామాల్లో సంస్కరణ ఉద్యమానికి పిలుపునిచ్చింది. పంజాబ్‌లో పరిస్థితులు ఇలా ఉంటే, పరాయిగడ్డ మీది సిక్కులు వేర్పాటువాద ఉగ్రవాదానికి నారుపోసి, నీరు పెట్టాలనుకోవడం శుద్ధ తప్పు. కెనడాలో దాదాపు 2 శాతం జనాభా (దాదాపు 8 లక్షలు) ఉన్న సిక్కుల్ని ఓటు బ్యాంకుగా చూస్తున్న ఆ దేశ నేతలేమో ఖలిస్తానీల్ని లాలించి, బుజ్జగిస్తున్నారు. సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో సైతం సిక్కు ఓటర్లను ఆకట్టుకొనేందుకు గతంలో అధికారిక నివేదికల నుంచి ఖలిస్తానీ తీవ్రవాద ప్రస్తావనలను సైతం తొలగించిన రకం. 2018లో భారత పర్యటనకు వచ్చినప్పుడు గతంలో భారత మంత్రిపై హత్యాయత్నం చేసిన ఖలిస్తానీ నిందితుడితోనే కలసి ఫోటోలు దిగడం వివాదాస్పదమైంది.

1985 ప్రాంతంలో టొరంటో నుంచి బయలుదేరిన ఎయిరిండియా విమానాన్ని ఖలిస్తానీ తీవ్రవాదులు పేల్చివేయగా, అందులోని 329 మందీ మరణించిన ఘటనను కెనడా నేతలు మర్చిపోయారా? ఆ మృతుల్లో అత్యధికులు కెనడియన్లే అయినా, ఓటుబ్యాంక్ లెక్కలతో దాన్ని ఇప్పటికీ భారతదేశానికి సంబంధించిన విషాదంగానే పరిగణిస్తున్న వైనాన్ని ఏమనాలి? పాలు పోస్తున్న పాము రేపు తమ చేతినే కాటు వేయదన్న నమ్మకం ఏముంది? ఇప్పటికైనా కెనడా కళ్ళు తెరవాలి. ప్రజాస్వామ్యం, బహుళ జాతీయతలకు తమ దేశం ప్రతీక అని జబ్బలు చరుచుకొంటూ ప్రజాస్వామ్యం, శాంతి, సౌభ్రాత్రం, చట్టబద్ధ పాలనపై భారత్‌కు తరచూ ఉపదేశాలిచ్చే ట్రూడో ముందు తమ పెరట్లో జరుగుతున్నదేమిటో తెలుసుకోవాలి. బోలెడంత భవిష్యత్తున్న భారత, కెనడా వ్యూహాత్మక, వాణిజ్య సంబంధాల్లో కాలిముల్లుగా తయారైన ఖలిస్తాన్ లాంటి అంశాలపై నిర్ద్వంద్వమైన అవగాహనకు రావాలి. భారత విచ్ఛిన్నాన్ని కోరుతున్న శక్తులపై కఠినంగా వ్యవహరించాలి. మన ప్రభుత్వం కూడా ఈ విషయంలో కెనడాపై దౌత్య, రాజకీయ ఒత్తిడి పెంచాలి. విద్వేషం వెదజల్లే వారిని నయానో, భయానో వంచాలి. ఒక్క కెనడాలోనే కాక వివిధ ప్రాంతాల్లో పెరుగుతున్న ఖలిస్తానీ నిరసనలపై దృష్టి సారించి, విస్తృత దౌత్య వ్యూహంతో వాటిని మొగ్గలోనే తుంచాలి. ఇంటా, బయటా మరో ఆపరేషన్ బ్లూస్టార్ అవసరం రాకుండా చూడాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** బ.దశమి ప.11.45 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** రేవతి ప.3.55 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.05 నుండి 8.55 వరకు, తదుపరి రా. 10.54 నుండి 11.38 వరకు, **అమృతఘడియలు:** ప.1.40 నుండి 3.12 వరకు.

సూర్యోదయం: 5.28
సూర్యాస్తమయం: 6.30
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

తప్పిన రుతువులు

నైరుతి రుతు పవనాల్ని ఎందుకు ఆహ్వానిస్తాం? దేశంలో వ్యవసాయ పనులకు ఈ సాధారణ వర్షపాతం అత్యంత కీలకం కాబట్టి. మన నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం పైగా దీనిపైనే ఆధారపడి ఉంది కాబట్టి. అందుకే 'స్వాతివానకు ముచ్చెపు చిప్ప' ఎదురుచూసినట్టే పంట పొలాలు నైరుతి రుతుపవనాల కోసం పడిగాపులు పడతాయి. కానీ రుతువులు గతి తప్పాయి. ఏది శరత్కాలమో, ఏది హేమంతమో, ఏది వసంతమో వెతుక్కోవలసిన పరిస్థితిలో ఉన్నాం.

రెండోమాట



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

ఆ రోజులు ఏమై పోయాయో? వందేళ్లలోనే రుతువులన్నీ తారుమారై పోయాయి. వేసవి కాలానికీ, వర్షాకాలానికీ భేదం కనుమరుగైంది. ఏది శరత్కాలమో, ఏది హేమంతమో, ఏది వసంతమో వెతుక్కోవలసిన పరిస్థితిలో ఉన్నాం. శ్రీనాథుడు 'కాల చక్రం' స్తంభించిపోతే లోకం ఎలా ఉంటుందో చెబుతూ– ''ఇది సంజ, ఇది రాత్రి, ఇది పగలు అనే సమయాలే క్రమంగా గాడి తప్పిపోయి కొన్ని దేశాలు ఎండలతో కుమిలితే, కొన్ని చలితో కుంగిపోతాయి'' అన్నాడు. వసంతం ఆనందదాయకమైతే, ఆ తర్వాత వచ్చే వర్ష రుతువు సకల ప్రాణికోటికి జీవనాధారం. అందుకే అనేది – వేసవి నుంచి జనాలను కాపాడి రక్షించేది వర్ష రుతువు అని! బహుశా అందుకే, పల్నాటి చరిత్రలో బ్రహ్మనాయుడు కార్యంపూడి యుద్ధరంగాన్ని పవిత్రం చేయడానికే శ్రీనాథుడు వర్షం కురిపించాల్సి వచ్చింది.

నైరుతి రుతుపవనాల్ని మనం ఎందుకు ఆహ్వానిస్తాం? దేశంలో వ్యవసాయ పనులకు ఈ సాధారణ వర్షపాతం అత్యంత కీలకం కాబట్టి. మన నికర సాగు విస్తీర్ణంలో 52 శాతం పైగా దీనిపైనే ఆధారపడి ఉంది కాబట్టి. దేశవ్యాప్తంగా విద్యుచ్ఛక్తి ఉత్పత్తికీ, తాగునీటికీ అవసరమైన జలాశయాల్ని (రిజర్వాయర్లు) నింపడానికి ఈ వర్షపాతం కీలకం. అందుకే నైరుతీ రుతుపవనాలను దేశ ఆహార భద్రతకూ, ఆర్థిక స్థిర జీవితానికీ కీలకంగా భావిస్తాం. 'స్వాతివానకు ముచ్చెపు చిప్ప' ఎదురు చూసినట్టే పంట పొలాలు నైరుతి రుతుపవనాల కోసం పడిగాపులు పడతాయి. గత వందేళ్లలో లేని గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది పొడవునా సగటున 45 డిగ్రీలకు పైగానే నమోదయ్యాయి. ఇదిగో, రేపోమాపో నైరుతీ రుతుపవనాలు కేరళకు తాకి జీవకోటికి ప్రాణధారలు అందిస్తాయని ఆశతో ఎదురుచూస్తున్న క్షణాల్లోనే 'బిపర్‌జాయ్' తుపాను భీకరంగా దూసుకువచ్చి రుతుపవనాలను మరి కొన్ని రోజులు వెనక్కి నెట్టేసింది.

ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల్ని మన ప్రాచీనులు చవి చూడలేదా, తట్టుకోలేదా అంటే, తట్టుకున్నారు. చివరకు మనం నిత్యం కొలిచే శివుడు సహితం ఎంతగా కైలాసాన్ని జీవన కేంద్రంగా మలచుకున్నా మంచుకు తట్టుకోలేక భూమిమీద ఉన్న చెట్ల నీడనే ఆశ్రయించాల్సి వచ్చింది. వేసవి పగళ్లు దీర్ఘములవడం వల్ల 'సర్వ జనులకు అసహ్యములయెయ్యను దారుణంబులై' అని మొత్తుకున్నాడు నన్నయ. పింగళి సూరన తన కాలంనాటి 'ఉరుముల భీషణ ఘోషణ'ను వినిపించాడు. అయితే రుతువుల రాణి అయిన వసంత కాలాన్ని రుతురాజుగా పరిగణించిన ప్రాచీన కవి 'ఋతుసంహార'మనే కావ్యంలో వసంతాన్ని రుతురాజని తను ఎందుకు పిలవాల్సి వచ్చిందో శృంగారపరంగా వర్ణించి తృప్తి చెందాడు. ఆ సమయంలో తామరపూవులో ఉన్న మగతేటి తన ప్రియురాలికి ఇష్టమైన శృంగార చేష్టలలో మునిగిపోయిందట.

ప్రకృతి వన సంపదను మానవులు విధ్వంసం చేయడాన్ని జానపద సాహిత్యంలోని 'జొన్నవాడ కాటమరాజు' కథల్లో నిరసించడాన్ని ఆహ్వానించకుండా ఉండలేము. ఈ విధ్వంసకాండకు మానవులే ఎలా 'పురోహితులు'గా ఉంటారో చూడండి:

> **''పోక వనములు నరికించి**
> **దూడలకు వేయించిరి**
> **నిమ్మ చెట్లు నరికించి నీడలు వేయించిరి**
> **పనస చెట్లు నరికించి పొర వేయించిరి**
> **ఖర్జూర వనాలు నరికించి దొడ్లు వేయించిరి**
> **నాగమల్లి తోటలు నరికించి కలయతొక్కించిరి**
> **ఆ వనము ఈ వనము అనకుండా**
> **ఆకుతోటలను తొక్కించిరి.''**

ప్రకృతి సహజ వాతావరణాన్ని చెడగొట్టడంలో మానవుడి విధ్వంసక పాత్ర తక్కువైనది కాదు. కనుకనే జానపద సాహిత్యాన్ని మనం ప్రసాదప్రాయంగా పరిగణించుకుని కాపాడుకోవాలి. జ్ఞానోదయం కలగడానికి పోతన, తన భాగవత రచనలో అజామీళుడు ఏ దుఃస్థితిలో ఉన్నాడో చెబుతూ ఇలా వర్ణించి బుద్ధి చెప్పాల్సి వచ్చింది:

> **''చదువు చట్టుపడియె, శాస్త్రంబు**
> **బుద్ధిపురుగు మేసె పుణ్యమడుగంటె**
> **నీతిమట్టుపడియె, నిర్మల జ్ఞానంబు**
> **మొదలికుడిగిపోయె.''**

భౌతిక సత్యాల్ని విడిచి శాస్త్రకారులు కానీ, కవులుగానీ పరిణామాల్ని పరిశీలించకూడదన్న సత్యాన్ని చాటుతూ పోతన 'మందార మకరందాన్ని చవిచూసిన కోయిల మరొక చోటికి' పోనట్టే,



హేతువాదాన్ని ఆశ్రయించినవారు మరొక దారికి మళ్లరన్నాడు. అడవి బాపిరాజు పల్లెజీవనంలో జానపదులకు జరిగే మోసాల్ని నిర్మొహమాటంగా చెప్పారు:

> **''మోసము చేసెను మునసబుగారు**
> **కక్షలు కట్టును కరణంగారు**
> **కలిమి కలిగినా కాపులు వీరు**
> **దూడూ దూడూ యెంకన్నా**
> **చెట్టు కదిలినా పుట్టపొదలదూ**
> **నీరుపోయినా నాచు కదలదూ**
> **గుడిపాడైనా గూబవదలదూ**
> **గుడి పొలాలు పూజారి వదలదూ.''**

అయినా తిరిగి ఈ మానవుడే 'కాలానికి క్లాం వేస్తాం, ప్రేమానికి గ్లాం తీస్తాం' అని చాటగలిగాడు. అథర్వణ వేదంలోని 'భూమి సూక్తం'లో ఎంతటి భౌతిక సత్యాన్ని అందజేశారో చూడండి:

''అసంఖ్యాకమైన కొండలు, నదులు, ఓషధులు, ఈ భూమంత గర్భంలోనే ఉన్నాయి. ప్రజలకు అవసరమైన ఆహారం అంతా ఎక్కడి నుంచి వస్తోందనుకుంటున్నారు, అక్కడి నుంచే వస్తోంది. ఓ భూదేవీ! నీ శరీరం ఎక్కడో, నీ కటి భాగం ఏదో, నీ బొడ్డు ఏదో నాకు ఆ వివరాలు తెలియవు సుమా. కానీ నీవు నా తల్లివి. నేను నీ కొడుకుని, నా తండ్రి పర్జన్యుడు. అతడు నాకు క్షేమం కలిగించుగాక!''


ఇలా ప్రకృతిని ఆలంబనగా చేసుకుని, ఈ చరాచర సృష్టి ఆది నుంచి ఉన్నదేననీ, దానికి మనిషి కల్పిస్తే తప్ప చావు పుట్టుకలంటూ లేవనీ నాస్తికులే కాదు, ఎందరో సామాజికవాదులు, శాస్త్రవేత్తలు భావించారు. అందుకే సామాజిక శాస్త్రవేత్త సంజీవదేవ్ 'మన పుట్టుక ప్రకృతిలో, మన మనుగడ ప్రకృతిలో, మన చావు ప్రకృతిలో' అన్నారు. ఈ ధర్మానికి ఏదీ భిన్నం కాదని చాటేది ప్రకృతి, పురుషుల శాసనం. నవీన విద్యాలయాల్లో పురాణ శ్రవణానికి ఇక కాలం చెల్లింది.

abkprasad2006@yahoo.co.in

అక్కర్లేని విమర్శలు

చంద్రబాబు ప్రభుత్వ అవినీతి కారణంగానే కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని బీజేపీ నేతలు అంటుండేవారు. అలాంటిది జగన్ విజ్ఞప్తి మేరకు ఇరవై నాలుగు వేల కోట్ల సాయం చేయడానికి కేంద్రం ఎందుకు ముందుకొచ్చింది? అప్పుడు ఎందుకు అమిత్ షా, నడ్డాలు ఏపీ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న ప్రశ్న వస్తుంది. ఆయా రాష్ట్రాలకు వెళ్లినప్పుడు బీజేపీయేతర ప్రభుత్వాలపై కొన్ని విమర్శలు చేయకతప్పదు. అందులో భాగంగానే వీరు కూడా చేశారనుకోవాలి.

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, శ్రీకాళహస్తిలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా చేసిన ప్రసంగాలలో ఒక విషయం స్పష్టం. ఏపీలో అభివృద్ధి జోరుగా సాగుతోందనీ, సంక్షేమ కార్యక్రమాలు బాగా అమలు అవుతున్నాయనీ! అమిత్ షా, నడ్డా ఏపీ ప్రభుత్వంపై కొన్ని విమర్శలు చేసినా, వాటిలో పస లేదు. ఫలానా ప్రాజెక్టులో అవినీతి జరుగుతోందనో, ఫలానా చోట అక్రమాలు జరిగాయనో ఆధారాల సహితంగా చెప్పక పోవడం గమనించదగ్గ విషయం. పైగా ఇటీవలే కేంద్రం రాష్ట్రానికి రెవెన్యూ లోటు కింద పదకొండు వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టు నిమిత్తం పదమూడు వేల కోట్లు మంజూరు చేసింది. నిజంగానే



వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏవైనా స్కామ్‌లకు పాల్పడి ఉంటే కేంద్రం అడ్డుపడదా!

ఆనాటి టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పోలవరంను ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఎన్నికల ప్రచార సభలో ఆరోపించారు. మరుగుదొడ్ల నిర్మాణం మొదలు అనేక అంశాలలో అక్రమాలు జరిగాయని బీజేపీ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఉన్న సోము వీర్రాజు అప్పట్లోనే ఆరోపించేవారు. 2019లో చంద్రబాబు ప్రభుత్వం ఓటమి చెందిన తర్వాత ఆయన 'పీఎస్' ఇంటిలో సోదాలు చేసి రెండువేల కోట్ల రూపాయల అక్రమాలు గుర్తించినట్లు కేంద్రం ప్రకటించింది. అవినీతికి దూరంగా ఉంటామని చెప్పుకొనే బీజేపీ ప్రభుత్వ పెద్దలు వీటి గురించి ఏమి చేసింది ఇంతవరకూ వెల్లడించలేదు. టీడీపీ, బీజేపీ కలిసి ప్రభుత్వంలో ఉన్నప్పుడే అమరావతి లాండ్ స్కామ్, స్కిల్ డెవలప్ మెంట్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్ వంటివి జరిగాయని వైసీపీ ప్రభుత్వం కనుగొంది. వాటిపై సీబీఐ విచారణకు సిద్ధం అని చెప్పినా, ఇంతవరకూ కేంద్రం కిమ్మనలేదు. అవినీతిని దునుమాడుతామనే మోదీ, అమిత్ షా ఎందుకు మౌనంగా ఉన్నారు?

అప్పట్లో చంద్రబాబు తరచూ ఒక మాట చెప్పేవారు. కేంద్రం తనకు సహకరించడం లేదనీ, ఇరవై తొమ్మిది సార్లు ఢిల్లీ వెళ్లినా ఆశించిన నిధులు ఇవ్వడం లేదనీ పదే పదే వాపోయేవారు. చంద్రబాబు ప్రభుత్వ అవినీతి కారణంగానే కేంద్రం పూర్తి స్థాయిలో నిధులు ఇవ్వడం లేదని కొందరు బీజేపీ నేతలు అంటుండేవారు. మరి అలాంటిది ఇప్పుడు జగన్ విజ్ఞప్తి మేరకు రెవెన్యూ లోటు, పోలవరం ప్రాజెక్టులకు ఇరవై నాలుగు వేల కోట్ల సాయం చేయడానికి కేంద్రం ముందుకు వచ్చిందంటే, దాని అర్థం జగన్ ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు లేనట్లే కదా! అయినా ఎందుకు అమిత్ షా, నడ్డాలు జగన్ ప్రభుత్వంపై విమర్శలు చేశారన్న ప్రశ్న వస్తుంది.

నిజానికి ఇది ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ప్రచారం కోసం ఏర్పాటు చేసిన సభ. ఆయా రాష్ట్రాలకు వెళ్లినప్పుడు బీజేపీయేతర ప్రభుత్వాలు ఉంటే ఏవో కొన్ని విమర్శలు చేయక తప్పదు. అందులో భాగంగానే వీరు ఏపీపై కూడా చేసినట్లు అనిపిస్తుంది. ఇసుక మాఫియా అని ఆరోపించారు. చంద్రబాబు టైమ్‌లో మాఫియాలు విజృంభించి ప్రజలను అగచాట్ల పాలు చేస్తే, జగన్ ప్రభుత్వం కొత్త విధానం తెచ్చి, అటు ప్రజలకు అందుబాటులో ఉంచుతూ, ఇటు ప్రభుత్వానికి ఆదాయమూ సమకూర్చగలుగుతోంది. మాజీ మంత్రి పేర్ని నాని అన్నట్లు ఇసుక ద్వారా ఏపీకి నాలుగువేల కోట్ల ఆదాయం వచ్చిందంటే అవినీతి జరిగినట్లు ఎలా అవుతుంది? మైనింగ్ రంగంలో కూడా గతంలో కన్నా కొన్ని వేల కోట్ల ఆదాయం పెరిగింది. విశాఖలో భూమాఫియా అని దుష్ప్రచారం చేస్తున్నారు. నిజానికి కొందరు టీడీపీ నేతలు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించిన విషయాన్ని గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్న సంగతి అమిత్ షాకు ఏపీ బీజేపీ నేతలు చెప్ప లేదేమో తెలియదు. అదే బీజేపీ, టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు జరిగిన భూ కబ్జాలపై చంద్రబాబు ప్రభుత్వమే సిట్ వేసింది కదా! అప్పుడు మంత్రిగా ఉన్న అయ్యన్నపాత్రుడే ఆనాటి కబ్జాలపై ఫిర్యాదు చేశారు కదా! నడ్డా, షాలకు ఆ విషయాలు చెప్పి ఉండకపోవచ్చు.

ఏపీలో జాతీయ రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, ఫార్మా హబ్ వంటివాటిని ప్రస్తావించారు. వాటన్నిటినీ కేంద్రం ఖాతాలో వేసుకునే యత్నం చేశారు. తప్పు లేదు. కేంద్రం, రాష్ట్రం కలిసి ఈ ప్రాజెక్టులను చేస్తాయి తప్ప కేంద్రం ఒక్కటే చేయగలిగింది తక్కువే అన్న సంగతి అందరికీ తెలుసు. ఒకపక్క రాష్ట్రంలో అసలు ఏమీ జరగడం లేదని చెబుతారు. మరో పక్క తాము చాలా చేసేస్తున్నామని అంటారు. సోము వీర్రాజు తన ప్రసంగంలో చాలా విషయాలు చెప్పారు. అవన్నీ వింటే జగన్ ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయా అన్న ఆశ్చర్యం కలుగుతుంది. ఒకరకంగా ఇది విమర్శలకు కనువిప్పు కూడా.

జగన్ సంక్షేమ కార్యక్రమాల కింద రెండు లక్షల కోట్లకు పైగా ఆర్థిక సాయాన్ని ప్రజలకు అందించారు. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా వారి ఖాతాలలోకి వెళ్లేలా కంప్యూటర్ బటన్ నొక్కడం ద్వారా చేశారు. ఇలా ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేయగలుగుతున్నాయి? కర్ణాటకలో నలభై శాతం కమిషన్ ఆరోపణతోనే కదా బీజేపీ ప్రభుత్వం పరాజయం చెందింది. ఆ విషయం ఏపీ ప్రజలకు తెలియదనుకుంటే బీజేపీ వారు అమాయకులే అనుకోవాలి. కేంద్రంపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా రాలేదని అమిత్ షా అంటున్నారు. రఫేల్ కుంభకోణం ఎంత పెద్ద ఆరోపణో వారికి తెలియదా! అది నిజం కాదని వీరు చెప్పవచ్చు... అది వేరే సంగతి. కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి పరిశ్రమల గురించి తెలుగుదేశం భాషలో మాట్లాడకుండా ఉంటే ఆమెకే గౌరవంగా ఉండేది.

చివరిగా ఒక మాట. ఏపీ నుంచి బీజేపీకి ఇరవై లోక్‌సభ సీట్లు ఇవ్వాలని అమిత్ షా విజ్ఞప్తి చేశారు. ఇది ఈ మధ్యకాలంలో వేసిన పెద్ద జోక్‌గా కనిపించడం లేదా? అమిత్ షా విశాఖ సభకు జనం పెద్దగా రాకపోవడం కూడా వారికి కాస్త నిరాశ కలిగించి ఉండవచ్చన్న వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వచ్చాయి. వీటన్నిటి ప్రభావంతో ఏపీ ప్రభుత్వంపైన కొన్ని విమర్శలు చేస్తే చేసి ఉండవచ్చు. వాటిని పెద్ద సీరియస్‌గా తీసుకోనవసరం లేదు.

వ్యాసకర్త ఏపీ ప్రెస్ అకాడమీ ఛైర్మన్

కన్నీరు ఇంకిన బతుకుల్లో కాంతిరేఖ

అభిప్రాయం



అడపా దుర్గ

విజయనగరం జిల్లా బొండపల్లి మండలం దేవులపల్లికి చెందిన డబేరు పద్మావతమ్మ ఓ పేదింటి మహిళ. 21 ఏళ్ల క్రితం ఏఎన్‌ఎమ్‌గా కాంట్రాక్ట్ ఉద్యోగంలో చేరింది. ఆ ఉద్యోగంలో సేవే పరమార్థంగా భావించి ఎప్పటికైనా తన కాంట్రాక్ట్ ఉద్యోగం క్రమబద్ధీకరణ అవుతుందని నమ్మింది. ప్రభుత్వాలు మారుతున్నాయి, ఏళ్లు గడిచిపోతున్నాయి. ఇంతలో సచివాలయంలో కార్యదర్శి ఉద్యోగం వచ్చింది. దగ్గరవారు అంతా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగం కంటే వచ్చిన మరో ఉద్యోగానికి వెళ్లమని సలహాలిచ్చారు. కానీ పద్మావతమ్మ తమ తాత్కాలిక ఉద్యోగాలను పర్మినెంట్ చేస్తానన్న 'నాయకుడి' హామీని బలంగా నమ్మింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీని తప్పరని విశ్వసించింది. ఈ ప్రభుత్వంలో తమకు మేలు జరుగుతుందని గట్టి నమ్మకం పెట్టుకుంది. ఆ నమ్మకం వమ్ము కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా పద్మావతమ్మ లాంటి 10,117 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపి వారు తనపై ఉంచిన నమ్మకానికి భరోసా కల్పించారు ముఖ్యమంత్రి జగన్. వేలాదిమంది తాత్కాలిక ఉద్యోగాలను ఒకేసారి పర్మినెంట్ చేయడం అంత ఆషామాషీ విషయం కాదు.

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గత నాలుగు సంవత్సరాల కాలంలో ముఖ్యమంత్రి జగన్ ప్రజలపక్షాన సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటూ వస్తున్నారు. అందులో పదివేల మందికి పైగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఒకటి. ఇదే కాదు... గతంలో ఏ ప్రభుత్వానికైనా 1998 డీఎస్సీ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇవ్వాలనే ఆలోచన కనీసం నామమాత్రంగానైనా వచ్చిందా? అప్పటి డీఎస్సీ అభ్యర్థులు తమ మొర వినే నాథుడు లేక నీరసించిన తరుణంలో వారికి ఉపాధ్యాయులుగా అవకాశం కల్పించి 4,534 మంది జీవితాల్లో వెలుగులు నింపడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చూపిన చొరవ సర్వత్రా ప్రశంసనీయమైంది. శ్రీకాకుళం జిల్లా పెద్దసీదికి చెందిన అల్లక కేదారేశ్వరరావు లాంటి కన్నీరింకిన 55 ఏళ్ల వారికి ఉపాధ్యాయ ఉద్యోగం కల్పించిన మానవీయ ప్రభుత్వం ఇది.

సచివాలయాల్లో ఎనర్జీ అసిస్టెంట్లలో అర్హత పొందిన 7 వేల మందిని రెగ్యులరైజ్ చేయడం, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసుకొని కార్మికులకు, ఉద్యోగులకు భరోసాను అందించడంలోనూ, తాజాగా 2014 జూన్ 2 నాటికి ఐదేళ్ల సర్వీస్ నిండిన కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేయడం, వైద్య విధాన పరిషత్ ను ప్రభుత్వంలోకి తీసుకువచ్చి 14,658 మంది ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపడం వంటి సాహసోపేతమైన నిర్ణయాలు ముఖ్యమంత్రికి ఉద్యోగుల పట్ల ఉన్న చిత్తశుద్ధిని మరోసారి నిరూపిస్తున్నాయి.

వ్యాసకర్త అడ్వైజర్ – ఎస్వీబీసీ, టీటీడీ
మొబైల్: 90007 25566

నడవాల్సింది... మన ధర్మమా? మనుధర్మమా?

సందర్భం



ఎ.ఎం. ఖాన్ యజ్దానీ

గర్భస్రావం చట్టబద్ధమో కాదో న్యాయస్థానాలు తేల్చి చెప్పేస్తే చాలు. దాన్ని నిర్ణయించడానికి మనుస్మృతి, జ్యోతిష్యాలనూ కోర్టులే ఆశ్రయించడం చూసి ప్రజాస్వామికవాదులు ఆందోళనకు గురవుతున్నారు. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సమీర్ దావె ఒక విడ్డూరానికి పాల్పడితే, అలహాబాద్ హైకోర్టు ఇంకో విడ్డూరానికి పాల్పడింది. రెండు కేసుల్లోనూ ఫిర్యాదిదారులు అత్యాచారానికి గురైన బాధితులు కావడం విశేషం.

భారతీయ జనతా పార్టీకీ, దానికి పూర్వీకులయిన 'జన సంఘ్', 'హిందూ మహాసభ'లకూ వీటికి తాత్విక గురువు అయిన రాష్ట్రీయ 'స్వయం సేవక్ సంఘ్'కూ ప్రాథమికంగా ప్రజాస్వామ్యం అంటే పడదు. రాజ్యాంగ సభ 1949 నవంబరు 26 భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు నుండే దానిమీద మనువాదులు దాడిని ఆరంభించారు. ఆరెస్సెస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' 1949 నవంబర్ 30 నాటి సంచికలో మనుస్మృతిని కొనియాడుతూ, రాజ్యాంగాన్ని విమర్శిస్తూ ప్రధాన వ్యాసాన్ని ప్రచురించింది. 'పురాతన కాలంలోనే భారత గడ్డ మీద పుట్టిన ఒక గొప్ప దార్శనికునిగా, న్యాయవేత్తగా మనువును ప్రపంచం మొత్తం కొనియాడుతోంది. ఆయన రూపొందించిన స్మృతి సూత్రాలు అందరి మన్ననలు పొందుతున్నాయి. ఇవేవీ మన రాజ్యాంగ పండితులకు పట్టలేదు' అంటూ అక్కసు వెళ్ళగక్కింది. నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని మార్చి మనుధర్మానికి ప్రాధాన్యం ఇవ్వాలని సంఘ్ పరివార్ శక్తులు తరచుగా అంటున్నాయి.

ఇక కోర్టు కేసుల విషయానికి వస్తే, ఉత్తర ప్రదేశ్ అలహాబాద్‌లో ఒక మ్యారేజ్ బ్యూరో ద్వారా ఓ అబ్బాయి, అమ్మాయికి మధ్య పరిచయం ఏర్పడింది. పెళ్ళి సాకుతో అతను ఆమె మీద అత్యాచారం చేశాడు. ఆమె తక్షణం పెళ్ళి చేసుకోమంది. అతను కుదరదన్నాడు. ఆమె కేసు వేసింది. అత్యాచారం నేరం కింద అరెస్టు చేశారు. హైకోర్టులో బెయిల్ విచారణ సందర్భంగా మంగళదోషం ఉన్నామెను పెళ్లాడితే తనకు తీవ్ర అనారోగ్యం, ఆర్థిక సమస్యలు వచ్చిపడతాయని వాదించాడు. అత్యాచారం బాధితురాలికి మంగళదోషం ఉందో లేదో 15 రోజుల్లో తేల్చాలంటూ లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య శాస్త్ర విభాగాన్ని



కోరుతూ అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది.

అలహాబాద్ హైకోర్టు ఉదంతాన్ని మీడియాలో చూసి సుప్రీం కోర్టు నివ్వెర పోయింది. జస్టిస్ సుధాన్షు ధులియా, జస్టిస్ పంకజ్ మిథాల్‌లతో కూడిన సుప్రీం కోర్టు వెకేషన్ బెంచ్ జూన్ 3న తనంతట తాను (సుమోటో)గా కేసును స్వీకరించి విచారించింది. అలహాబాద్ హైకోర్టు ఆర్డర్ 'పూర్తిగా అసందర్భంగా' ఉందని గమనించింది. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కూడా హైకోర్టు ఆదేశాలు తనను కలవర పెడుతున్నాయి అనడం విశేషం. నిందితుల తరఫు న్యాయవాది అజయ్ కుమార్ సింగ్ మాత్రం జ్యోతిష్యం ఒక విజ్ఞానశాస్త్రమనీ, అనేక విశ్వవిద్యాలయాలలో దీనిని ఒక శాస్త్రంగా బోధిస్తున్న విషయాన్ని న్యాయస్థానం గమనించాలనీ కోరారు. అంతిమంగా, లక్నో విశ్వవిద్యాలయంలోని జ్యోతిష్య శాస్త్ర విభాగానికి అలహాబాద్ హైకోర్టు జారీ చేసిన ఆదేశాల మీద సుప్రీంకోర్టు స్టే విధించింది.

అహ్మదాబాద్ హైకోర్టులో ఇంకో విచిత్రం జరిగింది. ఇది కూడా అత్యాచారం బాధితురాలి కేసే. ప్రస్తుతం ఏడు నెలల గర్భవతి. గర్భం ధరించి ఆరునెలలు దాటితే గర్భస్రావానికి డాక్టర్లు కోర్టు అనుమతి తీసుకోవాలి. బాధితురాలి తండ్రి గర్భస్రావానికి అనుమతి ఇమ్మంటూ హైకోర్టును ఆశ్రయించాడు.

బాధితురాలి పక్షాన వాదిస్తున్న అడ్వకేట్ సికందర్ సయ్యద్ ఆమెకు ఇంకా 17 సంవత్సరాలు కూడా నిండలేదనీ, ప్రసవించి బిడ్డను సాకే శారీరక మానసిక ఆరోగ్యం లేదనీ, సమాజం కూడ సానుకూలంగా లేదనీ కోర్టుకు విన్నవించుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న జస్టిస్ సమీర్ దావె గర్భస్రావానికి ససేమిరా అన్నారు. తల్లీ, గర్భస్థ శిశువుల ఆరోగ్య స్థితి మీద ఒక నివేదికను కోరారు. 'స్త్రీలు పద్నాలుగేళ్లకే పెళ్ళిచేసుకోవాలనీ, 17 ఏళ్ళు రాక ముందే తల్లి కావాలనీ మనుస్మృతిలో చెప్పారు. ఇది 21వ శతాబ్దం కనుక మనం ఇలాంటివి చదవం. మీరు మీ ఇంటికి వెళ్ళి మీ అమ్మనో, అమ్మమ్మనో అడగండి. వాళ్ళకు పెళ్ళి ఏ వయసులో అయిందో చెబుతారు' అని వ్యాఖ్యానించారు.

బాధితురాలి పక్షాన అడ్వకేట్‌గా ఉన్న సికందర్ సయ్యద్ కూడా గతంలో ముస్లిం సమాజంలోనూ 13 సంవత్సరాల వయసులోనే వివాహాలు చేసేవారని చెప్పడం ఈ కేసులో కొసమెరుపు. ఆధునిక అవసరాలను బట్టి ఆధునిక విలువలూ, చట్టాలూ వస్తాయి. వాటిని పాటించక తప్పదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్ । 90107 57776

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి



తిరుమల ఆలయం వెలుపల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి

తిరుమల: సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో ఆయనకు పండితులు వేద ఆశీర్వచనాలు అందించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు. ఆ తర్వాత జస్టిస్ అజయ్ రస్తోగి తిరుచానూరు చేరుకుని పద్మావతీ అమ్మవారిని కూడా దర్శించుకున్నారు. అలాగే కేంద్ర సహాయమంత్రి ఎల్.మురుగన్, తెలంగాణ ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి తిరుమల శ్రీవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

నగరాలు, పట్టణాల్లో ఆప్కో విక్రయ కేంద్రాలు

- రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్యకార్యదర్శి సునీత
- మంగళగిరి ఆప్కో తోటలో విక్రయశాల ప్రారంభం



విక్రయశాలను ప్రారంభిస్తున్న చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత, ఆప్కో చైర్మన్ చిరంజీవి

సాక్షి, అమరావతి/తాడేపల్లిరూరల్: రాష్ట్రంలోని అన్ని చిన్న నగరాలు, పట్టణాల్లో తక్కువ ఖర్చుతో ప్రయోగాత్మకంగా ఆప్కో విక్రయశాలలు ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య (చేనేత, జౌళి) శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం ఎర్రబాలెంలోని ఆప్కో తోట ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఆప్కో షోరూమ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చేనేత వస్త్రాలు అందుబాటులో ఉంచాలన్న నూతన విధానం మేరకు తక్కువ వ్యయంతో సాధ్యమైనన్ని ఎక్కువ షోరూమ్‌లు ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మాట్లాడుతూ చేనేత కార్మికుల ప్రయోజనాల పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోందన్నారు. నేతన్న నేస్తం పథకం ద్వారా నేత కార్మికులు లబ్ధిపొందుతున్నారని చెప్పారు. చేనేత, జౌళిశాఖ సంచాలకుడు, ఆప్కో ఎండీ ఎం.ఎం.నాయక్ మాట్లాడుతూ నూతన విక్రయశాలలో ప్రత్యేకంగా 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిడ్‌కాప్ ఎండీ డోల శంకర్, ఆప్కో పాలకవర్గ సభ్యుడు ఉదయగిరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే భూకబ్జాలపై విచారణ: లోకేశ్

బద్వేలు అర్బన్: తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్సార్ జిల్లా బద్వేలు నియోజకవర్గంలో జరిగిన భూ కబ్జాలపై సిట్ వేసి విచారణ చేపడతామని తెలుగుదేశం పార్టీ నాయకుడు లోకేశ్ చెప్పారు. ఆయన నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సోమవారం బద్వేలు మున్సిపాలిటీలో కొనసాగింది. ఈ సందర్భంగా సిద్దవటం రోడ్డులోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ వాసులు సీఎం జగన్‌కు 49 మంది ఎమ్మెల్యేలను, 8 మంది ఎంపీలను ఇస్తే సీమ అభివృద్ధిని ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. సీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తి చేయలేదని, ఒక్క పరిశ్రమ తీసుకురాలేదని పేర్కొన్నారు. 2019లో జగన్‌కు ఇచ్చిన మ్యాండేట్ 2024లో తమకిస్తే సీమ సత్తా ఏంటో దేశానికి చూపిస్తామని చెప్పారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఇదే బద్వేలు సెంటర్‌లో తనను బొక్కా పట్టుకుని నిలదీయండన్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరికేస్తాం..

- నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టుల బ్యానర్లు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో గనులు తెరిచేందుకు సహకరిస్తే సర్పంచ్, ఉపసర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరకడమే కాకుండా, హతమారుస్తామని మావోయిస్టులు హెచ్చరించారు. ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్ జిల్లాలోని ఓర్చా బ్లాక్‌లో నది నీటిని నిల్వ చేసేందుకు కరకట్ట నిర్మిస్తున్నారు. దీనిని మొదటి నుంచి వ్యతిరేకిస్తున్న మావోయిస్టులు పనులు నిలివేయాలని హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తాజాగా ఆదివారం రాత్రి ఓర్చా సమీపంలోని ప్రధాన రహదారి వెంట వాల్‌పోస్టర్లు వేయడంతో పాటు బ్యానర్లు కట్టారు. నదిలో కరకట్ట నిర్మాణ పనులతో పాటు, ఈ ప్రాంతంలో గనుల్లో తవ్వకాలను నిలిపివేయాలని అందులో హెచ్చరించారు. ఈ పనులకు సహకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్‌ల కాళ్లు, చేతులు నరికివేయడమేకాక గైతాపారా, బెస్మెట్ట గ్రామాల ప్రజలు సైతం తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని మావోయిస్టులు పేర్కొన్నారు.

ఊరంతా సం'క్షేమ'మే

కృష్ణా జిల్లా పాలకాయతిప్పలో 235 కుటుంబాలకు సంక్షేమ ఫలాలు

ప్రతి ఇంటికీ రెండు కంటే ఎక్కువ సంక్షేమ పథకాలతో లబ్ధి
సీఎం జగన్ పాలనపై ప్రశంసల వెల్లువ

ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు



కృష్ణా జిల్లా పాలకాయతిప్ప గ్రామానికి చెందిన చిలకలపూడి రాంబాబు. సముద్రంలో చేపల్ని వేటాడి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇంజిన్ బోటుపై సముద్రంలోకి వెళ్లేందుకు అవసరమైన ఆయిల్‌కు కూడా ప్రభుత్వమే సబ్సిడీపై అందిస్తోంది. ఆయిల్ సబ్సిడీ కింద నెలకు రూ.2,700 చొప్పున చెల్లిస్తోంది. వేట నిషేధ సమయంలో కుటుంబ పోషణకు ఇబ్బందులు తలెత్తకుండా చూసేందుకు మత్స్యకార భరోసా కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల నగదును ఐదేళ్లుగా అతడి అకౌంట్‌లో జమ చేస్తోంది. చిలకలపూడి రాంబాబు మాట్లాడుతూ.. 'వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే మాలాంటి పేదల బతుకులు ఒక్కసారిగా మారిపోయాయి. ఈ ప్రభుత్వంలో అందరికీ పూర్తిస్థాయిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయ'ని చెప్పాడు.

ఇంటింటికీ మత్స్యకార భరోసా



అదే గ్రామానికి చెందిన చిలకలపూడి అర్జునరావుకు సైతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ వేట నిషేధ సమయంలో మత్స్యకార భరోసా కింద ఏటా రూ.10 వేల చొప్పున అతడి బ్యాంక్ ఖాతాలో జమ అవుతున్నాయి. ఇప్పటికే ఐదు విడతలుగా అతడికి మత్స్యకార భరోసా జమయ్యింది. అర్జునరావును కదిలించగా.. 'మా గ్రామంలోని వారంతా సముద్రం వేటపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో వేట నిషేధ సమయంలో కుటుంబ పోషణ గడవక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచీ వేట నిషేధ సమయంలో రూ.10 వేల చొప్పున బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఎప్పుడూ రుణపడి ఉంటాం' అన్నాడు.

అమ్మఒడితో అండ



పాలకాయతిప్ప గ్రామానికే చెందిన చిలకలపూడి బాల నాగమ్మకు ఇద్దరు పిల్లలు. ఇద్దరూ గ్రామంలోని పాఠశాలలోనే చదువుతున్నారు. అమ్మ ఒడి పథకం కింద ఏటా రూ.15 వేల చొప్పున అందుతున్నాయి. కుటుంబ పరిపుష్టి సాధించేందుకు ఇవి ఎంతో అండగా నిలుస్తున్నాయి. బాలనాగమ్మను పలకరించగా.. 'అమ్మఒడితోపాటు తమ పిల్లలకు పుస్తకాలు, యూనిఫామ్, షూ వంటివి ప్రభుత్వమే ఇస్తోంది. ఇవి మా బిడ్డలకు ప్రయోజనకరంగా ఉండటంతోపాటు మా కుటుంబంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా ఎంతో మేలు కలుగుతోంది. ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ మీడియం బోధనతో పిల్లల్లో ఇంగ్లిష్ మాట్లాడగలుగుతున్నార'ని చెప్పింది.

కోడూరు: కృష్ణా జిల్లా కోడూరు మండలంలోని హంసలదీవి పంచాయతీ పరిధిలో సముద్ర తీరానికి ఆనుకుని పాలకాయతిప్ప అనే గ్రామం ఉంది. గ్రామంలో 235 కుటుంబాలు ఉండగా.. గ్రామ జనాభా పిల్లాపాపలతో కలిపి 756 మంది ఉన్నారు. గ్రామంలో 235 తెల్లకార్డులున్నాయి. అంటే ప్రతి కుటుంబానికి తెల్లకార్డులే ఉన్నాయి. గ్రామస్తులంతా సముద్రంలోకి వెళ్లి చేపల్ని వేటాడి కుటుంబాల్ని పోషించుకుంటున్నారు. సముద్రంలో విపత్తులు సంభవిస్తే గ్రామస్తులంతా ఉపాధి కోల్పోతుంటారు. చేపల వేట తప్ప మరోపని తెలియని మత్స్యకారులకు గత ప్రభుత్వాలు ఎలాంటి తోడ్పాటు ఇవ్వలేదు. కేంద్ర ప్రభుత్వం ఏటా విధించే వేట నిషేధ సమయంలో కూడా వీరికి గత ప్రభుత్వాలు నామమాత్రపు సహాయం అందించి చేతులు దులిపేసుకునేవి. దీంతో గ్రామస్తులంతా ఉపాధి కోసం వలసబాట కూడా పట్టేవారు. కనీసం బతుకుపై భరోసా కల్పించేందుకు తోడ్పాటునిచ్చే పింఛన్లకు కూడా అనేక మంది నోచుకునేవారు కాదు.

ఒక్కసారిగా మారిన జీవితాలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం.. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే పాలకాయతిప్ప గ్రామస్తుల జీవితాలు ఒక్కసారి మారిపోయాయి. గతంలో గ్రామస్తులు ఎన్నడూ చూడని విధంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు చేరుతున్నాయి. మత్స్యకార భరోసా కింద గ్రామంలోని ప్రతి ఇంటికి సంవత్సరానికి రూ.10 వేల నగదు అందిస్తూ కష్టకాలంలో వారికి ప్రభుత్వమే అండగా నిలుస్తోంది. గ్రామంలోని 218 కుటుంబాలకు ఇప్పటివరకు మత్స్యకార భరోసా పథకం కింద సుమారు రూ.94.27 లక్షల నగదు వారి ఖాతాల్లో జమయ్యింది. దీంతోపాటు రైతుభరోసా, వాహన మిత్ర, పింఛన్లు, అమ్మఒడి, విద్యాదీవెన-వసతి దీవెన కింద 312 మంది గ్రామస్తులు లబ్ధి పొందుతున్నారు.





ఏయే పథకాల కింద.. ఎందరికి లబ్ధి చేకూరుతోందంటే..

గ్రామ జనాభా:	756
గ్రామంలోని తెల్లకార్డుల సంఖ్య:	235
రైతు భరోసా కింద లబ్ధి పొందుతున్న వారు:	29
వాహన మిత్ర లబ్ధిదారులు:	9
పెన్షన్లు అందుకుంటున్న వారి సంఖ్య:	120
మత్స్యకార భరోసా కింద లబ్ధిదారులు:	218
అమ్మఒడి పథకం కింద లబ్ధి పొందుతున్న సంఖ్య:	70
జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన లబ్ధిదారులు:	11
ఆయిల్ సబ్సిడీ అందుకుంటున్న వారు:	73

ప్రతి ఇంటికీ రెండు కంటే ఎక్కువ పథకాలు

పాలకాయతిప్ప గ్రామంలో ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాల రూపంలో ప్రభుత్వ సాయం అందుతోంది. గ్రామంలో 235 కుటుంబాలు ఉండగా.. ఆయా కుటుంబాల్లో మొత్తంగా 530 మందికి వివిధ పథకాలు అందుతున్నాయి. అంటే.. గ్రామంలోని ప్రతి ఇంటికీ రెండు కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు వర్తిస్తున్నాయి. ఈ విధంగా సంక్షేమ పథకాలు పొందడానికి కారణమైన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పుడూ రుణపడి ఉంటామని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆయిల్ సబ్సిడీ కింద ప్రతి నెలా రూ.2,700

మత్స్య శాఖ ఆధ్వర్యంలో గ్రామంలో 73 మందికి ఆయిల్ సబ్సిడీ స్మార్ట్ కార్డులను కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మంజూరయ్యాయి. గత ప్రభుత్వంలో ఒక్కసారి కూడా ఆయిల్ సబ్సిడీ అందని మత్స్యకారులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే ప్రతి నెలా రూ.2,700 చొప్పున వారి ఖాతాల్లో జమం చేస్తోంది. నాలుగేళ్ల నుంచి మత్స్యకారులకు ఈ నగదును క్రమం తప్పకుండా అందిస్తోంది.

లారీని ఢీకొన్న కారు.. ఏడుగురి దుర్మరణం

గృహప్రవేశ వేడుకకు వెళ్లి వస్తూ.. మృత్యుఒడికి

అందరూ బంధువులు. గృహప్రవేశ వేడుకకు హాజరయ్యారు. ఆ వేడుకలో విశేషాలను ముచ్చటించుకుంటూ ఎనిమిది మంది సికింద్రాబాద్ నుంచి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని తమ ఇళ్లకు కారులో బయలుదేరారు. ఇళ్లకు చేరుకోకుండానే ఏడుగురు మృత్యువాతపడ్డారు. వీరిలో అక్కాచెల్లెళ్లు, తండ్రీకొడుకులు, తల్లీబిడ్డ ఉన్నారు.



తండ్రీ కొడుకులు సత్యనారాయణ, రవితేజ(ఫైల్)



రేలంగి లక్ష్మి (ఫైల్)



ఆత్కూరి దుర్గ (ఫైల్)



మిద్దే అరుణ (ఫైల్)

దేవరపల్లి: తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం అనంతపల్లి వద్ద గుండుగొలను-కొవ్వూరు జాతీయరహదారి (ఎన్‌హెచ్‌-16)పై సోమవారం తెల్లవారుజామున జరిగిన ఘోర ప్రమాదంలో ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. తీవ్రంగా గాయపడిన మరొకరు రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన ఎనిమిదిమంది బంధువులు మూడురోజుల కిందట సికింద్రాబాద్‌లో బంధువుల గృహప్రవేశ వేడుకకు రైలులో వెళ్లారు. వారంతా రాజమహేంద్రవరానికి చెందిన బంధువుల కారులో ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు తిరుగు ప్రయాణం అయ్యారు. రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన మిద్దే సత్యనారాయణ (46) వాహనం నడుపుతున్నారు. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో అనంతపల్లి వద్దకు చేరుకున్న కారు అతివేగంగా.. హైవేపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీఎల్‌-4 సీఎన్‌బీ-9767 నంబరు గల మహీంద్ర ఎక్స్‌యూవీ కారు ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న రాజమహేంద్రవరంలోని ప్రకాశ్‌నగర్‌కు చెందిన మిద్దే సత్యనారాయణ (46), మిద్దే రవితేజ (25), మిద్దే అరుణ (20), పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం మండలం ఎల్ఎన్‌డీ పేటకు చెందిన దాసరి శ్రావణకుమారి (21), తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం ఊనగట్లకు చెందిన రేలంగి లక్ష్మి (50), దాసరి లోహిత్ గగన సాయి (9 నెలలు) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. చాగల్లు మండలం మీనానగరానికి చెందిన ఆత్కూరి దుర్గ (50) ఆస్పత్రిలో మృతిచెందింది. తీవ్రంగా గాయపడిన రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌కు చెందిన మిద్దే విద్యాసాయి రాజమహేంద్రవరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుల్లో దుర్గ, లక్ష్మి అక్కాచెల్లెళ్లు. కారు నడుపుతున్న సత్యనారాయణ, రవితేజ తండ్రీకొడుకులు. దాసరి శ్రావణకుమారి, ఆమె తొమ్మిదినెలల బిడ్డ గగనసాయి ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. ప్రమాద స్థలాన్ని తూర్పుగోదావరి జిల్లా అదనపు ఎస్పీ ఎం.రజని, కొవ్వూరు డీఎస్పీ వి.ఎస్.ఎన్.వర్మ, నల్లజర్ల సీఐ ఎస్.రాజు పరిశీలించారు.

హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్‌గా రమేష్ నాయుడు



తిరుపతి కల్చరల్: తిరుపతి నగరంలోని హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్‌గా కె.రమేష్ నాయుడు నియమితులయ్యారు. ఎన్టీఆర్ జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో హథీరాంజీ మఠం మహంత్‌గా పనిచేస్తున్న అర్జున్‌దాస్‌పై అనేక అక్రమాలు, ఆస్తుల దుర్వినియోగానికి పాల్పడ్డారన్న ఆరోపణలతో దేవదాయశాఖ ఆయనను సస్పెండ్ చేసింది. దీనిపై అర్జున్‌దాస్ కోర్టుకెళ్లడంతో అర్జున్‌దాస్ అక్రమాలు, ఆస్తుల దుర్వినియోగం ఆరోపణలపై ధార్మిక పరిషత్ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ చేపట్టాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాష్ట్ర దేవదాయ శాఖ ఏర్పాటు చేసిన ధార్మిక పరిషత్ సమగ్ర విచారణ చేపట్టి నివేదిక అందించింది. అర్జున్‌దాస్ అక్రమాలు, అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో దేవదాయ శాఖ ఆయనను సస్పెండ్ చేసింది. ఈ మేరకు రెండు రోజుల కిందట దేవదాయ శాఖ ప్రతినిధులు హథీరాంజీ మఠానికి నోటీసులు అంటించారు. అనంతరం ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కె.రమేష్ నాయుడు మఠం ఫిట్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టి మఠంలోని పలు రికార్డులు పరిశీలించారు.

పోలీస్ జీపునే ఎత్తుకెళ్లాడు!

- తమిళనాడులో దొరికిన నిందితుడు

చిత్తూరు అర్బన్ : పోలీస్ జీపుపైనే కన్నేశాడో దొంగ. పోలీస్ స్టేషన్ ఎదుట పార్కింగ్ చేసిన జీపునే ఎత్తుకెళ్లాడు. చిత్తూరు నడిబొడ్డున వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఉంది. ఈ స్టేషన్‌కు సంబంధించిన రక్షక్ జీపుకు డ్రైవర్‌గా హోంగార్డు కోటి పనిచేస్తున్నాడు. సాయంత్రం 4 గంటల సమయంలో జీపును పోలీస్ స్టేషన్ బయట ఉంచి, తాళాలను జీపులోనే వదిలి స్టేషన్‌లోకి వెళ్లిపోయాడు. ఓ 15 నిముషాలు ఆగి బయటకు వచ్చి చూస్తే రక్షక్ జీపు కనిపించలేదు. సరేలే, మనవాళ్లు ఎవరో ఒకరు తీసుకెళ్లి ఉంటారులే అనుకుని మిన్నకుండిపోయాడు. ఎంతసేపటికీ రాకపోవడంతో వైర్‌లెస్ సెట్‌లో రక్షక్‌ను పిలుస్తున్నా ఎవరూ స్పందించకపోవడంతో చెమటలుపట్టాయి. రక్షక్ జీపును ఎవరో ఎత్తుకెళ్లారని స్టేషన్ అధికారుల ఎదుట కన్నీటిపర్యంతమయ్యాడు. అప్రమత్తమైన అధికారులు సరిహద్దుల్లో చెక్‌పోస్టుల వద్ద ఉన్న పోలీసులతో పాటు కర్ణాటక, తమిళనాడు పోలీసులకు సమాచారం ఇచ్చి అప్రమత్తం చేశారు. రక్షక్ జీపును చోరీచేసిన నిందితుడు చిత్తూరు మీదుగా గుడిపాల, రాణిపేట, వాలాజ, చెయ్యార్ దాటుకుని వందవాసివైపు వెళుతుండగా అక్కడి పోలీసులు పట్టుకున్నారు. సమాచారం చిత్తూరు పోలీసులకు ఇవ్వడంతో జీపుతో పాటు దాన్ని ఎత్తుకెళ్లిన ఘనుడిని తీసుకురావడానికి తమిళనాడు వెళ్లారు. మొత్తంమీద జీపు దొరికినా.. పొరపాటుచేసిన హోంగార్డును ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఉత్తర్వులిచ్చారు.

పోషకాహారం అందించే వంగడాలు అవసరం

- పీపీవీఎఫ్ఆర్‌ఏ చైర్మన్ డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర
- ఘనంగా ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం



విత్తన మహోత్సవాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర, డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగాన్ని ఎనర్జీ సోర్స్‌గా కూడా పరిగణించవచ్చని పీపీవీఎఫ్ఆర్‌ఏ చైర్మన్, ఐకార్ మాజీ డైరెక్టర్ డాక్టర్ తిలోచన్ మహాపాత్ర పేర్కొన్నారు. ఆహార ఉత్పత్తి అనేది దేశంలో పోషకాహార లోపం లేకుండా చేసేలా ఉండాలని తెలిపారు. ఇందుకోసం ఐరన్, జింక్, ప్రొటీన్లతో కూడిన పోషకాహారం అందించే నూతన వంగడాలు తయారు చేయాలని సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 59వ వ్యవస్థాపక దినోత్సవం సోమవారం గుంటూరు శివారులోని లాంఫాంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ తిలోచన్ మహాపాత్ర మాట్లాడుతూ ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం నాణ్యమైన వంగడాలతోపాటు మానవ వనరులను కూడా తయారు చేసిందని ప్రశంసించారు. కోవిడ్ సమయంలో కూడా దేశంలో వ్యవసాయం, అనుబంధ రంగాల్లో 15 బిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన ఉత్పత్తి నమోదైందని చెప్పారు. ఎన్జీ రంగా వర్సిటీ వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయం పరిధిలో తయారు చేసిన వంగడాల్లో 33 శాతం వరి, 54 శాతం వేరుశనగ రకాలు దేశవ్యాప్తంగా రైతులు వినియోగిస్తున్నారన్నారు. వ్యవసాయంలో కూలీల కొరతను నివారించి రైతులకు ఖర్చులు తగ్గించేందుకు నూతనంగా డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేశామన్నారు. ఈ టెక్నాలజీ ద్వారా మొదటి ఏడాదిలోనే 40 వేల హెక్టార్లలో వ్యవసాయం చేసినట్లు తెలిపారు. డ్రోన్ టెక్నాలజీపై రైతులకు శిక్షణ ఇస్తున్నామని, ఆర్బీకేల ద్వారా రైతులకు డ్రోన్లు అందజేయనున్నామని వివరించారు. రోబో టెక్నాలజీతో కలుపు తీసే యంత్రాన్ని సైతం తయారు చేశామన్నారు. ఐకార్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌కే మాథూర్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంతో కలిసి పరిశోధనలు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎన్జీ రంగా వర్సిటీ మాజీ వీసీ డాక్టర్ ఎస్.రఘువర్ధన్‌రెడ్డి, కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఏపీ ఫిషరీస్ విశ్వవిద్యాలయం ఓఎస్‌డీ డాక్టర్ ఒ.సుధాకర్, ఏపీఎస్ఎస్‌సీఏ డైరెక్టర్ డాక్టర్ వి.త్రివిక్రమరెడ్డి ప్రసంగిస్తూ యూనివర్సిటీ సేవలను ప్రశంసించారు. అనంతరం 11 మంది ఉత్తమ రైతులకు, 8 మంది శాస్త్రవేత్తలకు, 2 చెరుకు పరిశ్రమల ప్రతినిధులకు అతిథులు అవార్డులను ప్రదానం చేశారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. తొలుత విత్తన మహోత్సవం, ప్రదర్శన, విత్తన విక్రయ కేంద్రాన్ని డాక్టర్ త్రిలోచన్ మహాపాత్ర ప్రారంభించారు.

రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ తీసుకున్న నిర్ణయంపై కాంట్రాక్ట్ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌తో కలిసి క్షీరాభిషేకం నిర్వహించారు.
– యర్రగొండపాలెం



బీజేపీ వ్యాఖ్యలు సిగ్గుచేటు

- 988వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: అమరావతికి తట్టెడు మట్టి, చెంబుడు నీళ్లు మినహా ప్రత్యేక నిధులు ఏమీ కేటాయించని బీజేపీ నాయకులు రాజధానికి నిధులు కేటాయించామని బుకాయించడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 988వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. బీజేపీ నాయకులు అమిత్‌షా, జేపీ నడ్డా గత 5 సంవత్సరాలు బాబుతో చెట్టాపట్టాలు వేసుకుని.. మంత్రి పదవులు తీసుకుని ఊరేగినపుడు ఏపీకి చేసిన మేలు ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే అమరావతిని రాజధాని చేస్తామని చెబుతున్న బీజేపీ ఏపీలో ఒక్క సీటూ గెలవడం కూడా కలేనని గుర్తుంచుకోవాలని అన్నారు. ఏపీకి రూ.5 లక్షల కోట్లు ఇచ్చామని చెబుతున్న బీజేపీ ఆ నిధులు ఏ రూపంలో ఇచ్చారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. విశాఖ స్టీల్ సిటీని అమ్మకానికి పెట్టిన బీజేపీ నాయకులు.. రెవెన్యూ లోటులో ఉన్న రాష్ట్రానికి ఒరగబెట్టిందేమిటని ప్రశ్నించారు. కులోన్మాదం, మతోన్మాదంతో రాష్ట్రంలో బాబు, దత్తపుత్రుడు పవన్‌ను అడ్డుపెట్టుకుని కుటిల రాజకీయాలకు తెరలేపాలని చూడటం సిగ్గుచేటన్నారు. బహుజనులకు అండగా ఉండే పార్టీలకే తామంతా అండగా నిలుస్తామని.. తమ హక్కులకు భంగం కలిగించే పార్టీలను బొంద పెట్టడం ఖాయమని హెచ్చరించారు. నాయకులు మాదిగాని గురునాథం, నూతక్కి జోషి, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజ్, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుగంగ కాలువలో ఆటో బోల్తా

- మహిళ గల్లంతు

సైదాపురం/రాపూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో సోమవారం రాత్రి ఆటో తెలుగుగంగ కాలువలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఒక మహిళ గల్లంతైంది. భార్యాభర్తలు సొంత ఆటోలో దైవదర్శనానికి వెళ్లివస్తుండగా రాపూరు, సైదాపురం మండలాల పరిధిలోని తెలుగుగంగ కాలువ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం నుంచి భర్త బయటపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. సైదాపురం మండలంలోని కలిచేడు గ్రామానికి చెందిన చాగణం మస్తాన్ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన భార్య మీరాంబీ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. డక్కిలి మండలంలోని దేవుడు వెల్లంపల్లి గ్రామంలో ఉన్న ఈశ్వరయ్యస్వామి గుడికి వస్తానని మొక్కుకుంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం కలిచేడు నుంచి మస్తాన్, మీరాంబీ ఆటోలో దేవుడు వెల్లంపల్లి వెళ్లారు. స్వామిని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళుతుండగా.. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించే క్రమంలో ఆటో చెన్నైకి వెళ్లే తెలుగుగంగ ప్రధాన కాలువలో పడిపోయింది. మస్తాన్ తప్పించుకోగా మీరాంబీ (36) గల్లంతైంది. ఆటో కాలువలో కొట్టుకుపోయింది. మస్తాన్ బంధువులకు చెప్పడంతో వారు సైదాపురం, రాపూరు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సైదాపురం, రాపూరు ఎస్ఐలు నాగబాబు, రంగనాథ్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని గాలింపు చేపట్టారు.

నచ్చనివాళ్లంతా ఏకమైనా విజయం మాదే

- మరోసారి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తాం
- వైఎస్ జగన్ మరోసారి సీఎం అవుతారు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



పుంగనూరులో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి. చిత్రంలో మంత్రులు నారాయణస్వామి, నాగార్జున, ఎంపీ రెడ్డెప్ప

పుంగనూరు (చిత్తూరు జిల్లా): సీఎం వైఎస్ జగన్ సమర్థ పాలన నచ్చని వాళ్లంతా ఏకమవుతున్నారని విద్యుత్, అటవీ, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. ఎవరు ఏం చేసినా రాష్ట్రంలో మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. మొత్తం 25 ఎంపీ సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో సోమవారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత నేతలు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ర్యాలీగా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల్లో అవినీతికి తావులేకుండా నేరుగా ప్రజల ఖాతాల్లోకి రూ.2 లక్షల కోట్లు సీఎం జగన్ జమ చేశారన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదని చెప్పారు. ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సొంత మామను వెన్నుపోటు పొడిచి పార్టీని, గుర్తును లాక్కున్న చంద్రబాబును ప్రజలు క్షమించరని తెలిపారు. కోవర్టులను బీజేపీలోకి పంపి.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అవినీతిని అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా గతంలో కంటే అధిక మెజార్టీ సాధిస్తామని చెప్పారు. జగన్ తిరిగి ముఖ్యమంత్రి అవుతారని స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి మాట్లాడుతూ 14 ఏళ్లలో చంద్రబాబు పేదలకు ఎన్ని ఇళ్లు కట్టించారో చెప్పాలని నిలదీశారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను అమలు చేయడమే జగన్ నినాదమన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్యేలు పెద్దిరెడ్డి ద్వారకానాథరెడ్డి, నవాజ్‌బాషా, కైలే అనిల్‌కుమార్, ఎంఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రూ.10 అడిగితే ప్రాణం తీశాడు

టీనేజీ కుమారుడి పట్ల తండ్రి కర్కశత్వం

ఛత్రా(జార్ఖండ్): కేవలం రూ.10 అడిగిన కుమారుడి పట్ల తండ్రి కాలయముడైన ఘటన జార్ఖండ్‌లో చోటుచేసుకుంది. తాగిన మత్తులో ఉన్న తండ్రి.. కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ఛత్రా జిల్లాలోని వశిష్ఠనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కరేలీబర్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. స్టేషన్ ఇన్‌చార్జ్ గులామ్ సర్వర్ వెల్లడించిన వివరాల ప్రకారం .. 48 ఏళ్ల బిలేశ్ భుయాన్ తన భార్య, 15 ఏళ్ల కుమార్తె, 12 ఏళ్ల కుమారుడు పప్పు కుమార్‌తో కలిసి జీవిస్తున్నాడు. సోమవారం ఉదయం తొమ్మిదిగంటలకే భుయాన్, అతని భార్య ఇద్దరూ పూటుగా తాగి ఇద్దరూ తీవ్రంగా గొడవ పడ్డారు. అదే సమయంలో ఓ పది రూపాయలు ఇవ్వు నాన్నా అంటూ బాలుడు పప్పు కోరాడు. అప్పటికే కోపంతో ఉన్న భుయాన్ మరింత ఆగ్రహంతో రగిలిపోయాడు. తీవ్ర ఆవేశంతో కుమారుడిని ఊపిరాడకుండా చేసి చంపేశాడు. అదే సమయానికి ఇటుక బట్టీలో పనిచేసే కూతురు పని ముగించుకుని ఇంటికి వచ్చింది. తమ్ముడి మరణం చూసి పొరుగువారిని కేకలేసి పిలిచింది. విషయం తెల్సుకున్న పోలీసులు వెంటనే తండ్రిని అరెస్ట్‌చేశారు.

మధ్యప్రదేశ్‌లో 220 నెలల్లో 225 కుంభకోణాలు

- బీజేపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయింది: ప్రియాంక



జబల్పూర్: మధ్యప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ సోమవారం శ్రీకారం చుట్టారు. జబల్పూర్‌లో నిర్వహించిన భారీ ర్యాలీలో ఆమె ప్రసంగించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా అవినీతిలో కూరుకుపోయిందని, యువతకు ఉద్యోగాలు ఇవ్వడంలో దారుణంగా విఫలమైందని మండిపడ్డారు. బీజేపీ పాలనలో గత 220 నెలల్లో 225 కుంభకోణాలు జరిగాయని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లో ప్రతి నెలా ఒక కొత్త కుంభకోణం చోటుచేసుకుంటోందని దుయ్యబట్టారు. వ్యాపమ్, రేషన్ సరుకుల పంపిణీ, మైనింగ్, ఈ-టెండర్ వంటి వ్యవహారాలను ఆమె ప్రస్తావించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తామని, 100 యూనిట్ల కరెంటు ఉచితంగా సరఫరా చేస్తామని, వ్యవసాయ రుణాలను రద్దు చేస్తామని చెప్పారు.

అందరికీ నాణ్యమైన డేటా

- డేటా సరఫరాలో అంతరాలను తొలగించాలి
- సాంకేతిక ప్రజాస్వామీకరణ ముఖ్యమైన సాధనం
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- వారణాసిలో 'జీ20' డెవలప్‌మెంట్ మంత్రుల సదస్సు



వర్చువల్‌గా మాట్లాడుతున్న ప్రధాని మోదీ. చిత్రంలో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తదితరులు

న్యూఢిల్లీ: నాణ్యమైన డేటా ప్రజలందరికీ అందుబాటులోకి రావాలని, ఈ విషయంలో సాంకేతిక ప్రజాస్వామీకరణ ఒక ముఖ్యమైన సాధనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. డేటాను అందించడంలో అంతరాలను తొలగించాల్సిన అవసరం ఉందన్నారు. సోమవారం వారణాసిలో జరిగిన జీ20 దేశాల డెవలప్‌మెంట్ మంత్రుల సదస్సులో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగించారు. భారత్‌లో డిజిటలీకరణ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిందని, ఈ రంగంలో తమ అనుభవాన్ని భాగస్వామ్య దేశాలతో పంచుకొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. అవసరంలో ఉన్నవారికి రుణాలు సులభంగా లభించేలా ఆర్థిక సంస్థల్లో సంస్కరణలు రావాలని ఆకాంక్షించారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, వనరుల సమర్థ కేటాయింపునకు, ప్రజలకు పాలనాపరమైన సేవలు మెరుగ్గా అందించడానికి అత్యంత నాణ్యమైన డేటా అవసరమని వివరించారు. ప్రజా సాధికారతకు, డేటాను ప్రజలకు అందించడానికి టెక్నాలజీని విస్తృతంగా వాడుకుంటున్నామని వెల్లడించారు. నగరాలు, పట్టణాలే కాదు, మారుమూల ప్రాంతాల్లో ఉండేవారికి సైతం నాణ్యమైన డేటాను అందించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

అభివృద్ధి లక్ష్యాలు సాధిద్దాం

కోవిడ్ మహమ్మారి వ్యాప్తి వల్ల ప్రపంచ దేశాలు ఆర్థికాభివృద్ధిలో వెనుకంజ వేశాయని మోదీ గుర్తుచేశారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు కలిసికట్టుగా కృషి చేయడం మన బాధ్యత అని సూచించారు. మన ప్రయత్నాలనీ పారదర్శకంగా, సమగ్రంగా ఉండాలన్నారు. అభివృద్ధి లక్ష్యాల సాధనకు పెట్టుబడులు పెంచాలని చెప్పారు. చాలా దేశాలు అప్పుల ముప్పును ఎదుర్కొంటున్నాయని, ఈ సమస్య పరిష్కారానికి మార్గాలు కనిపెట్టాలని పిలుపునిచ్చారు. భారత్‌లో వందకుపైగా లక్షిత జిల్లాల్లో ప్రజల జీవనాన్ని మరింత మెరుగుపర్చడానికి చర్యలు చేపట్టామని ప్రధానమంత్రి వివరించారు. ఆయా జిల్లాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అవి ఇప్పుడు అభివృద్ధి ఉత్ప్రేరకాలుగా మారాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ డెవలప్‌మెంట్ మోడల్‌ను అధ్యయనం చేయాలని జీ20 దేశాల మంత్రులకు నరేంద్ర మోదీ సూచించారు. ప్రకృతిని ఆరాధించడం భారత్‌లో ఒక సంప్రదాయంగా వస్తోందన్నారు. వాతావరణ మార్పుల నియంత్రణకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. లింగ సమానత్వం, మహిళా సాధికారతకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేవారు. తమ దేశంలో మహిళా సాధికారతకు ఎలాంటి పరిమితులు లేవన్నారు. సమాజంలో మార్పునకు, ప్రగతికి మహిళలే సారథులని తేల్చిచెప్పారు. అభివృద్ధి ఎజెండాను వారే నిర్దేశిస్తారని అన్నారు.

కాశీని సందర్శించండి

ప్రజాస్వామ్యానికి తల్లిలాంటి భారత్‌లో వారణాసి అత్యంత పురాతన నగరమని ప్రధాని మోదీ తెలియజేశారు. విజ్ఞానానికి, చర్చకు, సంవాదానికి, సంస్కృతికి, ఆధ్యాత్మికతకు వారణాసి కొన్ని శతాబ్దాలుగా ముఖ్యమైన కేంద్రంగా వెలుగొందుతోందని హర్షం వ్యక్తం చేశారు. దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజల కలయికకు ఇదొక కూడలి అని చెప్పారు. భారత్‌లోని భిన్నమైన సంస్కృతి సంప్రదాయాలను ఇక్కడ చూడొచ్చని అన్నారు. సదస్సు జరిగే గదులకే పరిమితం కాకుండా కాశీ నగరాన్ని సందర్శించాలని, కాశీ స్ఫూర్తిని అనుభూతి చెందాలని జీ20 దేశాల మంత్రులకు మోదీ విజ్ఞప్తి చేశారు. గంగా హారతిని, సారనాథ్‌ను తిలకిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించే ప్రేరణ కచ్చితంగా లభిస్తుందని తెలిపారు. వారణాసి తన సొంత నియోజకవర్గమని తాను ఈ మాట చెప్పడం లేదని మోదీ వ్యాఖ్యానించారు.

కోవిన్ పోర్టల్.. ఫుల్ సేఫ్

- కరోనా టీకా లబ్ధిదారుల డేటా లీక్ కాలేదు
- కేంద్ర ఆరోగ్య శాఖ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: కోవిడ్ వ్యాక్సినేషన్ కోసం తీసుకొచ్చిన కోవిన్ పోర్టల్‌లో రిజిస్టర్ అయిన టీకా లబ్ధిదారుల డేటా లీకైనట్లు వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఈ వార్తలకు ఎలాంటి ఆధారాల్లేవని స్పష్టం చేసింది. నోడల్ సైబర్ సెక్యూరిటీ ఏజెన్సీ అయిన ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్-ఇన్) ఈ వ్యవహారాన్ని సమీక్షిస్తోందని వెల్లడించింది. పోర్టల్‌లోని డేటా భద్రంగా ఉందని, డేటా ప్రైవసీ కోసం అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ తెలిపింది. డేటా లీక్ అంటూ జరుగుతున్న ప్రచారం ఆకతాయిల పనేనని పేర్కొంది. డేటా లీక్ వార్తలపై సెర్ట్-ఇన్ వెంటనే స్పందించిందని, కోవిన్ యాప్‌పై లేదా డేటాబేస్‌పై ప్రత్యక్షంగా దాడి జరిగినట్లు ఆధారాలు లభించలేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. టెలిగ్రామ్ యాప్‌లో ఫోన్ నెంబర్లు ఎంట్రీ చేస్తే కోవిన్ యాప్ వివరాలను చూపిస్తోందని చెప్పారు. అంతేతప్ప వ్యాక్సిన్ లబ్ధిదారుల వివరాలు లీక్ కాలేదని స్పష్టం చేశారు. కాగా, కోవిన్ పోర్టల్ నుంచి ముఖ్యమైన డేటా లీకైనట్లు తెలుస్తోందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆధ్వర్యంలోని మొత్తం డేటా మేనేజ్‌మెంట్ వ్యవస్థ గోప్యతపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ సోమవారం డిమాండ్ చేశారు.

అసలేం జరిగింది?

కరోనా టీకా తీసుకున్న వారి వ్యక్తిగత డేటా కోవిన్ పోర్టల్‌లో నిక్షిప్తమైన సంగతి తెలిసిందే. టీకా లబ్ధిదారుల వ్యక్తిగత వివరాలు ఆన్‌లైన్ మెసెంజర్ యాప్ 'టెలిగ్రామ్'లో కనిపిస్తున్నట్లు కొందరు ట్విట్టర్ ఖాతాదారులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. దీనిపై దేశవ్యాప్తంగా కలకలం మొదలైంది. ఈ వ్యవహారంపై కొన్ని రాజకీయ పార్టీలు స్పందించాయి. ప్రజల వ్యక్తిగత డేటాకు భద్రత లేకపోవడం ఏమిటని ప్రభుత్వాన్ని నిలదీశాయి. దాంతో కేంద్ర ఆరోగ్య శాఖ స్పందించి, వివరణ ఇచ్చింది. రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ఆధారిత ధ్రువీకరణ ద్వారా మాత్రమే కోవిన్ పోర్టల్‌లోని తమ వివరాలను లబ్ధిదారులు తెలుసుకోవచ్చని పేర్కొంది. లబ్ధిదారులు మినహా ఇతరులు తెలుసుకోవడానికి అవకాశం లేదని స్పష్టం చేసింది. లబ్ధిదారుల చిరునామాలు తెలుసుకొనే వెలుసుబాటు కూడా లేదని వెల్లడించింది.

'అయోధ్య' తొలి అంతస్తు దాదాపు పూర్తి

వివరాలు వెల్లడించిన ట్రస్ట్



న్యూఢిల్లీ: అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రామాలయ పనులు వేగం పుంజుకున్నాయి. ఆలయాన్ని మొత్తం మూడు అంతస్తుల్లో నిర్మిస్తుండగా తొలి అంతస్తు నిర్మాణం దాదాపు పూర్తికావచ్చింది. ఈ వివరాలను ఆలయ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 'ఈ ఏడాది అక్టోబర్‌కల్లా గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మాణం పూర్తి అవుతుంది. నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా స్వయంగా ఈ పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నిర్మాణ పనులపై తాజా సమీక్షా సమావేశంలో నిర్మాణసంస్థలు లార్సెన్ అండ్ టూబ్రో, టాటా కన్సల్టింగ్ ఇంజనీర్స్ వారి నిపుణులు, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. రోజువారీగా పనుల పర్యవేక్షణ కొనసాగుతోంది. గర్భగుడితో ఉన్న ప్రధాన ఆలయంతోపాటు నృత్య మండపం, ప్రధాన మండపం, కీర్తన మండపం ఇలా ఐదు మండపాలనూ నిర్మిస్తున్నారు. ఐదు మండపాలపై 34 అడుగుల పొడవు, 32 అడుగుల వెడల్పు, 32 అడుగుల ఎత్తు ఉండే గుమ్మటాలను ఏర్పాటుచేస్తారు. ఇవి భక్తులకు ఆలయం ప్రాంగణం నుంచి 69 అడుగుల నుంచి 111 అడుగుల ఎత్తుల్లో గోచరిస్తాయి. ప్రధాన ఆలయం పొడవు 380 అడుగులుకాగా, వెడల్పు 250 అడుగులు, ఎత్తు 161 అడుగులు. మొత్తం గర్భగుడి నిర్మాణంలో మక్రానా మార్బుల్‌తో చెక్కిన స్తంభాలు, పైకప్పు, కుడ్యాలను వినియోగించనున్నారు. ఆలయ బరువు, అన్ని రకాల వాతావరణ మార్పులను తట్టుకునేలా మొత్తంగా 392 భారీ స్తంభాలను ప్రధాన ఆలయం కోసం వాడుతున్నారు. గర్భగుడి ద్వారాలకు బంగారు పూత పూయనున్నారు. ఆలయ ప్రాకారంతో కలిపి రామాలయ విస్తీర్ణం 8.64 ఎకరాలు. ఆలయ ప్రాకారం పొడవు 762 మీటర్లుకాగా లోపలి ప్రాంగణంలో మొత్తం ఆరు ఆలయాలు నిర్మిస్తారు. భక్తుల కోసం విడిగా సదుపాయం కల్పిస్తారు' అని ఆ ప్రకటన పేర్కొంది.

గోధుమ నిల్వలపై పరిమితులు

2024 మార్చి వరకు అమలులో ఉంటాయని కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ: పెరుగుతున్న గోధుమ ధరలను కట్టడి చేసేందుకు నిల్వలపై పరిమితులు విధించినట్లు కేంద్రం తెలిపింది. తక్షణమే అమల్లోకి రానున్న ఈ పరిమితులు 2024 మార్చి వరకు కొనసాగుతాయని స్పష్టం చేసింది. బహిరంగ మార్కెట్ విక్రయ పథకం(ఓఎంఎస్ఎస్) విధానం కింద సెంట్రల్ పూల్ నుంచి 15 లక్షల టన్నుల గోధుమలను ఈ నెలాఖరులోగా టోకు వినియోగదారులకు, వ్యాపారులకు అందజేయనున్నట్లు వివరించింది. నిల్వలు సరిపోను ఉన్నందున గోధుమల దిగుమతి విధానాన్ని మార్చే ఆలోచన ఏదీ లేదని తెలిపింది. గోధుమల ఎగుమతిపై నిషేధం కొనసాగుతుందని తెలిపింది. పంచదార ఎగుమతులకు అనుమతి లేదని వెల్లడించింది. గోధుమల నిల్వలపై కేంద్రం చివరిసారిగా 2008లో పరిమితులు విధించింది. గత నెలతో పోలిస్తే గోధుమల మార్కెట్ ధరల్లో 8% పెరుగుదల నమోదు కావడంతో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుందని ఆహార శాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. గోధుమ వ్యాపారులు/హోల్‌సేలర్లు 3 వేల టన్నుల వరకు, రిటైలర్లు 10 టన్నులు, మిల్లర్లయితే స్థాపిత సామర్థ్యంలో 75% వరకు గోధుమలను నిల్వ ఉంచుకోవచ్చని ఆయన చెప్పారు. వీరు ఎప్పటికప్పుడు నిల్వ సమాచారాన్ని ఆహారం, ప్రజాపంపిణీ శాఖ పోర్టల్‌లో అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని వివరించారు.

15న తీరాన్ని తాకనున్న బిపర్‌జోయ్

- గంటకు 150 కి.మీ. వేగంతో గాలులు
- 7,500 మంది సురక్షిత ప్రాంతాలకు తరలింపు
- అందుబాటులోకి ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అత్యంత తీవ్రంగా మారిన బిపర్‌జోయ్ తుపాను ఈ నెల 15న గుజరాత్‌లోని జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకనుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరించింది. అరేబియా సముద్ర తీర ప్రాంత జిల్లాలైన కచ్, పోరుబందర్, ద్వారక, జామ్‌నగర్, జునాగఢ్, మోర్బిల నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నామని అధికారులు తెలిపారు. '15వ తేదీ మధ్యాహ్ననికి బిపర్‌జోయ్ తుపాను జఖౌ పోర్టు వద్ద తీరాన్ని తాకే అవకాశాలున్నాయి. ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా దాదాపు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయవచ్చు. అతి భారీ వర్షాలు కురుస్తాయి' అని గుజరాత్‌లోని ఐఎండీ కేంద్రం డైరెక్టర్ మనోరమ మహంతి చెప్పారు. ఈ నెల 15, 16 తేదీల్లో సౌరాష్ట్ర-కచ్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయన్నారు. పోర్టుల్లో ప్రమాద హెచ్చరికలను ఎగురవేయడంతోపాటు 16వ తేదీ వరకు సముద్రంలో చేపల వేటను వెళ్లవద్దని మత్స్యకారులకు హెచ్చరికలు జారీ చేసినట్లు ఆమె వెల్లడించారు. సుమారు 7,500 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కచ్-సౌరాష్ట్ర జిల్లాల్లో తీరానికి 10 కిలోమీటర్ల లోపు దూరంలోని గ్రామాల వారిని మంగళవారం నుంచి తరలిస్తామని చెప్పారు. ఈ ప్రాంతంలో ఉండే సుమారు 10 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలో ఉంచుతామని కచ్ కలెక్టర్ అమిత్ అరోరా చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్‌కు చెందిన 12 బృందాలు, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. ఆర్మీ, నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బందిని సిద్ధంగా ఉంచారు.

తక్షణమే చర్యలు తీసుకోండి: ప్రధాని

తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించారు. సోమవారం ఆయన ఢిల్లీలో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. 'తుపాను ప్రభావంతో విద్యుత్, టెలికమ్యూనికేషన్స్, ఆరోగ్యం, తాగునీరు వంటి అత్యవసర సౌకర్యాలకు ఇబ్బంది కలిగినట్లయితే వెంటనే పునరుద్ధరించాలని ప్రధాని ఆదేశించినట్లు ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంవో)తెలిపింది. ఇందుకు గాను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని కోరారని తెలిపింది. తపానుతో ఉత్పన్నమైన పరిస్థితులను తెలుసుకునేందుకు హోం శాఖ రాష్ట్ర యంత్రాంగంతో నిరంతరం టచ్‌లో ఉంటుందని పీఎంవో వివరించింది. ఈ సమావేశానికి హోం మంత్రి అమిత్ షా, ఐఎండీ డీజీ మృత్యుంజయ్ తదితరులు హాజరయ్యారు.

ఇటలీ మాజీ ప్రధాని బెర్లుస్కోనీ మృతి



రోమ్: ఇటలీలో మీడియా దిగ్గజంగా ఎదిగి రాజకీయాల్లోనూ రాణించి మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన సిల్వియో బెర్లుస్కోనీ సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు 89 సంవత్సరాలు. కొన్నాళ్లుగా లుకేమియాతో బాధపడుతున్న ఆయన శుక్రవారం మిలాన్ నగరంలోని శాన్ రఫేల్ ఆస్పత్రిలో కన్నుమూశారని ఇటలీ మీడియా తెలిపింది. హృద్రోగ సమస్యలు, ప్రోస్టేట్‌క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన 2020లో కోవిడ్‌కారణంగా ఆస్పత్రి పాలయ్యారు. తొలుత బెల్లీ డ్యాన్సర్, తర్వాత మీడియా రంగంలో వేలకోట్లు సంపాదించి రాజకీయాల్లో అడుగుపెట్టిన ఏడాదికే ప్రధానిగా పగ్గాలు చేపట్టారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రధాన మంత్రి జార్జియా మెలోనీ సంకీర్ణ ప్రభుత్వంలో బెర్లుస్కోనీకి చెందిన ఫోర్జా ఇటాలియా భాగస్వామిగా ఉంది.

బుంగా బుంగా పార్టీలతో అప్రతిష్టపాలు

వేశ్యలు, మైనర్ బాలికలతో మిలాన్‌లోని ఆర్కోల్ విల్లాలో బుంగా బుంగా పేరుతో జరిగిన పార్టీలు బెర్లుస్కోని విచ్చలవిడి వ్యక్తిగత జీవిత కోణాన్ని బట్టబయలు చేశాయి. పలువురు మహిళలతో, టీనేజీ అమ్మాయిలతో సంబంధాలు కొనసాగించారు. 1936 సెప్టెంబర్‌లో ఒక మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ఈయన బెల్లీ డ్యాన్సర్‌గా జీవితాన్ని ప్రారంభించి తర్వాతి వార్తా పత్రికలు, దేశంలోనే అతిపెద్ద ప్రైవేట్ టీవీ నెట్‌వర్క్‌లు, అడ్వర్టైజింగ్, సినిమా సంస్థలు, ఏసీ మిలాన్ సాకర్ టీమ్, రియల్ ఎస్టేట్ ఇలా పలు వ్యాపారాల్లో వేలకోట్లు గడించి దేశంలోనే అత్యంత సంపన్నుల్లో ఒకరిగా నిలిచారు. 1990లలో రాజకీయాల్లోకొచ్చి ప్రధాని అయ్యారు. ఈయనపై ఎన్నో కేసులు నమోదైనా కేవలం పన్నుల కేసులోనే దోషిగా తేలారు. 76 ఏళ్ల వయసుకారణంగా శిక్ష నుంచి తప్పించుకున్నారు.



కొలంబియా దేశంలోని సుటమర్చన్ నగరంలో వార్షిక టొమాటో ఫైట్ ఫెస్టివల్ 'టొమాటినా'లో హుషారుగా పాల్గొన్న ప్రజలు

రష్యా ఆక్రమణ నుంచి 4 గ్రామాలకు విముక్తి



ఉక్రెయిన్‌లోని కఖోవ్‌కా జలాశయం ధ్వంసం కావడంతో ఖెర్సన్‌లో నీట మునిగిన ఇళ్లు

కీవ్: రష్యా ఆక్రమణలోని మరో గ్రామాన్ని తిరిగి తాము స్వాధీనం చేసుకున్నట్లు ఉక్రెయిన్ తెలిపింది. డొనెట్స్క్ ప్రాంతంలోని మూడు గ్రామాలు స్వాధీనమైనట్లు ఆదివారం ప్రకటించింది. సోమవారం సారొఝియివ్ అనే గ్రామంపై ఉక్రెయిన్ పతాకం మళ్లీ ఎగిరిందని రక్షణ శాఖ పేర్కొంది. ఇవన్నీ కుగ్రామాలేనని సమాచారం. అయితే, ఉక్రెయిన్ బలగాలు ఆక్రమిత ప్రాంతాల్లోకి మరింత ముందుకు చొచ్చుకుపోయేందుకు ఈ స్వల్ప విజయాలే అవకాశం కల్పిస్తాయని పరిశీలకులు అంటున్నారు. ఈ పరిణామంపై రష్యా స్పందించలేదు. రష్యా మిలటరీ బ్లాగర్లు మాత్రం.. ఉక్రెయిన్ పేర్కొంటున్న నాలుగు గ్రామాల నుంచి రష్యా బలగాలు ఉపసంహరించుకున్నాయని ప్రకటించారు. జెపొరిజియా తదితర ప్రాంతాల్లో ఇరు పక్షాల మధ్య భీకర పోరు సాగుతోందని చెబుతున్నారు. ఇన్నాళ్ల యుద్ధంలో ఉక్రెయిన్‌లోని ఐదో వంతు భాగం రష్యా బలగాల చేతుల్లోకి వెళ్లిపోయింది.

శిక్ష పడినా అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తా

అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్: తన ప్రతిష్ఠను దెబ్బతీయడమే లక్ష్యంగా రాజకీయ ప్రత్యర్థులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్(76) ఆరోపించారు. తనపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాల్లేవని అన్నారు. అమెరికా అధ్యక్ష పోరు నుంచి తనను తప్పించేందుకు పెద్ద ఎత్తున కుట్ర జరుగుతోందని విమర్శించారు. తాజాగా ఉత్తర కరోలినా, జార్జియాలో రిపబ్లికన్ల సదస్సులో ఆయన ప్రసంగించారు. ఎన్నికల్లో తాను నెగ్గకుండా ఉండేందుకే విచారణ చేపట్టారని చెప్పారు. ఎవరు ఎన్ని రకాలుగా వేధింపులకు గురి చేసినా, తనకు శిక్ష పడినా సరే వచ్చే ఎన్నికల్లో అధ్యక్ష పదవికి పోటీపడడం ఖాయమని తేల్చిచెప్పారు. తాను ఏ తప్పూ చేయలేదని పేర్కొన్నారు. రిపబ్లికన్‌ను కావడం వల్లే తనను వేధిస్తున్నారని, తనపై ప్రారంభించిన విచారణ ప్రక్రియ అమెరికా చరిత్రలోనే అతిపెద్ద అధికార దుర్వినియోగంగా మిగిలిపోతుందని డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. తనను ఎన్నిక రకాలుగా ఇబ్బందులకు గురిచేసినా సరే రాజకీయాల నుంచి విరమించుకొనే ప్రసక్తే లేదన్నారు. అధ్యక్ష పదవి నుంచి దిగిపోయినప్పుడు ప్రభుత్వ అధికారిక పత్రాలను ట్రంప్ తన ఇంటికి తీసుకెళ్లారన్న ఆరోపణలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ట్రంప్ విచారణను ఎదుర్కొంటున్నారు. విచారణలో భాగంగా మంగళవారం కోర్టుకు హాజరుకానున్నారు.

ఎంబీబీఎస్ 9 ఏళ్లలో పూర్తి చేయాలి

- ఫస్టియర్ నాలుగు ప్రయత్నాల్లోనే గట్టెక్కాలి
- ఎన్ఎంసీ తాజా నిబంధనలు



న్యూఢిల్లీ: ఎంబీబీఎస్ కోర్సును విద్యార్థులు తొమ్మిదేళ్లలోగా పూర్తి చేయాలని, ఫస్టియర్‌ను నాలుగు ప్రయత్నాల్లో పూర్తి చేయాలని నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ) తాజాగా నిబంధనలు తీసుకువచ్చింది. ఈ మేరకు ఈ నెల 2న గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ రెగ్యులేషన్స్-2023(జీఎంఈఆర్-23) గెజిట్‌ను విడుదల చేసింది. అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సులో అడ్మిషన్ పొందిన తేదీ నుంచి తొమ్మిదేళ్లలోగా ఆ కోర్సును విద్యార్థులు పూర్తి చేయాలి. ఎంబీబీఎస్ కోర్సులో మొదటి సంవత్సరం పూర్తి చేసేందుకు విద్యార్థులకు ఎట్టిపరిస్థితుల్లోనూ నాలుగుకు మించి ప్రయత్నాలకు అవకాశమివ్వరు. వైద్య సంస్థల్లో గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్-యూజీ మెరిట్ లిస్ట్ ప్రాతిపదికన ఉమ్మడి కౌన్సెలింగ్ ఉండాలి.

'పద్మ' గ్రహీతలకు రూ.10 వేల పింఛను

చండీగఢ్: తమ రాష్ట్రానికి చెందిన పద్మ అవార్డు గ్రహీతలకు నెలకు రూ.10 వేల చొప్పున పింఛను అందజేయనున్నట్లు హరియాణా సీఎం ఖట్టర్ ప్రకటించారు. పద్మ అవార్డులైన పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ గ్రహీతలకు పింఛనుతోపాటు ప్రభుత్వ వోల్వో బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కలిస్తామన్నారు. ఏడాదికి రూ.1.8-రూ.3 లక్షల మధ్య ఆదాయం ఉన్న కుటుంబాలకు కొంత ప్రీమియంతో రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

హైకోర్టులో రాహుల్‌కు ఉపశమనం



ముంబై: ప్రధాని నరేంద్ర మోదీని దొంగగా అభివర్ణిస్తూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారంటూ దాఖలైన కేసులో ఆయనకు బాంబే హైకోర్టులో ఉపశమనం లభించింది. కోర్టులో ప్రత్యక్ష హాజరు నుంచి మినహాయింపునిస్తూ ఇచ్చిన గడువును ఆగస్టు రెండో తేదీ దాకా పొడిగిస్తూ సోమవారం బాంబే హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. తనకు మరికొంత సమయంకావాలని ఫిర్యాదుదారు న్యాయవాది కోరడంతో కోర్టు ఈ నిర్ణయంతీసుకుంది. రాఫెల్ యుద్ధవిమానాల కొనుగోలు విషయంలో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ 2018 సెప్టెంబర్‌లో రాజస్తాన్‌లోని ఓ ర్యాలీలో మోదీని 'కమాండర్-ఇన్-తీఫ్(దొంగల ముఠా పెద్ద)' అని రాహుల్ దూషించి పరువు తీశారని బీజేపీ కార్యకర్త మహేశ్ .. రాహుల్‌పై పరువునష్టం దావా వేశారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మావోయిస్టు మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది. చోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని రాజ్‌నంద్‌గావ్-కాంకేర్ జిల్లా సరిహద్దు డివిజన్‌లో 25 మంది వరకు సాయుధ మావోయిస్టులు సంచరిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో డీఆర్‌జీ, 132వ బెటాలియన్ బీఎస్ఎఫ్ బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో సోమవారం ఉదయం బినాగుండా అటవీ ప్రాంతంలో మావోయిస్టులు తారసపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన హోరాహోరీ ఎన్‌కౌంటర్‌తో మావోయిస్టులు పారిపోయారు. అనంతరం ఆ ప్రాంతంలో ఒక మహిళా మావోయిస్టు మృతదేహం కనిపించింది.

'పొద్దుతిరుగుడు'కు మద్దతు ధర ఇవ్వాలి

కురుక్షేత్ర: పొద్దుతిరుగుడు విత్తనాలకు మద్దతు ధర డిమాండ్‌తో హరియాణాలోని కురుక్షేత్ర జిల్లాలో సోమవారం రైతులు ఢిల్లీ-చండీగఢ్ హైవేపై బైఠాయించారు. పొద్దుతిరుగుడుకు కనీస మద్దతు ధర డిమాండ్‌పై భారతీయ కిసాన్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు పింప్లి ధాన్యం మార్కెట్‌లో సోమవారం మహాపంచాయత్ జరిగింది. సమావేశంలో రైతు నేత కరం సింగ్ మథానా మాట్లాడుతూ.. రైతుల డిమాండ్లపై చర్చించేందుకు సీఎం ఖట్టర్‌తో సమావేశం ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చిన అధికారులు, ఆ తర్వాత మాట మార్చారని ఆరోపించారు.

యునెస్కోలోకి మళ్లీ అమెరికా!

చైనా ఆధిపత్యానికి చెక్ పెట్టేందుకే

పారిస్: అంతర్జాతీయ వాణిజ్యం, ఎగుమతులు, ప్రపంచదేశాలతో సత్సంబంధాల్లో 'పెద్దన్న' అనే పేరు కోసం తమతో పోటీపడుతున్న చైనాను నిలువరించేందుకు అమెరికా మరో అడుగు ముందుకేసింది. యునెస్కోలోని చైనా పలుకుబడిని తగ్గించేందుకే అమెరికా ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. కృత్రిమ మేధ, సాంకేతిక విద్య వంటి అంశాల్లో యునెస్కోలో ప్రపంచవ్యాప్తంగా పాటించే ప్రమాణాలు, విధాన నిర్ణయాలను తనకు అనువుగా మార్చేందుకు చైనా యత్నిస్తోందని ఇటీవల అమెరికా ఉన్నతాధికారి ఒకరు ఆరోపించడం తెల్సిందే. దీంతో యునెస్కోలో తాజా సభ్యత్వం కోసం అమెరికా రంగంలోకి దిగుతోంది. యునెస్కోలో అమెరికా మళ్లీ చేరబోతున్నట్లు ఆ దేశ అధికారులు సోమవారం ప్రకటించారు. గతంలో పాలస్తీనాను సభ్యదేశంగా చేర్చుకునే అంశాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన అమెరికా యునెస్కో నుంచి తప్పుకుంటానని బెదిరించింది. 2017లో నాటి ట్రంప్ సర్కార్ యునెస్కో నుంచి వైదొలగింది. ఆనాటి నుంచి దాదాపు రూ.5,100 కోట్ల విరాళాలు ఆపేసింది. తాజాగా ఆ నిధులన్నీ చెల్లిస్తామంటూ యునెస్కో మహిళా డైరెక్టర్ జనరల్ ఆంద్రీ ఆజౌలేకు అమెరికా ఉన్నతాధికారి రిచర్డ్ వర్మ లేఖ రాశారు. గతంలో యునెస్కోకు అమెరికానే అతిపెద్ద దాతగా ఉండేది. ఇది యునెస్కోకు చరిత్రాత్మక ఘటన అంటూ అమెరికా తాజా నిర్ణయాన్ని ఆంద్రీ స్వాగతించారు.

సివిల్స్ ప్రిలిమినరీ ఫలితాలు విడుదల

అర్హత సాధించిన 14,624 మంది

న్యూఢిల్లీ: అఖిల భారత సర్వీసుల్లో నియామకాల కోసం నిర్వహించిన సివిల్స్-2023 ప్రిలిమినరీ పరీక్ష ఫలితాలను యూపీఎస్సీ సోమవారం వెల్లడించింది. ఈ పరీక్షలో 14,624 మంది అర్హత సాధించారు. ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్ వంటి ఆలిండియా సర్వీసెస్‌ల కోసం యూపీఎస్సీ ప్రతీ ఏటా ప్రిలిమినరీ, మెయిన్, ఇంటర్వ్యూ ఇలా మూడు దశల్లో సివిల్స్ పరీక్షను నిర్వహిస్తున్న విషయం విదితమే. 2023 సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను మే 28వ తేదీన నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థుల సీరియల్ నంబర్, పేరు, రోల్ నంబర్లను యూపీఎస్సీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'ఈ ప్రొవిజనల్ అభ్యర్థులంతా సివిల్స్ మెయిన్ కోసం డిటేల్డ్ అప్లికేషన్ ఫామ్-1 (డీఏఎఫ్-1)ను నింపి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది' అని యూపీఎస్సీ ఒక ప్రకటనలో పేర్కొంది. డీఏఎఫ్-1కు పాటించాల్సిన నియమాలు, దరఖాస్తు తేదీ తదితర వివరాలను త్వరలోనే వెబ్‌సైట్‌లో వెల్లడించనున్నారు. 2023 సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ మొత్తం ప్రక్రియ పూర్తయ్యాకే అభ్యర్థులు పొందిన మార్కులు, కటాఫ్ మార్కులు, సీఎస్(పీ) ఎగ్జామినేషన్ ఆన్సర్ కీను https://upsc.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే అప్‌లోడ్ చేస్తామని యూపీఎస్సీ స్పష్టంచేసింది. సందేహాలుంటే ఢిల్లీలోని యూపీఎస్సీ కార్యాలయంలో నేరుగా లేదా ఫోన్‌లో వాకబు చేయవచ్చు.


సాక్షి 24|7 తమిళనాడు
TAMILNADU
మంగళవారం । 13 । జూన్ । 2023

పట్టాలు తప్పిన ఇంజిన్

తిరువళ్లూరు: రైల్వేట్రాక్, విద్యుత్ వైర్ల తనిఖీ కోసం వచ్చిన ఇంజిన్ పట్టాలు తప్పడంతో పొన్నేరి నుంచి చెన్నై వైపు వెళ్లే రైళ్ల రాకపోలకు అంతరాయం ఏర్పడింది. తిరువళ్లూరు జిల్లా మీంజూరు నుంచి పొన్నేరి రైల్వేస్టేషన్ మధ్య రైల్వేట్రాక్, విద్యుత్ వైర్లను తనిఖీ చేయడానికి సోమవారం ఉదయం 3.50 గంటలకు ఇంజిన్ బయలుదేరింది. లూప్‌లైన్ నుంచి మొదటి ప్లాట్‌ఫాంపైకి వచ్చిన సమయంలో హఠాత్తుగా ఇంజిన్ ముందుభాగంలోని చక్రాలు పట్టాలు తప్పాయి. రైల్వే సిబ్బంది అప్రమత్తమై పొన్నేరి, కొరుక్కుపేట రైల్వేస్టేషన్లకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని క్రేన్ సాయంతో ఇంజిన్‌ను సరిచేశారు. అనంతరం మొదటి ప్లాట్‌పాంపైనే ఇంజిన్‌ను నిలిపి వేశారు. దీంతో సోమవారం ఉదయం చెన్నై నుంచి పొన్నేరి మీదుగా వెళ్లాల్సిన పలు రైళ్లు సుమారు గంట ఆలస్యంగా నడిచాయి.

డెల్టా సాగుకు మెట్టూరు నీరు

రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం స్టాలిన్ తెలిపారు. ఆయన సోమవారం డెల్టా జిల్లాల్లో కురువై సాగుకు మేట్టూరు డ్యామ్ నుంచి కావేరి నీటిని విడుదల చేశారు. నీటిలో పూలు చల్లి నీటి విడుదలను ప్రారంభించారు. ఈ ఏడాది డెల్టా జిల్లాల్లో 5 లక్షల ఎకరాల్లో కురువై సాగు లక్ష్యంగా పనిచేస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా రైతులకు ప్రత్యేక రాయితీలు అందజేస్తామని ప్రకటించారు.





స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న సీఎం స్టాలిన్ (ఇన్‌సెట్) పూలు చల్లుతున్న సీఎం స్టాలిన్

- విడుదల చేసిన సీఎం స్టాలిన్
- 5 లక్షల ఎకరాల్లో కురువై సాగుకు చర్యలు
- 17.37 లక్షల ఎకరాలకు ఉపయోగం
- అన్నదాతలకు ప్రత్యేక రాయితీలు
- మూడో సారి నిర్ణీత సమయంలో రైతులకు కావేరి జలాలు
- తమిళులను పీఎం చేస్తే ఆహ్వానిస్తామని వ్యాఖ్య

సాక్షి, చెన్నై ప్రతి ఏటా జూన్ 12వ తేదీన డెల్టా జిల్లాల వర ప్రదాయిని మేట్టూరు జలాశయం నుంచి సాగు నిమిత్తం నీటిని విడుదల చేయడం ఆనవాయితీగా వస్తున్న విషయం తెలిసిందే. మూడేళ్ల క్రితం వరకు నిర్ణీత సమయంలో నీరు విడుదల కాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నైరుతీ రుతు పవనాల ప్రభావం ఆశాజనకంగానే ఉంటోంది. కర్ణాటకలో సమృద్ధిగా వర్షాలు కురవడంతో కావేరి నది పలుమార్లు పరవళ్లు తొక్కింది. గత ఏడాది మేట్టూరు జలాశయం పలుమార్లు పూర్తిగా నిండి ఉబరి నీరు డెల్టా జిల్లాల వైపు ఉగ్ర రూపంతో ప్రవహించింది. 2021లో నిర్ణీత సమయంలో, 2022లో నిర్ణీత సమయంకన్నా నెల రోజులు ముందుగా నీటిని మేట్టూరు జలాశయం నుంచి విడుదల చేశారు. మూడో ఏడాది కూడా సోమవారం ఈ జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు.

నీటిని విడుదల చేసిన సీఎం

సీఎం స్టాలిన్ శనివారం నుంచి డెల్టా జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఆదివారం సేలంలో పర్యటించారు.



పరవళ్లు తొక్కుతున్న నీరు

సోమవారం మేట్టూరుకు చేరుకుని జలాశయాన్ని పరిశీలించారు. డ్యామ్ నీటి మట్టం 103.35 అడుగులు కాగా 69.252 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్టు అధికారులు వివరించారు. డ్యామ్ నీటి మట్టం 103 అడుగులు ఉండడంతో కావేరి నీటి ఆధారంగా డెల్టా జిల్లాల్లో సాగు కోసం డ్యామ్ గేట్లను తెరిచేందుకు చర్యలు తీసుకున్నారు. సేలం, నామక్కల్, కరూర్, తిరుచ్చి, పుదుకోట్టై, తంజావూరు, తిరువారూర్, నాగపట్నం, మైలాడుతురై జిల్లాల్లో 4,91,200 ఎకరాలు, కడలూరు, అరియలూరు జిల్లాల్లో 30,800 ఎకరాల కురువై సాగును దృష్టిలో ఉంచుకుని మేట్టూరు జలాశయం నుంచి నీటిని విడుదల చేశారు. సీఎం స్టాలిన్ స్విచ్ ఆన్ చేసి, పూలు చల్లి నీటిని బయటకు విడుదల చేశారు. తొలుత సెకనుకు 3 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయగా, రాత్రి సమయానికి పది వేల క్యూసెక్కులకు పెంచారు. ఈ నెలాఖరు వరకు సెకనుకు 10 వేల క్యూసెక్కులు, జూలైలో 16 వేలు, ఆగస్టులో 18 వేల క్యూ సెక్కుల నీటిని విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ కాలంలో కర్ణాటక నుంచి కావేరి పోటెత్తిన పక్షంలో నీటి విడుదలను మరింత పెంచుతారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దురై మురుగన్, కేఎన్ నెహ్రూ, ఎంఆర్‌కే పన్నీరు సెల్వం, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నీటి పారుదల, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రూ.76 కోట్లు కేటాయింపు

అనంతరం సీఎం స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది కురువై సాగు కోసం రూ.76 కోట్లు కేటాయించామని ప్రకటించారు. కురువై వరి సాగు ప్యాకేజీ పథకం ద్వారా ఎకరాకు 45 కిలోల యూరియా, 50 కిలోల డీఏపీ, 25 కిలోల పొటాష్ చొప్పున 2.5 లక్షల ఎకరాలకు అందజేస్తామన్నారు. 1.25 లక్షల ఎకరాలకు 50 శాతం రాయితీతో వరి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. డెల్టా రైతులు ప్రభుత్వ సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది 5 లక్షల ఎకరాలకు పైగా కురువై సాగు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్టు పేర్కొన్నారు. డెల్టాలో 17.32 లక్షల ఎకరాలు ఉపయోగంలో ఉన్నాయని, ఇందులో 70 శాతం మేట్టూరు నీటి ఆధారంగా సాగులో ఉన్నట్టు వివరించారు. మరో 30 శాతం బావులు, బోరు బావుల ద్వారా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు సమృద్ధిగా నీటిని విడుదల చేస్తామని, నీటిని రైతులు మరింత పొదుపుగా వాడుకుని ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు.



మీడియాతో మాట్లాడుతున్న సీఎం స్టాలిన్, మంత్రులు

తమిళులను పీఎం చేస్తే ఆహ్వానిస్తాం

తమిళనాడుకు చెందిన వారిని ప్రధానిని చేస్తామ ని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలను ఆహ్వానిస్తున్నామని సీఎం ఓ ప్రశ్న కు సమాధానమిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పై అమిత్ షా ఎందుకో తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టుందని ఎద్దేవా చేశారు. తమిళనాడు నుంచి పీఎంగా తమిళి సై లేదా, మురుగన్ వంటి వారికి అవకాశం ఇవ్వవచ్చేమో అని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గత 9 ఏళ్లుగా తమిళనాడుకు ఒరిగిందేమీ లేదన్నారు. గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ పాలనలో ప్రకటించిన ప్రాజెక్టులే ప్రస్తుతం నిర్మాణాలను పూర్తి చేసుకున్నాయని తెలిపారు. మదురై ఎయిమ్స్ పనులు ముందుకు సాగనివ్వకుండా చేస్తున్నది కేంద్ర ప్రభుత్వం కాదా..? అని ప్రశ్నించారు. తమ మీద నిందలు వేసే విధంగా అమిత్ షా మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. గతంలో తాము తీసుకొచ్చిన పథకాలు, ప్రాజెక్టులను అన్నా డీఎంకే పాలకులు తుంగలో తొక్కారని, తాము వారి పథకాలను కొనసాగిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలని మరో ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. అత్తి కడవు – అవినాసి ప్రాజెక్టు గురించి మాట్లాడుతూ త్వరలో ప్రజల కోసం నీటిని విడుదల చేస్తామన్నారు.

న్యూస్‌రీల్

రాష్ట్రపతి పర్యటన మళ్లీ రద్దు?

- సీఎంతోనే ఆసుపత్రి ప్రారంభోత్సవానికి చర్యలు



ద్రౌపదిముర్ము

సాక్షి, చెన్నై : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చెన్నై పర్యటన మరోసారి రద్దు అయినట్టు సమాచారం వెలువడింది. దీంతో కలైంజ్ఞర్ కరుణానిధి మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సీఎం స్టాలిన్ చేతుల మీదుగానే ఈ నెల 15న ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టినట్టు సంకేతాలు వెలువడ్డాయి. చెన్నై గిండిలో రూ.230 కోట్లతో వెయ్యి పడకల మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన విషయం తెలిసిందే. డీఎంకే దివంగత నేత కరుణానిధి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా జూన్ 5వ తేదీన ఈ ఆసుపత్రిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. సీఎం స్టాలిన్ నెలన్నర రోజుల క్రితం స్వయంగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి ద్రౌపదిముర్మును ఆహ్వానించారు. ప్రారంభోత్సవానికి తగ్గ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో రాష్ట్రపతి చెన్నై పర్యటన రద్దు సమాచారం వెలువడింది. దీంతో ఆమె అపాయింట్‌మెంట్‌కు అనుగుణంగా ప్రారంభోత్సవాన్ని ఈ నెల 15కు మార్చి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రపతి రాకకు సంబంధించిన స్పష్టమైన సమాచారం ప్రభుత్వానికి అందలేదు. రాష్ట్రపతి భవన్ నుంచి ఎలాంటి సమాచారం లేనట్టు సంకేతాలు వెలువడ్డాయి. మరో రోజు మాత్రమే సమయం ఉండడంతో రాష్ట్రపతి కోసం వేచి చూడకుండా, రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంక్షేమాన్ని కాంక్షించే విధంగా ఆస్పత్రిని సీఎం చేతుల మీదుగానే ప్రారంభించేందుకు సంబంధించిన ఏర్పాట్లలో ఆరోగ్య శాఖ నిమగ్నమై ఉన్నట్టు సమాచారం వెలువడింది.

16న విద్యార్థుల పోరు

– గవర్నర్‌కు వ్యతిరేకంగా నిరసనలు

సాక్షి, చెన్నై : విశ్వవిద్యాలయాల్లో స్నాతకోత్సవాల నిర్వహణలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 16న రాష్ట్రవ్యాప్త ఆందోళనకు అన్ని విద్యార్థి సంఘాల నేతృత్వంలోని సమాఖ్య నిర్ణయం తీసుకుంది. ఇందులో గవర్నర్ ఆర్‌ఎన్ రవి నిర్లక్ష్యాన్ని ఎండగట్టే విధంగా నిరసనలు చేపట్టనున్నారు. రాష్ట్రంలో అనేక ప్రభుత్వ వర్సిటీల్లో రెండేళ్లుగా స్నాతకోత్సవాలు నిర్వహించలేదు. దీంతో డిగ్రీ పట్టాల కోసం లక్షలాది మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై గుర్రుగా ఉన్న గవర్నర్ ఆర్ఎన్ రవి ఈ స్నాతకోత్సవాల నిర్వహణకు అనుమతి ఇవ్వలేదన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఆగమేఘాలపై కొన్ని వర్సిటీల్లో స్నాతకోత్సవాల నిర్వహణకు రాజ్ భవన్ తేదీలను ప్రకటించింది. ఈ పరిస్థితిలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న రాష్ట్ర గవర్నర్ వైఖరిని నిరసిస్తూ, రాజ్ భవన్ నిర్లక్ష్యాన్ని ఎండగట్టే విధంగా విద్యార్థి సంఘాలన్నీ సోమవారం ఏకమయ్యాయి. డీఎంకే విద్యార్థి విభాగంతోపాటు వామపక్ష అనుబంధ, తదితర మిత్ర పక్షాల విద్యార్థి సంఘాలన్నీ ఏకమై ఈ నెల 16వ తేదీన రా ష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసనలు చేపట్టాలని నిర్ణయించాయి.

ఇద్దరు నిందితుల అరెస్టు

సాక్షి,చెన్నై: అజ్ఞాతంలో ఉన్న గుజరాత్, ఆంధ్రాకు చెందిన ఇద్దరు నిందితులను చెన్నై విమానాశ్రయం అధికారులు పట్టుకున్నారు. వీరిని సోమవారం చెన్నై పోలీసులకు అప్పగించారు. చెన్నై విమానాశ్రయంలో ఆదివారం రాత్రి శ్రీలంకకు బయలు దేరేందుకు సిద్ధమైన ఓ విమానంలోని ప్రయాణికుల పాస్ పోర్టులను అధికారులు తనిఖీ చేశారు. ఇందులో గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌కు చెందిన ఆశిష్ గుప్తా య్ పాస్ పోర్టుపై అనుమానం రావడంతో అతడ్ని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇతడిపై గుజరాత్‌లో అనేక కేసులు ఉన్నట్టు విచారణలో తేలింది. అలాగే దుబాయ్ వెళ్తున్న మరో విమానంలో తనిఖీలు చేయగా విశాఖపట్టణానికి చెందిన శ్రీనివాసన్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇతడిపై కూడా విశాఖపట్నంలో పలు కేసులు ఉన్నట్టు తేలింది. పోలీసుల వాంటెడ్ లిస్టులో ఉన్న ఈ అజ్ఞాత నేరగాళ్లు విదేశాలకు పారిపోయే క్రమంలో చెన్నై విమానాశ్రయ అధికారులకు చిక్కారు. వీరిని చెన్నై పోలీసు కమిషనరేట్ నిఘా విభాగానికి అప్పగించారు. వీరి అరెస్టు సమాచారాన్ని ఆయా రాష్ట్రాల పోలీసులకు చేర వేశారు.

మోగిన బడి గంటలు

- తెరుచుకున్న పాఠశాలలు
- విద్యార్థులకు పలుచోట్ల ఘన స్వాగతం
- వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- విద్యా మంత్రి అన్బిల్ మహేశ్



పుస్తకాలతో విద్యార్థులు

సాక్షి, చెన్నై: వేసవి సెలవుల అనంతరం సోమవారం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు చేరుకున్నారు. వారిని ఆహ్వానిస్తూ పలుచోట్ల ఘనంగా స్వాగతం పలికారు. ప్రభుత్వ బడుల్లో తొలి రోజే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మరింత మెరుగుపడిన తర్వాత విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు లేదా ట్యాబ్‌లు అందజేయడానికి అధ్యయనం చేస్తున్నట్టు చెప్పారు.

ఏప్రిల్ 28వ తేదీతో 2022–23 విద్యా సంవత్సరం ముగిసిన విషయం తెలిసిందే. తొలుత నెల రోజులు వేసవి సెలవును ప్రకటించారు. అగ్ని నక్షత్రం ముగిసినా ఎండలు తగ్గకపోవడంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాశాఖ రెండుసార్లు వేసవి సెలవులు పొడిగించింది. ఈ సారి మొత్తం 45 రోజులు వేసవి సెలవులు ఇచ్చారు. సెలవులు ముగియడంతో 2023–24 విద్యా సంవత్సరం సోమవారం నుంచి ప్రారంభమైంది. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలో 6–12 విద్యార్థులకు తరగతులను ప్రారంభించారు. అన్ని పాఠశాలల్లో ముందుగానే మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతులు తదితర పనులు పూర్తి చేశారు.



విద్యార్థులతో విద్యా మంత్రి అన్బిల్ మహేశ్

ఉత్సాహంగా స్కూళ్లకు విద్యార్థులు

పాఠశాలల పునః ప్రారంభానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో సోమవారం ఉదయాన్నే విద్యార్థులు బడి బాట పట్టారు. పుస్తకాల బ్యాగుల్ని మోస్తూ ఉరకలు తీశారు. ఆనందంతో కొందరు విద్యార్థులు పాఠశాలల వైపు నడిస్తే, మరి కొందరు విద్యార్థులు అప్పుడే సెలవులు ముగిశాయా..? అని నిట్టూర్పుతో కదిలారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహకారంతో నడిచే పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలల గేట్లు ఉదయం తెరుచుకోవడంతో ఆ పరిసరాలు విద్యార్థులతో కళకళలాడాయి. తల్లిదండ్రులు తమ పిల్లల్ని వెంటబెట్టుకుని స్కూల్స్ వద్ద వదలి పెట్టి వెళ్లారు. అనేక పాఠశాలల వద్ద విద్యార్థులను ఆహ్వానిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. చాక్లెట్లు, స్వీట్లు పంచి పెట్టారు. ఈరోడ్ పన్నీరు సెల్వం పార్కు పాఠశాలలో విద్యార్థులకు రెడ్ కార్పెట్ ఆహ్వానం పలికారు. విద్యార్థులను తీసుకెళ్లే వాహనాల్లో ఓవర్ లోడింగ్‌కు ఆస్కారం ఇవ్వని రీతిలో అధికారులు నిఘా పెట్టారు. తొలిరోజే విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. బస్ పాస్‌ల పంపిణీకి జాప్యం నెలకొననున్న దృష్ట్యా, విద్యార్థులు యూనిఫామ్ ధరించి ఉచితంగా బస్సుల్లో ప్రయాణించవచ్చని విద్యా శాఖ సూచించింది. ఇక 1–5 తరగతుల విద్యార్థులకు బుధవారం నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. పాఠశాలల ప్రారంభంతో విద్యార్థులకు సీఎం స్టాలిన్ శుభాకాంక్షలు తెలియజేశారు. చక్కగా చదువుకోవాలని పిలుపునిచ్చారు. చదువుల్లోనే కాదు, ఆటల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు.

వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యం

విరుగంబాక్కంలోని పాఠశాలలో విద్యార్థులను విద్యా మంత్రి అన్బిల్ మహేశ్ ఆహ్వానించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మరింత మెరుగు పడగానే విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు లేదా, ట్యాబ్‌ల పంపిణీ చేయాలని పరిశీలన జరుపుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా ఉపాధ్యాయులు టార్గెట్ నిర్ణయించుకోవాలని సూచించారు. ప్లస్ వన్ పబ్లిక్ పరీక్ష రద్దు విషయంగా ఇంతవరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. యూనిఫాం ధరించి బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల నుంచి ఎలాంటి చార్జీలు వసూలు చేయవద్దని రవాణా సంస్థకు విన్నవించారు.

కేంద్రం చర్యలను అడ్డుకుంటాం

- తమిళ విద్యార్థులకు న్యాయం చేస్తాం
- ఆరోగ్య మంత్రి ఎం సుబ్రమణియన్



ఎం సుబ్రమణియన్

సాక్షి, చెన్నై : వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియను పూర్తిగా తన చేతుల్లోకి తీసుకునేందుకు కేంద్రం చేపట్టిన ప్రయత్నాలను అడ్డుకుని తీరుతామని రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి ఎం సుబ్రమణియన్ తెలిపారు. చెన్నై వర్సిటీ స్నాతకోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. జాతీయ స్థాయిలో జనరల్ కౌన్సెలింగ్ నిర్వహించడం ద్వారా తమిళ విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కౌన్సెలింగ్ ప్రక్రియను కేంద్రం తన గుప్పెట్లోకి తీసుకోబోతుందన్న సమాచారం రాగానే తీవ్రంగా వ్యతిరేకిస్తూ సంబంధిత శాఖకు లేఖ రాశామని వివరించారు. ఈ ఏడాది అమలుచేయడం లేదని సమాధానం ఇచ్చిన కేంద్రం ప్రస్తుతం హఠాత్తుగా అమలు చేస్తామని ప్రకటించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ విధానం కారణంగా తమిళనాడులో ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అమల్లో ఉన్న 7.5 శాతం రిజర్వేషన్‌కు అడ్డంకులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. తమ విద్యార్థులకు దక్కాల్సిన సీట్లను ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు తన్నుకెళ్లడాన్ని అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. కేంద్రం చర్యలతో వైద్య విద్య ప్రశ్నార్థకమవుతోందని ధ్వజమెత్తారు. గ్రామీణ, పేద విద్యార్థుల కోసం తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న రిజర్వేషన్‌ను అడ్డుకునే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. వైద్య విద్య, వైద్య రంగంలో తమిళనాడు దేశానికే మార్గదర్శకంగా ఉన్న విషయాన్ని కేంద్రం గుర్తించాలని సూచించారు. సీఎం స్టాలిన్‌తో చర్చించి కేంద్రం చర్యలను అడ్డుకునేందుకు ఎలాంటి పోరాటాలకైనా సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు.

పట్టపగలే పీఎంకే నాయకుడి హత్య

సాక్షి, చెన్నై : చెన్నై శివారులోని మరమలై నగర్‌లో సోమవారం పట్టపగలే పీఎంకే నాయకుడిని గుర్తుతెలియని ముఠా నరికి చంపింది. ప్రజలు భయంతో పరుగులు తీశారు. చెంగల్పట్టు జిల్లా మరమలై నగర్ కాట్టూరుకు చెందిన కాళి(40) పీఎంకే నాయకుడిగా పనిచేస్తున్నారు. మరమలై నగర్ వన్నియర్ సంఘం నేత కూడా. సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో మరమలైనగర్‌లోని ఓ కాఫీ సెంటర్‌లో ఉండగా కారు, మోటారు సైకిళ్లపై వచ్చిన దుండగులు అతనిపై దాడి చేశారు. కత్తులు, కొడవళ్లతో నరికి చంపేశారు. అతడు మరణించాడా..? అని నిర్ధారించుకుని అక్కడి నుంచి వచ్చిన వాహనాల్లోనే ఉడాయించారు. అక్కడున్న జనం భయంతో పరుగులు తీశారు. సమాచారం అందుకున్న తాంబరం కమిషనరేట్ పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు, చెంగల్పట్టు పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి పరుగులు తీశారు. మృతదేహాన్ని చెంగల్పట్టు ఆసుపత్రికి తరలించారు. తాంబరం కమిషనర్ అమల్ రాజ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం విచారణకు రంగంలోకి దిగింది. అక్కడి సీసీ కెమెరాలలోని దృశ్యాల ఆధారంగా విచారణను వేగవంతం చేశారు. కాళికి భార్య, కుమార్తె ఉన్నారు. ఇతడు రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నట్టు విచారణలో తేలింది. ఇటీవల చెంగల్పట్టులో హత్యకు గురైన పేరు మోసిన రౌడీ రవిప్రకాష్ కేసులో కాళి అనుమానితుడిగా ఉన్నట్టు తేలింది. ఈ హత్యకు ప్రతీకరంగా ఈ ఘటన జరిగిందా..? లేదా మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు.

మోసం కేసులో రూ.78 లక్షల జప్తు

కొరుక్కుపేట: అధిక వడ్డీకి ఇస్తామని చెప్పి రూ.కోట్లు మోసం చేసిన కేసులో ఏఆర్‌టీ గ్రూప్ యజమానుల బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.78 లక్షల నగదును ఆర్థిక నేరాల విభాగం అధికారులు స్తంభింపజేశారు. అలాగే నిందితులను ఐదు రోజుల పాటు కస్టడీలోకి తీసుకుని విచారణ చేపట్టాలని నిర్ణయించారు. ఏఆర్‌టీ గ్రూప్ జ్ఞానదురై నేతృత్వంలోని గ్రూప్ యజమానులు, అతని సోదరుడు రాబిన్ నేతృత్వంలో నడుస్తోంది. ఈ గ్రూప్ తరఫున ప్రజలు పెట్టుబడులు పెట్టారు. రూ.లక్ష పెట్టుబడికి వారానికి రూ.3 వేలు, నెలకు రూ.12 వేలు వడ్డీ ఇస్తామని వారు ప్రచారం చేశారు. దురై, అతని సోదరుడు రాబిన్ నమ్మారు. ఈ కంపెనీలో వారితోపాటు చాలా మంది కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఆభరణాలు, సూపర్‌మార్కెట్‌లో ప్రజలు పెట్టుబడి పెట్టిన డబ్బుపై గ్రూపు వడ్డీ చెల్లించలేకపోయింది. బాధితులు కేసులు పెట్టగా అధికారులు విచారణ జరిపి ముఖ్యమైన పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఏఆర్‌టీ గ్రూప్ డివిజన్ యజమానులు జ్ఞానదురై, అతని సోదరుడు రాబిన్‌ను ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్ట్ చేశారు. 1,760 మంది నుంచి రూ.23 కోట్ల వరకు డబ్బులు తీసుకున్నారు. దీని ప్రకారం సోదరుల బ్యాంకు ఖాతాల్లోని రూ.78 లక్షల నగదును పోలీసులు స్తంభింపజేశారు. అంతేకాకుండా స్కామ్‌కు సంబంధించి ఇద్దరు యజమానులను 5 రోజుల రిమాండ్‌కు తరలించాలని స్థానిక క్రైమ్ బ్రాంచ్ నిర్ణయించింది.

అన్నామలైపై గరంగరం

- ధోరణి మార్చుకోవాలన్న అన్నాడీఎంకే
- లేని పక్షంలో కూటమిపై పునః పరిశీలన చేస్తామని హెచ్చరిక

సాక్షి, చెన్నై : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై అన్నాడీఎంకే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. దివంగత సీఎం జయలలితను ఉద్దేశించి కించపరిచే వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా పరిగణించింది. ధోరణి మార్చుకోవాలని, లేనిపక్షంలో కూటమిపై పునర్ పరిశీలన చేయాల్సి ఉంటుందని అన్నాడీఎంకే సీనియర్ నేత జయకుమార్ హెచ్చరికలు చేశారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఇటీవల డీఎంకేను టార్గెట్ చేసి పలు ఆరోపణలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే అన్నాడీఎంకేపైనా విరుచుకు పడుతున్నారు. ఆయన సోమవారం ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యలు అన్నాడీఎంకే వర్గాల్లో ఆగ్రహాన్ని రేపాయి. డీఎంకే అవినీతి ఫైల్స్–2 గురించి అన్నామలై స్పందించే క్రమంలో ఆ మీడియా సంధించిన ప్రశ్నలకు నోరు జారారు. అన్నాడీఎంకేను టార్గెట్ చేసి విరుచుకుపడ్డారు. ప్రధానంగా అన్నాడీఎంకే వర్గాల అమ్మ, దివంగత సీఎం జయలలితను అవినీతి పరురాలిగా చిత్రీకరించేలా వ్యాఖ్యల తూటాలను పేల్చారు. 1991–96 మధ్య రాష్ట్రంలో అవినీతి పెట్రేగేందుకు జయలలిత ఆజ్యం పోశారని విరుచుకుపడ్డారు. అలాగే అన్నాడీఎంకే మాజీల అవినీతి జాబితాను సైతం విడుదల చేస్తానంటూ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే తీవ్రంగా పరిగణించింది.

జయకుమార్ ద్వారా తీవ్ర హెచ్చరికలు

అన్నామలై వ్యాఖ్యలపై అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామి తీవ్ర ఆగ్రహం చెందినట్టు సమాచారం. దీంతో ఆ పార్టీ సీనియర్ నేత జయకుమార్ సోమవారం మీడియాతో మాట్లాడారు. ఒక పార్టీ అధ్యక్షుడికి ఉండాల్సిన అర్హత అన్నామలైకి లేవని ధ్వజమెత్తారు. నాలుకను అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని హెచ్చరించారు. తమిళ రాజకీయ చరిత్ర కూడా తెలియని అన్నామలై తనను తాను పబ్లిసిటీ చేసుకునేందుకు ఇతరులపై నిందలు వేయడాన్ని సంహించబోమన్నారు. కూటమి ధర్మాన్ని విస్మరించి మిత్రులపై ఆరోపణలు చేయడం ఎంత వరకు సమంజసమని బీజేపీ జాతీయ నేతలను ప్రశ్నించారు. ఆయన తన ధోరణిని మార్చుకోకుంటే సరైన సమయంలో తాము కూడా కూటమిపై పునర్ పరిశీలన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. కర్ణాటకను ఏలిన బీజేపీ పాలకుల అవినీతి జాబితాను ధైర్యం ఉంటే విడుదల చేయాలని అన్నామలైకు జయకుమార్ సవాల్ చేశారు. బీజేపీ అసెంబ్లీలో అడుగు పెట్టడంలో ఎవరి సహకారం కీలకమైందో అన్న విషయాన్ని అన్నామలై గుర్తుంచుకోవాలని హితవుపలికారు. ఇదిలా ఉండగా, చెన్నై విమానాశ్రయంలో సాయంత్రం మీడియాతో మాట్లాడిన అన్నామలై కూటమి విషయంగా చర్చించేందుకు ఇంకా సమయం ఉందని చెప్పడం గమనార్హం.



అన్నామలై, జయకుమార్

అన్నామలైకు వ్యతిరేకంగా నిరసనలు

బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలైకు వ్యతిరేకంగా పుదుచ్చేరిలో నిరసనలు వెల్లువెత్తాయి. నాలుకను అదుపులో పెట్టుకోవాలని, అహంకారంతో మాట్లాడితే పరిణామాణాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరిస్తూ అన్నాడీఎంకే నేతలు సోమవారం సాయంత్రం భారీ నిరసన చేపట్టారు. అన్నామలై వ్యాఖ్యలను మాజీ సీఎం పన్నీరు సెల్వం తీవ్రంగా ఖండించారు. అహంకారంతో విర్రవీగుతున్న అన్నామలైకు కళ్లెం వేస్తే మంచిదని, లేనిపక్షంలో నష్టం బీజేపీకే అన్న విషయాన్ని జాతీయ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని హితవుపలికారు.

క్లుప్తంగా

పట్టుదలతో ఉన్నత శిఖరాలు

అన్నానగర్: పట్టుదలతో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని వారు నిరూపించారు. నర్సు, టీచర్ ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిచారు. చెన్నై రైస్ మిల్లులో బానిసలుగా పుట్టిన ఇద్దరు అక్క, చెల్లెలు నర్సుగా, టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇరులర్ జాతికి చెందిన మారి 1990లో మల్లికా అనే మహిళను వివాహం చేసుకున్నాడు. పెళ్లికి సరిపడా డబ్బులు లేకపోవడంతో మారి తండ్రి తిరువళ్లూరు జిల్లాలోని ఓ పట్టణంలో రైస్ మిల్లు నడుపుతున్న వ్యక్తి నుంచి రూ.20 వేలు అప్పు తీసుకున్నాడు. అందుకు గాను అతని రైస్ మిల్లులో బానిసలుగా పనిచేస్తామని రాసిచ్చాడు. దాని ప్రకారం అతను, అతని కుమారుడు మారి, కోడలు మల్లికా అక్కడ కూపర్లుగా పనిచేశారు. వారికి ఐదుగురు పిల్లలు. వారిలో దుర్గ (25), దేవి (23) చిన్నప్పుడు రైస్ మిల్లులో పాడి ట్యాంక్ శుభ్రం చేసే పనిలో నిమగ్నమై ఉండేవారు. ఈ స్థితిలో 2005లో అతని కుటుంబాన్ని అధికారులు రక్షించారు. ఆ తర్వాత ఈ అక్కాచెల్లెళ్లు బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకున్నారు. ప్రస్తుతం దేవి నర్సింగ్ చదువు పూర్తి చేసింది. ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి పేదలకు సేవ చేస్తోంది. ఆమె అక్క దుర్గ టీచర్‌గా పని చేస్తోంది.

చెన్నై విపణిలోకి అల్ట్రాజ్ ఐసీఎన్జీ



కారును ఆవిష్కరిస్తున్న వినయ్ పంత్, అబ్దుల్ రెహ్మాన్

సాక్షి ,చెన్నై: లగ్జరీ కార్ల తయారీలో పేరు గాంచిన టాటా మోటార్స్ సంస్థ ఐసీఎన్జీ టియాగో, టిగోర్ వరుసలో భాగంగా ట్విన్ సిలిండెర్ సీఎన్జీ టెక్నాలజీతో, ఆధునిక సదుపాయాలతో రూపొందించిన అల్ట్రాజ్ ఐసీఎన్జీ బ్రాండ్ లగ్జరీ కారును సోమవారం చెన్నైలో ప్రవేశపెట్టారు. ఈ కారుని టాటామోటార్స్ మార్కెటింగ్ హెడ్ వినయ్ పంత్ ఆవిష్కరించారు. ఈ కారులో వాయిస్ అసిస్టెడ్ ఎలక్ట్రిక్ సన్రూఫ్, వైర్లెస్ చార్జెర్, ఎయిర్ ప్యూరిఫైర్ సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. కారు వెనుక భాగాన లగేజీ ఉంచేందుకు అనువైన స్థలం కూడా ఉన్నట్టు పేర్కొన్నారు. నాలుగు అందమైన రంగులలో తయారైన ఈ కారు రూ.7.55 లక్షల నుంచి రూ.10.54 లక్షల ధరలలో లభిస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు మార్కెటింగ్ ప్రతిధిని అబ్దుల్ రెహ్మాన్ కూడా పాల్గొన్నారు.

అన్నాడీఎంకే సభ్యుల వాకౌట్



యూనియన్ చైర్‌పర్సన్ రంజిత ఆధ్వర్యంలో సమితి సమావేశం



సమావేశం నుంచి వాకౌట్ చేసి బయటకు వచ్చిన అన్నాడీఎంకే సభ్యులు

పళ్లిపట్టు: యూనియన్ సమితి సభ్యుల పేర్లు చెక్కిన శిలాఫలకానికి రూ.రెండు లక్షలు కేటాయించడంపై అన్నాడీఎంకే సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 16 మంది పేర్లతో శిలాఫలకం ఏర్పాటుకు అంత మొత్తం ఎందుకు అవసరం అవుతుందని ప్రశ్నించారు. వారు ఆర్కేపేట యూనియన్ సమితి సమావేశం నుంచి వాకౌట్ చేశారు. ఆర్కేపేట యూనియన్ సమితి సభ్యుల సమావేశం సోమవారం చైర్‌పర్సన్ రంజిత అధ్యక్షతన నిర్వహించారు. వైస్ చైర్‌పర్సన్ తిలకవతి, బీడీఓలు కలైసెల్వి, వెంకటేశన్ తదితరులు పాల్గొన్నారు. చైర్‌పర్సన్ ప్రవేశపెట్టిన తీర్మానాలకు సంబంధించిన చర్చల్లో కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభ్యులకు బీడీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాద ఇవ్వడం లేదని, సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై బీడీవోలు మాట్లాడుతూ అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సత్సంబంధాలు మెరుగుపడేందుకు, సంక్షేమ పథకాలు అమలులో ప్రజా ప్రతినిధులకు భాగస్వామ్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సకాలంలో బిల్లులు చెల్లిస్తామన్నారు. అనంతరం నిర్వహించిన చర్చల్లో వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ముందస్తు చర్యలకు తీర్మానం ఆమోదించారు. అదే సమయంలో యూనియన్ సమితి సభ్యులు 16 మంది పేర్లతో శిలాఫలకం ఏర్పాటుకు వీలుగా జనరల్ నిధుల నుంచి రూ.రెండు లక్షలు కేటాయింపు తీర్మానం చేశారు. దీనిపై అన్నాడీఎంకే సభ్యులు అభ్యంతరం తెలిపారు. అనంతరం ఐదుగురు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. సమావేశంలో చైర్‌పర్సన్ తీసుకొచ్చిన తీర్మానాలు మెజారిటీ సభ్యుల ఆమోదంతో నెరవేర్చారు.

వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం

అన్నానగర్: చెన్నైలోని మింట్ స్ట్రీట్ సౌకార్‌పేటలో రెండంతస్తుల వాణిజ్య సముదాయంలో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రూ.లక్షల వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఇక్కడ బట్టలు, నగలు, ఫ్యాన్సీ తదతర 13 దుకాణాలు ఉన్నాయి. వీటికి కాంప్లెక్స్ ప్రవేశద్వారం వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ప్రాంతంలో ఆదివారం రాత్రి వర్షం కురిసింది. సోమవారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో ఒక్కసారిగా ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగాయి.. మంటలు వేగంగా వ్యాపించి సమీపంలోని వాణిజ్య సముదాయంలోని దుకాణాలకు వ్యాపించాయి. దీంతో ఆ ప్రాంతమంతా పొగ కమ్ముకుంది. ప్రజలు, కమర్షియల్ కాంప్లెక్స్‌లో నిద్రిస్తున్న వారు వేడికి తట్టుకోలేక నిద్ర లేచారు. విషయం తెలియగానే షాక్‌తో బయటకు పరుగులు తీయడంతో ఎవరికీ ఎలాంటి గాయాలు ఏర్పడలేదు. సమాచారం అందుకున్న 50 మంది అగ్నిమాపక సిబ్బంది వచ్చి దాదాపు 4 గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు పోలీసు ఇన్‌స్పెక్టర్ పుష్పరాజ్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని బందోబస్తు చేపట్టారు. ఈ అగ్ని ప్రమాదంలో పలు లక్షల విలువైన వస్తువులు దగ్ధమయ్యాయి.



స్వాగతం

వేలూరులో జరిగిన బీజేపీ తొమ్మిది సంవత్సరాల సాధన బహిరంగ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర మంత్రి అమిత్‌షాను వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్ వేలూరు విమానాశ్రయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయనతో పాటు వీఐటీ ఉపాధ్యక్షుడు జీవీ సెల్వం ఉన్నారు. – వేలూరు

పారిశుధ్య కార్మికులు వేతనం రూ.5 వేలు పెంపు

తిరువొత్తియూరు: అన్ని గ్రామాలు, పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనం రూ.5 వేలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామాల్లో పరిశుభ్రతను కాపాడడానికి, క్లీనెస్ గార్డులు ప్రతి ఇంటి నుంచి ఘన వ్యర్థాలను సేకరించి, చెత్తను కంపోస్ట్ చేస్తారు. ఈ మార్పిడి పనిని చేస్తున్న శానిటేషన్ గార్డులకు నెలవారీ వేతనాన్ని పెంచేందుకు చట్టం ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో ప్రకటన చేశారు. ఆ నోటిఫికేషన్‌కు స్పందించిన తమిళనాడు ప్రభుత్వం నెలవారీ వేతనాన్ని రూ. 3,600 నుంచి రూ.5 వేలకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

వాయిద్యంలో చిన్నారి ప్రతిభ

తిరువొత్తియూరు: ఆరేళ్ల చిన్నారి నాదస్వర వాయిద్యాన్ని వాయించి అందరినీ ఆకట్టుకున్నాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. నాగపట్నం జిల్లా కిల్వేలూరుకు చెందిన బాలసుందరం ఆలయ ఉత్సవాలు, శుభకార్యాల్లో నాదస్వరం వాయిస్తున్నాడు. ఇతని కుమారుడు సాయి వెంకటేష్ (6) కిల్వేలూరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో పాఠశాలకు సెలవులు, ఖాళీ సమయాల్లో వెంకటేష్ తన తండ్రి సుందరంతో కలిసి శుభ కార్యాల్లో పాల్గొనేవాడు. తద్వారా నాదస్వరం వాయించడంలో శిక్షణ పొందాడు. ఆలయంలో కీల్వేలూరు యాదవ తిరుకల్యాణ ఉత్సవంలో బాలుడు వేంకటేష్ నాదస్వర సంగీతానికి అనుగుణంగా వాయిద్యాన్ని అద్భుతంగా వాయించాడు. ఈ వీడియోను కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయింది. బాలుడి తాత గణేశన్ నాదస్వరానికి తమిళనాడు ప్రభుత్వం కళైమామణి అవార్డు అందజేసింది.

గ్రీవెన్స్ సెల్‌లో స్పృహతప్పి పడిపోయిన మహిళ



మహిళను విచారిస్తున్న పోలీసులు

వేలూరు: వేలూరు కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం కలెక్టర్ కుమరవేల్ పాండియన్ అధ్యక్షతన గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై వినతి పత్రాలు సమర్పించారు. అధికారులు విచారణ జరిపి అర్హులైన లబ్ధిదారులకు అక్కడికక్కడే సంక్షేమ పథకాలు అందజేశారు. ఇదిలా ఉండగా కాట్పాడి సమీపంలోని సెంగుట్టైకి చెందిన భారతి ఉచిత ఇంటి పట్టా కోసం వినతి పత్రం అందజేసేందుకు కలెక్టరేట్‌కు వచ్చింది. క్యూలైన్‌లో ఎండలో సుమారు అర గంట పాటు వేచి ఉంది. ఈ క్రమంలో సీరసం చెంది హాలు ముందు స్పృహ తప్పి పడిపోయింది. గమనించిన పోలీసులు, అధికారులు వెంటనే ఆమెపై నీటిని చల్లి విచారణ జరిపారు. విచారణలో ఉదయం నుంచి ఎటువంటి ఆహారం తీసుకోకుండా కలెక్టరేట్‌కు చేరుకున్నట్లు తెలిపింది. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పళ్లిపట్టు: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ రమేష్ పిలుపునిచ్చారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన దినం సందర్భంగా సోమవారం ఆర్కేపేట తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ విద్య ప్రతి ఒక్కరికీ ప్రాథమిక హక్కు అని తెలిపారు. 14 ఏళ్ల లోపు చిన్నారులను బడిలో చేర్పించి ఉచిత విద్య అందించాలన్నారు. చిన్నారులను కూలి పనులకు పంపడం నేరమని, ఎవరైనా పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు తమవంతు సహకారాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ చార్జీలు ఉపసంహరించుకోవాలని వినతి



వినతి పత్రాన్ని అందజేస్తున్న తామాకా పార్టీ నాయకులు

కొరుక్కుపేట: వాణిజ్య, పరిశ్రమల సంస్థలకు పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తమిళ మానిల కాంగ్రెస్ పార్టీ (తామాకా) నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు జి.కె.వాసన్ ఆదేశానుసారం సోమవారం 200 మందికి పైగా నాయకులు చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. విద్యుత్‌చార్జీలు ఉపసంహరించాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం విద్యుత్ చార్జీలు తగ్గించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. పార్టీ కార్యాలయ కార్యదర్శి జీఆర్ వెంకటేషన్, చెన్నై జిల్లా నాయకులు బిజు షాకో, అరుణ్‌కుమార్, బాల, రవిచంద్రన్, గోవిందసామి, మునవర్ బాషా, మనోహరన్, సత్యనారాయణన్, శక్తి వడివేల్, కంపం అబ్బాస్, జీఆర్ వెంకటేష్, రాజాం ఎంపీ నాథన్, ఆర్ఎస్ ముత్తు, ప్రేమ్‌కుమార్, వెలచ్చేరి లూయిస్, జానీ, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోలీవుడ్ టాక్స్



టక్కర్ చిత్ర దర్శకుడు కార్తీక్ క్రిష్‌ను సత్కరిస్తున్న స్థానికులు

తమిళ సినిమా: నటుడు సిద్ధార్థ్, దివ్యాన్షా జంటగా నటించిన తాజా చిత్రం టక్కర్. కార్తీక్ క్రిష్ దర్శకత్వంలో ప్యాషన్ స్టూడియోస్ పతాకంపై సుదన్ సుందరం, జయరాం కలిసి నిర్మించిన ఈ చిత్రం గత 9వ తేదీన విడుదలైంది. సొంత ఊరు మైలాడుదురైకు వెళ్లిన ఈ చిత్ర దర్శకుడు కార్తీక్ క్రిష్‌కు ఆ గ్రామం ప్రజలు మైయిలాడుదురైకు ఘనతను చేకూర్చావంటూ బ్యాండ్ బాజాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆ ఊరులోని విజయ్ థియేటర్లో అభినందన సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజకీయ, న్యాయవాద, వ్యాపార, వైద్య, సినీ ప్రముఖులు పాల్గొని దర్శకుడు కార్తీక్ క్రిష్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు కార్తీక్ క్రిష్ మీడియాతో మాట్లాడుతూ టక్కర్ చిత్రం ప్రేక్షకుల మధ్య మంచి ఆదరణను పొందుతుండడం సంతోషంగా ఉందన్నారు. పలు ప్రాంతాల్లో చిత్రాన్ని కుటుంబ సమేతంగా చూసి ఎంజాయ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా తన సొంత ఊరు మైలాడుదురై ప్రజలు ఘన స్వాగతం పలికి తన సినీ ప్రయాణాన్ని ప్రోత్సహిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. అదే విధంగా ప్రేక్షకులు ఆదరించారని, సహకరించిన ప్యాషన్ స్టూడియోస్ అధినేతలకు, నటుడు సిద్ధార్థ్, ఇతర నటీనటులు, సాంకేతిక వర్గానికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు.

టక్కర్ చిత్రానికి ఆదరణ - అందరికీ ధన్యవాదాలు

ధనుష్‌కు నటి కంగనా నో చెప్పిందా?





నటి కంగనా రనౌత్

తమిళ సినిమా: సంచలనాలకు చిరునామా, వివాదాలకు పేటెంట్ నటి కంగనా రనౌత్. ఆమె సమాజంలో జరిగే సంఘటనలపై తనదైన శైలిలో స్పందిస్తుంది. ప్రతిభకు నిలువెత్తు నిదర్శనం అనే పేరు తెచ్చుకున్న నటి ఈ బాలీవుడ్ భామ. నటిగా, నిర్మాతగా, దర్శకురాలిగా తన సత్తా చాటుకుంటున్న కంగనా ప్రస్తుతం దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పరిపాలన, నాటి సంఘటనలతో ఎమర్జెన్సీ చిత్రంలో ఇందిరాగాంధీ పాత్రను పోషించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించడం విశేషం. దక్షిణాదిలోనూ నటిగా రాణిస్తోంది. ఇప్పటికే తమిళంలో ఇప్పటికీ ధామ్ ధూమ్, తలైవి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. దీంతో ఇక్కడ అవకాశాలు వస్తున్నాయి. తమిళ చిత్రాల అవకాశాలను తిరస్కరిస్తుందనే ఆరోపణలను ఎదుర్కొంటోంది. ఇంతకు ముందు నటుడు శింబు సరసన నటించే అవకాశాన్ని నిరాకరించిన కంగనా రనౌత్ తాజాగా నటుడు ధనుష్‌తో జత కట్టే అవకాశానికి నో చెప్పినట్టు ప్రచారం జరుగుతోంది. ధనుష్ పాన్ వరల్డ్ నటుడు అన్నది తెలిసిందే. కాగా ఈయనలోనూ బహుముఖాలు ఉన్నాయి. నటుడిగా, గాయకుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా సక్సెస్ అయ్యారు. తాజాగా తన 50వ చిత్రంలో నటించడానికి సిద్ధం అవుతున్నారు. ఈ చిత్రానికి ఈయనే దర్శకత్వం వహించనున్నారు. భారీ తారాగణంతో సన్ పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని భారీ ఎత్తున నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. ఇందులో ధనుష్‌కు జంటగా కంగనా రనౌత్‌ను నటింపజేసే ప్రయత్నం చేసినట్లు, ఆమె కాల్ షీట్స్ సమస్య అంటూ నిరాకరించినట్లు టాక్. దీంతో ధనుష్ తన అర్ధ సెంచరీ చిత్రంలో నాయకిగా నటి త్రిషనే ఎంపిక చేసుకున్నట్లు సమాచారం.

తమిళ సినిమా: సినీ రంగంలోకి మరో అందాల భామ దూసుకొస్తున్నారు. ఆమె పేరు ప్రిషా సింగ్. వేలాడే అందం ఈమె సొంతం. మరికొద్ది రోజుల్లోనే ప్రిషా సింగ్ నటించిన రెండు తెలుగు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాయి. ఈ బ్యూటీ నటించిన తొలి చిత్రం స్పై. నిఖిల్ సిద్ధార్థ్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో నటి ప్రిషా సింగ్ నెగిటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో నటించారు. దీని గురించి ఈమె ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన స్పై చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో పాన్ ఇండియా చిత్రంగా విడుదల కాబోతోందన్నారు. మొదటి చిత్రమే పాన్ ఇండియా స్థాయిలో విడుదల కానుండడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో తన పాత్ర ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ప్రిషా సింగ్ కథానాయకిగా నటించిన మరో తెలుగు చిత్రం బడ్డీ. అల్లు శిరీష్ కథానాయకుడిగా నటించిన ఈ చిత్రాన్ని ప్రముఖ తమిళ నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా తన స్టూడియో గ్రీన్ పతాకంపై నిర్మించడం, సామ్ ఆంటోన్ దర్శకత్వం వహించడం విశేషం. బడ్డీ చిత్రంలో సరికొత్త అనుభవంగా ప్రిషా సింగ్ పేర్కొన్నారు. ఇది ఈ నెలాఖరులోనే తెరపైకి రానుంది. ఈ రంగంలోకి రాకముందే నటనలో తర్ఫీదు పొందిన ప్రిషా సింగ్ డ్యాన్స్‌లోనూ శిక్షణ పొందినట్లు చెప్పారు. తనకు తమిళ చిత్రాల్లో నటించడమంటే చాలా ఇష్టమని, త్వరలోనే తమిళ చిత్రాల్లో నటిస్తాననే నమ్మకం ఉందని పేర్కొన్నారు. అదే విధంగా నటుడు అల్లు అర్జున్, విజయ్ సేతుపతి సరసన నటించాలని కోరుకుంటున్నట్లు ప్రిషా సింగ్ చెప్పారు.

విజయ్ సేతుపతితో జతకట్టాలనుంది



నటి ప్రిషా సింగ్

విడుదలకు సిద్ధమైన ఈడాట్టం

తమిళ సినిమా: ఇప్పుడు వెండితెరకు బుల్లితెర వారధిగా మారిందనే చెప్పాలి. సత్తా చాటుకుంటున్న పలువురు బుల్లితెర నటీనటులకు చిత్ర పరిశ్రమ అవకాశాలు కల్పిస్తోంది. తాజాగా ప్రముఖ బుల్లితెర నటుడు శ్రీకుమార్ హీరోగా తెరంగేట్రం చేశారు. ఈయన కథానాయకుడిగా నటించిన చిత్రం ఈడాట్టం. రాజసూర్య, నటి వెంబా, అనుకృష్ణ, దీక్షిక, విజయ్ విచిత్రన్, కాదల్ సుకుమార్, పవర్ స్టార్, పూవిళంగు మోహన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. ఈ చిత్రానికి కథనం, మాటలు, దర్శకత్వం పర్యవేక్షణను గజపతి నిర్వహించగా, కథ, దర్శకత్వం బాధ్యతలను ఈశన్ నిర్వహించారు. దీన్ని ఈశన్ మూవీస్ పతాకంపై శక్తి అరుణ్ కేశవన్ నిర్మిస్తున్నారు. జాన్ పీటర్ సంగీతాన్ని, జసన్ విలియమ్స్ చాయాగ్రహణం అందించారు. ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి ముస్తాబవుతోంది. చిత్ర వివరాలను దర్శకుడు తెలుపుతూ ఇది ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే విభిన్న కథాచిత్రంగా ఉంటుందన్నారు. చిత్ర కథానాయకుడు యాషికా అనే ధనవంతురాలి ఇంట్లో కార్ డ్రైవర్‌గా పని చేస్తాడన్నారు. మద్యానికి బానిసైన అతను చిన్న చిన్న దొంగతనాలు చేస్తూ ఆపై అమ్మాయిలను మోసం చేసి డబ్బులు గుంజుకుంటాడన్నారు. అలాంటి పరిస్థితుల్లో మూడు హత్యలు జరుగుతాయన్నారు. ఆ హత్యలలో అతనికి సంబంధం ఉందా? ఉంటే వాటి నుంచి ఎలా బయటపడ్డాడు? ఆసక్తికరమైన అంశాలతో వినోదాన్ని జోడించి తెరకెక్కించిన చిత్రం ఈడాట్టం అని తెలిపారు.



ఈడాట్టం చిత్ర యూనిట్

తలైనగరం 2కు మరిన్ని సీక్వెల్స్ రావాలి



తలైనగరం 2 చిత్ర ఆడియో ఆవిష్కరణ దృశ్యం

తమిళ సినిమా: దర్శకుడు సుందర్ సి కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం తలైనగరం 2. ఇందులో నటి పలాక్ లల్వాణి హీరోయిన్. ఈ చిత్రాన్ని దర్శకుడు వీజడ్ దురై రైట్ ఐ ప్రొడక్షన్స్ పతాకంపై ఎస్ ఎం .ప్రభాకరన్‌తో కలిసి నిర్మిస్తూ దర్శకత్వం వహించారు. ఇంతకు ముందు సుందర్ సి దర్శకత్వం వహించిన తలైనగరం చిత్రానికి ఇది సీక్వెల్. నిర్మాణ కార్యక్రమాలు పూర్తి చేసుకుని త్వరలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా చిత్ర ఆడియో, ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం సాయంత్రం చెన్నైలోని కమలా థియేటర్లో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న చిత్ర కథానాయకుడు సుందర్ సి మాట్లాడుతూ తలైనగరం చిత్రం టైటిల్ ఆస్కార్ రవిచంద్రన్‌దని, అడగ్గానే తమకు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు పేర్కొన్నారు. తాను ఈ చిత్రంలో నటించడానికి కారణం దర్శకుడు వీజడ్ దురై నేనని పేర్కొన్నారు. తాను ఇంతకు ముందు ఆయన దర్శకత్వంలో ఇరుట్టు చిత్రంలో నటించానని, దాన్ని ఆయన తెరకెక్కించిన తీరు నచ్చిందని చెప్పారు. ఇరుట్టు చిత్రం మంచి విజయాన్ని సాధించిందన్నారు. దీంతో తలైనగరానికి సీక్వెల్‌లో నటించమని వీజడ్ దురై కోరగా కాదనడానికి తనకు అవకాశం లేకపోయిందని అన్నారు. ఫర్ఫెక్షన్ కోరుకునే దర్శకుడు ఈయన అని పేర్కొన్నారు. తలైనగరం 2లో ఎమోషనల్ సన్నివేశాలను అద్భుతంగా తెరకెక్కించారని చెప్పారు. ఈ చిత్రం విజయంపై దర్శకుడికి, తనకు నమ్మకం ఉందన్నారు. అరణ్మణై చిత్రం తరహాలో ఇది మరిన్ని సీక్వెల్స్ రూపొందాలని కోరుతున్నానన్నారు.

క్లుప్తంగా

వృద్ధురాలిపై లైంగిక దాడి, హత్య
– యువకుడి అరెస్టు

అన్నానగర్: మదురైలో ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు(65)పై లైంగిక దాడిచేసి హత్య చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేసి విచారిస్తున్నారు. మదురై జైహింద్‌పురం అంబేడ్కర్ నగర్‌కు చెందిన వృద్ధురాలు ఒంటరిగా జీవిస్తోంది. ఆమె భర్త మృతి చెందగా, కుమారుడికి కూడా వివాహమై ఒంటరిగా ఉంటున్నాడు. ఆదివారం ఉదయం వృద్ధురాలు ఇంటి తలుపులు ఎంత సేపటికీ తెరవలేదు. దీంతో ఇరుగుపొరుగు అనుమానంతో వచ్చి చూడగా ఆమె గాయాలతో మృతి చెంది ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వృద్ధురాలిపై లైంగిక దాడి చేసి హత్య చేసినట్లు గుర్తించారు. తదుపరి విచారణలో ఆ ప్రాంతానికి చెందిన అర్జున్ (31) వృద్ధురాలిని హత్య చేసినట్లు గుర్తించి అరెస్టు చేశారు.

పిడుగు పడి యువకుడి మృతి

అన్నానగర్: అరుప్పుక్కోట్టై సమీపంలో ఆదివారం సాయంత్రం క్రికెట్ ఆడుతున్న యువకుడు పిడుగుపాటుకు గురై దుర్మరణం చెందాడు. విరుదునగర్ జిల్లా అరుప్పుక్కోట్టైకి చెందిన మణికంఠన్ (25) ఫ్లెక్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. ఇతను ఆదివారం సాయంత్రం పాలయంపట్టి తీర్థక్కరై ప్రాంతంలో స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. ఆ సమయంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మణికంఠన్ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అరుప్పుక్కోట్టై ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐస్ వ్యాపారి హత్య
– యువకుడి అరెస్టు

అన్నానగర్: ఉచితంగా ఐస్ ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేసి ఐస్ వ్యాపారిని హత్య చేసిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాంబాబు (52) చెన్నై పెరంపూర్ జీ.కే.ఎం.కాలనీలో అద్దె ఇంట్లో ఉంటూ గుల్ఫీ ఐస్ వ్యాపారం చేస్తున్నాడు. ఆదివారం అన్నానగర్‌లోని అన్నై సత్యానగర్ ప్రాంతంలో ఐస్ క్రీం విక్రయిస్తుండగా ఆ ప్రాంతానికి చెందిన అశ్విన్(19) డబ్బులు ఇవ్వకుండా ఐస్ అడిగాడు. రాంబాబు నిరాకరించడంతో అశ్విన్ వాగ్వాదానికి దిగాడు. అక్కడ ఉన్న పెద్ద కర్ర తీసుకుని రాంబాబును బలంగా కొట్టి పారిపోయాడు. తీవ్రంగా గాయపడి రక్తం కారుతున్న రాంబాబును ఆ ప్రాంత ప్రజలు రక్షించి వెంటనే కీల్పాక్కం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ తీవ్ర చికిత్స పొందుతూ రాంబాబు మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు అన్నానగర్ పోలీసులు కేసు నమోదు చేసి అశ్విన్‌ను అరెస్ట్ చేశారు.

మద్యం బాటిల్‌లో జెర్రి

తిరువొత్తియూరు: టాస్మాక్ దుకాణంలో తీసుకున్న మద్యం బాటిల్‌లో జెర్రి ఉన్న వీడియో సామాజిక మద్యమాల్లో వైరల్ అయ్యింది. కన్యాకుమారి, మార్తాండం, మేళపురం ప్రాంతంలో టాస్మాక్ దుకాణం ఉంది. ఇందులో ఆదివారం సాయంత్రం ఒకరు మద్యం బాటిల్ కొనుగోలు చేశారు. అందులో జెర్రి చచ్చిపోయి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందాడు. దీనిపై ప్రశ్నించడంతో విక్రయదారుడు మరో బాటిల్ ఇచ్చి పంపించాడు. ఈ సంఘటనను కొందరు వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అది వైరల్ అయ్యింది.

బీజేపీ కార్యదర్శి అరెస్టు

తిరువొత్తియూరు: ముస్లింలకు కించపరుస్తూ ట్వీట్ చేసిన బీజేపీ కార్యదర్శిని పోలీసులు అరెస్టు చేశారు. పెద్ద కాంచీపురం ప్రాంతానికి చెందిన సెల్వం కాంచీపురం జిల్లా బీజేపీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఆయన తన ట్విట్టర్ ఖాతాలో హిందూ ఆలయంలో ఉన్న హుండీల్లోని నగదు ప్రభుత్వానికి చెందుతుందని, మసీదుల్లోని హుండీల్లోని కానుకలు వారికి ఎలా సొంతం అవుతాయని అని పోస్టు చేశారు. ఇది వైరల్ కావడంతో వలాజాబాద్‌కు చెందిన ముబారక్ బాషా కాంచీపురం జిల్లా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి సెల్వంను అరెస్టు చేశారు. అతని అరెస్టును వ్యతిరేకిస్తూ బీజేపీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.

ఆభరణాలు మాయం కేసులో చురుగ్గా విచారణ

కొరుక్కుపేట: గాయకుడు విజయ్ యేసుదాసు ఇంట్లో ఆభరణాలు మాయం కేసులో విచారణ చురుగ్గా సాగుతోంది. ఇంట్లో పనిచేసిన 11 మంది పనివాళ్లను పోలీసులు విచారణ చేసి నగలు చోరీకి గురికాలేదని తేల్చారు. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంలో విజయ్ యేసుదాసు భార్య తప్పుడు ఫిర్యాదు చేసి డ్రామా ఆడుతోందా అనే కోణంలో దర్యాప్తు చేయాలని పోలీసులు నిర్ణయించారు. విజయ్ యేసుదాసు చెన్నైలోని ఆల్వార్ పేట్ 3వ వీధిలో భార్య దర్శనతో కలిసి ఉంటున్నాడు. ఫిబ్రవరి 18వ తేదీన ఒక కార్యక్రమానికి వెళ్లివచ్చిన తర్వాత ఇంటి లాకర్ నుంచి 60 సవర్ల నగలు మాయమైనట్లు మార్చి 30న అభిరామపురం పోలీస్ స్టేషన్‌లో దర్శన ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు. ఆభరణాలు ఉంచే లాకర్ సీక్రెట్ కోడ్ విజయ్ యేసుదాసు, అతని భార్య దర్శనకు మాత్రమే తెలుసని గుర్తించారు. ఇంట్లో పని చేస్తున్న 11 కార్మికులను విడివిడిగా విచారించి నగలు లాకర్ నుంచి చోరీకి గురికాలేదని తేల్చారు. ఫిబ్రవరి 18న ఆమె ఇంట్లో నగలు మాయమైనట్లు తేలిందని, అప్పుడు ఫిర్యాదు చేయకుండా 40 రోజుల తర్వాత మార్చి 30న ఫిర్యాదు చేయడానికి గల కారణమేమిటి? అన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో విజయ్ యేసుదాసు భార్య దర్శనను విచారించాలని పోలీసులు నిర్ణయించారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా బడికి

- తొలిరోజే పాఠ్యపుస్తకాలు పంపిణీ
- హర్షం వ్యక్తం చేసిన పిల్లల తల్లిదండ్రులు




పాఠశాలలో విద్యార్థుల సందడి, విద్యార్థులకు చాక్లెట్లు అందజేసి స్వాగతం పలుకుతున్న టీచర్‌లు

తిరుత్తణి: వేసవి సెలవుల తరువాత సోమవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. విద్యార్థులు ఉత్సాహంగా.. ఉల్లాసంగా బడికి హాజరయ్యారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు నోటు పుస్తకాలు అందజేయడంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వారం రోజులు ఆలస్యంగా బడులు తెరుచుకున్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు చిరునవ్వుతో స్వాగతం పలికారు. తిరుత్తణి బాలికల ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో తల్లిదండ్రులతో విద్యార్థినులు బడికి చేరుకున్నారు. ఉపాధ్యాయులు వారికి స్వాగతం పలికారు. పీటీఏ అధ్యక్షుడు కుమరవేలు ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాలు అందజేశారు. కేజీ.కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సాయిశ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులకు చాక్లెట్లు పంచి పెట్టి స్వాగతం పలికారు. తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోటు పుస్తకాలను పీటీఏ అధ్యక్షుడు రమేష్, ఎస్ఎంసీ అధ్యక్షురాలు నిరోష పంపిణీ చేశారు. 40 రోజులకు పైగా మూతపడిన పాఠశాలలు తెరుచుకోవడంతో సందడి నెలకొంది.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

వేలూరు: ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని కలెక్టర్ కుమరవేల్ పాండియన్ తెలిపారు. సోమవారం రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు పునః ప్రారంభమయ్యాయి. వేలూరు, తిరువణ్ణామలై జిల్లాల్లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తమ పాఠశాలల్లో చేరాలని అవగాహన ర్యాలీ నిర్వహించారు. వేలూరులోని ప్రభుత్వ ముస్లిం మైనారిటీ పాఠశాలలో విద్యార్థులకు కలెక్టర్ ఉచిత పుస్తకాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. 5 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాభోదన ఉందని, ఇక్కడ విద్యను అభ్యసించిన అనేక మంది ఉన్నత స్థానాల్లో ఉన్నారని తెలిపారు. తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలల ప్రకటనలకు మోస పోకుండా ఉండాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో బోధన ఉంటుందన్నారు. కొందరు విద్యార్థులు సంతోషంతో ఆలయాల్లో పూజలు చేసి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకొని పాఠశాలకు చేరుకున్నారు. అదే విధంగా వేలూరు ఈవేరా ప్రభుత్వ పాఠశాల బాలికలకు టీచర్‌లు కర్పూర హారతి పట్టి చాక్లెట్లు అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సీఈవో మునస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.






తిరుత్తణిలో బడికి వెళుతున్న విద్యార్థినులు, కేజీ.కండ్రిగ ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో విద్యార్థులకు స్వీట్ల పంపిణీ, పుస్తకాలు అందజేస్తున్న పీటీఏ అధ్యక్షుడు రమేష్, హెచ్‌ఎం. సాయి శ్రీనివాస్, పుస్తకాలు అందజేస్తున్న కలెక్టర్ కుమరవేల్ పాండియన్

కార్మికుడి ఇంట్లో 20 సవర్ల నగలు చోరీ

అన్నానగర్: నైవేలిలో సోమవారం ఉదయం రిటైర్డ్ ఎల్‌ఎల్‌సీ కార్మికుడి ఇంట్లో 20 సవర్ల బంగారు నగలు, నగదు చోరీ చేసిన నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నైవేలి ఉత్తరంలోని శ్రీనివాస అవెన్యూలో వేల్ మురుగన్(62), కళావతి దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహమై వేర్వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. దుబాయ్‌లో ఉన్న కూతుకు తోడుగా ఉండేందుకు మూడు నెలల క్రితం కళావతి వెళ్లింది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం కళావతి విమానంలో దుబాయ్ నుంచి చెన్నై వచ్చింది. వేల్ మురుగన్ ఆమెను తీసుకురావడానికి రాత్రి చెన్నై బయలుదేరాడు. సోమవారం ఉదయం ఇద్దరూ ఇంటికి వచ్చారు. అప్పుడు ఇంటి ముందు తలుపులు పగులగొట్టి ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందారు. లోపల పరిశీలించగా బీరువాలో ఉన్న 20 సవర్ల బంగారు నగలు, రూ.80 వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించారు. విషయం తెలుసుకున్న నైవేలి టౌన్‌షిప్ పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. ఫోరెన్సిక్ నిపుణులు వేలి ముద్రలు సేకరించారు. కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాల భవనాల ప్రారంభం



ప్రభుత్వ పాఠశాల భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి టిఎం అన్బరసన్, ఎమ్మెల్యే కరుణానిధి

కొరుక్కుపేట: చెన్నైలోని త్రిసూలం ప్రాంతంలో రౌండ్ టేబుల్ ఇండియా ఆధ్వర్యంలో రూ.23 లక్షలతో పంచాయితీ యూనియన్ మిడిల్ స్కూల్‌లో నిర్మించిన రెండు తరగతి గదులను సోమవారం ఎంఎస్‌ఎంఈ శాఖా మంత్రి టిఎం అన్బరసన్, పల్లావరం ఎమ్మెల్యే ఐ.కరుణానిధి, చెంగల్‌పట్టు కలెక్టర్ ఏఆర్ రాహుల్‌నాథ్, రౌండ్ టేబుల్ ఇండియా ఏరియా 2 చైర్మన్ విజయరాఘవేంద్ర, లేడీస్ సర్కిల్ ఇండియా ఏరియా 2 చైర్‌పర్సన్ దివ్య చేతన్ ప్రారంభించారు. ఎమ్మెల్యే కరుణానిధి మాట్లాడుతూ ఈ రెండు తరగతి గదులు వల్ల ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ఇది భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడే ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉన్నత విద్యలో 7.5 శాతం రిజర్వేషన్ల ప్రకటించడం ఎంతో గొప్ప విషయమన్నారు. దీంతో పేద పిల్లలు మళ్లీ ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి ముందుకు వస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా నాణ్యమైన తరగతి గదులను నిర్మించి అందించామని రౌండ్ టేబుల్ ఇండియా నిర్వాహకులు తెలిపారు. మద్రాసు మెట్రో రౌండ్ టేబుల్ ఇండియా 95, మద్రాసు లేడీస్ సర్కిల్ 70 నేతృత్వంలో రౌండ్ టేబుల్ ఇండియా ట్రస్ట్, పి అండ్ జి సంయుక్తంగా నమకే నామ్ దిట్టం (మనకు మనమే పథకం)లో భాగంగా ఈ తరగతి గదులను నిర్మించినట్లు విజయరాఘవేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఆర్‌టీ 95 చైర్మన్ రోషన్ కుమార్, ఎంఎంఎల్‌సి 70 పాయల్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

అడవి సంరక్షణ బాధ్యత యువతదే



మొక్కలు నాటుతున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: అడవిని సంరక్షించి భావితరాలకు అందించే బాధ్యతను యువత, స్వచ్ఛంద సంస్థలు తీసుకోవాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా వేలకాపురంలో ఐఆర్‌సీడీఎస్ సంస్థ, చిప్ అకాడమీ ఆధ్యర్యంలో కొత్త అడవిని సృష్టించే కార్యక్రమంలో భాగంగా లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వేర్వేరు కారణాలతో చెట్లను నరికివేస్తుండడంతో వాతావరణ కాలుష్యం అధికమై సకాలంలో వర్షాలు కురవడం లేదన్నారు. దీంతో భవిష్యత్‌లో సరైన గాలి అందక మానవ జాతి అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రాథమిక దశ నుంచి చిన్నారులు పర్యావరణ పరిరక్షణ, రీఫారెస్టేషన్ విధానాలపై అవగాహన కలిగి వుండాలన్నారు. మొక్కలను నాటడం, పరిరక్షించడంపై అవగాహన కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌సీడీఎస్ సంస్థ నిర్వాహకుడు స్టీఫెన్, చిప్ అకాడమీ డైరెక్టర్ దినేష్‌విక్టర్, పూండీ బీడీవో మణిశేఖర్, వేలకాపురం పంచాయతీ అధ్యక్షుడు హరి, వీఏఓ భరత్ పాల్గొన్నారు.

వినతులపై జవాబుదారీతనం ఉండాలి



వికలాంగుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్

తిరువళ్లూరు: గ్రీవెన్స్‌డేలో వచ్చే వినతులపై అధికారులకు జవాబుదారీతనం ఉండాలని కలెక్టర్ ఆల్బీజాన్‌వర్గీష్ సూచించారు. తిరువళ్లూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే నిర్వహించారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు ప్రజలు వినతి పత్రాలు స్వీకరించారు. వాటిని ఆయా శాఖల అధికారులకు బదిలీ చేస్తూ వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విద్యార్థికి ఉన్నత విద్య కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.50 వేల చెక్కును అందజేశారు.

కలెక్టర్ కారు ముందు కిరోసిన్‌తో హల్‌చల్

ఎస్టీలకు మంజూరు చేసిన పక్కాగృహాల పనులను వెంటనే ప్రారంభించాలని, లేకుంటే శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని ఎస్టీ సంఘం అధ్యక్షుడు ప్రభు హెచ్చరించాడు. ఆయన సోమవారం గ్రీవెన్స్‌డే ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో కలెక్టర్ కారును అడ్డుకున్నాడు. ఆగ్రహం చెందిన కలెక్టర్ కిరోసిన్ బాటిల్‌తో వచ్చి బెదిరింపులకు దిగడం పరిపాటిగా మారిందని, ఇలాంటి వాటిని ఉపేక్షించవద్దని, అరెస్టు చేయాలని పోలీసులను ఆదేశించారు. పోలీసులు ఎస్టీ సంఘం అధ్యక్షుడు ప్రభును స్టేషన్‌కు తరలించారు.



ప్రతిజ్ఞ

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తామని పలువురు అధికారులు సోమవారం సచివాలయంలో ప్రతిజ్ఞ చేశారు. అన్ని శాఖల కార్యదర్శులు, అదనపు కార్యదర్శులతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఇరై అన్బు ప్రతిజ్ఞ చేయించారు. –సాక్షి, చెన్నై

వ్యాపారికి బెదిరింపులు
- తమిళగ మున్నేట్ర కజగం నేత అరెస్టు



రంజిత్‌కుమార్

తిరువళ్లూరు: భవన నిర్మాణ పనులకు ఉపయోగించే పాత వస్తువులను తమకే విక్రయించాలని, లేని పక్షంలో రూ.5 లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడిన తమిళగ మున్నేట్ర కజగం నేత రంజిత్‌కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు. తిరువళ్లూరు జిల్లా పూందమల్లి సమీపంలోని తిరువేర్కాడుకు చెందిన సుబ్రమణ్యం కుమారుడు బాలాజీ కోళప్పంజేరి ప్రాంతంలో వీజీఎన్ ఇన్‌ఫ్రా సంస్థ ద్వారా భవన నిర్మాణ పనులు నిర్వహిస్తున్నాడు. ఇతను వెళ్లవేడు సమీపంలో గోదామును ఏర్పాటు చేసి అక్కడ భవన నిర్మాణ రంగానికి ఉపయోగించే వస్తువులను వుంచుతున్నాడు. ఈ నేపథ్యంలో పాత వస్తువులను విక్రయించాలని నిర్ణయించాడు. ఈ విషయం తెలుసుకున్న తమిళగ మున్నేట్ర కజగం జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ అక్కడికి చేరుకుని పాత సామగ్రి తనకు తక్కువ ధరకే విక్రయించాలని, లేనిపక్షంలో రూ.ఐదు లక్షలు ఇవ్వాలని బెదిరింపులకు దిగాడు. ఈ సంఘటనపై బాలాజీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లవేడు పోలీసులు కేసు నమోదు చేసి రంజిత్‌కుమార్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

నీటి తొట్టెలో పడి బాలిక మృతి

తిరుత్తణి: నీటి తొట్టిలో పడి మూడేళ్ల బాలిక మృతి చెందిన సంఘటన తిరుత్తణి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. అరక్కోణం తాలూకా గురువరాజుపేట గ్రామానికి చెందిన రమేష్ నేత కార్మికుడు. అతని భార్య మూడేళ్ల పాప నిరంజనతో తిరుత్తణి సమీపంలోని బుచ్చిరెడ్డిపల్లెలో బంధువుల ఇంట్లో నిశ్చితార్థం వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లింది. మధ్యాహ్నం ఇంటి వెనుక భాగంలో మూడేళ్ల చిన్నారి ఆడుకుంటూ అక్కడున్న నీటి తొట్టిలో పడిపోయింది. వెంటనే అక్కడున్న వారు చిన్నారిని కాపాడి తిరుత్తణి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు నిర్ధారించారు. తిరుత్తణి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ ఉద్యోగుల పోరుబాట

సాక్షి, చెన్నై: రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బంది మూడు రోజుల పాటు సమ్మెకు సిద్ధమయ్యారు. ఈ నెల 14, 15, 16 తేదీల్లో నిత్యావసర వస్తువుల పంపిణీని నిలుపుదల చేయనున్నామని వారు సోమవారం ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 35 వేల రేషన్ దుకాణాల్లో వేలాది మంది ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఇటీవల కాలంగా తనిఖీల పేరిట తమను అధికారులు వేధిస్తున్నారని, కింది స్థాయి అధికారులు తమను మోసం చేస్తున్నారని ఆరోపిస్తూ రేషన్ ఉద్యోగ, సిబ్బంది సంఘం మూడు రోజుల సమ్మెకు నిర్ణయించింది. దీంతో మూడు రోజులు నిత్యావసర వస్తువుల సరఫరా ఆగనుంది. దీంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై రాష్ట్ర పౌరసరఫరాల విభాగం దృష్టి పెట్టింది.

ఉరివేసుకుని పోలీసు ఆత్మహత్య

అన్నానగర్: తిరువారూర్‌లోని మన్నార్‌గుడి సమీపంలో సోమవారం ఉదయం పోలీసు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నిశ్చితార్థం జరగనున్న సమయంలో ఈ విషాదం చోటుచేసుకుంది. నాగై జిల్లా ఉప్పలయం ప్రాంతానికి చెందిన చందాన మారిముత్తు కుమారుడు ప్రవీణ్ కుమార్ (31) తిరువారూర్ జిల్లా మన్నార్గుడి తాలూకా పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం మన్నార్గుడి సమీపంలోని నలనల్లూరు గ్రామంలోని పొలంలో చెట్టుకు ఉరివేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మన్నార్గుడి తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రవీణ్‌కుమార్ మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రవీణ్ కుమార్ ఆత్మహత్యకు గల కారణాలేంటి? వారు దర్యాప్తు చేస్తున్నారు. వచ్చే 28న ప్రవీణ్ కుమార్ నిశ్చితార్థం జరగాల్సి ఉంది. ఈ క్రమంలో ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

బారికేడ్‌ను ఢీకొన్న బైక్
- ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

అన్నానగర్: బారికేడ్‌ను బైక్ ఢీకొనడంతో ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెదాడు. ఈ సంఘటన తిరుఇంగోయ్‌మలై సమీపంలోని కావేరి వంతెన వద్ద ఆదివారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ధర్మపురికి చెందిన దండపాణి కుమారుడు మథియాలగన్ (21), తంజావూరు జిల్లా పట్టుకోట్టైకి చెందిన అరుళ్ సాయి కుమారుడు శివ ప్రకాష్ (21) తిరుచ్చిలోని అన్నా యూనివర్సిటీ తిరుచ్చి క్యాంపస్‌లో సివిల్ ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. వీరు ఆదివారం రాత్రి ధర్మపురిలోని మథియాళగన్ ఇంటికి బైకులో బయలుదేరారు. తొట్టియమ్ సమీపం తిరుఇంగోయ్‌మలై సమీపంలోని కావేరి వంతెన వద్ద వస్తుండగా బైకు వంతెనపై ఏర్పాటుచేసిన బారికేడ్‌ను ఢీకొంది. మథియాలగన్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ ప్రకాష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని స్థానికులు తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ తీవ్ర చికిత్స పొందుతున్నాడు. తానియం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మథియళగన్ మృతదేహాన్ని ముసిరి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పెట్రోల్ క్యాన్లతో ప్రభుత్వ బస్సు డ్రైవర్, కండెక్టర్ ధర్నా



ప్రభుత్వ బస్సు ఎదుట పెట్రోల్ క్యాన్లతో ధర్నా చేస్తున్న డ్రైవర్, కండెక్టర్

వేలూరు: అధికారుల వేధింపులను నిరసిస్తూ ప్రభుత్వ బస్సు డ్రైవర్, కండెక్టర్ బస్సు ముందు పెట్రోల్ క్యాన్లతో ఆత్మహత్య చేసుకుంటామంటూ ధర్నా చేపట్టారు. వేలూరు జిల్లా పేర్నంబట్టులో ప్రభుత్వ పీఏటీసీ డిపో నడుస్తోంది. ఇక్కడి నుంచి వారంలో మూడు రోజులు ఉదయం 5 గంటలకు ప్రభుత్వ బస్సు చెన్నైకి బయలుదేరుతుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం బస్సును నడపాల్సిన పేర్నంబట్టు సమీపంలోని వేపంబట్టు గ్రామానికి చెందిన డ్రైవర్ దేవరాజ్, పల్లిగొండపట్టు గ్రామానికి చెందిన కండెక్టర్ బాబు రాలేదు. డిపో మేనేజర్ వెంకటేశన్ ఇద్దరికి ఫోన్ చేశారు. వారి నుంచి సమాధానం రాకపోవడంతో వేరే డ్రైవర్, కండెక్టర్‌ను విధులకు పంపారు. సోమవారం ఉదయం డ్రైవర్ దేవరాజ్, కండెక్టర్ బాబు విధులకు వచ్చారు. ఉన్న ఫలంగా బస్సు ముందు పెట్రోల్ క్యాన్లను పెట్టుకొని ధర్నా చేశారు. అధికారుల వేధింపుల కారణంగానే తాము సక్రమంగా విధులు నిర్వహించలేకపోతున్నామని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పేర్నంబట్టు ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్, వేలూరు రీజినల్ మేనేజర్ పాండియన్ అక్కడికి చేరుకుని వారితో చర్చించారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు.

బ్లేడుతో కండక్టర్ గొంతు కోసిన యువకుడి కోసం గాలింపు

తిరువొత్తియూరు: బ్లేడుతో కండక్టర్ గొంతు కోసిన యువకుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. చెన్నై చూలైమేడు మెహతా నగర్‌కు చెందిన జగదీశన్(56) సిటీ బస్సులో కండక్టర్‌గా పని చేస్తున్నాడు. అతను ఆదివారం రాత్రి ప్రభుత్వ బస్సు నెంబరు 59లో తిరువేర్కాడు నుంచి మింట్‌కు వెళ్తున్నాడు. చెన్నైలోని మూలకొత్తరం బస్టాప్‌లో యువకుడు(22) బస్సు ఎక్కాడు. కండక్టర్ అతన్ని టికెట్టు అడిగాడు. అతను తననే టికెట్ తీసుకోమంటావా అని కండెక్టర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహం చెంది కండెక్టర్‌ను బ్లేడ్‌తో గొంతు కోసి పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన జగదీశన్‌ను ప్రయాణికులు స్టాన్లీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి యువకుడి కోసం గాలిస్తున్నారు.

క్రీడాకారులకు అభినందనలు



దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా అథ్లెటిక్స్ 2023 పోటీల్లో తమిళనాడుకు చెందిన క్రీడాకారులు పతకాలను సాధించారు. చెన్నైకి చేరుకున్న క్రీడాకారులు సోమవారం క్రీడల శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను కలిశారు. తాము సాధించిన పతకాలను అందజేశారు. వారిని మంత్రి అభినందించారు. –సాక్షి, చెన్నై

తెలుగు విద్యార్థులకు నిరాశే
- అందని పాఠ్యపుస్తకాలు



నిరాశకు గురైన తెలుగు విద్యార్థులు

తిరుత్తణి: పాఠశాలలకు వేసవి సెలవులు ముగిసి బడులు తెరుచుకున్న తొలిరోజే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు సరఫరా చేసినా తెలుగు విద్యార్థులకు ఎప్పటిలాగే నిరాశ మిగిలింది. రాష్ట్రంలోని మైనారిటీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు సరఫరాలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. గత విద్యా సంవత్సరంలో పరీక్షలకు ముందు పాఠ్య పుస్తకాలు సరఫరా చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాత పుస్తకాలు, తమిళం, ఇంగ్లిష్ మీడియం పుస్తకాల సాయంతో తెలుగు విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సోమవారం పాఠశాలలు ప్రారంభం కావడంతో తొలిరోజు తెలుగు విద్యార్థులకు సైతం పుస్తకాలు అందుతాయని ఆశతో ఎదురుచూశారు. తెలుగు పుస్తకాలు ముద్రణలో ఆలస్యం చోటుచేసుకోవడంతో సరఫరా కాలేదని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దీంతో తిరువళ్లూరు జిల్లాలోని తిరుత్తణి, కేజీ.కండ్రిగ, అత్తిమాంజేరిపేట, పళ్లిపట్టు, పొదటూరుపేట, కీచ్చళం, నెడియం, కరింబేడు, నొచ్చిలి ప్రాంతాల్లోని ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల తెలుగు విద్యార్థులు బడులు తెరిచిన తొలి రోజే నిరాశకు గురికావాల్సి వచ్చింది.

రేషన్ దుకాణం ఉద్యోగి హత్య

తిరువొత్తియూరు: రేషన్ ఉద్యోగిని హత్య చేసిన అన్నదమ్ముల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరుచ్చి పుంగనూర్ కీల్ వీధికి చెందిన తమిళరసన్ (50) రేషన్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇతని సొంత ఊరు తిరుచ్చి జిల్లా లాల్గుడి పూవలూర్. ఇతనికి బంధువులు శరత్ కుమార్, రంజిత్‌కు మధ్య పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో తమిళరసన్‌పై శరత్ కుమార్, రంజిత్ ఆదివారం సాయంత్రం దాడి చేశారు. తమిళరసన్ అదే చోట కింద పడి మృతి చెందాడు. దీనిపై ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి రంజిత్ కుమార్, శరత్ కుమార్ కోసం గాలిస్తున్నారు.

కర్నూల్ మెడికల్ కాలేజీలో మల్టీ యుటిలిటీ సెంటర్

- రూ.15 కోట్లతో నిర్మించనున్న కేఎంసీజీటీ



ఎంవోయూ పత్రాలను మార్చుకుంటున్న డీఎంఈ నరసింహం, కేఎంసీజీటీ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: కర్నూల్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రాంగణంలో మల్టీ యుటిలిటీ సెంటర్ నిర్మాణానికి కర్నూల్ మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేట్ ట్రస్ట్(కేఎంసీజీటీ) ముందుకొచ్చింది. ఈ మేరకు మంగళగిరిలోని వైద్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు సమక్షంలో డీఎంఈ డాక్టర్ నరసింహం, కేఎంసీజీటీ ప్రతినిధులు ఎంవోయూ కుదుర్చుకున్నారు. రూ.15 కోట్ల అంచనాతో ఈ సెంటర్ నిర్మాణాన్ని ప్రారంభిస్తున్నట్లు కేఎంసీజీటీ ప్రతినిధులు తెలిపారు. అవసరమైతే మరిన్ని అదనపు నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సెంటర్‌లో 300 మంది సామర్థ్యంతో వర్చువల్ కాన్ఫరెన్స్ హాల్, డిజిటల్ లైబ్రరీ, ఇతర అధునాతన విద్యా మౌలిక సదుపాయాలు కల్పిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కేఎంసీజీటీ కార్యదర్శి డి.ద్వారకానాథ్‌రెడ్డి, కోశాధికారి డాక్టర్ మహేశ్‌కుమార్ పాల్గొన్నారు.

స్కిల్ హబ్స్ ద్వారా 3,333 మందికి ఉపాధి

- శిక్షణ పూర్తి చేసుకున్న 6,323 మంది
- 100శాతం ఉపాధి కల్పించిన జిల్లాగా పశ్చిమ గోదావరి రికార్డు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్‌లోపు విద్యార్థులకు నైపుణ్య శిక్షణ కోసం ప్రవేశపెట్టిన స్కిల్ హబ్స్ మంచి ఫలితాలు ఇస్తున్నాయి. ప్రతి శాసన సభ నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ కచ్చితంగా ఉండేలా, నగరాలు, పట్టణాల్లో కలిపి మొత్తం 192 స్కిల్ హబ్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇప్పటి వరకు శిక్షణ కోసం 15,559 మంది నమోదు చేసుకున్నారు. వారిలో ఇప్పటికే 8,266 మంది శిక్షణ పొందగా, 6,323 మంది తుది పరీక్షల్లో ఉత్తీర్ణులైనట్లు ఏపీఎస్ఎస్‌డీసీ అధికారులు వెల్లడించారు. ఉత్తీర్ణులైన వారిలో 3,333 మందికి వివిధ సంస్థల్లో ఉపాధి లభించిందని, మిగిలిన విద్యార్థుల ప్లేస్‌మెంట్స్ ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉపాధి కల్పనలో పశ్చిమ గోదావరి జిల్లా 100 శాతంమందికి ప్లేస్‌మెంట్స్ కల్పించడం ద్వారా మొదటి స్థానంలో నిలిచింది. తర్వాతి స్థానాల్లో నంద్యాల 93శాతం, ఎన్టీఆర్ 91 శాతం, చిత్తూరు, పల్నాడు జిల్లాలు 88 శాతం చొప్పున ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలోని స్కిల్ హబ్స్‌లో మొత్తం 287 బ్యాచుల్లో 7,293 మంది శిక్షణ పొందుతున్నారు.

బీజేపీ.. ఏపీలో టీ–బీజేపీగా మారింది..

అమిత్ షా ప్రసంగంతో టీడీపీలో ఎక్కువ సంబరాలు

- విశాఖలో అమిత్‌షా, శ్రీకాళహస్తిలో నడ్డా వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం
- స్టీల్‌ప్లాంట్, ప్రత్యేక హోదా, విభజన హామీలపై మాట్లాడతారని అందరూ అనుకున్నారు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో భాగమే మా బంధం
- వారు ఎంత గౌరవిస్తే.. మేమూ అంతే గౌరవిస్తాం
- ఒక్క ఎంపీ కూడా లేనివారు 20 ఎంపీలు ఎలా ఆశిస్తారు?
- అమిత్ షా వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన మంత్రి గుడివాడ అమర్‌నాథ్

సాక్షి, విశాఖపట్నం/కంచరపాలెం: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ టీ–బీజేపీ (తెలుగుదేశం-బీజేపీ)గా మారిపోయిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. విశాఖలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, శ్రీకాళహస్తిలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా రాష్ట్ర ప్రభుత్వం మీద, తమ పార్టీ నేతల పైన విమర్శలు చేస్తుంటే రాష్ట్ర బీజేపీ నాయకుల కంటే టీడీపీ నేతలు, ఎల్లో మీడియా వారు ఎక్కువ సంబరాలు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర బీజేపీ నేతల వ్యాఖ్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నగరంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సంక్షేమ పథకాలకు కేంద్రం నుంచి నిధులు పంపిస్తుంటే.. వీళ్ల ఫొటోలు పెట్టుకుంటున్నారని.. విశాఖలో సంఘ విద్రోహక శక్తులు ఉన్నాయని చేసిన విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు అమర్‌నాథ్ చెప్పారు. విశాఖ సభలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ, రాష్ట్ర విభజన అంశాలు, ప్రత్యేక హోదాపై మాట్లాడతారని రాష్ట్ర ప్రజలంతా అనుకుంటే.. కేంద్ర పథకాలపై రాష్ట్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఫొటో వేసుకుంటున్నారని మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ, బీజేపీ ప్రభుత్వాల మధ్య బంధం కేంద్ర, రాష్ట్ర సంబంధాలేనని.. వారు మాకు ఏ విధమైన గౌరవం ఇస్తారో.. తాము అలాగే ఇస్తామన్నారు. అమర్‌నాథ్ ఇంకా ఏమన్నారంటే..

వీటిపై ఎందుకు మాట్లాడలేదు?

విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి అమిత్ షా ఎందుకు మాట్లాడలేదు? విభజన చట్టంలో వున్న మేరకే కేంద్రం విద్యా సంస్థలను ఏపీకి ఇచ్చింది. అంతకంటే ఏమీ ఇవ్వలేదు. బీజేపీ–టీడీపీలు కలిసి పనిచేసినప్పుడు కేంద్రం నుంచి వచ్చిన డబ్బు ఏమైంది? బీజేపీ నేతృత్వంలో ఏర్పాటైన రాష్ట్రాల్లో అభివృద్ధి చెందిన నగరాలే రాజధానులయ్యాయి.. అలాంటప్పుడు వైజాగ్‌ను రాజధాని చేస్తే తప్పేంటి? ఏపీలో కనీసం ఒక్క సీటులేని బీజేపీ 20 సీట్లు ఎలా ఆశిస్తుంది?

అన్ని రాష్ట్రాల్లాగే ఏపీ కూడా..

గడిచిన నాలుగేళ్లలో ఇసుక ద్వారా దాదాపు రూ.4 వేల కోట్ల ఆదాయాన్ని ప్రభుత్వం ఆర్జించింది. కానీ, టీడీపీ హయాంలో ఈ ఆదాయమంతా జన్మభూమి కమిటీలు, పచ్చ తమ్ముళ్ల జేబుల్లోకి వెళ్లినప్పుడు ఇదే బీజేపీ ఎందుకు ప్రశ్నించలేకపోయింది? మరో 9 నెలల్లో రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాన్ని విమర్శిస్తే లాభపడొచ్చనే ఆలోచనలో బీజేపీ అధినాయకులు ఉన్నట్లు అర్థమవుతోంది. వారి ప్రయత్నాలన్నీ వృథా అవుతాయి. కేంద్ర నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని నిరూపించగలరా? రాష్ట్రంలో 65 లక్షల మందికి ప్రభుత్వం పెన్షన్ ఇస్తుంటే.. ఇందులో గోరంత మాత్రమే కేంద్ర ప్రభుత్వ వాటా ఉందన్న విషయాన్ని లెక్కలతో సహా స్పష్టంచేశాం. దేశంలో అన్ని రాష్ట్రాలతో పాటుగానే కేంద్రం ఏపీకి ఇస్తోంది తప్ప అదనంగా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. నిజానికి.. కేంద్ర ప్రభుత్వ వైఖరితో విశాఖ రైల్వేజోన్, ప్రత్యేక హోదా, పోలవరం, స్టీల్ ప్లాంట్ విషయాలలో రాష్ట్ర ప్రజలు మోసపోయారు. రాష్ట్ర విభజన సమయంలో వెనకబడిన ప్రాంతాలకు ఇస్తామన్న రూ.350 కోట్లు ఏమయ్యాయి?

టీ–బీజేపీ నేతలిచ్చిన స్క్రిప్ట్‌నే చదివిన అమిత్ షా

విశాఖ సభలో అమిత్ షా చుట్టూ కూర్చున్న వారంతా టీ–బీజేపీ (బీజేపీలోని టీడీపీ నేతలు) నాయకులే. వారిచ్చిన స్క్రిప్ట్‌నే ఆయన చదివి వినిపించారు. బాబు హయాంలో అమరావతిలో జరిగిన స్కాముల గురించి చెప్పాలని అమిత్ షాకు అనిపించలేదా? తిరుపతిలో అమిత్ షాపై రాళ్లు వేయించిన చంద్రబాబును అక్కున చేర్చుకోవాలని అనిపిస్తోందా?

టీడీపీ ట్రాప్‌లో బీజేపీ



తెలుగుదేశం పార్టీ ట్రాప్‌లో బీజేపీ పడిందని టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. విశాఖలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ నేతలు కాషాయ కండువాలు తీసేసి పచ్చ కండువాలు వేసుకోవాలని ఎద్దేవా చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలుగా అన్యాయం చేసిన బీజేపీకి ఏపీలో మాట్లాడే అర్హతలేదన్నారు. ఆదివారం అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై సుబ్బారెడ్డి మండిపడ్డారు. సీఎం జగన్‌ను విమర్శించేందుకే తొమ్మిదేళ్ల విజయోత్సవ సభను నిర్వహించినట్లుందని ఆయన ఆరోపించారు.

– వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి

ఐటీ రిటర్న్స్ పేరిట మోసాలు..!

తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: సుజయ్.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటర్న్స్ ఫైల్ చేయాలంటూ అతడికి ఓ ఈ మెయిల్ వచ్చింది. అందులో 'మీరు రూ. 41,542 ఓవర్ డ్యూ రీఫండ్‌కు అర్హులు, కాకపోతే మీ అకౌంట్ వివరాల్లో తప్పులు ఉన్నాయి. వాటిని సరి చేసుకునేందుకు వెంటనే మేం పంపిన ఈ మెయిల్‌లో లింక్‌పై క్లిక్ చేసి, వివరాలు నమోదు చేయండి'అని ఉంది. అది ఆదాయపన్నుశాఖ నుంచి వచ్చిన ఈ–మెయిలని సుజయ్ భావించాడు. ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారిక లోగో, భారత ప్రభుత్వ ఆదాయ పన్నుశాఖ అని వివరాలు ఉండటంతో నమ్మేశాడు. కానీ.. నిశితంగా పరిశీలించి ఈ–మెయిల్ వచ్చిన అడ్రస్ మరేదో ఉండడంతో ఖంగుతిన్నాడు. వెంటనే విషయాన్ని అధికారుల దృష్టికి తెచ్చాడు. కేవలం సుజయ్‌కే కాదు.. అనేకమందికి సైబర్ మోసగాళ్లు ఆదాయ పన్నుశాఖ పంపుతున్నట్టుగా ఈ–మెయిల్స్ పంపి మోసాలు చేస్తున్నట్టు పోలీసులు హెచ్చరిస్తున్నారు. పన్ను చెల్లింపుల పేరిట వచ్చే ఏ ఈ–మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు నమ్మవద్దని, అధికారిక వెబ్ సైట్ ద్వారానే వివరాలు పొందాలని సూచిస్తున్నారు.


మోసపూరిత ఈ–మెయిల్స్ వస్తే ఏం చేయాలి?

➤ ఆదాయపన్ను చెల్లింపు పేరిట వచ్చే నకిలీ ఈ–మెయిల్స్‌ను గుర్తించేందుకు ముందుగా మనకు వచ్చిన ఈ మెయిల్‌లో పంపిన వారి మెయిల్ అడ్రస్‌ను నిశితంగా పరిశీలించాలి.

➤ అది మోసపూరిత ఈ–మెయిల్ అని భావిస్తే.. ఈ మెయిల్స్‌లోని లింక్‌లపై ఎట్టిపరిస్థితుల్లోనూ క్లిక్ చేయకూడదు. మన బ్యాంకు ఖాతా, ఫోన్ నంబర్, ఆధార్‌నంబర్ సహా ఇతర ఏ వివరాలు పంచుకోవద్దు.

6 రౌండ్లలో జోసా–2023 కౌన్సెలింగ్

- 19 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రాథమిక కీ విడుదల
- అభ్యంతరాల స్వీకరణ
- 18న తుది కీ, ఫలితాల ప్రకటన
- అనంతరం కౌన్సెలింగ్
- 30న మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు
- జూలై 26తో కౌన్సెలింగ్ పూర్తి



సాక్షి, అమరావతి: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లు, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)లు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ)లు, తదితర జాతీయ విద్యాసంస్థల్లో ప్రవేశానికి జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 19 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి ఆరు రౌండ్లలో సీట్ల కేటాయింపు ప్రక్రియను నిర్వహించనున్నారు. సీట్ల మిగులును అనుసరించి అవసరమైతే స్పెషల్ రౌండ్ నిర్వహణపై నిర్ణయం తీసుకోనున్నారు. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించిన వారికి ప్రతిభ, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించనున్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్ ప్రాథమిక కీ విడుదల

కాగా జేఈఈ అడ్వాన్స్‌డ్–2023 పరీక్షల ప్రాథమిక కీని ఐఐటీ గౌహతి ఆదివారం రాత్రి విడుదల చేసింది. వీటిపై అభ్యంతరాలను సోమవారం రాత్రి వరకు స్వీకరించారు. వీటిని పరిష్కరించి తుది కీని, ఫలితాలను ఈ నెల 18న ప్రకటించనున్నారు. అనంతరం సీట్ల కేటాయింపునకు జోసా కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. అడ్వాన్స్‌డ్‌లో అర్హత సాధించినవారు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు ఈ నెల 19న రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆప్షన్ల నమోదు అనంతరం ముందుగా రెండుసార్లు మాక్ సీట్లను కేటాయిస్తారు. అభ్యర్థులకు ఆప్షన్ల నమోదులో అవగాహన కల్పించాక తొలి రౌండ్‌లో అధికారికంగా సీట్లు సాధించినవారి జాబితాను ఈ నెల 30న ప్రకటిస్తారు. ఆర్కిటెక్చర్, ప్లానింగ్ విభాగం అభ్యర్థులకు ఆర్కిటెక్చర్ ఆప్టిట్యూడ్ టెస్టు (ఏఏటీ)లో మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయిస్తారు (జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల అనంతరం ఈ నెల 21న ఏఏటీ నిర్వహించి 24న వాటి ఫలితాలు ప్రకటించనున్నారు. ఆ తేదీ నుంచి అభ్యర్థులు తమ ఆప్షన్లను నమోదు చేయాల్సి ఉంటుంది.)

ఈసారి పోటీ ఎక్కువే..

కాగా జోసా కౌన్సెలింగ్‌లో అభ్యర్థులు భారీగా పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈసారి జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ఎక్కువ మంది రాయడమే ఇందుకు కారణం. మెయిన్ పరీక్ష 11,13,325 మంది రాశారు. వీరిలో 2.5 లక్షల మందిని అడ్వాన్స్‌డ్ పరీక్షకు ఎంపిక చేయగా 1.95 లక్షల మంది పరీక్షకు హాజరయ్యారు. ఈనెల 18న వెలువడే అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అర్హత సాధించే అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఈసారి ఐఐటీలు, ఎన్ఐటీలు, ఐఐఐటీలు, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సంస్థలు (జీఎఫ్ఐటీ)ల్లో దాదాపు 55 వేల వరకు సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఐఐటీల్లో 16,598, ఎన్ఐటీల్లో 23,994, ఐఐఐటీల్లో 7,126, జీఎఫ్ఐటీల్లో 6,759 ఉన్నాయి. అయితే సీట్ల సంఖ్యను జోసా అధికారులు విడుదల చేశాక తుది సంఖ్య తేలనుంది. వీటికి అదనంగా ఐఐటీల్లో మహిళలకు సూపర్ న్యూమరరీ సీట్లు కూడా అందుబాటులో ఉంటాయి.

జోసా షెడ్యూల్ ఇలా..

ప్రక్రియ	తేదీ
రిజిస్ట్రేషన్	జూన్ 19
ఆప్షన్ల నమోదు	24 వరకు
మాక్ సీట్ల కేటాయింపు-1	25
ఆప్షన్ల సవరణ	26
మాక్ సీట్ల కేటాయింపు-2	27
చాయిస్‌ల నమోదు (ఆటో సిస్టమ్ లాక్)	28
అభ్యర్థులు తమ వివరాల పునఃపరిశీలన	29
మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు	30
రెండో రౌండ్ సీట్ల కేటాయింపు	జూలై 6
మూడో రౌండ్ సీట్ల కేటాయింపు	జూలై 12
నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు	జూలై 16
ఐదో రౌండ్ సీట్ల కేటాయింపు	జూలై 21
ఆరో రౌండ్ సీట్ల కేటాయింపు	జూలై 26
ఎన్ఐటీ సీట్ల కేటాయింపు, విత్‌డ్రా	జూలై 26-28

సల్ఫర్ పక్కనే అమ్మోనియం నైట్రేట్..?

- భద్రత మరిచిన విశాఖ పోర్టు యాజమాన్యం
- అనుభవం లేని సంస్థకు అమ్మోనియం నైట్రేట్ హ్యాండ్లింగ్
- పోర్టు సిబ్బంది అడ్డగోలుగా వ్యవహరించారన్న ఆరోపణలు
- పక్కనే సల్ఫర్ ఉన్నా.. సరిగా నిర్వహణ చేయని వైనం



సల్ఫర్ నిల్వల పక్కనే అమ్మోనియం నైట్రేట్ హ్యాండ్లింగ్ చేస్తున్న వైనం

సాక్షి, విశాఖపట్నం: లెబనాన్ రాజధాని బీరూట్‌లో నిల్వ ఉంచిన అమ్మోనియం నైట్రేట్ భారీ విస్ఫోటన ఘటన జరిగి మూడేళ్లు గడుస్తున్నా.. ఇంకా యావత్ ప్రపంచం కళ్లముందే ఆ విషాద ఉత్పాతం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే అమ్మోనియం నైట్రేట్ రవాణా, నిల్వలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. అనుభవం ఉన్న వారితోనే హ్యాండ్లింగ్, నిల్వ చేయించాలని మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ విశాఖ పోర్టు అధికారులకు మాత్రం ఇవేమీ చెవికెక్కినట్లుగా లేవు. నగరానికి చేరుకున్న సరకును అనుభవం లేని ఓ సంస్థతో రవాణా చేయించడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. పైగా అత్యంత ప్రమాదకరమైన సల్ఫర్ పక్కనే దీనికి బెర్తింగ్ ఇవ్వడం గమనార్హం.

నగర భద్రతపై నిర్లక్ష్యం

పేలుడు గుణాలు అధికంగా ఉండే అమ్మోనియం నైట్రేట్‌ని చాలా జాగ్రత్తగా రవాణా, నిల్వ చేయాలి. ఏమాత్రం అనుభవం లేకపోయినా.. అజాగ్రత్తగా ఉన్నా పెను ప్రమాదం సంభవిస్తుంది. లెబనాన్ రాజధాని బీరూట్‌లో నిల్వ ఉంచిన 2,750 టన్నుల అమ్మోనియం నైట్రేట్ పేలుడు అణుబాంబుని తలపించింది. అప్పటి నుంచి అమ్మోనియం నైట్రేట్ హ్యాండ్లింగ్, నిల్వలపై ప్రభుత్వాలు ఆంక్షలు కఠినతరం చేశాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా 90 రోజుల్లో హ్యాండ్లింగ్, రవాణా పూర్తి చేసేలా ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) నిబంధనలు విధించింది. ఇవేమీ పట్టనట్లు విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ) వ్యవహరించింది. నగర భద్రత పై ఏమాత్రం బాధ్యత లేనట్లుగా.. అమ్మోనియం నైట్రేట్ లోడింగ్, అన్‌లోడింగ్‌పై ఏమాత్రం అనుభవం లేని ఓ స్టీవడోర్‌కు హ్యాండ్లింగ్ బాధ్యతని అప్పగించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.

లైసెన్స్ వచ్చాక మొదటిసారిగా..

మూడు రోజుల క్రితం విశాఖ పోర్టుకు ఎంవీ ఈగల్ ట్రేడర్ అనే కార్గో షిప్ 16,544 మెట్రిక్ టన్నుల అమ్మోనియం నైట్రేట్‌తో చేరుకుంది. అయితే దీని హ్యాండ్లింగ్ బాధ్యతని అనుభవం ఉన్నవారికి అప్పగించాలి. కానీ విదేశీ ఏజెన్సీ.. ఇక్కడ ఎలాంటి అనుభవం లేని స్టీవడోర్‌కు బాధ్యతలు కట్టబెట్టారు. పోర్టు అధికారులు స్టీవడోర్‌కు లైసెన్స్‌ను ఏడు నెలల క్రితం ఇచ్చారు. అయితే ఇప్పటి వరకూ ఏ విధమైన కార్గోని సదరు సంస్థ హ్యాండ్లింగ్ చెయ్యలేదు. ఒక్క మెట్రిక్ టన్ను సరకు హ్యాండ్లింగ్ కూడా నిర్వహించని ఈ కొత్త సంస్థకు.. అత్యంత ప్రమాదకరమైన అమ్మోనియం నైట్రేట్ హ్యాండ్లింగ్ బాధ్యతని అప్పగించేశారు. అయితే సల్ఫర్ నిల్వలు కూడా ఉన్న నేపథ్యంలో అత్యంత ప్రమాదకరమైన దీని హ్యాండ్లింగ్ బాధ్యతని అనుభవం ఉన్న సంస్థలకు అప్పగించకుండా.. కొత్తవారికి ఇవ్వడం వెనుక పోర్టు అధికారుల హస్తం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పక్కపక్కనే సల్ఫర్, అమ్మోనియం నైట్రేట్

పోర్టులో ఉన్న వెస్ట్ క్యూ 6 బెర్త్ చాలా చిన్నది. ఈ బెర్త్‌లో ఇప్పటికే ప్రమాదకరమైన సల్ఫర్ లోడుతో ఒక కార్గో షిప్ మూడు రోజుల క్రితం పోర్టుకు చేరుకుంది. దాన్ని పోర్టులోనే నిల్వ చేసి ఉంచారు. దాని పక్కనే అమ్మోనియం నైట్రేట్ హ్యాండ్లింగ్‌కు అనుమతి ఇవ్వడం అత్యంత ప్రమాదకరమైన విషయం. పొరపాటున ఈ రెండు కలిస్తే.. జరిగే విధ్వంసం ఊహకందనిది. ఈ విషయం తెలిసి కూడా.. పోర్టు ట్రాఫిక్ అధికారులు ఇలా ఒకే బెర్త్ వద్ద.. రెండు ప్రమాదకరమైన కార్గోలకు గుడ్డిగా అనుమతివ్వడం.. నగర ప్రజల భద్రతకు సంబంధించిన అంశంపై పోర్టు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై.. సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరపాలని కార్మిక సంఘాలు సైతం డిమాండ్ చేస్తున్నాయి. అయితే నిబంధనల మేరకే వ్యవహరించామని పోర్టు అధికారులు చెప్పడం గమనార్హం.

తగ్గిన మామిడి ఎగుమతులు

సరైన ధర లేక నష్టపోతున్న రైతులు



మంగుతెగులు సోకిన మామిడి కాయలు

చింతలపూడి: మామిడి పరిశ్రమ ఈ సంవత్సరం సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అకాల వర్షాలు, వడగళ్లు, మంచు, మంగు తెగులు వంటి కారణాల వల్ల మామిడి పరిశ్రమ ఈ ఏడాది చిక్కుల్లో పడింది. మామిడి ఎగుమతుల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ప్రథమస్థానం ఆక్రమించిన చింతలపూడి ప్రాంతంలో ఈ ఏడాది వ్యాపారం మందగించింది. ఆశించిన స్థాయిలో ఎగుమతులు లేదు. కాయ దిగుబడి ఉన్నా నాణ్యత లోపించడంతో ఎగుమతులు తగ్గాయి. కాయ ఆకర్షణీయమైన సైజుకు ఎదిగేవరకూ చెట్టుమీదే ఆపడానికి రైతులకు ధైర్యం సరిపోయే పరిస్థితులు లేవు. అకస్మాత్తుగా ఏ గాలిదుమ్మో, వడగళ్ళ వానో వస్తే మరింత నష్టపోవాల్సి వస్తుందని ఆందోళన చెందిన రైతులు ఈ ఏడాది ముందుగానే కోతలు ప్రారంభించారు. గతంలో ఏప్రిల్, మే నెలల్లో రోజుకు 25 లారీల సరుకు ఎగుమతి చేసేవారు. గత రెండేళ్ళుగా ఆశించిన స్థాయిలో ఎగుమతి చేయలేక పోయామని వ్యాపారులు వాపోతున్నారు. ప్రతి ఏటా 20 వేల టన్నుల మామిడి పంట ఈ ప్రాంతం నుంచి కోల్‌కతా, నాగపూర్, గుజరాత్, హైదరాబాద్, పూనే, అహ్మదాబాద్, ఢిల్లీ, కాన్పూర్, ఒడిశా వంటి రాష్ట్రాలకు ఎగుమతయ్యేవి. ఈ ఏడాది సీజన్ ముగింపు దశకు వచ్చినా 5 వేల టన్నులు కూడ ఎగుమతి చేయలేక పోయామంటున్నారు.

టన్ను రూ.12 వేలే..

ఈ ఏడాది ప్రారంభంలో టన్ను రూ.లక్ష ఉన్న మామిడి కాయల ధర హఠాత్తుగా పడిపోయింది. ప్రస్తుతం టన్ను మామిడి కాయలు రూ.12 వేల వరకు ఉంది. ఇప్పుడు మార్కెట్‌కు వస్తున్న కాయకు మంగు ఉండటంతో వ్యాపారులు వీటిని ఎగుమతి చేయడానికి ఇష్టపడటంలేదు. ఎగుమతికి సిద్ధం చేసిన కాయలు కూడ పండిపోతున్నాయని, కుళ్ళిపోయి పురుగులు కూడ పడుతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో తగ్గిన విస్తీర్ణం

ఉమ్మడి జిల్లాలో అన్ని రకాల ఉద్యాన పంటలు కలిపి 1,08,300 హెక్టార్లలో ఉన్నాయి. ఒకప్పుడు జిల్లాలో లక్షలాది ఎకరాల్లో విస్తరించి ఉండే మామిడి తోటలు ప్రస్తుతం బాగా తగ్గిపోయాయి. అధిక భాగం మామిడి తోటలను తొలగించి రైతులు పామాయిల్ తోటలు వేసుకున్నారు. మామిడి స్థానంలో ఇప్పుడు జిల్లాలో 44 వేల హెక్టార్లలో పామాయిల్ ఆక్రమించింది. జిల్లాలో చింతలపూడి, నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, ద్వారకా తిరుమల, నల్లజర్ల, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, లింగపాలెం, కామవరపుకోట ప్రాంతాల్లో సుమారు 15 వేల హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మామిడి తోటల అభివృద్ధికి ప్రభుత్వం అనేక రాయితీలు అందిస్తుంది. రైతులకు మరింత ప్రోత్సాహం అందించి అవగాహన కల్పించకపోతే భవిష్యత్తులో మామిడి అంతరించిపోయే ప్రమాదం ఉంది.

మామిడి రైతులను ఆదుకోవాలి



ప్రభుత్వం మామిడి రైతులను మరింత ప్రోత్సహించాలి. శీతల గిడ్డంగులు నిర్మించి మార్కెటింగ్ సదుపాయం కల్పించాలి. అకాల వర్షాలు, ఈదురు గాలుల కారణంగా కాయ రాలిపోయి నష్టం వచ్చింది.

–తాండ్ర రామకృష్ణరావు, రైతు, చింతలపూడి మండలం

మంగు తెగులుతో నష్టపోయాం



ఈ ఏడాది వ్యాపారంలో నష్టపోయాం. మంగు తెగులు కారణంగా ఎగుమతులు మందగించాయి. ప్రారంభంలో టన్ను లక్ష వరకూ ఉన్న ధర ప్రస్తుతం రూ.12 వేలు ఉంది.

–చిక్కాల సుధాకర్, మామిడి కమిషన్ వ్యాపారి, చింతలపూడి

క్లిక్.. అమౌంట్.. ఓకే

- అంతా ఆన్‌లైన్ లావాదేవీలు
- జిల్లా జనాభా 32 లక్షలు
- స్మార్ట్ ఫోన్ యూజర్లు సుమారు 6 లక్షలు
- డిజిటల్ లావాదేవీలు 55 శాతం
- తక్కువ సమయంలోనే నగదు బదిలీలు
- పారదర్శకతోపాటు అకౌంటబులిటీ

➤ నెల్లూరు నగరం రామలింగాపురంలోని నాగేశ్వరరావు ఇంటికి ఇటీవల ఓ మధ్యాహ్నం సమయంలో అనుకోకుండా బంధువులు వచ్చారు. వారికి భోజనం పెట్టాలి. సమయానికి తగినన్ని కూరగాయలు కూడా లేవు. ఏం చేయాలో ఆ ఇల్లాలికి పాలు పోలేదు. భర్తతో అదే విషయం చెప్పింది. వెంటనే ఆమెను కంగారు పడొద్దని చెప్పి జొమాటోలో చికెన్ బిర్యానీ ఆర్డర్ చేశారు. 15 నిమిషాల్లో డెలివరీ బాయ్ వచ్చి ఘుమఘుమలాడే బిర్యానీ అందజేశాడు.

➤ కావలికి చెందిన అనసూయమ్మ కొత్తగా ఇల్లు నిర్మించుకుంది. బాగా ఖర్చు చేసి గోడలకు పెయింట్ వేయించుకున్నా ఆమెకు అంతగా నచ్చలేదు. స్నేహితురాళ్ల సూచనతో ఆన్‌లైన్ పోర్టల్ అమెజాన్‌లో తనకు నచ్చిన కలర్స్, డిజైన్స్ ఎంపిక చేసుకుని వాల్‌పేపర్లు ఆర్డర్ చేసింది. రెండు రోజుల్లో పార్శిల్ డెలివరీ వచ్చింది. వాటిని పనివాళ్లతో గోడలకు అంటించుకోవడంతో రిచ్ లుక్ వచ్చింది.

సాక్షి, నెల్లూరు డెస్క్

ఇలా ఒకరిద్దరే కాదు.. స్మార్ట్ ఫోన్ వాడుతున్న చాలామంది ఉన్న చోటు నుంచి కదలకుండా తమకు కావాల్సిన వస్తువులను డిజిటల్ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి తెప్పించుకుంటున్నారు. స్మార్ట్ ఫోన్‌లో డేటా బ్యాలెన్స్ ఉండి.. బ్యాంక్ అకౌంట్‌లో డబ్బు ఉంటే చాలు ఎక్కడికి వెళ్లినా కావాల్సినవి కొనుగోలు చేయొచ్చు. యూనిక్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ యాక్సెస్ ఉన్న గూగుల్ పే, పేటీఎం, ఫోన్‌పే తదితర వాటి ద్వారా చెల్లింపులు భారీగా జరుగుతున్నాయి. చాలామంది ఇంట్లో నుంచే బస్సు, రైలు, విమాన టికెట్లు బుక్ చేసుకుంటున్నారు. నేరుగా కరెన్సీ నోట్ల ద్వారా క్రయవిక్రయాలు బాగా తగ్గిపోతున్నాయి.

పెరుగుతున్న డిజిటల్ ప్రాధాన్యత

ఆన్‌లైన్ లావాదేవీలు అంటే కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా జరిగే నగదు బదిలీలు. ఇలా చేయడం వల్ల అకౌంటబులిటీ ఉంటుంది. ఎవరి ఖాతా నుంచి ఎవరి ఖాతాకు ఎంత మేరకు నగదు బదిలీ అవుతోందో స్పష్టమవుతుంది. అంతా పారదర్శకంగా ఉంటుంది. దేశంలో మూడేళ్లుగా ఆర్థిక లావాదేవీల్లో అధిక శాతం డిజిటల్ రూపంలోనే సాగుతున్నాయి. తొలుత పట్టణాలకే పరిమితమైన 'ఈ' లావాదేవీలు గ్రామీణ ప్రాంతాల్లో ముఖ్యంగా ఇంటింటికీ వెళ్లి కాయగూరలు అమ్మే మహిళలు సైతం డిజిటల్ లావాదేవీలకు అలవాటు పడ్డారంటే పరిస్థితి అర్థమవుతోంది.



యూఐడీఏఐ (యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) లెక్కల ప్రకారం నెల్లూరు జిల్లా జనాభా సుమారు 32 లక్షలు. వీరిలో దాదాపు 14 లక్షల మంది మొబైల్ ఫోన్లు వినియోగిస్తున్నట్లు అంచనా. ఇందులో దాదాపు 43 శాతం అంటే ఇంచుమించు 6 లక్షల మంది వరకు స్మార్ట్ ఫోన్లు కలిగి ఉన్నారు. వీరంతా ఆన్‌లైన్ ద్వారానే ఆర్థిక లావాదేవీలు చేస్తున్నారని బ్యాంకింగ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కరోనా తర్వాత ఈ తరహా లావాదేవీలు ఎక్కువయ్యాయి. బ్యాంకుకు వెళ్లి నగదు విత్‌డ్రా చేయడం ప్రస్తుతం బాగా తగ్గిపోయింది. ఇంటి నుంచే కంప్యూటర్ లేదా మొబైల్ ద్వారా నిమిషాల్లోనే నగదు బదిలీలు జరుగుతున్నాయి. ఈ డిజిటల్ లావాదేవీలు ప్రస్తుతం 55 శాతం వరకు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది.

స్విగ్గీ, జొమాటోల ఆధిపత్యం

జిల్లాలో ఆహారం సరఫరా చేసే ఆన్‌లైన్ యాప్‌లలో స్విగ్గీ, జొమాటోలు మార్కెట్‌లో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. హెచ్ఎస్‌బీసీ గ్లోబల్ రీసెర్చ్ నివేదిక ప్రకారం 2022 సంవత్సరంలో తెలుగు రాష్ట్రాల్లో 55 శాతం వాటాను జొమాటో కలిగి ఉంది. 40 శాతం వాటా స్విగ్గీ సొంతం. మిగిలిన 5 శాతం వాటా ఇతర యాప్‌లదే. ఇవి వినియోగదారులకు నేరుగా ఆహారాన్ని అందించి రెస్టారెంట్ల నుంచి భారీగానే కమీషన్లు తీసుకుంటున్నాయి. ఈ సొమ్ముతోనే స్టాఫ్ జీతాలు, ఆఫీసుల నిర్వహణకు ఖర్చు చేస్తుంటాయి.

ఏ వస్తువు కావాలన్నా..

ప్రస్తుతం నేరుగా వెళ్లి షాపింగ్ చేసేవాళ్లు తగ్గిపోతున్నారు. ఒకప్పుడు ఏ వస్తువు కావాలన్నా మూడు, నాలుగు దుకాణాలకు వెళ్లి కొనుగోలు చేసేవారు. నేడు ఆ పరిస్థితిలో మార్పు వచ్చింది. వస్తువులను ఒకటికి నాలుగు ఈ–కామర్స్ యాప్‌లలో చూసి.. రేట్లను బేరీజు వేసుకుని రేటింగ్స్ చూసి కొంటున్నారు. నిత్యావసర వస్తువులు, కూరగాయలు కూడా ఆర్డర్ పెట్టగానే గంటల్లోనే ఇంటికి చేరుస్తున్నారు. దీంతో దుకాణాల్లో వ్యాపారం గతంతో పోల్చుకుంటే బాగా తగ్గింది. దుస్తులను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేవారు అధికమయ్యారు. ఆయా ఈ–కామర్స్ సంస్థలు వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్స్ ఇస్తూ పోటీ పడుతున్నాయి.

ఆన్‌లైన్ మనీ ట్రాన్స్‌ఫర్

దుకాణానికి వెళ్లి వస్తువు కొని నగదు ఇవ్వడం.. చిల్లర కోసం ఎదురు చూడడం.. డబ్బు సరిపోకపోతే మళ్లీ ఇంటికి రావడం.. ఆ రోజులు ఇప్పుడు దాదాపుగా లేవు. ఒక్క క్లిక్‌తో మనీ ట్రాన్స్‌ఫర్ చేసి ఆహారం తినొచ్చు. టీ తాగొచ్చు. నచ్చిన వస్తువు కొనుక్కోవచ్చు. అవును కాలం ఎంతో వేగంగా మారిపోయింది. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా.. బ్యాంక్ అకౌంట్‌లో నగదు ఉంటే చాలు. స్మార్ట్ ఫోన్‌లోని ఫోన్‌పే, గూగుల్ పే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా సులువుగా లావాదేవీలు చేసేయొచ్చు. ఆన్‌లైన్ బ్యాంకింగ్‌లో లెక్కలు పక్కాగా ఉంటాయి.



పేడతో కళాకృతులు తయారు చేస్తూ...

భలే... పేడ కళ

'ఇంకేం మిగిలింది పేడ' అని వ్యంగ్యంగా అనవచ్చు. పేడ విలువ మన పూర్వీకులకు తెలుసు. దాని ఉపయోగాలూ తెలుసు. పేడ అలికిన ఇల్లు శుభదాయకమైనది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇప్పుడొక టీచరమ్మ పేడతో కళాకృతులు తయారు చేస్తోంది. ఆధ్యాత్మిక చిహ్నాలను పేడతో రూపొందిస్తోంది. వీటి అలంకరణ ఇంటికి సంప్రదాయకళ తెస్తుందని చెబుతోంది. ప్రస్తుతం జనం వాటిని కొనేందుకు సిద్ధమవుతున్నారు.

పేడతో పిడకలు కొట్టడం, కళ్లాపి చల్లుకోవడం, ఇల్లు అలుక్కోవడం తరతరాలు చేస్తున్నదే. కాని పేడతో కళాకృతులు చేయడం ద్వారా ఒట్టిపోయిన ఆవులను, ఎడ్లను కూడా రోడ్ల మీద వదలడమో, కబేళాకు తరలించడమో చేయకుండా వాటి ఆలనా పాలనా చూడొచ్చు అంటుంది 42 ఏళ్ల పూజా గాంగ్వర్.



తాము తయారుచేసిన కళాకృతులతో పూజా బృందం

కిలో పేడ ఎంత?

కిలో పేడ మనం ఎంతకు కొంటాం? ఎంతకీ కొనం. ఎందుకంటే పేడ ఎక్కడైనా దొరుకుతుంది. 'కాని వాటితో కళాకృతులు చేస్తే కిలో పేడ కళాకృతులకు 2000 రూపాయలు వస్తాయి. సంపాదించవచ్చు' అంటోంది పూజా గాంగ్వర్. ఉత్తరప్రదేశ్‌లోని షాజహాన్‌పూర్‌కు సమీపంలోని రాజన్‌పూర్ అనే గ్రామంలో ప్రైమరీ టీచర్‌గా పని చేస్తున్న పూజా గాంగ్వర్ పేడతో కళాకృతులు చేయడమే కాదు. వాటివల్ల ఒక డజను మందికి ఉపాధి కల్పిస్తోంది, ఆదాయమూ గడిస్తోంది. వాల్ హ్యాంగింగులు, నేమ్ ప్లేట్లు, బొమ్మలు, పెన్ హోల్డర్లు, అగర్ బత్తీలు, చెప్పులు... ఇలా ఎన్నో తయారు చేస్తూ ఆకట్టుకుంటోంది.

తేలిక బొమ్మలు

పేడతో తయారయ్యే వస్తువులు తేలిగ్గా ఉంటాయి. ఎందుకంటే పేడను సేకరించి, ఎండబెట్టి, పొడి చేసుకుని, జల్లెడ పట్టుకుని, ఆ వచ్చిన మెత్తటి పొడికి మైదా పిండిగాని, చెట్టు బంక గాని, ముల్తానీ మట్టిగాని కలిపి సాగే లక్షణం కలిగిన బంక పదార్థంగా (క్లే) చేసుకుని దానితో కళాకృతులు తయారు చేస్తారు. 'ఇనుము, రాగి, ఫైబర్ మూసల్లో పేడ క్లేను మూసబోసి ఆరబెట్టి బొమ్మలను తయారు చేస్తాం' అని తెలిపింది గాంగ్వర్.

బొప్పాయి పాలు

'మూసలో పోసి ఆరబెట్టుకున్న కళాకృతులకు పాలిష్ కోసం బొప్పాయి పాలుగాని, అవిసె గింజల నూనె గాని వాడతాం. ఈ కళాకృతులు పాడుగావు. నీళ్ల తగలకుండా చూసుకుంటే ఐదారేళ్లు ఉంటాయి. మా ఊళ్లోని యాభై ఆవుల పేడను నేను ఈ బొమ్మల కోసం వాడుతున్నాను. ఉత్తర ప్రదేశ్‌లోని కొన్ని జిల్లాల నుంచి స్త్రీలు వచ్చి నేర్చుకుంటామంటున్నారు. వారికి ట్రయినింగ్ ఇస్తే ఆవు పేడ సద్వినియోగం అవుతుంది. ఆవుల సంరక్షణా జరుగుతుంది' అని తెలిపింది పూజ.

కిచెన్ టిప్స్

- పకోడీలు కరకరలాడాలంటే శనగ పిండిలో ఒక గరిటెడు వేడి నూనె కలపాలి.
- పూరీలు బాగా పొంగాలంటే పావుకేజీ గోధుమ పిండిలో ఒక టేబుల్ స్పూన్ వరి పిండి కలపాలి లేదా పూరీల పీట మీద వరి పిండి చల్లి పూరీలు వత్తాలి.



- వేపుడు చేసే బాణలిలో నూనె వేయడానికి ముందు చిటికెడు ఉప్పు చల్లితే తక్కువ నూనెతో వంట పూర్తి చేయవచ్చు.
- కొబ్బరి మసాలా రుబ్బడానికి ముందు కొబ్బరిని తక్కువ సమయం వేయించాలి, రంగు మారే వరకు వేయిస్తే కొబ్బరి రుచి మారిపోతుంది.
- మసాలా పొడి కోసం ధనియాలు, మెంతులు వంటి దినుసులను వీలయినంత తక్కువ మంట మీద వేయించాలి.
- టొమాటోలు దొరకని రోజుల్లో వంటల్లో టొమాటో కెచప్ లేదా టొమాటో సాస్‌లను కలిపి దాదాపు అదే రుచిని తీసుకురావచ్చు.



- అల్లం వెల్లుల్లి మసాలా తయారీలో ఏది ఎంత మోతాదులో వేయాలా అనే సందేహం పీడిస్తుంది, అల్లం నలభై శాతం, వెల్లుల్లి 60 శాతం ఉండాలి.
- కంది పప్పు ఉడికేటప్పుడు ఒక స్పూన్ నూనె లేదా నెయ్యి వేస్తే రుచి ఇనుమడిస్తుంది. పప్పు పలుకుగా ఉండకుండా మృదువుగా ఉంటుంది కూడా.
- డెజర్ట్ తయారీలో వాడే పాలు తప్పనిసరిగా ఫుల్ క్రీమ్ మిల్క్ అయి ఉండాలి. అప్పుడే చక్కటి రుచి వస్తుంది.

గెలుపు దారి

కాగితానికి కొత్త ఊపిరి

'నేను ఇల్లు దాటి బయట అడుగు వేయలేకపోవచ్చు. అయితే నేను తయారు చేసిన బొమ్మలు మాత్రం దేశదేశాలకు వెళుతున్నాయి' ఆనందంగా అంటుంది రాధిక. ఆమె చేతిలో కాగితం కూడా కొత్త ఊపిరి పోసుకుంటుంది. పాతన్యూస్ పేపర్లతో ఆమె తయారు చేసిన బొమ్మలలో ఆత్మవిశ్వాస కళ ఉట్టిపడుతుంది. 'చీకటిని చూసి దిగులు పడకు. అదిగో వెలుగు' అని ఆ బొమ్మలు మౌనంగానే చెబుతుంటాయి...



మోటివేషనల్ స్పీకర్‌గా... రాధిక

తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన రాధిక బోస్ డిసీజ్ వల్ల నడకకు దూరమైంది. బడి మానేయవలసి వచ్చింది. రోజంతా బెడ్ మీద కూర్చోక తప్పనిసరి పరిస్థితి. 'ఇక ఇంతేనా!' అనే చింత ఆమెలో మొదలైంది. తన మనసులోని బాధను పంచుకోడానికి స్నేహితులు కూడా లేరు. కిటికీ నుంచి అవతలి ప్రపంచాన్ని చూస్తే... పిల్లలు బడికి వెళుతుంటారు... ఇలా ఎన్నో దృశ్యాలు ఆమె కంట పడేవి. తన విషయానికి వస్తే... బయటి ప్రపంచంలోకి వెళ్లడమంటే ఆస్పత్రికి వెళ్లడమే.



తనలో తాను మౌనంగా కుమిలిపోతున్న సమయంలో 'ఆర్ట్' అనేది ఆత్మీయనేస్తమై పలకరించింది. పద్నాలుగేళ్ల వయసులో డ్రాయింగ్, పెయింటింగ్ మొదలుపెట్టింది. ఆర్ట్‌పై సోదరి ఆసక్తిని గమనించిన రాజ్‌మోహన్ పాత న్యూస్‌పేపర్లు, మెటల్ వైర్లతో ఆఫ్రికన్ బొమ్మలు తయారు చేసే యూట్యూబ్ వీడియోలను చూపెట్టాడు. అవి చూసిన తరువాత రాధికకు తనకు కూడా అలా తయారు చేయాలనిపించింది.

పాత న్యూస్‌పేపర్‌ల నుంచి నవదంపతులు, సంగీతకారులు, వైద్యులు, దేవతలు... ఇలా రకరకాల బొమ్మలు తయారు చేసింది.

పొరుగింటి వ్యక్తికి రాధిక తయారు చేసిన బొమ్మ బాగా నచ్చి కొనుగోలు చేసింది. అది తన ఫస్ట్ సేల్.

ఆ సమయంలో రాధికకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది. రాజ్‌మోహన్ స్నేహితుడు రాధిక తయారు చేసిన అయిదు బొమ్మలను తన షాప్‌లో పెడితే మంచి స్పందన వచ్చింది. ఆ తరువాత మరి కొన్ని బొమ్మలు కొన్నాడు. వారం వ్యవధిలో 25 బొమ్మలను అమ్మాడు.

సోషల్ మీడియా ద్వారా రాధిక బొమ్మల వ్యాపారం ఊపు అందుకుంది. ఊటీకి చెందిన ఒక హోటల్ యజమాని 25 బొమ్మలకు ఆర్డర్ ఇచ్చాడు. ఊటీలోని ఆ హోటల్‌ను తాను తయారు చేసిన బొమ్మలతో అలంకరించడం రాధికకు సంతోషం కలిగించింది.

తన బొమ్మల గురించి ప్రచారం చేయడానికి పైసా ఖర్చు చేయకపోయినా సోషల్‌మీడియాలోని పోస్ట్‌ల వల్ల ఆర్డర్లు వెల్లువెత్తాయి.

మూడువేలకు పైగా బొమ్మలు తయారు చేసిన రాధిక...

'బొమ్మలకు ప్రాణం పోస్తుంటే నన్ను నేను మరిచిపోతాను. కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లుగా అనిపిస్తుంది. టైమే తెలియదు. బొమ్మలు చేస్తున్నప్పుడు ఎంతో ఏకాగ్రత కావాలి. ఆసక్తి ఉన్నచోట సహజంగానే ఏకాగ్రత ఉంటుంది' అంటుంది. రాధిక ఇప్పుడు ఆర్టిస్ట్ మాత్రమే కాదు. మోటివేషనల్ స్పీకర్ కూడా. తన స్ఫూర్తిదాయకమైన ఉపన్యాసాలతో ఎంతోమందికి ధైర్యాన్ని ఇస్తోంది. ఆత్మవిశ్వాసాన్ని కల్పిస్తోంది.

బీజీ-3 పత్తితో డేంజర్!

సాగుబడి
మృగశిర కార్తె : జూన్ 21 వరకు
ఆరుద్ర కార్తె : జూన్ 22 నుంచి

కలుపు మందును తట్టుకునే (హెర్బిసైడ్ టాలరెంట్) విధంగా జన్యుమార్పిడి చేసిన పత్తి రకం (దీన్నే 'బీజీ 3 పత్తి' అని కూడా అంటున్నారు) దేశవ్యాప్తంగా అక్రమంగా సాగులో ఉంది. దీనికి ప్రభుత్వ అనుమతి లేదు. గ్లైఫోసేట్ అనే ప్రమాదకరమైన కలుపు మందు చల్లినా తట్టుకునే విధంగా జన్యుమార్పిడి చేసిన పత్తి పంట ఇది. సాధారణ బీజీ 2 పత్తి రకాలకు మాత్రమే ప్రభుత్వ అనుమతి ఉంది. ప్రభుత్వ అనుమతి లేకపోయినా కొందరు రైతులకు వ్యాపారులు బీజీ 3 పత్తి విత్తనాలను అంటగడుతున్నారు. ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల అనేక సార్లు అక్రమంగా తరలిస్తున్న క్వింటాళ్ల కొద్దీ బీజీ 3 పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో నిషిద్ధ హెచ్.టి. పత్తి సాగు వల్ల కలిగే అనర్థాలే మిటో రైతులకు తెలియజెప్పే ప్రయత్నమే ఈ కథనం. గ్లైఫోసేట్ కలుపు /గడ్డి మందు వల్ల కేన్సర్ వంటి జబ్బులు రావటంతో పాటు భూమి, నీరు, గాలి కలుషితం అవుతాయని, రైతులు వాస్తవాలు తెలుసుకొని ఈ విత్తనాలు వాడకుండా జాగ్రత్తపడాలని ప్రముఖ శాస్త్రవేత్త, తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డా. కేశవులు 'సాక్షి సాగుబడి' ద్వారా సూచిస్తున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...



ప్రతీకాత్మక చిత్రం

హెర్బిసైడ్ టాలరెంట్ (హెచ్.టి.) పత్తి అనేది ప్రభుత్వ ఆమోదం లేని కలుపు మందును తట్టుకునే జన్యువును కలిగి ఉన్న ఒక రకమైన జన్యుమార్పిడి పత్తి. దీన్ని సాధారణంగా బీజీ–3 (రౌండ్ అప్ రెడీ ఫ్లెక్స్)గా వ్యవహరిస్తుంటారు. దీని సాగుకు భారత ప్రభుత్వ ఆమోదం లేదు. బీజీ 3 పత్తి విత్తనాలను ఉత్పత్తి చేయటం, అమ్మటం మన దేశంలో చట్టవిరుద్ధం. కలుపు మందును తట్టుకునే పత్తి రకాన్ని మోన్‌శాంటో అభివృద్ధి చేసి 'రౌండ్-అప్ రెడీ ఫ్లెక్స్ (ఆర్.ఆర్.ఎఫ్.) పేరుతో అమెరికాలో విక్రయిస్తూ ఉంది. మన దేశంతో సహా ప్రపంచదేశాల్లో కూడా అమ్మటానికి ఆ కంపెనీ ప్రయత్నిస్తోంది.



డా. కె. కేశవులు

హెచ్.టి. పత్తి గింజలో గ్లైఫోసేట్ కలుపు మందును తట్టుకునే అదనపు జన్యువు ఉంది. అందువల్ల, ఈ పంటను పొరపాటున సాగు చేసే రైతులు పొలాల్లో కలుపు మొక్కల నియంత్రణ కోసం గ్లైఫోసేట్‌ను గుడ్డిగా పిచికారీ చేసే ప్రమాదం ఉంది. అయితే, గ్లైఫోసేట్ కలుపు మందు క్యాన్సర్ కారక ప్రభావాన్ని కలిగి ఉందని రైతులు తెలుసుకోవాలి. అంతేకాదు, మీరు పొలాల్లో అనుమతి లేని ఈ పంటను సాగు చేస్తే పరాగ సంపర్కం ద్వారా సమీపంలోని మొక్కలకు కలుపు మందును తట్టుకునే జన్యువు అనియంత్రితంగా వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. ఇది వివిధ రకాల 'సూపర్ వీడ్(కలుపు మందులకు లొంగని మొండి జాతి కలుపు మొక్క)లను సృష్టిస్తుంది.

భారత ప్రభుత్వ ఆమోదం లేని కలుపు మందులను తట్టుకునే లక్షణం కలిగిన జన్యువు ఉద్దేశపూర్వకంగానో లేదా అనుద్దేశపూర్వకంగానో గుర్తు తెలియని సంస్థలు/ఏజెన్సీల ద్వారా మన దేశంలోని రైతుల పొలాల్లోకి, పర్యావరణంలోకి విడుదలైంది. అది ఇప్పుడు రైతులు పండించిన పత్తి పొలాల్లోకి చేరి ఇతర సంకరజాతి పత్తి రకాలను కూడా కలుషితం చేస్తూ.. జీవ వనరుల స్వచ్ఛతకు ముప్పుగా పరిణమించింది.

జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రైజల్ కమిటీ(జీఈఏసీ) అనుమతి లేకుండా ఏదైనా పత్తి విత్తనాన్ని ఉత్పత్తి చేయడం/అమ్మటం పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం చట్టవిరుద్ధం. ఇది జీఈఏసీ ఆమోదం పొందనందున, మన దేశంలో అక్రమంగా విక్రయిస్తున్న బీజీ3 విత్తనం నాణ్యతపై జవాబుదారీతనం లేదు. అంతేకాదు, పర్యావరణం కలుషితమవుతున్నది. చట్టవిరుద్ధమైన బీజీ 3 పత్తి విత్తనాలు చిన్న, సన్నకారు పత్తి రైతులను నాశనం చేయడమే కాకుండా దేశంలోని మొత్తం చట్టపరమైన పత్తి విత్తన మార్కెట్‌కు కూడా ముప్పుగా తయారయ్యాయి.

అంతేకాదు, గ్లైఫోసేట్ కలుపు మందును పంటలు వేయని ప్రాంతాల్లో మాత్రమే వాడటానికి చట్టం అనుమతిస్తుంది. అందువల్ల, అనుమతి లేని బీజీ 3 పత్తి విత్తనాలు వేసి గ్లైఫోసేట్ కలుపు మందును రైతులు విచక్షణారహితంగా పొలాల్లో పిచికారీ చేస్తే.. అది మనుషులు, జంతువుల ఆరోగ్యంతో పాటు జీవవైవిధ్యం, నేల ఆరోగ్యంపై, భూసారంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.



అమెరికాలో గ్లైఫోసేట్ కలుపు మందుకు కూడా లొంగకుండా పెరుగుతున్న హార్స్‌విడ్

అందువల్ల రైతులు కలుపు మందును తట్టుకునే (హెచ్.టి.) బీజీ 3 పత్తిని ఎందుకు సాగు చేయకూడదంటే : ● బీజీ 3 పత్తి సాగుకు ప్రభుత్వ అనుమతి లేదు. దేశంలో దీని సాగు చట్టవిరుద్ధం. ● బీజీ 3 పత్తి సాగు గ్లైఫోసేట్ వినియోగాన్ని ప్రోత్సహిస్తుంది. ఇది క్యాన్సర్‌కు కారణం కావచ్చు. నేల ఆరోగ్యంపై, భూ సారంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. నీటిని కలుషితం చేస్తుంది. జంతువులు, మనుషుల ఆరోగ్యాన్ని కూడా దెబ్బ తీస్తుంది. ● రైతులు ఈ అక్రమ విత్తనాలను ఉపయోగించడం వలన పంట పోవచ్చు/ దిగుబడి నష్టం జరగొచ్చు/ ఆదాయం తగ్గిపోవచ్చు. ● ఈ రకం పత్తి సాగు వల్ల కొన్నాళ్లకు కలుపు మందులు చల్లినా చనిపోని మొండి కలుపు మొక్కలు తయారు కావచ్చు. మొండి కలుపును నియంత్రించడం చాలా కష్టం. అంటే, రైతులు ఈ కలుపు మొక్కల నియంత్రణకు మరింత ఎక్కువ డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పైగా తక్కువ దిగుబడి/పంట నష్టానికి దారితీయవచ్చు. కాబట్టి, బీజీ 3/హెచ్.టి. పత్తి విత్తనాలకు రైతులు దూరంగా ఉంటే మంచిది.

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

● ఎత్తు మడులపై లేదా బోదెలు తోలి విత్తుకుంటే వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా పంటకు ఢోకా ఉండదు

బోదెలు తోలి విత్తుకుంటే మేలు!



ఎత్తు మడులపై ఏపుగా ఎదిగిన పత్తి పంటలో డా.ప్రవీణ్‌కుమార్ తదితరులు

వర్షాలు తక్కువైనా, ఎక్కువైనా, వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజుల వ్యవధి వచ్చినా.. పత్తి, కూరగాయలు, సోయా, వేరుశనగ.. పంట ఏదైనా సరే.. నల్ల రేగడైనా, ఎర్ర నేలైనా, బంక మట్టి అయినా సరే.. ఎత్తు మడులు(రెయిజ్డ్ బెడ్స్) చేసి లేదా బోదెలు తోలి పంటలు విత్తుకోవటం మంచిదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఆదిలాబాద్‌లోని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ప్రవీణ్ కుమార్ (99896 23829) గత కొన్ని సంవత్సరాలుగా ఎత్తుమడులపై పత్తిని సాగు చేయటంపై ప్రయోగాలు చేస్తూ చక్కటి ఫలితాలు సాధిస్తున్నారు.



దుక్కి చేసిన పొలంలో ట్రాక్టర్ ద్వారా ఇలా ఎత్తు మడులు/బోదెలు తోలుకోవాలి

దుక్కి దున్ని, ట్రాక్టర్‌కు అమర్చిన బెడ్ మేకర్ ద్వారా బోదెలు తోలాలి. తగుమాత్రంగా వర్షం పడిన తర్వాత ఆ బెడ్‌పై ఒకే వరుసలో విత్తుకోవాలి. చదునుగా ఉండే పొలంలో సాగు చేసిన పత్తి పంట కంటే బోదెలు తోలి సాగు చేసిన పత్తి పంట మంచి దిగుబడినిచ్చింది. వర్షాలకు అధిక నీరు పొలంలో నిల్వ ఉండకుండా బయటకు వెళ్లిపోవటం వల్ల పత్తి పంట ఉరకెత్త లేదు. గాలి, వెలుతురు మొక్కల మొదళ్లకు బాగా తగలటం వల్ల, ఎత్తు మడిలో మట్టి గుల్లగా ఉండటంతో వేరు వ్యవస్థ బాగా విస్తరించటం వల్ల పంట ఆరోగ్యంగా ఎదిగింది. ఫ్లాట్ బెడ్‌పై విత్తనాలు నాటిన దానితో పోల్చితే అధిక పత్తి దిగుబడులు రావటానికి ఎత్తు మడుల పద్ధతి బాగు ఉపయోగపడిందని డా. ప్రవీణ్ కుమార్ 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. ఒక వేళ వర్షాలు తక్కువ పడితే, వర్షానికి వర్షానికి మధ్య ఎక్కువ రోజులు గ్యాప్ వచ్చినా కూడా ఎత్తుమడిపై ఉన్న పంట వేరు వ్యవస్థలో తేమ త్వరగా ఆరిపోదు. అందువల్ల బెట్టను తట్టుకునే శక్తి కూడా బోదెలపై నాటిన పంటకు చేకూరుతుంది. ఎత్తు మడులు / బోదెలపై పత్తి పంటను విత్తుకోవటం గురించి తాజా వీడియోను 'కేవీకే ఆదిలాబాద్' యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. రైతులు ఆ వీడియోను చూసి అవగాహన పెంచుకోవచ్చు.



వర్షం పడిన తర్వాత ఒక వరుసలో పత్తి విత్తనం వేసుకోవాలి



ఎత్తు మడులపై ఆరోగ్యంగా పెరుగుతున్న పత్తి పైరు

www.youtube.com/@kvkadilabad3800

జూలై 15 వరకు ఆంగ్రూ ఇంక్యుబేటర్ గడువు

వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వినూత్న ఆవిష్కరణలను గుర్తించి, ప్రోత్సహించే లక్ష్యంతో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా తిరుపతిలో ఏర్పాటైన పోషణ్ ఇంక్యుబేటర్ విభాగం ఆరో విడత ప్రవేశాల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతోంది. కేంద్ర ప్రభుత్వ ఆర్‌కెవీవై రఫ్తార్ నిబంధనల ప్రకారం అర్హులైన వారికి 2 నెలల సాంకేతిక, వాణిజ్య అంశాలపై శిక్షణతో పాటు సంకల్ప్ ప్రోగ్రామ్‌లో రూ. 5 లక్షలు, సమృద్ధి ప్రోగ్రామ్‌లో రూ. 25 లక్షల వరకు ఆర్థిక తోడ్పాటును అందిస్తారు. ఆవిష్కర్తలకు విద్యార్హతల పరిమితి లేదు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకలకు చెందిన ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు. జూలై 15 ఆఖరు తేదీ. వివరాలకు.. ఆంగ్రూ పోషణ్ ఇంక్యుబేటర్ విభాగం – 94416 70829.

భూ సమస్యలపై 23న గుంటూరులో శిక్షణ

'భూమి సమస్యలు –చట్టాలు –పరిష్కార మార్గాలు' అనే అంశంపై గుంటూరు బృందావన్ గార్డెన్స్ రోడ్డు నంబర్–1 లోని ల్యాఫ్ (ది రురల్ లా ఫర్మ్) కార్యాలయంలో ఈ నెల 23(శుక్రవారం)న ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు సాధనా అకాడమీ ఆఫ్ ఇంపరటివ్ లా అండ్ లైఫ్ స్కిల్స్(సెయిల్స్)కు చెందిన 'భూమి సునీల్' తదితర నిపుణులు అవగాహన కల్పిస్తారు. ఆర్‌ఓఆర్ చట్టం –నూతన సవరణలు, భూముల సర్వే, టైటిల్ గ్యారంటీ, చుక్కల భూముల సమస్యలు, అసైన్డ్ భూముల సమస్యలు, నిషేధిత భూముల జాబితాలో పట్టా భూములు, ఇనాం భూముల సమస్యలు, భూమి రికార్డులు.. ఈ అంశాలపై అవగాహన కల్పిస్తారు. ఫీజు, ఇతర వివరాలకు.. 63038 67620.

స్పోర్ట్స్



మళ్లీ నంబర్‌వన్‌గా జొకోవిచ్

కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో కొత్త చరిత్ర సృష్టించిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో తన అగ్ర స్థానాన్ని మళ్లీ అందుకున్నాడు. ఏటీపీ సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో అతను 7,595 పాయింట్లతో రెండు స్థానాలు మెరుగుపర్చుకొని వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచాడు. 36 ఏళ్ల జొకోవిచ్ తన కెరీర్‌లో నంబర్‌వన్‌గా 388వ వారంలోకి అడుగు పెట్టడం విశేషం. ఇప్పటివరకు టాప్‌లో ఉండి సెమీస్‌లో జొకోవిచ్ చేతిలో ఓడిన అల్‌కరాజ్ రెండో స్థానానికి పడిపోగా, రష్యా ప్లేయర్ ఖచనోవ్ మరోసారి టాప్-10లోకి అడుగు పెట్టాడు.

380వ ర్యాంక్‌కు సహజ యమలపల్లి



ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ) ప్రపంచ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో తెలుగమ్మాయి సహజ యమలపల్లి పురోగతి సాధించింది. సోమవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో ఆమె 60 స్థానాలు మెరుగుపర్చుకొని 380వ ర్యాంక్‌కు చేరుకుంది. 143 ర్యాంకింగ్ పాయింట్లు ఆమె ఖాతాలో ఉన్నాయి. ఈ జాబితాలో భారత్‌నుంచి అంకితా రైనా అందరికంటే మెరుగైన ర్యాంక్ (209)లో ఉంది.

భారత మ్యాచ్ 'భాగ్యం' లేదు!

వరల్డ్ కప్‌లో ఉప్పల్ మైదానానికి దక్కని టీమిండియా వన్డే

- పాకిస్తాన్ 2 మ్యాచ్‌లు ఆడే అవకాశం
- అహ్మదాబాద్‌లో భారత్, పాక్ పోరు
- ఐసీసీకి షెడ్యూల్ డ్రాఫ్ట్ సమర్పించిన బీసీసీఐ



న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అభిమానులను తీవ్రంగా నిరాశపర్చే పరిణామం...వన్డే ప్రపంచకప్ వేదికల్లో ఒకటిగా ఖాయమై రూ. 117 కోట్లతో ఆధునీకరణకు ఉప్పల్ స్టేడియం సిద్ధమవుతోందని, మెగా ఈవెంట్‌లో టీమిండియా మ్యాచ్‌ను వీక్షించవచ్చని భావించిన ఫ్యాన్స్‌కు బీసీసీఐ షాక్ ఇచ్చింది. ఉప్పల్ స్టేడియంలో భారత జట్టు ఆడే అవకాశం లేదని తేలింది. మ్యాచ్ వేదికలు, తేదీలకు సంబంధించి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ)కి బీసీసీఐ షెడ్యూల్ డ్రాఫ్ట్ సమర్పించింది. ఇందులో టీమిండియా లీగ్ దశలో ఆడే 9 మ్యాచ్‌ల వేదికల్లో హైదరాబాద్ పేరు లేదు. ఉప్పల్ స్టేడియాన్ని భారత మ్యాచ్ కోసం పరిగణలోకి తీసుకోలేదు. బోర్డు పంపిన జాబితాను వరల్డ్ కప్ ఆడే అన్ని జట్లకూ పంపించి వారి అభిప్రాయం తీసుకున్న తర్వాత ఐసీసీ అధికారిక ప్రకటన చేస్తుంది. అయితే... సాధారణంగా ఆతిథ్య దేశం ఇచ్చిన డ్రాఫ్ట్‌లో మార్పులు లేకుండానే ఐసీసీ ఆమోదిస్తుంది కాబట్టి ఈ షెడ్యూల్ ప్రకటన లాంఛనమే. భారత జట్టు ఆడకపోయినా... 2011 వరల్డ్ కప్‌తో పోలిస్తే ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్‌లు జరగడమే అభిమానులకు కాస్త ఊరట. డ్రాఫ్ట్ ప్రకారం పాకిస్తాన్ జట్టు ఇక్కడ రెండు మ్యాచ్‌లు ఆడే అవకాశం ఉంది.

వరల్డ్ కప్‌లో భారత మ్యాచ్‌ల షెడ్యూల్ (బీసీసీఐ డ్రాఫ్ట్ ప్రకారం)

అక్టోబర్ 8	ఆస్ట్రేలియా (చెన్నై)
అక్టోబర్ 11	అఫ్గనిస్తాన్ (ఢిల్లీ)
అక్టోబర్ 15	పాకిస్తాన్ (అహ్మదాబాద్)
అక్టోబర్ 19	బంగ్లాదేశ్ (పుణే)
అక్టోబర్ 22	న్యూజిలాండ్ (ధర్మశాల)
అక్టోబర్ 29	ఇంగ్లండ్ (లక్నో)
నవంబర్ 2	క్వాలిఫయర్ (ముంబై)
నవంబర్ 5	దక్షిణాఫ్రికా (కోల్‌కతా)
నవంబర్ 11	క్వాలిఫయర్ (బెంగళూరు)



భారత్ సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2011 వన్డే వరల్డ్ కప్ షెడ్యూల్‌ను దాదాపు ఏడాది క్రితమే ఐసీసీ ప్రకటించింది. దీని ప్రకారం శ్రీలంక, బంగ్లాదేశ్ కాకుండా భారత్‌లో 8 వేదికల్లో 29 మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు బీసీసీఐ ఖరారు చేసింది. అప్పట్లోనే అన్ని రకాలుగా సిద్ధమైన హైదరాబాద్ స్టేడియం 3 వన్డేలకు ఆతిథ్యమిచ్చింది కూడా. అయితే వరల్డ్ కప్ మైదానాల్లో మాత్రం ఉప్పల్‌కు చోటు దక్కలేదు. 'టెస్టు హోదా ఉన్న స్టేడియాలను మాత్రం బోర్డు పరిశీలించింది' అంటూ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధికారి ఒకరు దానికి వివరణ ఇచ్చారు. ఇప్పుడు పుష్కర కాలం తర్వాత భారత్ మరోసారి వన్డే ప్రపంచ కప్‌ను నిర్వహిస్తోంది. హైదరాబాద్‌కు మ్యాచ్‌లు దక్కాయన్న ఆనందంలో అభిమానులు ఉండగా, ఇప్పుడు భారత్ మ్యాచ్ లేకపోవడం సహజంగానే నిరాశపర్చే అంశం. క్రికెట్ పట్ల చూపించిన ఆదరణను బట్టి చూస్తే ఉప్పల్ స్టేడియం ఎప్పుడూ నిరాశపర్చలేదు. అంతర్జాతీయ మ్యాచ్‌లు మాత్రమే కాదు...ఐపీఎల్ హోం టీమ్ సన్‌రైజర్స్ పేలవ ప్రదర్శన ఇచ్చినా సరే, స్టేడియంలో వారి ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదు. దేశవ్యాప్తంగా చూస్తే చక్కటి అవుట్‌ఫీల్డ్, ఫిర్యాదులు లేని పిచ్‌తో సహా సౌకర్యాలపరంగా చూస్తే ఇతర అన్ని స్టేడియాలతో పోలిస్తే మేలైన వసతులు ఉన్నాయి. అయితే ఇదంతా బోర్డు పట్టించుకున్నట్లుగా లేదు. వరల్డ్ కప్‌లో వేదికల ఖరారు గురించి గత నెలలో కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. కార్యదర్శి జై షా నేతృత్వంలో ఇది పని చేసింది. భారత మ్యాచ్‌లకు కేటాయించిన 9 వేదికలను చూస్తే వేర్వేరు కారణాలతో వీటిని ఖాయం చేసినట్లుగా అర్థమవుతుంది. భారత క్రికెట్‌లో మొదటినుంచి 'ప్రధాన' కేంద్రాలుగా గుర్తింపు పొందిన ముంబై, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, ఢిల్లీ వేదికల విషయంలో ఎలాంటి సందేహాలు లేవు. సహజంగానే పెద్ద స్టేడియమైన అహ్మదాబాద్‌లో అన్నింటికంటే పెద్ద మ్యాచ్ (పాక్‌తో) నిర్వహించాలని బోర్డు భావించింది. మిగతా మూడు వేదికల విషయంలో బోర్డు అంతర్గత రాజకీయాలు పని చేశాయి. బోర్డు ఉపాధ్యక్షుడైన రాజీవ్ శుక్లా తన సొంత మైదానమైన లక్నోలో, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తమ అసోసియేషన్‌కు చెందిన ధర్మశాలలో మ్యాచ్‌లను తీసుకున్నారు. పుణేకు కూడా మ్యాచ్ కేటాయించుకోవడంలో మహారాష్ట్ర క్రికెట్ సంఘం గట్టిగా ప్రయత్నం చేసి సఫలమైంది. నిజానికి ముందుగా షార్ట్ లిస్ట్ చేసిన 12 వేదికల్లో పుణే పేరు లేదు. ఆ తర్వాత దానిని అదనంగా చేర్చడంలోనే పరిస్థితి అర్థమైంది. బహుశా ఈ మ్యాచ్ ఉప్పల్‌కు దక్కేదేమో. కానీ బోర్డులో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున ఎలాంటి ప్రాతినిధ్యమే లేదు. నిత్య కలహాలతోనే అసోసియేషనే లేకుండా మాజీ న్యాయమూర్తి చేతుల్లో ఉన్న వ్యవస్థ మ్యాచ్‌పై పట్టుబట్టే పరిస్థితిలో అసలే లేదు!

తొలి మ్యాచ్, ఫైనల్ అహ్మదాబాద్‌లోనే...

లక్షకు పైగా సామర్థ్యం ఉన్న అహ్మదాబాద్ స్టేడియం సహజంగానే వరల్డ్‌కప్‌కు ప్రధాన వేదిక కానుంది. 2019 వరల్డ్ కప్ ఫైనలిస్టులు ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య అక్టోబర్ 5న జరిగే మ్యాచ్‌లో ఈ విశ్వ సమరం మొదలవుతుంది. నవంబర్ 19న ఫైనల్ మ్యాచ్ కూడా ఇక్కడే జరిగే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ఈ షెడ్యూల్‌లో లీగ్ దశకే పరిమితం కాగా... నవంబర్ 15, 16న జరిగే సెమీ ఫైనల్ వేదికల గురించి ఇంకా పేర్కొనలేదు. అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో జరిగే తొలి పోరుతో భారత్ వరల్డ్ కప్ వేట మొదలవుతుంది. నిజానికి పూర్తి స్థాయి షెడ్యూల్‌ను బీసీసీఐ ఎప్పుడో ప్రకటించాల్సింది. అయితే భారత గడ్డపై తమ మ్యాచ్‌ల వేదికల విషయంలో పాకిస్తాన్ లేవనెత్తిన అభ్యంతరాలు, ఆసియా కప్‌లో తాము పాల్గొనే అంశంతో ముడిపెట్టడంతో ఇంత ఆలస్యమైంది. పాక్ విజ్ఞప్తిని బట్టి ఆ జట్టు ఆడే మ్యాచ్‌ల విషయంలో బోర్డు కాస్త సడలింపులు ఇచ్చినట్లు తెలుస్తోంది. నాకౌట్ దశకు వెళ్లి తప్పనిసరైతే తప్ప అహ్మదాబాద్‌లో ఆడమని చెబుతూ వచ్చిన పాకిస్తాన్ వెనక్కి తగ్గింది. ఈ షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 15న భారత్, పాకిస్తాన్ మధ్య అహ్మదాబాద్‌లోనే మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్ మినహా తమ 8 మ్యాచ్‌లలో పాకిస్తాన్ తాము సూచించిన నాలుగు వేదికలు కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లలోనే ఆడనుంది.

జులై 12నుంచి తొలి టెస్టు

భారత జట్టు విండీస్ పర్యటన ఖరారు

న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో ఓడిన నెల రోజుల తర్వాత భారత జట్టు వచ్చే డబ్ల్యూటీసీ (2023-25) కోసం తమ పోరును కొత్తగా ప్రారంభించనుంది. వెస్టిండీస్‌లో జరిగే పర్యటనతో ఇది మొదలవుతుంది. ఈ టూర్‌ను సోమవారం బీసీసీఐ అధికారికంగా ప్రకటించింది. ఇందులో భాగంగా భారత్, విండీస్ మధ్య 2 టెస్టులు, 3 వన్డేలు, 5 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇరు జట్ల మధ్య జులై 12-16 మధ్య తొలి టెస్టు (డొమినికాలో), జులై 20-24 మధ్య రెండో టెస్టు (ట్రినిడాడ్)లో జరుగుతాయి. జులై 27, 29న రెండు వన్డేలు బార్బడోస్‌లో, ఆగస్టు 1న మూడో వన్డే ట్రినిడాడ్‌లో నిర్వహిస్తారు. ఆగస్టు 3, 6, 8, 12, 13 తేదీల్లో జరిగే 5 టి20 మ్యాచ్‌లు జరుగుతాయి. ఇందులో తొలి 3 టి20లు ట్రినిడాడ్, గయానాలలో జరగనుండగా...చివరి 2 టి20లకు ఫ్లోరిడా (అమెరికా)లోని లాడర్‌హిల్ స్టేడియం ఆతిథ్యమిస్తుంది.

భారత్‌కు 100 శాతం జరిమానా



లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్లో స్లో ఓవర్ రేట్ కారణంగా భారత మ్యాచ్ ఫీజులో మొత్తం 100 శాతాన్ని జరిమానాగా విధిస్తున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. నిర్ణీత సమయంలో పూర్తి చేయాల్సిన ఓవర్లకంటే భారత్ ఐదు ఓవర్లు తక్కువగా వేయడంతో ఈ శిక్షకు గురైంది. డబ్ల్యూటీసీ చాంపియన్ ఆస్ట్రేలియాపై కూడా నాలుగు ఓవర్లు ఆలస్యంగా వేసినందుకు మ్యాచ్ ఫీజులో 80 శాతాన్ని జరిమానాగా విధించింది. మరో వైపు గ్రీన్ పట్టిన సందేహాస్పద క్యాచ్‌పై సోషల్ మీడియాలో బహిరంగంగా తన అసంతృప్తిని ప్రదర్శించినందుకు శుబ్‌మన్ గిల్‌పై ఐసీసీ మరో 15 శాతం జరిమానా వేసింది.

నేటినుంచి ఇండోనేసియా సూపర్ -1000 టోర్నీ



జకార్తా: ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) టూర్‌లో మరో పెద్ద టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటినుంచి జరిగే ఇండోనేసియా సూపర్-1000 టోర్నమెంట్‌లో భారత అగ్రశ్రేణి ఆటగాళ్లంతా బరిలోకి దిగుతున్నారు. గత రెండు టోర్నీల్లో తొలి రౌండ్‌లోనే ఓడిన భారత స్టార్, డబుల్ ఒలింపిక్ విజేత పీవీ సింధుకు ఈ టోర్నీ కీలకం కానుంది. మొదటి పోరులో ఇండోనేసియాకు చెందిన గ్రెగోరియా మరిస్కాతో సింధు తలపడుతుంది. మరో సీనియర్ ప్లేయర్ సైనా నెహ్వాల్ తొలి రౌండ్‌లో ఏడో సీడ్, చైనాకు చెందిన వాంగ్ జి యిని ఎదుర్కొంటుంది. పురుషుల విభాగంలో హెచ్‌ఎస్ ప్రణయ్, కిడాంబి శ్రీకాంత్, లక్ష్య సేన్ కూడా సింగిల్స్ బరిలో నిలిచారు.

భారత్‌ను గెలిపించిన ఛెత్రి

ఇంటర్ కాంటినెంటల్ కప్



భువనేశ్వర్: ఇంటర్ కాంటినెంటల్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో భారత్ వరుసగా రెండో విజయాన్ని అందుకుంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 1-0 గోల్ తేడాతో వనుతూను ఓడించింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను కెప్టెన్ సునీల్ ఛెత్రి 81వ నిమిషంలో సాధించాడు. తొలి మ్యాచ్‌లో శుక్రవారం మంగోలియాను 2-0తో ఓడించిన భారత్ తమకంటే చాలా తక్కువ ర్యాంక్‌లో ఉన్న వనుతూపై విజయం సాధించేందుకు కూడా శ్రమించాల్సి వచ్చింది. తొలి అర్ధభాగంలో చాలా వరకు బంతిని తమ ఆధీనంలోనే ఉంచుకున్నా...గోల్ చేసేందుకు భారత్ చేసిన ప్రయత్నాలన్నీ వృథా అయ్యాయి. మైదానంలో తన భార్య సోనమ్ మ్యాచ్‌ను తిలకిస్తుండగా...త్వరలో తండ్రి కాబోతున్న సంకేతాన్ని ఛెత్రి తన గోల్ సంబరంలో ప్రదర్శించాడు. రెండు విజయాల తర్వాత 6 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్న భారత్ తమ చివరి పోరులో గురువారం లెబనాన్‌తో తలపడుతుంది.

సినిమా

సంక్రాంతికి ఈగిల్

మోస్ట్ వాంటెడ్ పెయింటర్, పత్తి పండించే రైతు, 'రా' ఏజెన్సీ పట్టుకోవాలనుకుంటున్న మనిషి... ఇలా ఒకే వ్యక్తి గురించి విభిన్న కథలు వినిపిస్తున్నాయి? అసలు అతను ఎవరు? అతని నిజస్వరూపం ఏంటి? అనేది 'ఈగిల్' సినిమాలో తెలుస్తుంది. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'ఈగిల్'. అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలో నవదీప్, మధుబాల కీలక పాత్రలు పోషిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'ఈగిల్' సినిమా గురించి అధికారికంగా ప్రకటించి, వీడియోను విడుదల చేయడంతో పాటు సినిమాను సంక్రాంతికి విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది చిత్ర యూనిట్. ఈ సినిమాకు సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: దవ్‌జాంద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సుజిత్ కుమార్ కొల్లి.



● 'ఈగిల్' పోస్టర్

పవర్‌ఫుల్ భీమా

పవర్‌ఫుల్ పోలీసాఫీసర్ 'భీమా'గా గోపీచంద్ చార్జ్ తీసుకున్నారు. గోపీచంద్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'భీమా'. ఈ చిత్రంతో కన్నడ దర్శకుడు ఎ. హర్ష తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధా మోహన్ నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్‌ని ప్రకటించి, ఫస్ట్ లుక్‌ని సోమవారం విడుదల చేశారు. ''పోలీసాఫీసర్‌గా ఇంటెన్స్ రోల్‌లో గోపీచంద్ కనిపిస్తారు. ఆయన పాత్రలో వైల్డ్‌నెస్ కనిపిస్తుంది. యాక్షన్ అంశాలకు కుటుంబ భావోద్వేగాలు మిళితమైన చిత్రం ఇది. మిగతా వివరాలను త్వరలోనే వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్, కెమెరా: స్వామి జె. గౌడ.



● గోపీచంద్

అలీకి పద్మశ్రీ రావాలి - నటి రాజశ్రీ




● రాజశ్రీ, జుబేదా, అలీ, శ్రీలక్ష్మి, గీత

''బాలనటుడిగా కెరీర్‌ని ప్రారంభించి నలభై ఐదేళ్లుగా అగ్ర హాస్య నటుడుగా కొనసాగుతున్న అలీ కారణజన్ముడు. అతనికి పద్మశ్రీ అవార్డు వస్తే చూడాలని ఉంది'' అని సీనియర్ నటి రాజశ్రీ అన్నారు. సంగమం ఫౌండేషన్, వివేకానంద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'కామెడీ ఫెస్టివల్' నిర్వహించారు. ఇందులో భాగంగా నటుడు అలీని 'సంగమం-వివేకానంద జీవిత సాఫల్య పురస్కారం' అవార్డుతో సత్కరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజశ్రీ మాట్లాడుతూ-''అలీ ఎంత మంచి నటుడో అంత మంచి వ్యక్తి కూడా. తనలోని సేవాగుణం స్ఫూర్తినిస్తుంది'' అన్నారు. కాగా అలనాటి హీరో కాంతారావు కుమారుడు రాజా, వ్యాపారవేత్త రాజశేఖర్‌లు హాస్యనటి పాకీజా, కళాకారిణి హేమకుమారిలకు ఒకొక్కరికి రూ. 25000 ఆర్థిక సాయం అందించారు. వివేకానంద హాస్పిటల్స్ అధినేత డా. గీత, నటుడు తనికెళ్ల భరణి, 'సంగమం' సంజయ్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రేయసి రాఖీ కడితే...

కాలేజ్ డేస్‌లో బాలసుబ్రహ్మణ్యం (బాలు) ఓ అమ్మాయిని ప్రేమిస్తాడు. కానీ ఆ అమ్మాయి స్టూడెంట్స్ అందరి ముందు బాలూకి రాఖీ కడుతుంది. అప్పటి నుంచి ఎవరైనా అమ్మాయి తనను ప్రేమిస్తుందని తెలిస్తే చాలు వెంటనే ఆ అమ్మాయి చేత రాఖీ కట్టించుకుంటుంటాడు బాలు. మరి.. ఎలాంటి ఘటనలతో బాలు జీవితం మళ్లీ ప్రేమవైపు మలుపు తిరుగుతుంది? అనేది తెలుసుకోవాలంటే 'సామజవరగమన' సినిమా చూడాల్సిందే. ఈ చిత్రంలో బాలు పాత్రలో శ్రీవిష్ణు నటించారు. రెబా మోనికా జాన్ హీరోయిన్. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ సమర్పణలో రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్, సహనిర్మాత: బాలాజీ గుత్తా.



● శ్రీవిష్ణు

హంసలదీవిలో...

సాహస్, దీపికా హీరో హీరోయిన్లుగా నటించిన సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ '7:11'. చైతూ మాదాలను దర్శకునిగా పరిచయం చేస్తూ, ఆర్కస్ ఫిల్మ్స్ పతాకంపై నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించారు. ఈ నెల 30న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లుగా సోమవారం ప్రకటించారు. మైత్రీ ద్వారా ఈ సినిమా విడుదల కానుంది. ''టైమ్ ట్రావెల్ బ్యాక్‌డ్రాప్‌తో హంసలదీవిలో జరిగే వివిధ ఘటనల సమాహారంగా ఈ సినిమా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



● సాహస్

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

మనోజ్ బాజ్‌పాయ్ నటించిన తాజా హిందీ చిత్రం 'సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై'. అపూర్వ్ సింగ్ కర్కీ దర్శకత్వంలో జీ స్టూడియోస్, వినోద్ భన్సాలి, కమలేష్ భన్సాలి, విశాల్ గుర్నాని, ఆసిఫ్ షేక్ నిర్మించారు. ఈ చిత్రం ఇటీవల ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో, ప్రస్తుతం థియేటర్స్‌లో కూడా ప్రదర్శితమవుతోంది. తెలుగు, తమిళ భాషల్లో ఈ సినిమా జూన్ 7 నుంచి వీక్షకుల ముందుకు వచ్చింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో మనోజ్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ- ''ఈ సినిమాలో నేను చేసిన లాయర్ సోలంకి పాత్ర సామాన్య ప్రజలకు దగ్గరగా ఉంటుంది. అందుకే బాగా కనెక్ట్ అవుతున్నారు. కథపరంగా విలన్‌పై ఎక్కువగా ఫోకస్ పెట్టకుండా ఓ పదహారేళ్ల అమ్మాయి అనుభవిస్తున్న బాధ, ఆమె తరఫున న్యాయ పోరాటం చేస్తున్న సోలంకిల కోణంలోనే చూపించే ప్రయత్నం చేశాం. న్యాయవ్యవస్థకు అద్దం పట్టేలా ఈ సినిమాను తెరకెక్కించాం. పోక్సో చట్టంపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి. మంచి స్క్రిప్ట్ దొరికితే మళ్లీ తెలుగులో సినిమా చేస్తాను'' అన్నారు.



● మనోజ్ బాజ్‌పాయ్

ఆర్జీవీ డెన్ వారి కోసమే! - రామ్‌గోపాల్ వర్మ

"చిత్ర పరిశ్రమకి రావాలని ఎంతోమందికి ఉంటుంది. వారిలో చాలామంది ప్రతిభావంతులుంటారు. కానీ, వారికి ఇండస్ట్రీకి ఎలా రావాలి? ఎవర్ని సంప్రదించాలి? ఎవరు అవకాశం ఇస్తారు? అనేది తెలియదు. ప్రతిభ ఉన్న కొత్తవారిని ప్రోత్సహించేందుకే 'ఆర్జీవీ డెన్'ని ఏర్పాటు చేశాను. ఈ డెన్ ప్రతిభావంతులను తీర్చిదిద్దే క్రియేటివ్ హబ్ అవుతుంది" అని డైరెక్టర్ రామ్‌గోపాల్ వర్మ అన్నారు. ఇండస్ట్రీకి రావాలనుకునే కొత్తవారికి అవకాశాలు ఇచ్చేందుకు 'ఆర్జీవీ డెన్' అనే కార్యాలయాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించారాయన. ఈ సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూలో రామ్‌గోపాల్ వర్మ చెప్పిన విశేషాలు.

గతంలో ముంబైలో 'ఆర్జీవీ కంపెనీ'ని ప్రారంభించారు. ఇప్పుడేమో హైదరాబాద్‌లో 'ఆర్జీవీ డెన్' ఏర్పాటు చేశారు. ఈ డెన్ గురించి...

వర్మ: కొత్తవారికి ఓ ప్లాట్‌ఫామ్ ఇవ్వాలనే 'ఆర్జీవీ డెన్' ఆరంభించాను. నేనేంటో, నా మనస్తత్వం ఏంటో చూపించడానికి కూడా 'ఆర్జీవీ డెన్' ఉపయోగపడుతుంది. ఈ కార్యాలయానికి వచ్చి, చూశాక నాతో పని చేయాలనుకునేవారు వస్తారు.. వద్దనుకునే వాళ్లు పారిపోతారు (నవ్వుతూ). ఇప్పటి వరకూ నేను చేయని జోనర్స్‌లో దాదాపు పది సినిమాలు కొత్తవారి ద్వారా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాను.



ఇలా కెరీర్ గురించి పక్కా ప్రణాళికలు వేసుకుంటున్న మీరు వ్యక్తిగతంగా బంధాలకు దూరంగా ఉన్నారెందుకు?

కుటుంబం, దేవుడు, సమాజం.. ఈ మూడింటికీ నేను విలువ ఇవ్వను. కానీ, మనుషులకు విలువ ఇస్తాను. మా అమ్మ, నా కూతురు అంటే నాకు ద్వేషం లేదు. ఓ మనిషిగా వాళ్లను గౌరవిస్తాను. కానీ, ఆ బంధాల్లోనే ఉండిపోవడం నాకు ఇష్టం ఉండదు. నేను ప్రేమిస్తాను. కానీ, ఎదుటి వాళ్లు నన్ను ప్రేమిస్తే నాకు బరువుగా ఉంటుంది.

రాజకీయాలంటే ఇష్టం లేదని పలు సందర్భాల్లో మీరు అన్నారు. కానీ, ఆ నేపథ్యంలో సినిమాలు తీస్తుంటారు?

నా కెరీర్‌లో రాజకీయ నేపథ్యంలో మూడు సినిమాలే తీశాను. గతంలో 'సర్కార్, లక్ష్మీస్ ఎన్టీఆర్' సినిమాలు తీశా. ఇప్పుడు 'వ్యూహం' చిత్రం తీస్తున్నాను. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్ సినిమాలు ఎలక్షన్ సీజన్‌లోనే సేల్ అవుతాయి. 'వ్యూహం' తర్వాత మరో ఐదేళ్ల పాటు రాజకీయ నేపథ్యంలో సినిమాలు చేయను.

'వ్యూహం' కథేంటి? ఎంతవరకు వచ్చింది?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిగారి వ్యక్తిత్వం అంటే నాకు వ్యక్తిగతంగా చాలా ఇష్టం. మాట ఇస్తే దాని కోసం ఎంతవరకైనా కట్టుబడి ఉంటారాయన. వైఎస్ రాజశేఖర రెడ్డిగారు చనిపోయాక జగన్‌గారిని తొక్కేయాలని కొందరు కుట్రలు పన్నారు. జగన్‌గారి జీవితంలో 2009 నుంచి 2014 ఎన్నికల వరకు ఏం జరిగింది? ఎలాంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి? అన్నది 'వ్యూహం' తొలి భాగంలో చూపిస్తాను. ఈ చిత్రానికి తొలుత 'కుట్ర' అని టైటిల్ అనుకున్నా.. అయితే చీప్‌గా ఉంటుందని 'వ్యూహం'గా మార్చాను. షూటింగ్ 30 శాతం పూర్తయింది.. సెప్టెంబరులో రిలీజ్ అవుతుంది.

'వ్యూహం' రెండో భాగం కూడా ఉందన్నారు?

2015 నుంచి 2023 అక్టోబర్ వరకు జగన్‌గారి జీవితంలోని అంశాల నేపథ్యంలో 'వ్యూహం 2' ఉంటుంది. జగన్‌గారు ఆఫ్ స్క్రీన్‌లో ఎలా ఉంటారు? ఆయన వ్యక్తిత్వం ఏంటి? వంటి అంశాలు చూపించబోతున్నాను. 2024 ఫిబ్రవరిలో 'వ్యూహం 2' చిత్రాన్ని విడుదల చేస్తాం.

వ్యక్తిగతంగా, వృత్తిపరంగా మీపై వచ్చే ట్రోల్స్ గురించి ఏమంటారు?

నన్ను ట్రోల్స్ చేయడాన్ని నేను చాలా ఎంజాయ్ చేస్తాను. నేను ఏదైనా ఓ ట్వీట్ చేసినా, మాట్లాడినా కొందరు విపరీతమైన ట్రోల్స్ చేస్తుంటారు. దాని ద్వారా గంటల కొద్దీ వారి విలువైన సమయం వృథా అవుతుంది.. అందులోనే నాకు ఆనందం ఉంది.

మీరు సివిల్ ఇంజినీర్ కదా? డైరెక్టర్ అయ్యాక ఎప్పుడైనా ఇండస్ట్రీకి వచ్చి తప్పు చేశాననిపించిందా?

అలా ఎప్పుడూ అనిపించలేదు. ఇండస్ట్రీలో నేను సంతృప్తిగానే ఉన్నాను.

మీ జీవితంలో ఏ విషయంలో అయినా పశ్చాత్తాపం?

లేదు. నేను ఏది చేసినా ఆ తర్వాత ఇలా చేశానేంటి? అని పశ్చాత్తాపపడలేదు.

దేవుడంటే నమ్మకం లేదంటారు? అనుకోకుండా దేవుడు ప్రత్యక్షమై వరమిస్తే ఏం కోరుకుంటారు?

దేవుడు ప్రత్యక్షమైతే ముందుగా భయపడతాను.. (నవ్వుతూ). ఎందుకంటే సడన్‌గా వెంకటేశ్వర స్వామి ముందుకు వచ్చి, 'నేను వెంకటేశ్వర స్వామిని.. నీకు ఏ వరం కావాలో కోరుకో' అంటే నమ్ముతామా? నేను, మీరు, ఎవరైనా అంతే.. భయపడతాం.

రాజకీయాలపై మీకు ఆసక్తి లేకపోయినా 'ఒకే ఒక్కడు' సినిమాలోలా ఒక్క రోజు ముఖ్యమంత్రిగా అవకాశం వస్తే ఏం చేస్తారు?

మొదటిది.. ఇప్పుడున్న విద్యా వ్యవస్థను మార్చుతాను. రెండోది.. నా ఆలోచనలన్నింటినీ సమాజంపై రుద్దుతాను. మూడోది.. ప్రస్తుతం ఉన్న సొసైటీని డిస్టర్బ్ చేస్తాను (నవ్వుతూ).

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	99	62,725
నిఫ్టీ ▲	38	18,602

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	13,362	▲ 102
డోజోన్స్	33,994	▲ 117
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,571	▲ 8
డాక్స్	16,098	▲ 148
షాంఘై	3,229	▼ 3
నికాయ్	32,434	▲ 169

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,921
బంగారం (99.5 స్వచ్ఛత)	59,682
వెండి (కేజీ)	73,432



ఐటీ, ఇంధన షేర్లకు డిమాండ్

- రెండు రోజుల నష్టాలకు బ్రేక్
- సెన్సెక్స్ లాభం 99 పాయింట్లు
- 18,600 పైకి నిఫ్టీ

ముంబై: ఐటీ, ఇంధన షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం లాభాలతో ముగిశాయి. దీంతో సూచీల రెండురోజుల నష్టాలకు బ్రేక్ పడింది. దేశీయంగా రిటైల్, టోకు ద్రవ్యోల్బణ, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడితో పాటు అంతర్జాతీయంగా ఫెడ్ రిజర్వ్, ఈసీబీ, బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య పరపతి సమావేశాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయంగా కీలక పరిణామాల నేపథ్యంలో సూచీలు ట్రేడింగ్‌లో పరిమిత శ్రేణిలో లాభ నష్టాల మధ్య ట్రేడయ్యాయి. సెన్సెక్స్ ఉదయం 34 పాయింట్ల లాభంతో 62,660 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 190 పాయింట్ల పరిధిలో 62,805 వద్ద గరిష్టాన్ని, 62,615 వద్ద కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 99 పాయింట్ల స్వల్పలాభంతో 62,725 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 32 పాయింట్లు పెరిగి 18,595 ట్రేడింగ్‌ను ప్రారంభించింది. రోజంతా 18,560 – 18,634 శ్రేణిలో కదలాడింది. ఆఖరికి 38 పాయింట్లు బలపడి 18,602 వద్ద ముగిసింది. ఐటీ, ఇంధన రంగాలతో పాటు రియల్టీ, మెటల్, ఎఫ్ఎంసీజీ, ప్రభుత్వరంగ బ్యాంక్ షేర్లకు సైతం కొనుగోళ్ల మద్దతు లభించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

13-6-2023	
విశాఖ	515–00
చిత్తూరు	573–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	475–00
రిటైల్ ధర (డజను)	72.00
12-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

ఆర్థిక వ్యవస్థ శుభ సంకేతాలు

- మేలో రిటైల్ ద్రవ్యోల్బణం 4.25 శాతం
- రెండేళ్ల కనిష్ట స్థాయి
- ఏప్రిల్ పారిశ్రామిక వృద్ధి 4.2 శాతం



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో తాజా గణాంకాలు ఉత్సాహాన్ని నింపాయి. వినియోగ ధరల సూచీ (సీపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం మేలో 4.25 శాతంగా నమోదయ్యింది. అంటే 2022 మేతో పోల్చితే 2023 మేలో రిటైల్ ధరల బాస్కెట్ 4.25 శాతమే పెరిగిందన్నమాట. గడచిన రెండేళ్ల కాలంలో ఇంత తక్కువ స్థాయి రిటైల్ ద్రవ్యోల్బణం గణాంకాలు వెలువడ్డం ఇదే తొలిసారి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రెపో రేటు (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు– ప్రస్తుతం 6.5 శాతం) నిర్ణయానికి ప్రాతిపదిక అయిన రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న ప్రకారం 2 ప్లస్ లేదా 2 మైనస్‌తో 4 శాతం వద్ద ఉండాలి. అంటే 6 శాతం పైబడకూడదు. అయితే 2022 నవంబర్, డిసెంబర్, 2023 మార్చి, ఏప్రిల్, మే మినహా మిగిలిన అన్ని నెలలూ 6 శాతం ఎగువనే రిటైల్ ద్రవ్యోల్బణం కొనసాగింది. తాజా సమీక్షా నెల్లో 2021 ఏప్రిల్ కనిష్టాన్ని (4.23 శాతం) చూసింది. గడచిన నాలుగు నెలల నుంచీ రిటైల్ ద్రవ్యోల్బణం తగ్గుతూ వస్తుండగా, వరుసగా మూడవనెల నిర్దేశిత 6 శాతం దిగువన నమోదయ్యింది. ద్రవ్యోల్బణం భయాల నేపథ్యంలో గత మేలో 4 శాతంగా ఉన్న రెపో రేటును ఆర్‌బీఐ 6.5 శాతానికి పెంచింది. ద్రవ్యోల్బణం అదుపు నేపథ్యంలో గడచిన రెండు త్రైమాసికాల్లో యథాతథంగా కొనసాగించింది. తాజా గణాంకాల ధోరణి కొనసాగితే, ఆర్‌బీఐ 2023లో రెపో రేటును పెంచే అవకాశం లేదని నిపుణులు భావిస్తున్నారు. కాగా ఏప్రిల్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం రేటు 4.7 శాతం కాగా, గత ఏడాది మే నెల్లో 7.04 శాతంగా ఉంది.

కీలకాంశాలు ఇవీ...

- ఒక్క ఆహార విభాగాన్ని పరిశీలిస్తే, మే నెల్లో రిటైల్ ద్రవ్యోల్బణం 2.91 శాతంగా ఉంది. ఏప్రిల్‌లో ఇది 3.84 శాతం. మొత్తం సూచీలో దీని వెయిటేజ్ దాదాపు 50 శాతం. ఆయిల్, ఫ్యాట్స్ ధరల స్పీడ్ తాజా సమీక్షా నెల్లో 16 శాతం తగ్గింది. కూరగాయల ధరలు 8.18 శాతం దిగివచ్చాయి. అయితే తృణధాన్యాలు, పప్పుదినుసుల ధరలు వరుసగా 12.65 శాతం, 6.56 శాతంగా ఉన్నాయి.
- ఫ్యూయెల్ లైట్ విభాగంలో ధరల స్పీడ్ ఏప్రిల్‌లో 5.52% ఉంటే, మేలో 4.64 శాతం.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం సగటున 5.1 శాతంగా ఉంటుందని ఆర్‌బీఐ అంచనా. జూన్ త్రైమాసికంలో 4.6 శాతంగా ఉంటుందని భావిస్తోంది.

ఏప్రిల్‌లో తయారీ, మైనింగ్ చక్కని పనితీరు

ఆర్థిక సంవత్సరం (2023–24) తొలి నెల ఏప్రిల్‌లో పారిశ్రామిక రంగం మంచి ఫలితాన్ని నమోదుచేసింది. పారిశ్రామిక ఉత్పత్తి సూచీ (సీపీఐ) వృద్ధి రేటు 4.2 శాతంగా నమోదయ్యింది. తయారీ, మైనింగ్ రంగాలు మంచి వృద్ధిరేటును నమోదుచేసుకున్నట్లు అధికారిక గణాంకాలు తెలిపాయి. 2023 మార్చితో పోల్చితే (1.7 శాతం వృద్ధి) గణాంకాల తీరు బాగున్నప్పటికీ, 2022 ఏప్రిల్‌తో పోల్చితే (6.7 శాతం) వృద్ధి రేటు తక్కువగా ఉండడం గమనార్హం. అయితే అప్పటి గణాంకాల్లో బేస్ తక్కువగా ఉండడం మరోఅంశం. జాతీయ గణాంకాల కార్యాలయం విడుదల చేసిన తాజా అంకెలను పరిశీలిస్తే...

రంగాల వారీగా ఏప్రిల్ పారిశ్రామిక ఉత్పత్తి గణాంకాలు (క్రితం గణాంకాలతో పోల్చి.. శాతాల్లో)

	2023 ఏప్రిల్	2023 మార్చి	2022 ఏప్రిల్
తయారీ	4.9	0.5	5.6
మైనింగ్	5.1	6.8	8.4
విద్యుత్	1.1	– 1.6	11.8
క్యాపిటల్ గూడ్స్	6.2	8.1	12
కన్జూమర్ డ్యూరబుల్స్	– 3.5	–8.4	7.2
కన్జూమర్ నాన్ డ్యూరబుల్స్	10.7	–3.1	–0.8
ఇన్‌ఫ్రా/నిర్మాణం	12.8	5.4	4.0
ప్రైమరీ గూడ్స్	– 1.9	3.3	10.3
ఇంటర్మీడియట్ గూడ్స్	0.8	–0.1	7.1



రేటింగ్ అప్‌గ్రేడ్‌పై ఆర్థికశాఖ దృష్టి

16న మూడీస్‌తో అధికారుల భేటీ

న్యూఢిల్లీ: భారత్ సార్వభౌమ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసుకోవడంపై కేంద్రం మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా జూన్ 16న రేటింగ్ ఏజెన్సీ మూడీస్ ఇన్వెస్టర్స్ సర్వీస్‌తో ఆర్థిక శాఖ అధికారులు భేటీ కానున్నారు. భారత ఆర్థిక మూలాలు పటిష్టంగా ఉండటం, కొనసాగుతున్న ఆర్థిక సంస్కరణలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తుండటం, దాదాపు 600 బిలియన్ డాలర్ల విదేశీ మారక నిల్వలు తదితర సానుకూల అంశాలను వివరించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం భారత్‌కు అతి తక్కువ స్థాయి పెట్టుబడుల రేటింగ్ ఉంది.

ఎగవేతదారులతో సెటిల్మెంట్

ముంబై: మొండిపద్దుల నుంచి బ్యాంకులు సాధ్యమైనంత ఎక్కువగా రాబట్టుకునేందుకు వీలు కల్పించడంపై రిజర్వ్ బ్యాంక్ దృష్టి పెట్టింది. ఉద్దేశపూర్వక ఎగవేతలు, మోసపూరిత ఖాతాల విషయంలో రాజీ కుదుర్చుకుని, మొండిబాకీలను సెటిల్ చేసుకోవడానికి బ్యాంకులకు అనుమతి ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ప్రకారం రాజీ సెటిల్మెంట్లను చేపట్టే క్రమంలో ఉద్దేశపూర్వక ఎగవేతలు, సాంకేతిక రైటాఫ్‌ల అంశాల్లో పాటించాల్సిన ప్రక్రియలకు సంబంధించి బోర్డు ఆమోదిత పాలసీలను నియంత్రిత సంస్థలన్నీ (ఆర్‌ఈ) అమలు చేయాల్సి ఉంటుంది. ఏయే పరిస్థితుల్లో రాజీ యత్నాలు చేయవచ్చనేది వాటిలో నిర్దిష్టంగా పేర్కొనాలి. కనీస బాకీ వ్యవధి, తనఖా పెట్టిన ఆస్తుల విలువ కరిగిపోవడం మొదలైన వాటిని పరిగణనలోకి తీసుకోవాలి. నోటిఫికేషన్ అంశాలు..

- ఇలాంటి కేసుల్లో ఉద్యోగుల జవాబుదారీతనాన్ని పర్యవేక్షించేందుకు తగు వ్యవస్థ ఉండాలి. బాకీ పరిమాణం, కాలపరిమితులు మొదలైనవి బోర్డు నిర్ణయిస్తుంది. ఉద్దేశపూర్వక ఎగవేతదారులు లేదా మోసపూరిత ఖాతాలంటూ వర్గీకరించిన ఖాతాల విషయంలో, రుణదాతలపై క్రిమినల్ చర్యలతో సంబంధం లేకుండా, ఆర్‌ఈలు రాజీ సెటిల్మెంట్ చేసుకోవచ్చు.
- రాజీ సెటిల్మెంట్ విషయంలో తనఖా ఉంచిన ఆస్తి (ఏదైనా ఉంటే) నుంచి ప్రస్తుతం రాబట్టుకోగలిగే మొత్తాన్ని సముచిత రీతిలో మదింపు చేసి, ఎంత మొత్తం వదులుకోవచ్చు, ఎంతకు సెటిల్ చేసుకోవచ్చు అనే నిబంధనలను పాలసీలో పొందుపర్చాలి. తనఖా పెట్టిన వాటి నుంచి రాబట్టుకోగలిగే విలువను లెక్కించే విధానాన్ని కూడా నిర్దేశించాలి.
- ఆర్‌ఈకి ప్రయోజనం చేకూర్చేలా మొండిబాకీల నుంచి తక్కువ ఖర్చులో, అత్యధికంగా రాబట్టాలనేది లక్ష్యంగా ఉండాలి.రాజీ సెటిల్మెంట్ చేసుకున్న రుణగ్రహీతలకు ఆర్‌ఈలు నిర్దిష్ట వ్యవధి తర్వాతే మళ్లీ కొత్తగా రుణాలివ్వడానికి వీలుంటుంది.

ఏఐతో కొత్త అవకాశాలు.. ప్రైవసీకి సవాళ్లు

జీ20 షెర్పా అమితాబ్ కాంత్

పాంజిమ్: కృత్రిమ మేధ (ఏఐ)తో మానవాళి అభివృద్ధికి కొత్త అవకాశాలు లభించగలవని జీ20 షెర్పా అమితాబ్ కాంత్ తెలిపారు. పనితీరు, పరివర్తనలో సాంకేతికత కీలకపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. సమాచార సేకరణ, ప్రాసెసింగ్, వితరణ ప్రక్రియ అంతా వేగంగా, సమర్థమంతంగా నిర్వహించేందుకు తోడ్పడుతోందని రెండో జీ20–ఎస్ఏఐ (సుప్రీం ఆడిట్ ఇన్‌స్టిట్యూషన్) సదస్సులో పాల్గొన్న సందర్భంగా తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ), నకిలీ వార్తలపరమైన సవాళ్లు తలెత్తవచ్చని ఆయన చెప్పారు.

విద్య,ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీ- కేడెట్ ఎంట్రీ స్కీమ్

ఇండియన్ నేవీ.. ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు(10+2 క్యాడెట్ ఎంట్రీ) స్కీమ్‌లో అవివాహిత పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను కోరుతోంది. కేరళ రాష్ట్రం ఎజిమలలోని ఇండియన్ నేవల్ అకాడెమీలో శిక్షణ ఉంటుంది.

» **కోర్సు వివరాలు:** 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్
» **బ్రాంచ్ వివరాలు:** ఎగ్జిక్యూటివ్ అండ్ టెక్నికల్ కోర్సు
» **మొత్తం ఖాళీలు:** 30 (మహిళలకు 09)
» **విద్యార్హత:** ఇంటర్మీడియెట్‌లో ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులలో కనీసం 70 శాతం మార్కులు సాధించాలి. ఇంగ్లిష్‌లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **ఎంపిక విధానం:** జేఈఈ మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఇంటర్వ్యూ నిర్వహిస్తుంది.
» **వయసు:** అభ్యర్థులు 2004 జూలై 02 నుంచి 2007 జనవరి 1 మధ్య జన్మించి ఉండాలి.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది:** 30.06.2023
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

తెలంగాణ ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలు

తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ గురుకుల సొసైటీ.. ఎస్సీ గురుకుల కళాశాలల్లో(నాన్ సీవోఈ కాలేజీలు) 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి జనరల్, ఒకేషనల్ గ్రూపుల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **గ్రూపులు:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ, వొకేషనల్.
» **అర్హత:** 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000 (పట్టణ విద్యార్థులు), రూ.1,50,000(గ్రామీణ విద్యార్థులకు) మించకూడదు.
» **ఎంపిక విధానం:** పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023
» **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

నిట్ వరంగల్‌లో ఎంబీఏ ప్రవేశాలు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.. 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంబీఏ కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 28 సీట్లు
» **అర్హత:** 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు వ్యాలిడ్ క్యాట్/మ్యాట్ స్కోర్ సాధించి ఉండాలి.
» **ఎంపిక విధానం:** క్యాట్/మ్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023
» **షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 22.06.2023.
» **గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ తేది:** 03.07.2023
» **తుది ఫలితాల వెల్లడి తేది:** 05.07.2023.
» **వెబ్‌సైట్:** www.nitw.ac.in

ఐఏవీ, కేరళలో పీహెచ్‌డీ ప్రవేశాలు

కేరళలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ వైరాలజీ(ఐఏవీ).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **విభాగాలు:** జనరల్ వైరాలజీ విభాగం, వైరల్ డయాగ్నస్టిక్స్ విభాగం, వైరల్ వ్యాక్సిన్ల విభాగం, యాంటీవైరల్ డ్రగ్ రీసెర్చ్ విభాగం, వైరస్ అప్లికేషన్ విభాగం.
» **అర్హత:** ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్)/ఎంవీఎస్సీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులవ్వాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.06.2023
» **వెబ్‌సైట్:** www.iav.kerala.gov.in

సీఎఫ్‌టీఆర్ఐ, మైసూరులో ఎమ్మెస్సీ ప్రవేశాలు

మైసూరులోని సీఎస్ఐఆర్–సెంట్రల్ ఫుడ్ టెక్నాలజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎఫ్‌టీఆర్ఐ).. 2023–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 34
» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో బ్యాచిలర్ డిగ్రీ (సైన్స్/అగ్రికల్చర్ /ఇంజనీరింగ్ /టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 22.06.2023
» **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:** 12.07.2023.
» **ప్రవేశ పరీక్ష తేది:** 23.07.2023.
» **వెబ్‌సైట్:** www.cftri.res.in

అలీ యావర్ జంగ్ ఇన్‌స్టిట్యూట్, ముంబైలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ముంబైలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిజేబిలిటీస్(దివ్యాంగజన్).. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఏవైజేఎన్ ఐఎస్‌హెచ్‌డీడీ క్యాంపస్‌లలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **క్యాంపస్‌లు:** ముంబై, కోల్‌కతా, సికింద్రాబాద్, జన్లా, భోపాల్.
» **కోర్సుల వివరాలు:** ఎమ్మెస్సీ(ఆడియాలజీ)–రెండేళ్లు; ఎమ్మెస్సీ(స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ)–రెండేళ్లు; డిగ్రీ(ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ)–నాలుగేళ్లు; డిప్లొమా(హియరింగ్, లాంగ్వేజ్ అండ్ స్పీచ్)–ఏడాది; ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)–రెండేళ్లు; బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)–రెండేళ్లు; డీఎడ్ స్పెషల్ ఎడ్యుకేషన్(హియరింగ్ ఇంపెయిర్‌మెంట్)–రెండేళ్లు; డిప్లొమా ఇన్ ఇండియన్ సైన్ లాంగ్వేజ్ ఇంటర్‌ప్రెటర్ కోర్సు–రెండేళ్లు; పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆడిటరీ వెర్బల్ థెరపీ–ఏడాది; పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ రిహాబిలిటేషన్ సైకాలజీ–ఏడాది; డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్స్)–రెండేళ్లు; డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ)–రెండేళ్లు.
» **అర్హత:** కోర్సును అనుసరించి 10+2, డిగ్రీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **ఎంపిక విధానం:** ప్రవేశ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023
» **ప్రవేశ పరీక్ష తేదీలు:** 08.07.2023, 15.07.2023, 30.07.2023.
» **వెబ్‌సైట్:** www.ayjnihh.nic.in

ఆర్‌బీఐలో 35 జూనియర్ ఇంజనీర్ పోస్టులు

ముంబయి ప్రధాన కేంద్రంగా గల రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ).. వివిధ విభాగాల్లో జూనియర్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
» **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్ (సివిల్)–29, జూనియర్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్)–06
» **అర్హత:** డిప్లొమా సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్‌లలో 65 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 55 శాతం ఉండాలి). సంబంధిత విభాగంలో ఏడాది నుంచి రెండేళ్ల అనుభవం తప్పనిసరి.
» **వయసు:** 01.06.2023 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్యలో ఉండాలి(ఎస్సీ,ఎస్టీ, బీసీలకు మినహాయింపు ఉంటుంది.)
» **వేతనం:** రూ.33,900 – రూ.71,032
» **ఎంపిక విధానం:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
» **దరఖాస్తు చివరి తేది:** 30.06.2023
» **పరీక్ష తేది:** 15.07.2023
» **వెబ్‌సైట్:** www.rbi.org.in

ఇంటర్‌తో నేవీలో అగ్నివీరులు

నౌకదళంలో అగ్నివీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. దీనిద్వారా ఎస్ఎస్ఆర్, ఎంఆర్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్షలో చూపిన ప్రతిభతోపాటు, ఫిజికల్, మెడికల్ టెస్టుల్లో అర్హత సాధించిన వారిని అగ్నివీరులుగా నియమిస్తారు. వీరికి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది. అనంతరం అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా నాలుగేళ్లపాటు ఇండియన్ నేవీలో సేవలు అందించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. నేవీలో అగ్నివీర్ ఖాళీలు, ఎంపిక విధానం వివరాలు..



- **మొత్తం పోస్టుల సంఖ్య:** ఎస్ఎస్ఆర్–1365(మహిళలకు 273),ఎంఆర్–100(మహిళలకు-20)

అర్హత

- అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు.
- అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) పోస్టులకు దరఖాస్తుకు ఇంటర్మీడియట్/10+2లో ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి సబ్జెక్టులతోపాటు కెమిస్ట్రీ/బయాలజీ /కంప్యూటర్‌ల్లో ఏదైనా ఒక సబ్జెక్టు చదివి ఉండాలి.
- **అగ్నివీర్(ఎంఆర్):** పదోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు.
- **వయసు:** 17 1/2 నుంచి 21ఏళ్ల లోపు ఉండాలి. నవంబర్ 01, 2002 నుంచి ఏప్రిల్ 30, 2006 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు

అన్ని విభాగాలకు పురుషులు 157 సెం.మీ., మహిళలు 152 సెం.మీ ఉండాలి. ఎత్తుకు తగిన బరువు అవసరం. ఊపిరి పీల్చినప్పుడు, వదిలినప్పుడు ఛాతీ వ్యత్యాసం 5 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ఇలా

ఎంపిక ప్రక్రియలో మూడు దశలు ఉంటాయి. రాత పరీక్ష, ఫిజికల్, మెడికల్ టెస్టులు నిర్వహిస్తారు. ఈ మూడింటిలో అర్హత సాధించిన వారినే తుదిగా ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

ఎస్ఎస్ఆర్ అర్హత పరీక్షలు

- ఈ పోస్టులకు సంబంధించి రెండు స్టేజ్‌లుగా అర్హత పరీక్షలు నిర్వహిస్తారు. స్టేజ్–1 రాత పరీక్షలో అర్హత సాధించిన వారికి మాత్రమే స్టేజ్–2 రాత పరీక్ష, మెడికల్ టెస్టులకు అనుమతిస్తారు. స్టేజ్ 1కు సంబంధించిన రాత పరీక్ష, సిలబస్ వివరాలు ఇండియన్ నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో చూడొచ్చు.
- **స్టేజ్–1:** ఈ పరీక్ష ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. ఇంగ్లిష్, సైన్స్, మ్యాథ్స్, జనరల్ అవేర్‌నెస్.. ఇలా నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి ప్రశ్నకు ఒక మార్కును కేటాయిస్తారు. పొరపాటుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు చొప్పున కోతవేస్తారు. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీలో ఉంటాయి. ప్రతి విభాగంలో కనీస అర్హత మార్కులు సాధించడం తప్పనిసరి.

ఎంఆర్ రాత పరీక్ష

ఈ పరీక్షను ఆన్‌లైన్(సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. సైన్స్ అండ్ మ్యాథమెటిక్స్, జనరల్ అవేర్‌నెస్ రెండు విభాగాల నుంచి 50 ప్రశ్నలు–50 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి పావు మార్కు తగ్గిస్తారు. ఇందులో అర్హత సాధించిన వారికి స్టేజ్–2 పరీక్షలుంటాయి. వీరికి ఫిజికల్ స్టాండర్డ్ టెస్టులు, మెడికల్, ట్రెనింగ్ తదితర అన్ని నిబంధనలు అగ్నివీర్(ఎస్ఎస్ఆర్) మాదిరిగానే ఉంటాయి.

ఫిజికల్ టెస్టులు

- మొదటి దశ రాత పరీక్షలో ప్రతిభ చూపిన అభ్యర్థులకు ఫిజికల్ టెస్టులు నిర్వహిస్తారు. ఫిజికల్ టెస్టులకు ఎంపికైన వారు నిర్దేశిత సెలక్షన్ కేంద్రాలకు అవసరమైన సర్టిఫికేట్లతో హాజరవ్వాలి.
- ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్టులో భాగంగా 1.6 కిలోమీటర్ల దూరాన్ని పురుషులు 7 నిమిషాలు, మహిళలు 8 నిమిషాల్లో చేరుకోవాలి. అలాగే పురుషులు 20, మహిళలు 15 గుంజీలు తీయగలగాలి. పురుషులు 12 పుషప్స్, మహిళలు 10 సిట్‌అప్‌లు తీయగలగాలి. వీటిలో అర్హత సాధించిన వారికి మాత్రమే మెడికల్ టెస్టులను నిర్వహిస్తారు. మెడికల్ టెస్టులోనూ అర్హత సాధించిన వారికి తుది ఎంపికగా చేసి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఇస్తారు.

రాత పరీక్ష ప్రిపరేషన్ ఇలా

సిలబస్ 10+2 సీబీఎస్ఈ స్థాయిలో ఉంటుంది. కాబట్టి అభ్యర్థులు సంబంధిత టాపిక్స్‌పై అవగాహన పెంచుకోవాలి. సరైన ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. మాక్ టెస్టులు రాయడం ద్వారా టైమ్ మేనేజ్‌మెంట్ అలవడుతుంది. చేస్తున్న పొరపాట్లు తెలుస్తాయి. ఇంగ్లిష్‌కు సంబంధించి వ్యాకరణంపై పట్టు సాధించాలి. మేథమెటికల్ విభాగంలో మాదిరి ప్రశ్నలు ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి.జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి తాజాగా రక్షణ శాఖలో తీసుకొచ్చిన నూతన సాంకేతికత, సంభవించిన కీలక పరిణామాలపై దృష్టిపెట్టాలి. వీటితోపాటు స్పోర్ట్స్, అవార్డ్స్, బుక్స్, ఎన్నికలు తదితర తాజా సమకాలీనాంశాలపై అవగాహన మేలు చేస్తుంది.

సేవానిధి

ప్రతినెల అగ్నివీరులు అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్(సేవా నిధి)కి జమచేస్తారు. మొదటి ఏడాది ప్రతి నెల రూ.30 వేలు వేతనంగా పొందితే.. అందులో రూ.9 వేలు సేవానిధిలో జమ అవుతుంది. రెండో ఏడాది రూ.33,000 వేతనంగా అందుతుంది. ఇందులో నుంచి రూ.9900 నిధికి జమవుతుంది. అలాగే మూడో ఏడాది రూ.36,500 వేతనం లభిస్తుంది. ఇందులో నుంచి రూ.10,950 నిధికి జమచేస్తారు. ఇలా నాలుగో ఏడాదికి వచ్చేసరికి అగ్నివీరుని రూ.40000 వేతనంలో రూ. 12,000 సేవా నిధికి వెళ్తాయి. మొత్తం నాలుగేళ్ల కాలానికి సేవా నిధిలో రూ.5.02 లక్షలు అగ్నివీరుని వేతనం నుంచి జమవుతాయి. అంతేమొత్తాన్ని ప్రభుత్వమూ జమచేస్తుంది. రెండూ కలిపి రూ. 10.04 లక్షలవుతాయి. దీనికి వడ్డీని కలిపి నాలుగేళ్ల అనంతరం అందజేస్తారు. నాలుగేళ్ల సర్వీస్‌లో మధ్యలో కావాలంటే.. వైదొలిగే అవకాశం కూడా ఉంటుంది. అలాంటి సందర్భంలో వేతనం నుంచి జమ అయిన మొత్తాన్ని అగ్నివీరులకు అందిస్తారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహం మాత్రం వీరికి దక్కదు.

ఇతర ప్రయోజనాలు

అగ్నివీరులకు 30 వార్షిక సెలవులు లభిస్తాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్‌లీవ్‌లు కూడా ఇస్తారు. నాలుగేళ్ల సర్వీస్ కాలంలో రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్సులు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ కవర్ వర్తిస్తుంది. నాలుగేళ్ల సేవలకు గాను వారు పనిచేసిన విభాగాన్ని అనుసరించి అగ్నివీర్ సర్టిఫికేట్ అందుతుంది. వీరికి పింఛను, గ్రాట్యుటీ, కరవు భత్యం, మిలటరీ సర్వీస్ పే(ఎంఎస్‌పీ), ఎక్స్‌సర్వీస్‌మెన్ హోదా వంటివి వర్తించవు. ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) ఉండదు.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 2023, జూన్ 15
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

క్లుప్తంగా...

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ మొదటి, రెండో ఏడాది సప్లిమెంటరీ ఫలితాలను మంగళవారం విడుదల చేయనున్నట్టు ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించింది. సాయంత్రం 5 గంటలకు తాడేపల్లిలోని బోర్డు కార్యాలయంలో కార్యదర్శి శేషగిరిబాబు ఫలితాలను విడుదల చేయనున్నారు.ఫలితాలను సాక్షి డాట్‌కామ్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

19 నుంచి ఆన్‌లైన్‌లో డిగ్రీ అడ్మిషన్లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అండర్ గ్రాడ్యుయేషన్(యూజీ–డిగ్రీ) కోర్సుల్లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదలైంది. విద్యార్థులు ఈనెల 19 నుంచి 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉన్నత విద్యా మండలి కార్యదర్శి నజీర్ అహ్మద్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు. 26 నుంచి 30వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, జూలై 3న సీట్ల కేటాయింపు జరుగుతుందని చెప్పారు. 4వ తేదీ నుంచి డిగ్రీ తరగతులు ప్రారంభమవుతాయని.. ఆ రోజు విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని సూచించారు. దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ తదితర కోటా కింద స్పెషల్ కేటగిరీ సీట్ల భర్తీ కోసం విజయవాడలోని ఎస్‌ఆర్‌ఆర్, విశాఖలోని వీఎస్ కృష్ణా కాలేజీ, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 23 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని తెలిపారు.

ఏపీకి రూ.4,787 కోట్లు

రాష్ట్రాలకు మూడో విడత పన్నుల వాటాలు విడుదల చేసిన కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ : రాష్ట్ర ప్రభుత్వాలకు మూడో విడత పన్నుల వాటాను కేంద్ర ఆర్థిక శాఖ సోమవారం విడుదల చేసింది. అన్ని రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ.1,18,280 కోట్ల మేర విడుదల చేసినట్టు ఆర్థిక శాఖ ప్రకటించింది. ఇందులో ఏపీకి రూ.4,787 కోట్లు, తెలంగాణకు రూ.2,486 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రాలు తమ మూలధనం, అభివృద్ధి వ్యయాలను వేగవంతం చేసేందుకు, ప్రాధాన్యత ప్రాజెక్టులకు నిధులను అందుబాటులో ఉంచేందుకు ఈ నిధులు విడుదల చేసినట్లు పేర్కొంది.

జబర్దస్త్ కమెడియన్ హరి 'ఎర్ర' స్మగ్లర్!

- రూ.60 లక్షల విలువ చేసే ఎర్రచందనం స్వాధీనం
- పరారీలో నిందితుడు

పుంగనూరు (చిత్తూరు జిల్లా): రూ.60 లక్షల విలువ చేసే ఎర్రచందనం దుంగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జబర్దస్త్ కమెడియన్ హరి శేషాచలం నుంచి కర్ణాటక నుంచి విదేశాలకు ఎర్రచందనం తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. శేషాచలం అటవీ ప్రాంతం నుంచి బెంగళూరుకు ఎర్రచందనం రవాణా జరుగుతోందని సమాచారం అందడంతో సీఐ మధుసూదన్‌రెడ్డి , ఎస్‌ఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు మొరంపల్లె వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఆ సమయంలో వచ్చిన రెండు కార్లను నిలిపినపుడు వాటిలోని ఇద్దరు పరారు కాగా, డ్రైవర్ కిషోర్‌ను అదుపులోకి తీసుకుని వాహనాలను తనిఖీ చేశారు. అందులో 650 కేజీల ఏగ్రేడ్ క్వాలిటీ ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో జబర్దస్త్ కమెడియన్ హరి ఈ దుంగలను కర్ణాటకకు తరలిస్తున్నట్లు కిషోర్ తెలిపారు. ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ప్రధాన కీలకపాత్ర పోషిస్తున్న జబర్దస్త్ కమెడియన్ హరి పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అమిత్‌షాకు అవినీతి గురించి మాట్లాడే హక్కు లేదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: అవినీతి గురించి మాట్లాడే నైతిక హక్కు బీజేపీ నేత అమిత్‌షాకు లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈనెల 20 నుంచి 15 రోజులపాటు నిర్వహించనున్న సీపీఎం పాదయాత్రకు సంబంధించిన వాల్ పోస్టర్లను శ్రీనివాసరావు సోమవారం విజయవాడలో ఆవిష్కరించారు. అనంతరం సీపీఎం నాయకులు మంతెన సీతారాం, వి.వెంకటేశ్వర్లుతో కలిసి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రానికి రూ.లక్షల కోట్లు ఇచ్చినట్టు చెబుతున్న కేంద్రం.. పోలవరం పునరావాసానికి రూ.32 వేల కోట్లు అవసరమైతే కేవలం రూ.7 వేల కోట్లే ఎందుకు ఇచ్చిందో చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు గురించి అమిత్‌షా విశాఖ సభలో ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం దారుణమన్నారు. పోలవరం ముంపు గ్రామాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పుడు లెక్కలు చెబుతున్నాయని ఆరోపించారు. పునరావాసంపై దృష్టి పెట్టాలని.. పోలవరం ప్రాజెక్టు డ్యామేజీ ఖర్చును బాధ్యుల నుంచి వసూలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దేశంలోని రాజకీయ పార్టీలను, నాయకులను దారికి తెచ్చుకోవడానికి బీజేపీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు పాల్పడుతోందని శ్రీనివాసరావు మండిపడ్డారు. జనసేన, టీడీపీ, వైఎస్సార్‌సీపీకి బీజేపీ రోడ్ మ్యాప్ ఇచ్చి నడిపిస్తోందని ఆరోపించారు. వారాహి యాత్రలోనైనా రాష్ట్రానికి ప్రత్యేక హోదా అంశంపై ప్రశ్నిస్తావా? అని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను శ్రీనివాసరావు ప్రశ్నించారు.

అక్రమంగా ప్రవేశిస్తే.. మట్టుపెట్టేలా

ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకున్న నేవీ

- విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్ ఏర్పాటు
- శత్రు దేశాల డ్రోన్‌లను నాశనం చేసేలా స్వదేశీ పరిజ్ఞానంతో తయారీ
- నేవీ ఎయిర్‌స్టేషన్లకు 'స్మార్ట్ ఫెన్స్'
- ఐఎన్ఎస్ డేగాలో ప్రారంభం
- హెలికాప్టర్లతో సహా అక్రమంగా ఏది ప్రవేశించినా మట్టుపెట్టే సామర్థ్యం


నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్

సాక్షి, విశాఖపట్నం: శత్రుదేశాల కుయుక్తులను తిప్పికొట్టేందుకు భారత నౌకాదళం ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటోంది. భద్రతా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తోంది. ఇందులో భాగంగా యాంటీ డ్రోన్ సిస్టమ్‌తో పాటు నేవీ ఎయిర్‌ఫీల్డ్‌ను మరింత పక్కాగా నిర్వహించే వ్యవస్థలను అందుబాటులోకి తీసుకొచ్చింది. శత్రుదేశాల డ్రోన్‌లను మట్టుపెట్టేలా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసిన నేవల్ యాంటీ డ్రోన్ సిస్టమ్(ఎన్ఏడీఎస్)ను ఐఎన్ఎస్ డేగాలో సోమవారం తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్ దాస్‌గుప్తా ప్రారంభించారు. భారీ డ్రోన్ల నుంచి తూనీగల పరిమాణంలో ఉన్న మైక్రో డ్రోన్ల వరకు దేనినైనా సరే.. లేజర్ ఆధారిత కిల్ మెకానిజం సహాయంతో గుర్తించి వెంటనే మట్టుపెట్టేలా ఈ వ్యవస్థను రూపొందించారు. భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్) సహకారంతో దీనిని తయారు చేశారు. 360 డిగ్రీల కోణంలో.. 10 కిలోమీటర్ల పరిధిలో ఏ డ్రోన్ ఉన్నా.. దాన్ని జామ్ చేసి.. వివరాలు సేకరించేలా ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్‌లు అమర్చారు. రేడియో ఫ్రీక్వెన్సీ, డిటెక్టర్ల సహకారంతో ఆ డ్రోన్‌లను గ్లోబల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ ద్వారా ఎవరు ఎక్కడి నుంచి కంట్రోల్ చేస్తున్నారనే సమాచారాన్ని క్షణాల్లో సేకరిస్తుంది. సమాచారం వచ్చిన వెంటనే శత్రు డ్రోన్‌ల సిగ్నల్స్‌ను జామ్ చేసి.. దాన్ని నాశనం చేసేలా ఎన్ఏడీఎస్ పనిచేస్తుంది. యుద్ధ నౌకల్లో ఈ యాంటీ డ్రోన్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసేందుకు భారత నౌకాదళం చర్యలు చేపట్టింది.

నేవీ ఎయిర్‌స్టేషన్లకు రక్షణ కవచం

పఠాన్‌కోట్ తరహా ఉగ్రదాడులు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థను కవచంలా ఏర్పాటు చేసుకోవాలని భారత రక్షణ శాఖ నిర్ణయించుకుంది. ఇందులో భాగంగా భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్)తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నేవల్ ఎయిర్ ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ సెక్యూరిటీ సిస్టమ్(ఎన్ఏఐఎస్ఎస్)ను అభివృద్ధి చేశారు. నౌకాదళం ఎయిర్‌స్టేషన్ల పరిధిలోని భద్రతా వ్యవస్థను పూర్తిగా అప్‌గ్రేడ్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో మల్టీ లేయర్ సెక్యూరిటీ సిస్టమ్‌ను అందుబాటులోకి తెచ్చారు. దేశవ్యాప్తంగా మొత్తం 6 నేవీ ఎయిర్‌స్టేషన్లలో ఈ ఎన్ఏఐఎస్ఎస్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గోవాలోని ఐఎన్ఎస్ హన్సా, ముంబైలోని ఐఎన్ఎస్ షిక్రా, అరక్కోణంలోని ఐఎన్ఎస్ రజాలీ, విశాఖలోని ఐఎన్ఎస్ డేగా, పోర్టుబ్లెయిర్‌లోని ఐఎన్ఎస్ ఉత్క్రోష్, కొచ్చిలోని ఐఎన్ఎస్ గరుడను ఎంపిక చేశారు. సోమవారం విశాఖలోని ఐఎన్ఎస్ డేగాలో ఈ కొత్త భద్రతా వ్యవస్థను ప్రారంభించారు. ఈ ఎయిర్‌స్టేషన్‌లో స్మార్ట్ ఫెన్స్‌ను అమర్చారు. దీనిని సీసీ కెమెరాలకు అనుసంధానం చేశారు. ఈ స్మార్ట్ ఫెన్స్ లోపలికి ఎయిర్‌క్రాఫ్ట్, హెలికాప్టర్‌తో సహా ఏది ప్రవేశించినా.. వెంటనే కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేస్తుంది. సెకన్ల వ్యవధిలో మొత్తం వ్యవస్థకు సమాచారం అందజేస్తుంది. అనుమతి లేకుండా అక్రమంగా లోపలికి ఎవరు ప్రవేశించాలని భావించినా వారిని మట్టుపెట్టేలా యాంటీ పెనిట్రేషన్, థర్మల్ సెన్సార్లతో పాటు డ్రోన్ల పర్యవేక్షణతో పహారా ఏర్పాటు చేశారు. ఎయిర్‌స్టేషన్‌కు దాదాపు 2 కిలోమీటర్ల వరకు ఇన్‌ఫ్రారెడ్ సిగ్నల్స్ వ్యాపింపజేసి.. శత్రువుల చొరబాట్లను సులువుగా పసిగట్టవచ్చు.

హరిరామజోగయ్యకు తెలంగాణ హైకోర్టు అక్షింతలు

- ఏపీ సీఎం జగన్‌పై దాఖలు చేసిన పిల్‌లో ప్రజాప్రయోజనం ఏముందంటూ మండిపాటు
- పబ్లిక్ న్యూసెన్స్ పిటిషన్ అంటూ ఆగ్రహం
- వ్యక్తిగత కక్షతోనే పిల్ వేశారని వ్యాఖ్య
- రాష్ట్రపతి, సీజేఐ పేరు చెప్పి కోర్టును భయపెట్టలేరని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: 'ఇదో 'పబ్లిక్ న్యూసెన్స్' పిటిషన్.. అసలు ఇందులో 'ప్రజా ప్రయోజనం (పబ్లిక్ ఇంట్రస్ట్)' ఏముంది? వ్యక్తిగత కక్షతోనే ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేసినట్లు కనిపిస్తోంది అంటూ తెలంగాణ హైకోర్టు ధర్మాసనం మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్యపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ సీఎం వైఎస్ జగన్‌పై ఆరోపణలున్న సీబీఐ కేసులను త్వరగా విచారణ చేపట్టి, 2024 సాధారణ ఎన్నికలకు ముందే తీర్పు ఇవ్వాలని, ఆ మేరకు సీబీఐ కోర్టుకు ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ హరిరామజోగయ్య హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్‌పై అభ్యంతరం లేవనెత్తిన రిజిస్ట్రీ కేసు నంబర్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఫైలింగ్ నంబర్‌పైనే విచారణ చేపట్టింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలకు సిద్ధం కాగా ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. 'ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై నమోదు చేసిన కేసుల విచారణ త్వరగా పూర్తి కావాలని సీబీఐ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారా? అలాంటిదేమీ చేయకుండా రాష్ట్రపతికి లేఖ రాశాం, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాం.. అంటారా? ఇదేం పద్ధతి? ఉన్నత స్థానాల్లో ఉన్న వారి పేర్లు చెప్పినంత మాత్రాన కిందిస్థాయి కోర్టులు భయపడి పని చేయవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. బాధ్యత గల మాజీ ఎంపీ అయిన మీరు ఇలా వ్యవహరించడం సమంజసం కాదు. ప్రచార ప్రయోజనాల కోసమే పిల్ వేశారా? మీ పిటిషన్‌లో ఎక్కడన్నా ప్రజాసక్తి ఉంద మీకన్నా అనిపిస్తోందా? వ్యక్తిగత ద్వేషంతో కోర్టులను ఆశ్రయించి.. కోర్టుల విలువైన సమయాన్ని వృథా చేయవద్దు. తెలంగాణ గవర్నర్ చెప్పినట్లు ఇలాంటి పబ్లిక్ న్యూసెన్స్ కేసులు ఎక్కువయ్యాయి. కొందరికి ఇలాంటి పిటిషన్లు వేయడమే పరిపాటిగా మారింది. మీరు అడిగారని వెంటనే విచారణ చేపట్టలేం' అని ధర్మాసనం హరిరామజోగయ్యపై ఆగ్రహం వ్యక్తం చేసింది. రిజిస్ట్రీ అభ్యంతరం లేవనెత్తిన అంశాల కాపీని పిటిషనర్‌కు ఇవ్వాలని ఆదేశించింది. పిటిషన్‌ను నంబర్ చేయాలా వద్దా అనే విషయంపై విచారణను జూలై 6కు వాయిదా వేసింది.

ఆ రాతల్లో అంతా రోతే..

- ఉరుములు మెరుపులతో కూడిన బలమైన ఈదురు గాలులవల్ల తీగలు తెగి, స్తంభాలు విరిగాయి
- అత్యధిక విద్యుత్ వినియోగం కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్
- ఇవన్నీ సరిచేసేందుకే విద్యుత్ సరఫరాలో అంతరాయం
- దానిని రాష్ట్రమంతటా ఆపాదించి విద్యుత్ 'కోతలు బాబోయ్' అంటూ 'ఈనాడు' తప్పుడు కథనం


చిలకలూరిపేటలో ఈదురు గాలులకు కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు

సాక్షి, అమరావతి : పిడుగులు పడనీ, పెనుగాలులు రానీ, వానలతో చెట్లు కూలనీ, వరదలతో ట్రాన్స్‌ఫార్మర్లు కుప్పకూలనీ.. అగ్ని ప్రమాదాలు సంభవించనీ.. విద్యుత్ సరఫరా మాత్రం ఆగడానికి వీల్లేదు.. వైర్లు తెగి, స్తంభాలు కూలినా కరెంటును ఆపడం కుదరదు. ప్రాణాలుపోతే మాకేంటి.. ఎవరేమైపోతే మాకేంటి.. అన్నట్లుగా ఉంది ఈనాడు రామోజీరావు తీరు. అందుకేనేమో వాతావరణంలో అకస్మాత్తుగా వస్తున్న మార్పులతో అక్కడక్కడా కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిపితే రాష్ట్రమంతటా విద్యుత్ కోతలు విధిస్తున్నారంటూ అడ్డగోలు రాతలు రాస్తోంది. ఆ క్రమంలోనే విద్యుత్ 'కోతలు బాబోయ్' అంటూ సోమవారం 'ఈనాడు' ప్రచురించిన కథనంలో ఎలాంటి వాస్తవం లేదని గుంటూరు టౌన్–2, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ రమేష్ స్పష్టంచేశారు.

బలమైన ఈదురుగాలులవల్లే..

చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో శనివారం, ఆదివారం వాతావరణంలో జరిగిన మార్పులు దృష్ట్యా ఉరుములు మెరుపులతో కూడిన బలమైన ఈదురు గాలులు వచ్చాయి. దీంతో అక్కడక్కడ తీగలు తెగి, విద్యుత్ స్తంభాలు విరిగాయి. ఈ నేపథ్యంలో.. పడిపోయిన వాటిని యథాస్థితికి తీసుకొచ్చి, లోడ్‌ను సరిచేయడానికి విద్యుత్ సరఫరాను కొంతసేపు నిలపాల్సి వచ్చింది. విద్యుత్ పునరుద్ధరించి వినియోగదారులకు అందించే క్రమంలోనే ఇలా జరిగింది. అంతేగానీ ఎటువంటి అధికారిక కోతలు విధించటంలేదని ఏఈ వెల్లడించారు.

ఎన్‌సీఆర్‌ఎఫ్ అమలు కమిటీ సభ్యుడిగా దేవానందరెడ్డి


దేవానందరెడ్డి

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం –2020 అమలులో భాగంగా పాఠశాలల్లో జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్‌సీఆర్‌ఎఫ్) అమలు కోసం ఏర్పాటు చేసిన సబ్ కమిటీలో రాష్ట్రం నుంచి పాఠశాల విద్య పరీక్షల సంచాలకులు డి.దేవానందరెడ్డిని సభ్యునిగా నియమిస్తూ సీబీఎస్ఈ ఉత్తర్వులు జారీ చేసింది. సీబీఎస్ఈ చైర్‌పర్సన్ నిధి చిబ్బర్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో తొమ్మిది మంది సభ్యులుగా ఉంటారు. వీరిలో భారత ప్రభుత్వ అధికారులు, సీబీఎస్ఈ బోర్డు డైరెక్టర్లు ఉన్నారు. దక్షిణాది రాష్ట్రాల నుంచి దేవానందరెడ్డి ఒక్కరికే చోటు దక్కడం విశేషం. ఎన్ఈపీ–2020 ఉద్దేశం, లక్ష్యం, పాఠశాలల్లో జాతీయ క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను అమలు చేయడం వంటి అంశాలపై ఈ కమిటీ నివేదిక ఇవ్వనుంది. ఎన్‌సీఆర్‌ఎఫ్ విధానం ఇప్పటి వరకు ఐఐటీలు, కొన్ని డీమ్డ్ యూనివర్సిటీలు మాత్రమే అమలు చేస్తున్నాయి. ఇకపై ఈ విధానం పాఠశాల స్థాయిలోనూ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందుకోసం కొన్ని విధివిధానాలను సైతం రూపొందించింది.

ఏపీలో బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత

- ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపులో వైఎస్సార్‌సీపీ నిర్ణయం హర్షణీయం
- ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్న డిమాండ్ ఎప్పట్నుంచో ఉన్నా ఆచరణలోకి రాలేదని, అయితే ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపుల్లో వైఎస్సార్‌సీపీ తీసుకున్న నిర్ణయం హర్షణీయమని బిహార్ మాజీ సీఎం బీపీ మండల్ మనవడు, ఢిల్లీ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సూరజ్ మండల్ చెప్పారు. హైదరాబాద్‌కు వచ్చిన ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. బీసీల్లోని పలు సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం దక్కేలా ఆ ఎమ్మెల్సీ సీట్ల కేటాయింపు జరిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే పంథా అనుసరిస్తానని, బీసీలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించడం శుభపరిణామమని చెప్పారు. ఇదే స్ఫూర్తిని దేశ ప్రధాని సహా ఇతర రాష్ట్రాల సీఎంలు, అన్ని రాజకీయ పార్టీలు అనుసరిస్తే బీసీలకు తగిన న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

వచ్చే నెలలో హైదరాబాద్‌లో బీసీలతో మహాధర్నా

బీసీలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలంటే మండల్ కమిషన్ నిర్దేశించినట్టుగా ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో, పదోన్నతుల్లో తప్పకుండా బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని సూరజ్ మండల్ డిమాండ్ చేశారు. దేశంలో బీసీలు సహా.. కులాల వారీగా జనాభా ఎంత ఉందో స్పష్టత వచ్చేలా జనగణన చేయాలన్నారు. ఈ రెండు అంశాల అమలు కోసం దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నామని తెలిపారు. ఆ దిశగానే వచ్చే నెలలో హైదరాబాద్‌లో మహా ధర్నా నిర్వహించబోతున్నామని వెల్లడించారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక బీసీలు అన్ని విధాలా నష్టపోయారన్నారు. కేంద్రం తెచ్చిన జాతీయ విద్యా విధానంతో ఫీజులు పెరిగి పోవడం వల్ల కేంద్ర విద్యా సంస్థల్లో బీసీలు చదువుకోవడం కష్టమేనన్నారు. జనాభా లెక్కలు తేల్చకుండా కేంద్రం 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేసిందని విమర్శించారు.

జగనన్న ఆణిముత్యాలు.. టెన్త్‌లో 1,250 మంది.. ఇంటర్‌లో 1,585 మంది

రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సత్కారం

- రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20న సీఎం జగన్ చేతుల మీదుగా విద్యార్థులకు సత్కారం
- జిల్లా స్థాయిల్లో ఈ నెల 17న జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి ఆధ్వర్యంలో
- నియోజకవర్గ స్థాయిలో ఈ నెల 15న జగనన్న ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో కార్యక్రమం
- తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో 2023 సంవత్సరంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 1,250 మంది విద్యార్థులకు, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థుల్లో గ్రూపునకు ఒకరు చొప్పున 1,585 మందిని 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమం కింద ప్రతిభ అవార్డులతో సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గం స్థాయిల్లో విడివిడిగా జరిగే ఈ కార్యక్రమాల్లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెరిట్ సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తారు. విద్యార్థులు తల్లిదండ్రులను శాలువాలతో, ఆ పాఠశాలల హెడ్‌మాస్టర్లను శాలువ, మొమెంటోతో సత్కరిస్తారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పదో తరగతిలో రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురిని సత్కరించనున్నారు. అంతకు ముందు ఈ నెల 17న జిల్లా స్థాయిలో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, జిల్లా మంత్రులు ఆధ్వర్యంలో తొమ్మిది ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, ఏడు ప్రభుత్వ కాలేజీల్లో ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలో నాలుగు గ్రూపుల్లో ఒక్కో గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కరు చొప్పున నలుగురిని సత్కరించనున్నారు. ఈ నెల 15న అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిల్లో ఎమ్మెల్యేల అధ్యక్షతన పదో తరగతిలో మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులను, ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో ప్రతి గ్రూపులో అత్యధిక మార్కులు సాధించిన ఒక్కరు చొప్పున నలుగురిని సత్కరించనున్నారు.

అందరి సమన్వయంతో కార్యక్రమాలు: సీఎస్

జగనన్న ఆణిముత్యాలు సత్కార కార్యక్రమాలను మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించాలని కలెక్టర్లు, ఇతర అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డా. కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర స్థాయి సత్కార కార్యక్రమం కోసం రాష్ట్ర స్థాయి కంట్రోల్ రూమ్, ఇతర ఏర్పాట్లు చేయాలని ఇంటర్మీడియట్ కమిషనర్‌కు, ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్‌కు సూచించారు. పాఠశాల విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ఇతర శాఖలను, అధికారులను సమన్వయం చేసుకుని ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. నియోజకవర్గస్థాయిలో మండల కేంద్రంలోని ప్రభుత్వ స్కూలు లేదా కాలేజీలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయాలని, దీనికి మండల విద్యాధికారి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. జిల్లా స్థాయిలో జిల్లా మంత్రులను సంప్రదించి సత్కార కార్యక్రమ వేదికను కలెక్టర్ ఎంపిక చేయాలని చెప్పారు.

రాష్ట్ర స్థాయిలో జగనన్న ఆణిముత్యాలకు బహుమతులు

- పదో తరగతిలో 42 మందికి, ఇంటర్మీడియట్‌లో 35 మందికి ప్రతిభా అవార్డులు
- పదో తరగతిలో మొదటి స్థానం సాధించిన విద్యార్థులకు రూ.1,00,000, రెండో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.75,000, మూడో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.50,000 చొప్పున నగదు బహుమతి
- ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురేసి విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,00,000

జిల్లా స్థాయిలో..

- పదో తరగతిలో 606 మందికి, ఇంటర్‌లో 800 మందికి ప్రతిభా అవార్డులు
- పదిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.50,000, రెండో స్థానం సాధించిన వారికి రూ. 30,000, మూడో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10,000
- ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురికి ఒక్కొక్కరికి రూ.50,000

నియోజకవర్గ స్థాయిలో..

- పదో తరగతిలో 602 మందికి, ఇంటర్మీడియట్‌లో 750 మందికి ప్రతిభా అవార్డులు
- టెన్త్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులకు రూ.15,000, రెండో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.10,000, మూడో స్థానం సాధించిన విద్యార్థులకు రూ.5000లు నగదు బహుమతి
- ఇంటర్మీడియట్‌లో నాలుగు గ్రూపుల్లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000

హైదరాబాద్‌లో జీ-20 వ్యవసాయ సమావేశాలు

- ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు నిర్వహణ
- హాజరుకానున్న 30 దేశాల వ్యవసాయ మంత్రులు
- వ్యవసాయంలో ఆధునిక ఆవిష్కరణలపై చర్చలు
- ఆహార భద్రత, రైతులకు ఆర్థిక సహకారంపైనా చర్చించే అవకాశం

సాక్షి, హైదరాబాద్: ప్రతిష్టాత్మకమైన జీ–20 వ్యవసాయ మంత్రుల సమావేశాలు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు హైదరాబాద్‌లో జరగనున్నాయి. ఈ మేరకు హెచ్‌ఐసీసీలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఈ సమావేశాల్లో జీ–20లో భాగమైన ఇండోనేసియా, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, కెనడా, చైనా, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, కొరియా, మెక్సికో, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, యూకే, యూఎస్‌ఏ, ఇండియాలతోపాటు సదస్సుకు ఆహ్వానించిన 10 దేశాలు బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్, నెదర్లాండ్స్, ఒమన్, నైజీరియా, సింగపూర్, స్పెయిన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వియత్నాంల వ్యవసాయ మంత్రులు.. ఇక్రిశాట్, ఓఈసీడీ, ఏడీబీ, ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ, ప్రపంచ బ్యాంకు తదితర సంస్థల ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. మొత్తంగా 30 దేశాలకు చెందిన 180 మంది ప్రతినిధులు రానున్నట్టు వ్యవసాయ శాఖ వర్గాలు వెల్లడించాయి.

నాలుగో వ్యవసాయ సదస్సు

జీ–20 దేశాల సదస్సులో భాగంగా ఇప్పటివరకు మూడు వ్యవసాయ సంబంధిత సమావేశాలు జరిగాయి. ఫిబ్రవరిలో ఇండోర్‌లో, తర్వాత మార్చి చివరి వారంలో ఛండీగఢ్‌లో అగ్రికల్చర్ డిప్యూటీల భేటీలు జరిగాయి. ఏప్రిల్ మూడో వారంలో వారణాసిలో మూడు రోజులపాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సదస్సు జరిగింది. ఇప్పుడు నాలుగో వ్యవసాయ సదస్సు హైదరాబాద్‌లో జరుగుతోంది. దీనిలో మంత్రులు పాల్గొననున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి తమ దేశాల్లో అనుసరిస్తున్న విధానాలను వివరిస్తారు. ఆధునిక, వినూత్న సాంకేతిక ఆవిష్కరణల ప్రదర్శన ఉండనుంది.

ఆధునిక పరిజ్ఞానం.. సభ్య దేశాల మధ్య సహకారం..

ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్తు లక్ష్యంతో.. సభ్యదేశాల మధ్య వ్యవసాయ రంగంలో సహకారమే లక్ష్యంగా ఈ సమావేశాలు జరుగుతున్నాయి. వ్యవసాయంలో ఆధునిక పరిజ్ఞానం, విత్తన నాణ్యత, ఎగుమతులు, దిగుమతులు, కొత్త ఒరవడులు.. వ్యవసాయానికి సంబంధించి సభ్యదేశాలు ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాళ్లు, ఆహార భద్రత, అంతరాలు, వాతావరణ మార్పుల కారణంగా పంటల ఉత్పాదకతపై ప్రభావం, ఉపాధి సమస్యలను ఇందులో చర్చిస్తారు. వివిధ అంశాలపై ఒప్పందాలు కూడా జరగనున్నాయి. వివిధ దేశాల వ్యవసాయశాఖ మంత్రులతో కేంద్ర ప్రభుత్వం పలు ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనుంది. ఇందుకు అనుగుణంగా ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాదిని ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ సంవత్సరంగా జరుపుతున్న నేపథ్యంలో.. మిల్లెట్ల (చిరుధాన్యాలు)ను ప్రోత్సహించే చర్యలు, ఆహారం, ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపైనా సమావేశాల్లో చర్చించనున్నారు.

'గురుకుల' సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ప్రారంభం

15 వరకు కొనసాగనున్న ప్రక్రియ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలోని స్కూళ్లు, కాలేజీల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు సోమవారం గుంటూరు, కర్నూలులోని సెంటర్లలో ఎంపీసీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మంగళవారం బైపీసీకి, బుధవారం సీఈసీ/ఎంఈసీ అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని గురుకుల విద్యాలయ సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు తెలిపారు. ఈనెల 15న గురుకుల డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరగనుంది. సీట్లు లభించిన వారికి.. పూర్తి వివరాలను పంపించామని నరసింహారావు తెలిపారు. ఈ నెల 15వ తేదీతో మొదటి విడత కౌన్సెలింగ్ ముగుస్తుందని చెప్పారు. సీట్లు మిగిలి ఉంటే రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

ఆపరేషన్ స్వేచ్ఛ–2 ప్రారంభం

సీఐడీ విభాగం ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు


ఆవిష్కరిస్తున్న సీఐడీ అదనపు డీజీ సంజయ్ తదితరులు

సాక్షి, అమరావతి: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి సీఐడీ విభాగం 'ఆపరేషన్ స్వేచ్ఛ–2' కార్యక్రమం సోమవారం ప్రారంభించింది. రాష్ట్రంలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం పోస్టర్‌ను సీఐడీ అదనపు డీజీ సంజయ్ మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ఆపరేషన్ స్వేచ్ఛ–1 కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 326 మందిని బాల కార్మిక వ్యవస్థ నుంచి బయటకు తీసుకువచ్చామన్నారు. వారిలో 45 మందిని చైల్డ్ కేర్ హోమ్‌లకు పంపగా, 281 మందిని వారి తల్లిదండ్రుల చెంతకు చేర్చామని చెప్పారు. అదే స్ఫూర్తితో ఆపరేషన్ స్వేచ్ఛ–2ను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సరిత, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.గణేశన్ పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943